# అన్నమయ్య పదార్థ ప్రకాశిక



'సంగీత కళానిధి'

**శ్రీ నేదునూరి కృష్ణమూర్తి**

స్వరపరచిన 108 సంకీర్తనల వివరణ




వివరణకర్త

'సంగీత సాహిత్య కళానిధి'

**శ్రీమాన్ నల్లాన్‌చక్రవర్తుల కృష్ణమాచార్యులు**

ప్రచురణ : **నాదసుధాతరంగిణి**, విశాఖపట్నం



వేంకటాద్రి సమం స్థానం ।
బ్రహ్మాండే నాస్తి కించన ॥
వేంకటేశ సమోదేవో ।
న భూతో న భవిష్యతి ॥

# మనవి

సుమారు ఒక సంవత్సరము క్రింద నేను ''శ్రీత్యాగరాజ గేయార్థకుంచిక'' అనే పేరుతో త్యాగరాజ స్వామి కృతుల తాత్పర్యమును వ్రాసినాను. అది నా ప్రియమిత్రులు ''సంగీత కళానిధి'' శ్రీ నేదునూరి కృష్ణమూర్తిగారు పవిత్ర హస్తములతో విశాఖపట్నములో ఆవిష్కరింపబడినది. ఆనాడు అన్నమాచార్యులవారి కృతులకు కూడా కృష్ణమాచార్యుల తాత్పర్యముండినచో బాగుండునని వారికి తోచినది. నాకు ఉన్న శక్తి ఏదో ఉన్నది, లేనిదేదోలేదు. దీనికన్న కృష్ణమూర్తిగారికి నాయందున్న మైత్రీసద్భావమే ప్రధానము. కృష్ణమూర్తిగారిని విద్యార్థి దశనుండి నేనెరుగుదును. ఆనాడే వారు పాడిన పాట నామనస్సులో మంచి ముద్రవేసుకొని కూర్చున్నది. సుమారు 58 ఏండ్ల క్రితం రాజమండ్రిలో గౌతమీ విద్యా పీఠంవారు ఉత్సవాలు చేస్తూ కీ॥ శే॥ ద్వారం వేంకటస్వామినాయుడు గారి వంటి మహోదయుల గానసభలు పెట్టినారు. ఒక రోజు కీ॥ శే॥ జి. యన్. బి. గారి పాట. ఆ సభలలో నేను ఫిడిలుమీద పాల్గొనటానికి వెళ్ళి ఉన్నాను. ఆనాడు జి. యన్. బి. గారు ఏదో కారణము వలన రాలేకపోయినారు. అది వినటానికి కృష్ణమూర్తిగారు వచ్చి ఉన్నారు. నిర్వాహకులకు కృష్ణమూర్తి గారిసంగతి తెలిసినది. జి. యన్. బి. గారి బదులుగా కృష్ణమూర్తిగారిని పాడమన్నారు. ఆ రోజున కృష్ణమూర్తిగారి పాట మేరు శిఖరాగ్రాల నందుకొన్నది. శ్రోతల మహానందం చెప్పటానికి వీలు లేదు. ఫిడేలు ప్రక్కవాద్యం నేనేవాయించాను. కృష్ణమూర్తిగారి మైత్రి ఆనాటి నుండి ప్రారంభం అయినది. సజ్జనుల మైత్రి మధ్యాహ్నం తరువాత చెట్టు నీడవలెనే పెరుగునట. మామైత్రి అట్లే అయినది. ఆయనగానంలో మేరు శిఖరాగ్రాలను అందుకొన్నారు. దేశం ఆనందించింది. చిత్రమేమంటే గానమందే కాక సౌమనస్యంలో కూడ ఆయన పెరిగేరు. ఇది గాయకులలో అరుదుగా నుంటుంది. కొన్ని పదవులు నిర్వహించారు. అందులో తిరుపతిలో వారి పదవి. అన్నమాచార్యుల వారి పదములకు స్వరపరచే భావము, ప్రయత్నము, ఫలితము అన్నీ చక్కగా అమరినవి.

వారు స్వరపరచిన కృతులు 108. మూడు సంపుటములు. ఈ కీర్తనలకు తాత్పర్యము వ్రాయుమని నన్ను సాదరముగా కోరినారు. తిరుపతిలో కులపతి అయిన కారణంగా కృష్ణమూర్తిగారు వేంకటేశ్వరుని భక్తులైనారు. అన్నమాచార్యులు స్వామి వారి భక్త శిఖామణి. మా వంశపు ఇలవేల్పు వేంకటేశ్వరుడు. మా వంశమూలపురుషుని పేరు ''నల్లాన్'' వీరికి ''చక్రవర్తి'' బిరుదిచ్చినది వేంకటేశ్వరుడు. ''సేవే సమయ నిర్వాహే । వేంకటేశప్రసాదతః । చక్రవర్తీతి విఖ్యాతం । ఆత్తచక్రం జగద్గురుం'' అని ఇప్పటికీ మే మనుసంధించు కుంటాము. కృష్ణమూర్తిగారి మైత్రి వలన నాకీ పని అతర్కితముగా సమకూరినది. నా జన్మకూడ కొంత తరించినది. నేను చాలా మందకొడి వాడను. ఇంకొక సంగీత కళాకారుడైతే కృష్ణమూర్తిగారు స్వరపరచిన పాటలను ఇంతకు ముందే పాఠప్రవచనాలలో పెట్టుకొని శిష్యులందరికిని శిక్షణ ఇచ్చి ఉండేవాడు. అనేక విషయాలలో నున్న నా మందకొడితనము నన్నా పనిని చెయ్యనియ్యలేదు. ''ఏకక్రియా ద్వ్యర్థకరీ'' - ఒక్క పని రెండు ప్రయోజనాలను సాధించినది'' అన్నట్లు నేను ఈ పని చేయుటలో వారు స్వరపరచిన చాలా పాటలను పాడుకొని ఆనందించాను. ఉత్తమ స్థాయిలో నున్నాయి. దీనిలో దేనినీ నేను ముఖప్రీతికి వ్రాయలేదు. వ్రాసినది నా చెయ్యికాదు. హృదయము. ఈ సంపూర్ణావకాశమును నాకు కల్పించిన సంగీత కళానిధికి నా కృతజ్ఞతాభివందనములు. కృష్ణమూర్తిగారి స్వర కల్పనము, అన్నమయ్యగారి భావముల అవలోడనము నాకు ఆనందకరము లైనవి. ''శ్రుతులై శాస్త్రములై పురాణకథలై'' ఇత్యాదిగా ప్రసిద్ధి కెక్కిన అన్నమయ్యగారి పాటలు వ్యాఖ్యానించుటకు నా శక్తి చాలదు. అని తెలిసియును ఈ పనిని యథాశక్తిగా ముగించాను. తరువాత పండితులే ప్రమాణము.

**నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు.**

**20-9-2001.**

# విషయసూచిక


| సంఖ్య | సంకీర్తన | రాగము | తాళము | పుట |
|---|---|---|---|---|
| 1. | భావములోన | శుద్ధధన్యాసి | ఆది | 1 |
| 2. | చేరియశోదకు | మోహన | ఆది | 3 |
| 3. | పలుకు తేనెల తల్లి | అభేరి | రూపకం | 5 |
| 4. | జయజయరామ | మణిరంగు | ఆది | 6 |
| 5. | ముద్దుగారే యశోద | కురంజి | ఆది | 7 |
| 6. | వెనకేదో ముందేదో | హుసేని | ఆది (త్రిశ్రనడ) | 9 |
| 7. | పలుమరువుట్ల | ముఖారి | ఆది | 10 |
| 8. | విరహపు రాజదె | తోడి | ఆది | 12 |
| 9. | ఒకపరికొకపరి | ఖరహరప్రియ | ఆది | 13 |
| 10. | అలరచంచలమైన | రాగమాలిక | ఝంపె | 14 |
| 11. | కొలనిదోపరికి | యదుకులకాంభోజి | ఆది | 17 |
| 12. | ఇట్టిముద్దులాడి | ఆనందభైరవి | ఆది (త్రిశ్రనడ) | 18 |
| 13. | ఉయ్యాలబాలునూచెదరు | మధ్యమావతి | ఆది | 19 |
| 14. | ఉగ్గువెట్టరే | కమాస్ | ఆది | 20 |
| 15. | కోరుదునామది | మలహరి | రూపకం | 21 |
| 16. | ఎవ్వరిభాగ్యం | భైరవి | ఆది | 23 |
| 17. | ఎదుటనున్నాడు | భుజంగిని | ఆది | 25 |
| 18. | ఘుమ్మని యెడిశ్రుతి | పూర్వికల్యాణి | ఆది | 27 |
| 19. | కంటి శుక్రవారము | ఆనందభైరవి | ఆది | 28 |
| 20. | సింగారమూరితివి | కమాస్ | ఝంపె | 29 |
| 21. | ఇన్ని చదువనేల | వకుళాభరణం | ఝంపె | 31 |
| 22. | దీనుడనేను | నీలాంబరి | ఆది | 32 |
| 23. | రామరామరామకృష్ణ | కల్యాణి | రూపకం | 33 |
| 24. | అదివో అల్లదివో | హిందోళ | ఆది | 35 |
| 25. | ఆది దేవ పరమాత్మ | సింధుభైరవి | ఆది | 37 |

| | | | | |
|---|---|---|---|---|
| 26. | నానాటి బ్రతుకు | రేవతి | ఆది | 38 |
| 27. | శరణు శరణు | జంఝూటి | మిశ్రచాపు | 40 |
| 28. | ఎటువంటి మచ్చికలో | శంకరాభరణం | మిశ్రచాపు | 41 |
| 29. | నీ దాసుల భంగములు | మలయమారుతం | రూపకం | 42 |
| 30. | పరమాత్ముడైన | శుద్ధధన్యాసి | ఖండచాపు | 44 |
| 31. | అలమేలు మంగ | భైరవి | ఖండచాపు | 46 |
| 32. | వలదననొరులకు | కల్యాణి | ఆది | 47 |
| 33. | పురుషోత్తముడవీవు | రేవగుప్తి | ఖండచాపు | 49 |
| 34. | భక్తికొలది వాడే | మలయమారుతం | ఆది( త్రిశ్రనడ) | 50 |
| 35. | ఏమొకో | తిలంగ్ | రూపకం | 52 |
| 36. | తెలిసినవారికి | శంకరాభరణం | ఆది | 53 |
| 37. | కొలిచినవారల | కేదారం | ఆది | 56 |
| 38. | అంతరంగమెల్ల | హుసేని | ఆది ( త్రిశ్రనడ) | 57 |
| 39. | భక్తినీపై | శహన | ఖండచాపు | 59 |
| 40. | విశ్వరూపమిదివో | ముఖారి | రూపకం | 60 |
| 41. | అవధారు రఘుపతీ | కమాస్ | ఖండచాపు | 62 |
| 42. | రామచంద్రుడితడు | ద్విజావంతి | ఆది ( త్రిశ్రనడ) | 63 |
| 43. | పలవిచారములేల | షణ్ముఖప్రియ | ఖండచాపు | 65 |
| 44. | ఇతరములన్నియు | కానడ | ఆది | 67 |
| 45. | నారాయణాచ్యుత | మాయామాళవగౌళ | ఖండచాపు | 68 |
| 46. | ఏటి సుఖము | వరాళి | ఖండచాపు | 70 |
| 47. | నవనీతచోర | జంఝూటి | ఆది | 72 |
| 48. | అలాగు పొందులును | కుంతలవరాళి | ఖండచాపు | 72 |
| 49. | రాముడు లోకాభిరాముడు | ముఖారి | ఆది | 73 |
| 50. | కొలనిలోన | కమాస్ | ఆది | 74 |
| 51. | అమరాంగనలదె | రాగమాలిక | ఆది | 75 |
| 52. | పసిడియక్షంతలివె | ఆనందభైరవి | ఖండచాపు | 77 |
| 53. | పాపపుణ్యముల | నాదనామక్రియ | ఖండచాపు | 78 |

| | | | | |
|---|---|---|---|---|
| 54. | సకలశాంతికరము | బహుదారి | ఆది | 79 |
| 55. | చాలు చాలును | కేదారగౌళ | ఖండచాపు | 81 |
| 56. | తరుణి నీయలుక | శంకరాభరణం | ఖండచాపు | 82 |
| 57. | ఆకటివేళల | శుభాళి | ఆది | 83 |
| 58. | అదె చూడరే | మోహన | ఆది | 84 |
| 59. | ప్రతిలేని పూజ | సురటి | ఖండచాపు | 86 |
| 60. | మరలి మరలి | మధ్యమావతి | ఆది | 87 |
| 61. | ఇతర దేవతలకిది గలదా | సారమతి | ఆది | 89 |
| 62. | ఒకటిపై నొకటి | నీలాంబరి | ఆది( త్రిశ్రనడ) | 92 |
| 63. | ఇంతి ఏమీ యెరుగదు | సాజి | ఆది | 93 |
| 64. | పొలతిజవ్వనమున | ఖరహరప్రియ | ఆది ( త్రిశ్రనడ) | 94 |
| 65. | మందులు మాకులు | నాటకురంజి | ఆది | 97 |
| 66. | మనసిజసముద్ర | బేగడ | ఆది | 98 |
| 67. | తెరవకుబతివైతివి | బేహాగ్ | ఆది | 100 |
| 68. | వెన్నపట్టుక నేయి వెదక | జంఝూటి | ఖండచాపు | 102 |
| 69. | మనసిజ గురుడితడో | రీతిగౌళ | ఖండచాపు | 103 |
| 70. | మొక్కేటి గోపాంగనల | కమాస్ | రూపకం | 105 |
| 71. | సదానందము సర్వేశ్వర | ఖరహరప్రియ | ఆది | 107 |
| 72. | మొకమోటములకెల్ల | కాపి | ఆది ( త్రిశ్రనడ) | 108 |
| 73. | తెలిసితే మోక్షము | హంసనాదం | రూపకం | 109 |
| 74. | హరిగొలిచియుమరి | ధర్మవతి | ఆది | 110 |
| 75. | చాలదాహరినామ | లలిత | ఖండచాపు | 112 |
| 76. | తొల్లియునుమట్టాకు | రాగమాలిక | ఖండచాపు | 113 |
| 77. | చూడపిన్నవాడుకాని | ఆనందభైరవి | ఆది ( త్రిశ్రనడ) | 114 |
| 78. | రామభద్ర రఘువీర | ఆనందభైరవి | ఆది ( త్రిశ్రనడ) | 115 |
| 79. | ఏణనయనల చూపు | పున్నాగవరాళి | ఖండచాపు | 117 |
| 80. | ఘనుడాతడెమము | సారంగ | ఆది | 118 |
| 81. | ఏమమ్మ మగువా | వాచస్పతి | ఆది ( త్రిశ్రనడ) | 120 |

| | | | | |
|---|---|---|---|---|
| 82. | చేపట్టి మమ్ముగావు | శంకరాభరణం | ఆది (త్రిశ్రనడ) | 121 |
| 83. | ఘోరదురితములచే | హంసానంది | ఖండచాపు | 123 |
| 84. | చెలులాల చూడరె | కేదారగౌళ | ఆది (త్రిశ్రనడ) | 124 |
| 85. | ఇతరులకు నినునెరగ | రంజని | ఖండచాపు | 126 |
| 86. | చక్కని వాడవన్నిటా | శంకరాభరణం | రూపకం | 127 |
| 87. | అదివో కనుగొను | ముఖారి | ఆది | 128 |
| 88. | కనుగొనరే ఇరుగడ | కమాస్ | ఆది | 129 |
| 89. | ఎరిగించవలయు | కాంభోజి | ఆది | 130 |
| 90. | ఏది చూచినతమకు | శివరంజని | ఖండచాపు | 131 |
| 91. | నీవుదేవుడవు | సింధుభైరవి | ఆది | 133 |
| 92. | కలిమిగలిగియు | వలజి | ఖండచాపు | 134 |
| 93. | ఇరవగువారికి | చారుకేశి | ఆది | 135 |
| 94. | చాలదాహరి సంకీర్తన | చారుకేశి | ఆది | 136 |
| 95. | తలపులోననే దైవము | ఆరభి | ఆది | 138 |
| 96. | ఒసగితివన్నియు | ఆభోగి | ఆది | 139 |
| 97. | ఇద్దరి గుణంబులివి | కాపి | ఖండచాపు | 140 |
| 98. | ఇంతి చెలువమే | హరికాంభోజి | ఆది | 142 |
| 99. | అంతసిగ్గుపడక | జంఝూటి | ఆది (త్రిశ్రనడ) | 143 |
| 100. | ఆణికాడవట | దుర్గ | ఆది | 144 |
| 101. | ఇందిరానామమిందరికి | ఖరహరప్రియ | ఆది | 145 |
| 102. | వెరవకు మనసా | రాగమాలిక | ఆది | 147 |
| 103. | నారాయణాయ నమోనమో | రాగమాలిక | ఆది | 148 |
| 104. | ఏటిజోలి చేకొంటివి | సింధుభైరవి | ఆది (త్రిశ్రనడ) | 150 |
| 105. | ఏమిసేసితివో | కాంభోజి | ఆది | 151 |
| 106. | లాలనుచు నూచెరు | రాగమాలిక | ఖండచాపు | 152 |
| 107. | మాధవునకు మంగళం | కేదారగౌళ | ఆది | 154 |
| 108. | మంగళం గోవిందునకు | సురటి | ఆది | 155 |

# మొదటి భాగము

## 1. శుద్ధ ధన్యాసిరాగం = ఆదితాళం

ప॥ భావములోన । బాహ్యమునందును ॥
గోవింద గోవిందయని । కొలువవో మనసా॥ ॥ భావము ॥

చ॥ హరియవతారములే । అఖిలదేవతలు ॥
హరిలోనివే బ్రహ్మాండములు ॥
హరి నామములే । అన్ని మంత్రములు ॥
హరి హరి హరి హరి । హరియనవో మనసా॥ ॥ భావము ॥

2) విష్ణుని మహిమలే । విహిత కర్మములు ॥
విష్ణుని బొగడెడి । వేదంబులు ॥
విష్ణుడొక్కడే । విశ్వాంతరాత్ముడు ॥
విష్ణువు విష్ణువని । వెదకవో మనసా ॥ ॥ భావము ॥

3) అచ్యుతుడితడే । ఆదియు నంత్యము
అచ్యుతుడే అసు । రాంతకుడు ॥
అచ్యుతుడు శ్రీవేంకటాద్రిమీదనిదె ॥
అచ్యుత అచ్యుత శరణనవో మనసా ॥ ॥ భావము ॥

**తాత్పర్యము :**

ఇది మనస్సునకు బోధనము. ఓ జీవా నీవు గోవిందుని మనసా స్మరించు, బాహ్యంగా పలుకు. గోవింద అని కొలువుము. దేవతలందరును హరియొక్క అవతారములు. బ్రహ్మాండములన్నియు హరిలోనివే. అన్ని మంత్రములు హరి యొక్క నామములే. కనుక హరినామములను ఉచ్చరించుము. నరుడు చేసే విహిత కర్మలు విష్ణుదేవుని మహిమలే. వేదములు విష్ణువునే పొగడును.

విష్ణు వొక్కడే ఈ విశ్వానికి అంతరాత్మ. విష్ణువునే అన్వేషించు. అచ్యుతుడు ఈ అఖిల ప్రపంచానికి మొదలు తుది. అచ్యుతుడే రాక్షస సంహారకుడు. ఆ

అచ్యుతు డిదిగో శ్రీ వేంకట గిరిమీద నిలచి ఉన్నాడు. అచ్యుతుని శరణువేడుము. ఓ మనసా॥ అని మానసబోధ చేసినారు.

**విశేషము :** పల్లవి త్రికరణ శుద్ధిని తెలుపుచున్నది. ''కాయేన వాచా మన సేంద్రియైర్వా'' = నేను మేనితో గాని, వాక్కుతోగాని, మనస్సుతోగాని ఏది చేసినా దానిని నారాయణునకు అర్పిస్తాను. అని ప్రతిమానవుడు కర్మపరిసమాప్తి చేస్తాడు. దీనికి త్రికరణశుద్ధి ఆవశ్యకము. మొదటి చరణము : ముప్పదిమూడు కోట్లమంది దేవతలును హరి యొక్క అవతారమే. అనగా అంశమే. ''తత్రాఖిలామరమయః హరి రావిరాసీత్ '' = గజేంద్రుడు మొరబెట్టినప్పుడు సమస్త దేవతామయుడైన హరి ప్రత్యక్షమయ్యెను'' అని వ్యాసవాక్యము. దీనిని బట్టి అందరుదేవతలు హరి అవతారమని స్పష్టము. కృష్ణుడు మన్నుదిని యశోదవద్ద నోరు తెరచినప్పుడు ఆహరికుక్షిలో బ్రహ్మాండములు కనపడినవి కదా! 2వ చరణము: వేదము విధించిన యజ్ఞాది కర్మము హరిమహిమలే కదా! ''యజ్ఞోవై విష్ణుః'' = యజ్ఞమే విష్ణువు'' అని వేదము. పురుషసూక్తము మొదలగు వేదములు ''సహస్ర శీర్షాపురుషః, సహస్రాక్ష స్సహస్రపాత్ = హరి వేల తలలవాడు, వేలకనుల వాడు, వేయి పాదముల వాడు'' అని హరిని పొగడినవి కదా! విష్ణువు విశ్వము అనగా జీవులకు అంతరాత్మ. ''అనేన జీవేన ఆత్మనా అను ప్రవిశ్యనామ రూపే వ్యాకరవాణి'' = ప్రతి జీవునియందును నేను అనుప్రవేశము చేసి నామ రూపములను ఏర్పరచుచున్నాను'' అని విష్ణువు చెప్పిన వేద వాక్యము. దీనిని బట్టి విష్ణువు విశ్వాంతరాత్ముడు. విష్ణువంటే సర్వవ్యాపకుడని అర్థము. ''ఎందెందు వెదకి చూచిన అందందేగలడు'' అని భాగవతము. దీనిని బట్టి విష్ణువును వెదకుమని బోధనము. మూడవ చరణము : అచ్యుతుడే సృష్టికి ముందున్నాడు, సృష్టించిన వాడును ఆయనే. దీనికి ప్రమాణము. సదేవసోమ్యేద మగ్ర ఆసీత్ = హరియే ఆదియందున్నాడు. సృష్టి ప్రళయాంతమందు నశిస్తే హరియే వటపత్రశాయిగా సృష్టి అంతమందుంటున్నాడని ఋషిప్రోక్తము. అచ్యుతుడంటే సృష్టి అంతమయిన పిదప కూడా నుండువాడని అర్థము. రాక్షసులను సంహరించినవాడు అచ్యుతుడే. రాక్షసాంతకుడు అనుపేరు అచ్యుతనకే తగినది. తక్కిన దేవతలు నామమాత్రంగా కొందరు రాక్షసులను సంహరించినట్లు చరిత్రలున్నా వారందరు రాక్షసబాధలకు లోనైనవారే. అచ్యుతు డొక్కడే

రాక్షసులకు లొంగక మూలవిరాట్టుగాను, అవతారములలోను రాక్షసులను సంహరించినది అచ్యుతుడొక్కడే. ఆ అచ్యుతుడే ఇప్పుడు వేంకటాద్రిపైనున్నాడు. ఆ అచ్యుతుని శరణు వేడుము అని. ద్రౌపది ''శంఖచక్రగదాపాణే ద్వారకనిలయ అచ్యుత'' అని అచ్యుతనామంతో శరణు జొచ్చి సత్ఫలమును పొందినది. అన్నమాచార్య స్వామిపైన చెప్పిన ఆర్షప్రోక్తములన్నియు మనస్సున నుంచుకొని సార్థక నామములతో ఈ పదమును రచించారు.

## ౨. మోహనరాగం = ఆదితాళం

ప॥ చేరి యశోదకు । శిశు వితడు
ధారుణి బ్రహ్మకు । తండ్రియు నితడు ॥ ॥ చేరి ॥

చ॥ సొలసి చూచినను । సూర్యచంద్రులను ॥
లలి వెదజల్లెడు । లక్షణుడు ॥
నిలిచిన నిలువున । నిఖిల దేవతల ॥
కలిగించు సురల । గనివో ఇతడు ॥ ॥ చేరి ॥

2) మాట లాడినను । మరి అజాండముల ॥
కోటులు వొడమెడి । గుణరాశి ॥
నీటగు నూర్పుల । నిఖిల వేదములు ॥
చాటున నూరేటి । సముద్రమితడు ॥ ॥ చేరి ॥

3) ముంగిట పొలసిన । మోహన మాత్మల ॥
పొంగించే ఘన । పురుషుడు ॥
సంగతి మావంటి । శరణాగతులకు ॥
అంగము శ్రీ వేంక । టాధిపు డితడు ॥ ॥ చేరి ॥

**తాత్పర్యము :**

పల్లవి : చేరి యశోదకు శిశువైనాడు. అనగా గర్భాన పుట్టకుండా మధురలోపుట్టి యోగమాయ ద్వారా వ్రేపల్లె చేరి యశోదకు శిశువయినాడు. సామాన్య స్త్రీకి

శిశువయినవాడు సురజ్యేష్ఠుడయిన బ్రహ్మకు తండ్రి అయినాడు. ఆయన లక్షణమేమంటే అలసి చూచిన చూపులతో సూర్యచంద్రులను లోకాలపై వెదజల్లుతాడు. నిలుచున్నపళంగా సమస్త దేవతలను సృష్టి చేసే దేవతల గని.

2వ చరణము : ఒక్క మాట మాటాడితే సకల లోకాలు సృష్టి అయ్యే గుణము కలవాడు. తన నిట్టూర్పుల చాటున వేదములను ఊరించిన సముద్రము.

3వ చరణము : భక్తుల వాకిటి ముందర మోహనరూపంతో సాక్షాత్కరించి ఆ భక్తులకు ఆనంద రసం పొంగి పొర్ల చేసే ఘనపురుషుడు = గొప్పవాడు. మేఘం వంటివాడు అని కూడ అర్థం. మాబోటి శరణాగతులకు వేంకటేశుడు అంగము.

**విశేషము :** ''అణోరణీయాన్ మహతోమహీయాన్'' = అణువుకన్నా అణువు, మహత్తు కన్నా మహత్తు అనిన వేదసూక్తి ప్రకారం సామాన్య స్త్రీకి కొడుకయినాడు. సత్య లోకాధిపతికి తండ్రి అయినాడు.''చక్షో స్సూర్యో అజాయత'' = నేత్రము సూర్యుడయినాడు'' = అనే వేదసూక్తి ప్రకారం సూర్యచంద్రులనే తన నేత్రముల నుండి చల్లని చూపులను ప్రసరింప జేయువాడు. ''ఒన్రుం దేవుములగు ముయిరుంమత్తుం యాదు మల్లా। అన్రు నాన్ముగన్ తన్నొడు దేవరులగోడుయిర్ పడైత్తాన్ = ''ఒక్క దేవతయు, ఆత్మలు, లోకములు ఏవీ లేనిసమయంలో బ్రహ్మతో సహ దేవతలను సృష్టించివాడు'' అనే నమ్మాళ్వారుల శ్రీ సూక్తి (తిరువాయ్‌మొళి) ప్రకారం ఏ పదార్థము లేకుండా దేవతలను సృష్టించినవాడు అనే దాని ప్రకారం నిలుచుండిన పళంగా దేవతలను సృష్టించుట. సృష్టికి ముందు ఈలోకములు దేవతలు ఆత్మలు నారాయణుని కుక్షియందుండును అనిన ఆర్ష సూక్తిచేత ఆయన కుక్షియే దేవతలను సృష్టి చేసేగని. ''యస్య నిశ్వసితం వేదాః'' అనిన పురాణ సూక్తి ప్రకారం నారాయణుని నిట్టూర్పులే వేదములు. ఈ నిట్టూర్పులు ఓం భూః, ఓం భువః, ఓగుం సువః, ఓం మహః, ఒం జనః, ఓం తపః, ఓగుం సత్యం'' అని ఏడు పలుకులుగా వెలువడినవి. ఆ ఏడు పలుకులే ఏడు లోకములయినవి వేదములు నిట్టూర్పుల <u>చాటున</u> ఊరుట అనగా వేదపు నిట్టూర్పులు సృష్టి కంటే ముందే హరి ముఖమునుండి వెలువడుటయే అవి <u>చాటున</u> ఊరుట.

# 3. ఆభేరి రాగం = ఝంపెతాళం

ప॥ పలుకు తేనెల తల్లి। పవళించెను
కలికి తనముల విభుని। కలిసినదిగాన ॥ పలుకు॥

చ॥ నిగనిగని మోముపై । నెరులు కెలకుల చెదర ॥
పగలైన దాకచెలి । పవళించెను ॥
తెగని పరిణతులతో । తెల్లవారిన దాక ॥
జగదక పతి మనసు । జట్టిగొనెగాన ॥ ॥పలుకు ॥

2. కొంగు జారిన మెరుగు । గుబ్బలొలయగ తరుణి ॥
బంగారు మేడపై । పవళించెను ॥
చెంగలువ కనుగొనల। సింగారములు దొరల॥
అంగజ గురునితోడ । అలసినది గాన ॥ ॥పలుకు ॥

3. మురిపెంపు నటనతో । ముత్యాల మలగుపై
పరవశంబున తరుణి । పవళించెను ॥
తిరువేంకటాచలా । ధిపుని కౌగిట గలసి
అరవిరైనను చెమట । నంటినది గాన ॥ ॥ పలుకు ॥

## తాత్పర్యము :

ఇది వేంకటేశ్వరునితో రతి జరిగిన తరువాత నాయికకు కలిగిన అలుపును వర్ణించిన పాట. ఆ నాయిక అలమేలు మంగాదేవియే. ఆమెను అన్నమయ్యగారు పలుకు తేనెల తల్లిగా భావించినారు. తియ్యని మాటలు మాటలాడునది భావము. ఆమె పవ్వళించినది. శృంగారనాయికా లక్షణములతో నాయకునితో కలిసినది కనుక, అలసి పవ్వళించినది. నిగనిగలాడుచున్న ముఖము ప్రక్కల ముంగురులు చెదరగా, సూర్యోదయం అయిన పిదప కూడ పవ్వళించినది. వేంకటేశ్వరుని మనస్సును బాగా చూరకొని రతిలో ప్రగల్భముగా పాలుగొనినది కనుక తెలవారిన వరకు పవ్వళించినది. నిద్రా పారవశ్యంలో పైట కొంగు జారినది. చనులు కనపడుచున్నవి. బంగారు మేడపై పవ్వళించినది. కలువల వంటి కనుగొనల నుండి

శృంగార రసము జాలువారు చుండగా వేంకటపతితో రతిలో శ్రమించినది కనుక పగలైనను పవ్వళించినది.

**విశేషము :** రతిలో నాయికా నాయకులకు శ్రమకలుగుట శృంగార శాస్త్రమున నున్నది. కవికులగురువు కాళిదాసు మేఘసందేశంలో ''శిప్రావాతో హరతి సురత గ్లాని మంగాకులస్య'' ఉజ్జయినిలో మేడలలోనివాని సురత గ్లాని (సంభోగము వలన కలిగిన శ్రమ) ని శిప్రానదినుంచి వీచే వాయువు పోగొట్టుచున్నది అని ఉన్నది. కనుక సురత గ్లాని యొక్క ప్రసక్తి సాహిత్య మందున్నది. అన్నమాచార్య స్వామి దానిని అలమేలు మంగపరంగా వర్ణించినారు.

## 4. మణిరంగు = ఆది

ప॥ జయజయరామ । సమరవిజయ రామ ॥
భయహర నిజభక్త । పారీణ రామ ॥ ॥జయజయ॥

చ॥ జలధి బంధించిన । సౌమిత్రి రామ ॥
సెలవిల్లు విరచిన । సీతారామ ॥
అల సుగ్రీవు నేలిన । అయోధ్య రామ ॥
కలిగి యజ్ఞము గాచే । కౌసల్య రామ ॥ ॥జయజయ॥

2. అరిరావణాంతక । ఆదిత్యకులరామ ॥
గురు మౌనులను గాచే । కోదండరామ ॥
ధర నహల్య పాలిటి । దశరధరామ ॥
హరు రాణినుతుల లో । కాభిరామ ॥ ॥జయజయ ॥

3. అతి ప్రతాపముల మా । యామృగాంతకరామ ॥
సుత కుశలవ ప్రియ । సుగుణారామ ॥
వితతమహిమల శ్రీ । వేంకటాద్రిరామ ॥
మతిలో నా బాయని । మనువంశరామ ॥ జయజయ ॥

**తాత్పర్యము :**

సమరవిజయ = యుద్ధమందువిజయముగల వాడా ! భయహర = భయమును తొలగించువాడా! నిజభక్త పారీణ = నీ భక్తులపై అపారదయగల వాడా! సముద్రమును బంధించిన సౌమిత్రి రామ = లక్ష్మణ సహితుడయిన రామా! శివుని పాతవిల్లు విరచిన సీతారామా! అనగనగా సుగ్రీవునిగాచిన అయోధ్య రామా! కలిగి = శక్తి కలిగి విశ్వామిత్రుని యజ్ఞము గాచిన రామా! అరిరావణాంతక = శత్రువగురావణుని అంతమొందించిన వాడా! ఆదిత్యకులరామ = సూర్యకుల రాముడా! గురువులను మునులను రక్షించుటకు కోదండమును ధరించిన రామా! అహల్య శాపము తీర్చుటకు దశరధసుతుడయిన రామా! పార్వతి స్తోత్రములను పొందిన రామా! అతిప్రతాపముతో మాయామృగమును కూల్చిన రామా! కుశలవులగానమునకు ప్రియపడిన రామా! కలిలో వేంకటాద్రి పైన వెలసినరామా! నామనస్సును వదలని రామా!'' అని అన్నియు రామాయణకథలను రామనామంతో పొందుపరచి సంబోధించి జయజయ = జయించుము జయించుము అని సంస్కృత క్రియాపదముతో ముగించిన మణి ప్రవాళ కృతి ఇది...

## 5. కురంజిరాగం = ఆదితాళం

ప॥ ముద్దుగారే యశోద । ముంగిటి ముత్యము వీడు ॥
తిద్దరాని మహిమల । దేవకీ సుతుడు ॥ ॥ముద్దుగారే॥

చ ॥ అంతనింత గొల్లెతల । అరచేతి మాణిక్యము ॥
పంతమాడే కంసుని పాలి । వజ్రము ॥
కాంతుల మూడులోకాల । గరుడపచ్చపూస
చెంతల మాలోనున్న । చిన్ని కృష్ణుడు ॥ ॥ముద్దు గారే ॥

2. రతికేళి రుక్మిణికి । రంగు మోవి పగడము ॥
మితి గోవర్ధనపు గో । మేధికము
సతమై శంఖ చక్రాల । సందుల వైడూర్యము ॥
గతియై మమ్ముగాచేటి । కమలాక్షుడు ॥ ॥ముద్దుగారే ॥

3. కాళింగుని తలలపై । కప్పిన పుష్యరాగము ॥
ఏలేటి శ్రీ వేంకటాద్రి । యింద్రనీలము ॥
పాల జలనిధిలోన । పాయని దివ్యరత్నము ॥
బాలుని వలె తిరిగీ । పద్మనాభుడు ॥ ॥ముద్దుగారే ॥

**తాత్పర్యము :**

అన్నమాచార్యులు ఈకృతిలో శ్రీ వేంకటేశ్వరుని నవరత్నములలోని మణులుగా భావించిరి. ప్రధానముగా ఇందు దేవకీ సుతుడు వర్ణింపబడినాడు. యశోద ముంగిట ముద్దులొలికిస్తూ నడయాడే మంచిముత్యము వీడు. సరిదిద్దరాని మహిమలవాడు. చిన్న చిన్నగోపికలకు అరచేత జిక్కిన మాణిక్యము వీడు. అనగా సులభుడు అని అర్థము. పంతము లాడుచున్న కంసునికి వజ్రము వీడు. వజ్రమనగా నవరత్నములలోని వజ్రము. అదీ కాక రాక్షసులను వధించు ఇంద్రునిచేతిలోని వజ్రాయుధము కూడ. గరుడుడు మూడులోకాలు తిరుగగలవాడు. మూడులోకాలతోనూ అతనికి సంబంధమున్నది. కృష్ణుడు కూడా అట్టివాడే. అందుచేత గరుడపచ్చమణి. రుక్మిణీ దేవితో రతికేళి సలుపునప్పుడు కృష్ణుని పెదవి రుక్మిణికి పగడమయినది. గోవర్ధన పర్వతము మీద విహరించువాడు కదా కృష్ణుడు. అందుచేత ఆ పర్వతముమీద కృష్ణుడు గోమేధికమణి. కాళియుని పడగలపై ఆడినాడు కృష్ణుడు. సర్పము పడగలపైన రత్నములుండును. కృష్ణుని పాదములు ఎరుపు. పుష్యరాగము ఎరుపు. కాళియుడు నల్లత్రాచు. నల్లత్రాచు పడగలపైన నర్తించిన ఎర్రని పాదములు పుష్యరాగమణుల వలె ప్రకాశించినవి. వేంకటగిరిపైన ఇంద్రనీలమణి. సముద్రమునకు రత్నాకరుడు (రత్నములుగలవాడు) అని పేరు. పాల సముద్రమున శయనించిన స్వామి ఒక దివ్య రత్నము. ఈ విధముగా అన్నమయ్యగారు స్వామిని నవరత్నములతో పోల్చినారు.

**విశేషము :** కులశేఖరులు ముకుంద మాలలో ''భక్తాపాయభుజంగ గారుడ మణిః'' = భక్తుల ఆపదలనెడు సర్పములకు గరుడమణి = ఇత్యాదిగా ముకుందుడు ఆయామణులుగా రూపొందింపబడినాడు. ఇది దానిని బోలినది.

## ౯. హుసేనిరాగం = ఆదితాళం (త్రిశ్రగతి)

ప॥ వెనకేదో ముందేదో । వెఱ్ఱి నేనునా
మనసు మరులు దేర । మందే దాకో ।            వెనకేదో ॥

చ॥ చేరి మీదటి జన్మము । సిరులకు నోమే గాని ॥
ఏరూపై పుట్టుదునో । యెరుగనేను ॥
కోరి నిద్రించెదనను । కొని యుద్యోగింతుగాని ॥
సారె లేతునోలేవనొ । జాడతెలయలేను ॥            వెనకేదో ॥

2. తెల్ల వారి నప్పుడెల్లా । తెలిసితిననే గాని
కల్ల ఏదొ నిజమేదో । కాన నేను ॥
వల్ల జూచి కామినుల । వలపించెగాని ॥
మెల్లమై నా మేను । ముదిసిన దెరుగ ॥            వెనకేదో ॥

3. పాపాలు చేసి మరచి । బ్రతుకు చున్నాడగాని ॥
వైపుగ చిత్ర గుప్తుడు । వ్రాయుటెరుగ ॥
ఏపున శ్రీ వేంటేశు । ఎక్కడో వెదకెగాని ॥
నా పాలి దైవమని । నన్ను గాచుటెరుగ ॥            ॥వెనకేదో ॥

### తాత్పర్యము :

నాకు వెఱ్ఱి ఎత్తుచున్నది. వెనకముందులు తెలుసుకో లేకుండా ఉన్నాను. మనస్సు మాత్రం వేంకటేశుని మీది వ్యామోహంతో మండుచున్నది. 1వ చరణం. రాబోయే జన్మములో సంపదలు కలుగుటకు నోములు నోచుచున్నాను కాని ఏరూపమయిన జన్మ వచ్చునో తెలియలేకున్నాను. కోరికతో నిద్రించుటకు ప్రయత్నించుచున్నాను. కాని మరల నిద్రలేచెదనో లేవనో తెలియదు. తెల్లవారి నిదుర లేచి తెలుసుకొన్నాను అనుకొనుచున్నాను కాని ఈ చూచి తెలుసు కొన్నదానిలో నిజమైనదేదో కల్ల అయినదేదో తెలుసుకొనలేకున్నాను. సమయము చూచి స్త్రీలపైన వ్యామోహము పెంచుకొన్నాను కాని, ఈలోపుగా ముసలితనము ముంచు కొని వచ్చినదని ఎరుగలేక ఉన్నాను. పాపాలు చేయుచున్నాను. చేసితినని మరచిపోవుచున్నాను. కాని చిత్రగుప్తుడు మరచునా? మరువడు. ఒకవైపునుంచి

వాడు నా పాపాలను తన గ్రంథంలో వ్రాయుచున్నాడని తెలియకున్నాను. శ్రీ వేంకటేశ్వరుడు ఎక్కడో కలడని వెదకుచున్నానే కాని వాడు నన్ను అంతరాత్మగా ఉండి నన్ను రక్షించుచునే ఉన్నాడని ఎరుగలేకుండా ఉన్నాను. అని అన్నమాచార్యులు వేదాంతధోరణి తత్త్వ చింత కలిపి నిర్వేదమును చూపినారు.

**విశేషము :** ''కృత్యాకృత్య వివేకాంధం పరిభ్రాంతమిత స్తతః'' = ఈ సంసార మందు కృత్యాకృత్యములు తెలియక ఇటు నటు తిరుగుచున్నాను'' అంటారు ఎరుంబి అప్పా. అదే వెనకముందులు తెలియకపోవుట. నిదురించుట అంటే భగవంతుని జ్ఞానము లేకపోవుట. లేచుట అంటే అజ్ఞానము కలుగుట. యౌవన దశలో స్త్రీ లోలుడై ఉంటాడు జీవుడు. తనకు తెలియకుండానే ముదిమి ఆక్రమిస్తుంది. జీవుడు పాపాలు చేసి మరచిపోతాడు, కాని ఫలితం తప్పదు. యమయాతనలు తరువాత అనుభవించక తప్పదు. భగవంతుని ఎక్కడో వెదకుతాడు. సరికాదు.

శ్లో॥ యామోవైవస్వతో రాజా హృదయస్థోజనార్దనః
తేనచే దవివాదస్తే మాగంగాం మా కురూన్ గమః॥''

ఓరీ జీవా! శ్రీహరి నీ హృదయంలో ఉండి, నిన్ను నియమించుచు, నిన్ను రంజింపజేయుచు, నిన్ను రక్షించుచున్నాడు. ఇది తెలుసుకొని నీవు హరి ఆజ్ఞాను వర్తివై యున్నట్లయితే నీవు భగవంతుని వెదకుచు గంగకు పోకుము. కురుక్షేత్రానికి పోకుము'' అని శాస్త్రము. పైన చెప్పిన విశేషములన్నియు ఈ పాటలో అన్నమయ్య గారు నిక్షిప్తం చేశారు.

## 7. ముఖారి రాగం = ఆదితాళం

ప॥ పలుమరు ఉట్ల। పండుగను॥
చిలుకు చిలుక్కని। చింద

చ॥ ఊళ్లవీధుల। ఉట్ల కృష్ణుడు॥
తాళ్లు తెగిపడ। తన్నగను॥

ఫెళ్లు కఠిల్లుపె। ఠిల్లు చిఠిల్లని॥
పెళ్ళుగమ్రోసే। పెనురవము॥ ॥పలుమరు॥

2) బంగరు బిందెల। పాలు పెరుగులు॥
ముంగిట నెగయుచు। మోదగను॥
ఖంగు కళింగుక। ఠింగు ఖణింగని॥
రంగు మీరు పెను। రవములై॥ ॥పలుమరు॥

3) నిగ్గగ వేంకట। నిలయుడుట్టిపై॥
లగ్గలిక పగుల। అడపగను॥
బగ్గు బగిల్లని। పరమామృతములు॥
గుగ్గిలి పదనుగ। గురియగను॥ ॥పలుమరు॥

## తాత్పర్యము :

మన దేశంలో కృష్ణాష్టమి రోజున చాలా ఊళ్ళల్లో ఉట్ల పండుగ అని చేసేవారు. ఊరి నడిబొడ్డున రెండు వైపుల రెండు స్తంభాలు పాతి రెండు స్తంభాలు చివరి వైపున ఒక అడ్డకర్రను మధ్యలో కలిపి నడుమ ఒక గిలకను కట్టి ఒక గుడ్డలో తినుబండారాలు మూటగట్టి ఒక త్రాడు చివర దానిని కట్టి గిలక మీద వ్రేలాడ దీసి త్రాడు చివర ఒకడు పట్టుకొని లాగుతుంటే మూటపైకిపోతుంది, క్రిందికి వస్తుంది. అప్పుడు క్రిందనున్నవాడొకడు దానిని ఎగిరి పట్టుకోవాలి. ఆ సమయంలో ఆ ఊళ్ళోనున్న విష్ణువు ఆలయంలోని దేవుడు కూడ వాహనం మీద ఆ చోటికి వచ్చి ఆ ఉత్సవాన్ని తిలకిస్తాడు. అన్నమయ్యగారు ఆ పండుగలో జరిగే మ్రోతలను ఖంగుకఠిల్లు అని ధ్వని అనుకరణ శబ్దాలతో వర్ణించారు. ఆ ఉట్టి కొట్టినది వేంకటేశ్వరుడే అని భావన. ఈ ఉట్ల పండుగ, బాలకృష్ణుడు గోపికల ఇండ్లలో ఉట్టిలో నున్న పాలు పెరుగులను కుండలు పగులగొట్టి దొంగిలించిన క్రీడకు అనుకరణము. అన్నమయ్యగారు దీనిని వర్ణించినారు.

## 8. తోడి రాగం = ఆదితాళం

ప॥ విరహపు రాజదె। విడిదికి రాగా॥
సిరుల జేసె నిదె। సింగారములు॥

చ॥ నెలత నుదుటిపై। నీలపు కురులనె
తొలుతనె గట్టెను। తోరణము॥
మొలక చెమటలనె। ముత్యపు ముగ్గులు॥
అలరిచె మదనుడదె చెలిమేన॥ ॥విరహపు॥

2) దట్టముగ చిం। తాలతనే వడి॥
బెట్టె చప్పరము। పెనగొనగా॥
పట్టిన మైతా। వులు పరిమళములు॥
కట్టించెను చెం। గట వలరాజు॥ ॥విరహపు॥

3) విందగు వేంకట। విభుని ప్రేమచే॥
పొందగ బెట్టెను। బోనాలు॥
ఇందువదనకి। ఇందిరావిభుని॥
కందుదేర పలు। కులు చవిజేసె॥ ॥విరహపు॥

## తాత్పర్యము :

విరహపురాజు = కొంతకాలము పద్మావతి విరహము ననుభవించిన ప్రోషిత నాయకుడు. వేంకటేశ్వరుడు పద్మావతి విడిదికి (ఇంటికి) వచ్చినాడు. అప్పుడు మన్మధుడు పద్మావతిని అనేక అలంకారాలతో అలంకరించినాడు. ఎట్లనగా? ఇట్లు. పద్మావతి దేహమే ఒక గృహము. పద్మావతి ముఖముపై నల్లని ముంగురులనే తోరణం కట్టినాడు. సాత్విక భావంచేత పద్మావతికి చిరుచెమట బిందువులు ఏర్పడినవి అవే ముత్యాల ముగ్గులు. ప్రియుడు చేరగా ఆమెకు పలు తలపులు కలిగినవి. ఆ తలపుల తీగలతో దడి గట్టినాడు. ఆ లతలే చలువ చప్పరము. (పల్లకి). ఆమె తియ్యని పలుకులే వేంకటేశ్వరుని ఆకలి తీర్చే విందు భోజనము. సాహిత్య పరంగా ఈ గేయమందున్నది పరిణామాలంకారము. లక్షణం.

''ఆరోప్యమాణస్య ప్రకృతోపయోగిత్వే పరిణామాలంకారః'' = ఆరోపింపబడిన విషయము ప్రస్తుతమైన దానికి ఉపయోగపడినప్పుడు అది పరిణామాలంకార మగును. కురులయందు ఆరోపింపబడిన తోరణభావము మొదలయినవి ప్రస్తుతము వేంకటేశ్వరునకు ఉపచారములుగా ఉపయోగించెనుకదా!

## 9 ఖరహరప్రియరాగం = ఆదితాళం

ప॥ ఒకపరి కొకపరి। కొయ్యారమై॥
మొకమున కళలెల్ల। మొనసినట్లుండె॥ ॥ఒకపరి॥

చ॥ జగదేక పతిమేన। చల్లిన కర్పూర ధూళి॥
జిగిగొని నలువంక। చిందగాను॥
మొగి చంద్రముఖి నుర। మున నిలిపె గాన
పొగరు వెన్నెల దిగ। బోసినట్లుండె॥ ॥ఒకపరి॥

2) పొరిమెరుగు చెక్కుల। పూసిన తట్టు పునుగు॥
కరగి యిరు దెసల। కారగాను॥
కరిగమన విభుడు। కనుక మోహమదము
తొరగి సామజ సిరి। తొలకి నట్లుండె॥ ॥ఒకపరి॥

3) మెరయ శ్రీ వెంకటేశు। మేన సింగారము గాను
తరచైన సొమ్ములు। ధరియించగా॥
మెరుగుబోడి అల। మేలు మంగయు తాను
మెరుపు మేఘము గూడి। మెరసి నట్లుండె॥ ॥ ఒకపరి॥

### తాత్పర్యము :

వేంకటేశ్వరుని దర్శిస్తూ ఉంటే ఒకపారి కన్నా ఇంకొక పారి సేవిస్తూ ఉంటే ఆ ఒయ్యారము అధికమయినట్లు తోచుచున్నది. ఆ అనుభవాన్ని అన్నమయ్యగారు వర్ణిస్తున్నారు. స్వామికి చేసే అలంకారాలలో అర్చకులు విగ్రహం నిండా కర్పూర ధూళి చల్లినారు. కర్పూరము వెన్నెలవలె ఉంటుంది. చల్లిన కర్పూరము స్వామి

యొక్క విగ్రహం అంతా జాలువారింది. ఇది కాక చంద్రుని వంటి ముఖ కాంతి కలిగిన పద్మావతి స్వామి వక్షస్థలముపైన నుండుట చేత ఆమె ముఖకాంతి కర్పూర ధూళి కలిసి స్వామి విగ్రహము అంతా దట్టమైన వెన్నెల దిగబోసినట్లునది. మరియు స్వామి చెక్కిళ్ల పునుగు పూసినారు. అది కరగి రెండు వైపులా కారినది. అసలే స్వామి ఏనుగు నడకవాడు. కారిన తట్టు పునుగుతో స్వామి ఏనుగువలె కనిపించు చున్నాడు. ఆ సమయములో బంగారు నగలు పెట్టినారు. అదీగాక పద్మావతి మేనికాంతి బంగారు నగల కాంతి కలసి నల్లని మేని స్వామి మెరుపుతో కూడిన మేఘమువలె నున్నాడు. ఈ చివరిది కవి సమయసిద్ధము.

**విశేషము :** భోజమహారాజు ''లక్ష్మీ విద్యుల్లసిత మతసీ గుచ్ఛసచ్ఛాయ కాయం। వైకుంఠాఖ్యం త్రిదశ పరిషత్కాల మేఘం దదర్శ'' = దేవతలు లక్ష్మీదేవి అనే మెరపుతో కూడిన హరి అనే కాలమేఘమును చూచిరి అని.

## 10. రాగమాలిక = ఖండచాపు తాళం

ప॥ అలర చంచలమైన। ఆత్మలందుండ నీ
యలవాటు సేసెనీ। ఉయ్యాల
పలుమారు నుచ్ఛ్వాస। పవన మందుండనీ
భావంబు దెలిపె నీ। యుయ్యాల॥ ॥అలర॥

చ॥ ఉదయాస్త శైలంబు। లొనర కంభములైన॥
నుడు మండలము మోచె। నుయ్యాల॥
అదన నాకాశపద। మడ్డ దూలం బైన॥
అఖిలంబు నిండెనీ। యుయ్యాల॥ ॥అలర॥

2) పదిలముగ వేదముల బంగారు చేరులై॥
పట్టి వెరపై తోచె। నుయ్యాల॥
వదలకిటు ధర్మదే। వత పీఠమై మిగుల॥
వర్ణింప నరుదాయె। నుయ్యాల॥ ॥అలర॥

3) మేలు కట్లయి మీకు। మేఘమండల మెల్ల॥
మెరుగునకు మెరుగాయె। నుయ్యాల॥
నీలశైలము వంటి। నీ మేని కాంతికి
నిజమైన తొడవాయె। నుయ్యాల॥ ॥అలర॥

4) పాలిండ్లు కదలగా। పయ్యెదలు రాపాడ॥
భామినులు వడినూచు। నుయ్యాల॥
ఓలి బ్రహ్మాండములు। నొరగునోయని భీతి॥
నొయ్య నొయ్యన నూచి। రుయ్యాల॥ ॥ అలర॥

5) కమలకును భూసతికి। కదలు కదలుకు మిమ్ము
కౌగిలింపగ జేసె। నుయ్యాల॥
అమరాంగనలకు నీ। హావ భావ విలాస
మందంద జూపెనీ। యుయ్యాల॥ ॥అలర॥

6) కమలాసనాదులకు। కన్నులకు పండుగై
గణుతింప నరుదాయె। నుయ్యాల॥
కమనీయమూర్తి వేం। కటశైల పతి నీకు॥
కడువేడు కైయుండె। నుయ్యాల॥ ॥అలర॥

**తాత్పర్యము :**

అన్నమాచార్యులవారు భగవంతుడు చేసే ఈ జగత్సృష్టి రక్షణ ప్రళయములను ఒక ఉయ్యాల ఆటతో పోల్చుచున్నారు. చంచలస్వభావము కలిగిన జీవాత్మలకు ఈ ఉయ్యలలో నుండుట అలవాటైనది. జీవులు పీల్చే ఉచ్ఛ్వాసములో నీ భావము తెలుస్తుంది. ఉచ్ఛ్వాసము ఓంకారము. ఓంకారమందు నారాయణుడు సర్వనిర్వాహకుడని, అతనికి జీవాత్ముడు దాసుడని, జీవాత్ముని లక్షణమదే అని, దాస్యమవలంబించిన జీవాత్ముడు ముక్తి కర్హుడై పరమాత్మతో యావత్కాలమును సుఖించుననే భావము గర్భితమై యున్నది. ఇది ఈ ఉయ్యాలలోనిదే. సూర్యుడుదయించు అస్తమించు రెండు కొండలును స్తంభములయితే నక్షత్రమండల మంతయును ఈ ఉయ్యాలను మోయుచున్నది. ఈ ఉయ్యాలకు

ఆకాశము అడ్డదూలము. కనుక నీ ఉయ్యాల సమస్త ప్రపంచమును నిండియున్నది. ఈ ఉయ్యాలకు నాలుగు వేదములును బంగారు గొలుసులు. (జగత్క్రియా కలాపములకు వేదములే ఆధారము) ఉయ్యాలపట్టె సంఖ్యాశాస్త్రము. (మూడు లోకములు, సప్తకుల పర్వతములు, త్రిగుణములు, అరిషడ్వర్గములు, చతుర్దశవిద్యలు మొదలయిన వ్యవహార మంతయు సంఖ్యాశాస్త్రము మీదనే ఆధారపడినది కనుక ఆ పట్టె సంఖ్యాశాస్త్రము.) ధర్మదేవత పీఠము. మేఘమండలము మేలు కట్లు (బందుకట్లు). ఈ ఉయ్యాల మెరుగుకు మెరుగు (చాల మేలయినదని). నల్లని కొండవంటి నీ మేని కాంతికిది నిజమయిన ఆభరణము. (స్వామి యొక్క మేనిపైననే జగత్తు లాధారపడియున్నవి. కనుక ఇవియే స్వామి మేనికి నగలు). స్తనములు కదలు చుండగా, పైట కొంగులు రాచుకొనగా స్త్రీలు ఊపే ఉయ్యాల ఇది. (భగవంతుడూపే ఈ ఉయ్యాలకు బ్రహ్మాది దేవతలు తక్కిన జీవాత్మలు కూడ సహాయభూతులు కనుక వారు ఊపే ఉయ్యాల ఇది. అయితే వీరందరు స్త్రీలు. ''స్త్రీప్రాయ మితరంజగత్'' = భగవంతుడొక్కడే స్వతంత్రతకలిగిన పురుషుడు తక్కిన వారందరు భగవంతునకు పరతంత్రులు కనుక స్త్రీలే'' అని శాస్త్ర నిర్ణయము. వీరుకూడ ఈ ఉయ్యాల నూపుచున్నారు కదా) ఆ స్త్రీలు బ్రహ్మాండములన్నీ ఒరిగిపోతాయనే భయముతో ఊపుచున్నారు. (జగత్క్రియలు భగవంతుడు నిర్భయంగా చేస్తాడు. తక్కిన వారు పరతంత్రులు కనుక భయంతో చేస్తారు). ఈ ఉయ్యాలలో నున్న శ్రీదేవి భూదేవి ప్రతికదలికకు నిన్ను కౌగిలించుకొందురు కదా! స్వామీ! దేవతాస్త్రీలకు ఈ ఉయ్యాలలోనే నీ హావభావ విలాసములు తెలుస్తాయి. బ్రహ్మాదులకు కూడ ఇది ఆశ్చర్యకరమై వర్ణింపనలవికాదు. కన్నుల పండువయినది. ఓ వేంకటేశ్వరా! ఈ ఉయ్యాల ఊపుట నీకు వేడుకయిన లీల. (స్వామికి వైకుంఠము భోగము కొరకని, తక్కిన లోకములు లీలకొరకని సంప్రదాయము) ఈ పదము అన్నమయ్యగారి భావుకతకు నిదర్శనము.

## 11. యదుకుల కాంభోజి = ఆది.

ప॥ కొలనిదోపరికి గొబ్బిళ్లో యదు। కుల స్వామికి గొబ్బిళ్లో॥

చ॥ కొండగొడుగుగా గోవులగాచిన
కొండొక శిశువుకు గొబ్బిళ్లో ॥
దుండగంపు దైత్యుల కెల్లను తల
గుండు గండనికి గొబ్బిళ్లో॥ ॥కొలని॥

2) పాపవిధుల శిశుపాలుని తిట్టుల
కోపగానికిని గొబ్బిళ్లో ॥
యేపున కంసుని యిడుమల బెట్టిన
గోపబాలునికి గొబ్బిళ్లో॥ ॥కొలని॥

3) దండివైరులను తరిమిన దనుజుల
గుండె దిగులునకు గొబ్బిళ్లో ॥
వెండి పైడియగు వేంకటగిరిపై
కొండలయ్యకును గొబ్బిళ్లో॥ ॥కొలని॥

**తాత్పర్యము :**

ఇందు బాలకృష్ణుని లీలావిశేషములు చెప్పబడినవి. కొలని దోపరికి నమస్కారము. యదుకుల స్వామికి నమస్కారము. కొండను గొడుగుగా బట్టి గోవులను గాచిన అపూర్వ బాలునకు నమస్కారము. పాపకృత్యములు చేసిన శిశుపాలుని తిట్లకు కోపగించిన వానికి నమస్కారము. పెక్కురు శత్రువులను తరిమికొట్టి రాక్షసుల గుండెలకు దిగులు కలిగించిన శూరునకు నమస్కారము. అని అన్నమయ్య గారు పాడినారు.

**విశేషము :** కొలను దోపరి అంటే కోనేటిని దొంగిలించినవాడని అర్థము. వేంకటేశ్వరుడు వరాహ స్వామి వద్దనుండి ఆ క్షేత్రమును ఆ కొలనును ఆక్రమించుకొన్నాడు. కనుక కొలను దోపరి. ఇందన్నియు కృష్ణపరముగా నున్నవి

కనుక కొలనులో స్నానము చేయుచున్న గోపికల వస్త్రములను దొంగిలించిన వాడని లక్షణార్థము చెప్పవచ్చును. లక్షణార్థ మనగా ''గంగలో గొల్లపల్లె'' అనే వాక్యమునకు గంగ ఒడ్డున గొల్లపల్లె అని అర్థము చెప్పకొన వలెను. ఇది లక్షణార్థము. ''గొబ్బిళ్లు'' అనగా ద్వాపరములో గోపిక లొకవ్రతము చేసి తాము కోరిన కృష్ణుని భర్తగా పొందిరి. కలియుగమున గోదాదేవి గోపికలను అనుకరించి ఆ వ్రతము చేసి కృష్ణుని భర్తగా పొందినది. అనంతరకాలంలో వివాహ యుక్త వయస్సు గల కన్యలు పై కథను అనుసరించి (గోమయం) ఆవు పేడతో గుండ్రని ముద్దలు చేసి వాటికి పసుపు కుంకుమలు బెట్టి పూలు బెట్టి తమ ఇంటి ముంగిలి శుభ్రం చేసి ముగ్గులు బెట్టి గోమయపిండములను ముగ్గులపైన నుంచి వాటిని గోపికలుగా భావించి వాటికి పాటలు పాడుచు ప్రదక్షిణం చేసేవారు. 60 ఏండ్ల క్రితం వరకు ఇది ఉండేది. ఆ ముద్దలను గోపెమ్మలు, గొబ్బెమ్మలు అనేవారు. కాలక్రమంలో ''గొబ్బిళ్లు'' అయినది. నిఘంటువు ఈ పదమునకు క్రీడావిశేషము (ఒక ఆట) అనియును నమస్కార మనియును అర్థములు చెప్పినది. నేను ప్రకరణోచితముగా రెండవ అర్థమును గ్రహించితిని.

## 12. ఆనందభైరవి = ఆదితాళం (త్రిశ్రనడ)

ప॥ ఇట్టి ముద్దులాడి బాలు। డేడ వాడు వాని
పట్టి తెచ్చి పొట్టనిండ । పాలు వోయరే॥ ॥ఇట్టి॥

చ॥ కామిడై పారిదెంచి। కాగెడి వెన్నలలోన।
చేమ పూవు కడియాల। చేయి బెట్టి
చీమ కుట్టెనని తన। చెక్కిట కన్నీరు జార
వేమరు వాపోయె వాని। వెడ్డు బెట్టరే॥ ॥ఇట్టి॥

2) ముచ్చు వలె వచ్చి తన । ముంగ మురువుల చేయి
తచ్చెడి పెరుగులోన। తగ బెట్టి
నొచ్చెనని చేయిదీసి। నోరనెల్ల జొల్లు గార
నొచ్చెలి వాపోవు వాని। నూరడింపరే॥ ॥ఇట్టి॥

3) ఎప్పుడు వచ్చెనో మా। ఇల్లు జొచ్చి పెట్టెలోన
చెప్పరాని వుంగరాల। చేయి బెట్టె
అప్పడైన వేంకటేశు। డాస పాలకుడు గాన
తప్పకుండ పెట్టెవాని। తలకెత్తరే॥ ॥ఇట్టి॥

**తాత్పర్యము :**

ఒక గోప గృహములో బాలకృష్ణుడు కొన్ని లీలలు చేసినాడు. చేసిమాయమై నాడు. ఇది చూచిన ఒక గోప భామ తక్కిన వారితో చెప్పుచున్నది. ఏడి ముద్దుల కృష్ణుడు? వానిని పట్టి తెచ్చి పొట్టనిండా పాలు పొయ్యండి. కోరికతో కంగారుగా పరుగెత్తుకొని వచ్చి చేమంతిపూల కడియపు చేతిని సలసల కాగే వెన్నలో పెట్టినాడు. పెట్టి చీమ కుట్టినదని చెంపమీద నుంచి కన్నీరు కార్చుచున్నాడు. ఎలాగో ఆ మాట ఈ మాట చెప్పి వానిని బుజ్జగించండి. నేను పెరుగు చిలుకుచుంటే దొంగలాగవచ్చి చేతిమురుగులు చప్పుడు కాకుండ చెయ్యిబెట్టి చెయ్యి నొప్పి అని నోట చొల్లుగార్చుచు బాగా బాధపడుచున్నాడు. చూడండి. కృష్ణుని ఊరడించండి. ఎప్పుడు వచ్చెనో తెలియదు. ఇంటిలోనికి వెళ్లి తన ఉంగరాల చేతిని పెట్టెలో పెట్టినాడు. వేంకటేశ్వరుడు ఆశలవాడు కనుక ఆపెట్టెను వాని తలకెత్తండి'' అని అన్నమయ్య గోపభామలతో చెప్పినాడు.

## 13. మధ్యమావతి = ఆదితాళం

ప॥ ఉయ్యాల బాలు నూచెదరు కడు
నొయ్య నొయ్య నొయ్యనుచు॥ ॥ఉయ్యాల॥

చ॥ బాల యవ్వనలు పసిడి ఉయ్యాల
బాలుని వద్ద పాడేరు॥
లాలి లాలి లాలి లాలెమ్మ
లాలి లాలి లాలి లాలనుచు॥ ॥ఉయ్యాల॥

2) తమ్మిరేకు గను దమ్ముల నవ్వుల॥
పమ్మి జూపుల బాడేరు॥
కొమ్మలు మట్టెల గిలుకుల నడపుల।
ధిమ్మి ధిమ్మి ధిమ్మి ధిమ్మనుచు॥ ॥ఉయ్యాల॥

3) చల్ల చూపుల జవరాం(డ్రు రే। పల్లె బాలుని పాడేరు
బల్లిదు వేంకటపతి జేరందెలు। ఘల్లు ఘల్లు ఘల్లు ఘల్లనుచు॥

## తాత్పర్యము :

గోపభామలు గోపాలబాలుని ఓయి ఓయి అని పాడుచు ఉయ్యాల ఊపుచున్నారు. గోపికా బాలికలు యువతులు బంగరు ఉయ్యాలలో గోపాలుని ఉంచి లాలి లాలి అని పాడుచు ఊపుచున్నారు. గోపభామినులు కృష్ణుని పద్మ నేత్రములను తమ నేత్ర పద్మములతో చూచుచు కాలి మట్టెలు గిలుకు గిలుకు మనుచుండగా ధిం ధిం అని పాడుచున్నారు.

చల్లని చూపులు కలిగిన జవ్వనులు బలముగల వేంకటపతిని అతడే కృష్ణుడు. అతనిని తమ హారాలు అందెలు ఘల్లు ఘల్లు మనుచుండగా ఉయ్యాలలో నుంచి ఊపుచున్నారు. అని అన్నమయ్యగారు వర్ణించినారు.

## 14. ఖమాస్ = ఆదితాళం

ప॥ ఉగ్గు వెట్టరే ఓయమ్మా చె। య్యొగ్గీ నిదె శిశు వోయమ్మా

చ॥ కడుపులోని లోకమ్ములు గదలీ
నొడలూచకురే వోయమ్మా।
తొడికెడి సరగున। తొలగ దీయరే
ఉడికెడి పాలిని వోయమ్మా॥ ॥ఉగ్గు॥

2) చప్పలు పట్టుక। సన్నపు బాలుని
ఉప్పర మెత్తకు రోయమ్మా॥
అప్పుడె సకలము నదరీ నోరనె
వొప్పదు తీయరె వోయమ్మా॥ ॥ఉగ్గు॥

3) తొయ్యలు లిటు చే। తుల నలగించక
ఉయ్యల నిడరే। వోయమ్మా॥
కొయ్యమాటలను। కొండల తిమ్మని
ఒయ్యన తిట్టకు రోరమ్మా॥ ॥ఉగ్గు॥

**తాత్పర్యము :**

అన్నమయ్యగారు తాను ఒక భామయై గోపాల బాలునకు జాగ్రత్తగా ఉగ్గు బెట్టమని బోధించు చున్నారు. ఓ అమ్మా ఉగ్గు బెట్టమ్మా శిశువు చెయ్యి వదలి పెట్టునేమో జాగ్రత్త. ఓ తల్లీ శిశువు ఒడలు కదలనివ్వవద్దు. శిశువు కదలితే అతని కడుపులోని లోకాలన్నీ కదులుతాయి. అందుచేత కదలనీయవద్దు. జాగ్రత్తగా ఆ శిశువు ధరించిన – కదలాడుచున్న రెండు దండలను జాగ్రత్తగా తొలగించండి. గోరు వెచ్చని పాలు పోయండి. దుర్బలుడైన సన్నని బాలుడు. వానిని చెంపలు పట్టుకొని పైకి ఎత్తకండి. అలా ఎత్తితే అతడు అదురుతాడు. కడుపు అదురుతుంది. కడుపులోని లోకములన్నీ అదురుతాయి. ఓ స్త్రీలారా! మీరు గోపాల బాలుని చేతులతో నలుపకండి. మెత్తని ఉయ్యాలలో పడుకోబెట్టండి. ఏడు కొండల ప్రభువును కఠినపు మాటలతో తిట్టకండి అని చెప్పుచున్నారు.

## 15. మలహరి రాగం = రూపకం

ప॥ కోరుదు నామది ననిశము॥
గుణధరు నిర్గుణు కృష్ణుని॥
నారాయణు విశ్వంభరు।
నవనీతా హారుని॥ ॥కోరుదు॥

చ॥ కుండలి మణిమయ భూషణు
కువలయ దళవర్ణాంగుని॥
అండజపతి వాహనుని
అగణిత భవ హరుని

మండన చోదక దమునిని
మాలాలంకృత వక్షుని
నిండు కృపాంబుధి చంద్రుని
నిత్యానందుని॥ ॥కోరుదు॥

2) ఆగమపుంజపదార్థుని
ఆపత్సఖ సంభూతుని
నాగేంద్రాయతతల్పులుని
నానా కల్పుని॥
సాగ్రబ్రహ్మమయాఖ్యుని
సంతత గాన విలోలుని
వాగీశ్వర సంస్తోత్రుని
వైకుంఠోత్తముని॥ ॥కోరుదు॥

3) కుంకుమ వసంత కాముని
గోపాంగనా కుచలిప్తుని
శంకర సతీమణి నుతుని
సర్వాత్ముని సర్వసముని।
శంఖ నినాదమృదంగుని
చక్రాయుధ విదీప్తుని ॥
వేంకటగిరి నిజవాసుని।
విభవవిధాయకుని॥ ॥కోరుదు॥

## తాత్పర్యము :

నేను ఎప్పుడును సకల కల్యాణ గుణములు కలిగి – దుర్గుణములు లేక సమస్త జీవులకు ఆశ్రయమయి విశ్వమంతయును భరించుచు జగత్తులనన్నిటిని చేయుచు భూమికి ఆనందమును కలుగ జేయుచు తాను శయనించు తల్పమైన ఆదిశేషుని పడగల మణికాంతుల చేత భూషింపబడుచు = నల్లకలువల రంగుగల

మేని వానిని – గరుడవాహనుని – ''మండన చోదక దమనుని'' (ఇది అర్థం కాలేదు). వైజయంతిమాల వక్షమందు ధరించిన వానిని – కరుణ అనే సముద్రమునకు నిండు చంద్రుడయిన వానిని ( అనగా కరుణా రసము పొంగిన వానిని) ఎప్పుడును ఆనంద స్వరూపుడగు వానిని – వేదములకు అర్థమయిన వానిని – భక్తులకు ఆపద సమయములో సహాయమగు వానిని – ఆది శేషుడు నిడివయిన పడక అయిన వానిని – అనేక విధములగు సృష్టి స్థితి ప్రళయములను చేసిన వానిని – తాను నివసించెడి కొండతో కలిసిన పేరుగల బ్రహ్మమును ( అనగా వేంకటేశ్వర అనునామము గలవానిని అని) ఎప్పుడును భక్తులు చేయు గానమందు ఆసక్తి గలవానిని – బృహస్పతి స్తుతించు వానిని – వైకుంఠనాముని – కుంకుమము వసంతు ఋతువు అనిన ఇష్టపడువానిని – గోపికల చనులతో పూయబడిన వానిని – పార్వతి నుతించువానిని – అందరి జీవాత్మలలో పరమాత్మగా వెలుగువానిని – ఒకడు ఇష్టుడు, ఒకడు శత్రువు అనే భేదము లేని వానిని – మృదంగధ్వని కలిగిన శంఖము గలవానిని – సుదర్శన చక్రముతో వెలుగువానిని – వేంకటగిరి ( తిరుమల) నివాసమయిన వానిని – భక్తులకు వైభవము లిచ్చువానిని – నేను ఎప్పుడును కోరుకొందును అని పల్లవితో అన్వయము.

## 16. భైరవి రాగం = ఆదితాళం

ప॥ ఎవ్వరి భాగ్యం బెట్టున్నదో
దవ్వు చేరునకు। తానేగురుతు॥ ॥ఎవ్వరి॥

చ॥ పరమ మంగళము। భగవన్నామము॥
సురలకు నరులకు। శుభకరము॥
ఇరవుగ నెరిగిన। యెదుటనె యున్నది॥
వరుసల మరచిన। వారికి మాయ॥ ॥ఎవ్వరి॥

2) వేదాంతసారము। విష్ణు భక్తి యిది॥
ఆది మునుల మత। మయినది॥
సాధించు వారికి। సర్వసాధనము॥
కాదని తొలగిన। కడు శూన్యంబు॥ ॥ఎవ్వరి॥

3) చేతి నిధానము। శ్రీ వేంకట పతి॥
ఏతల జూచిన। ఇందరికి॥
నీతియు నిదియే । నిజసేవకులకు॥
పాతకులకు అది। భవసాగరము ॥ ॥ఎవ్వరి॥

**తాత్పర్యము :**

జీవులు లక్షల సంఖ్యలో ఎవరి భాగ్య మెట్లున్నదో? భగవంతుని సన్నిధి దగ్గర నున్నట్లు ఎవడికి వాడిదే గుర్తు. భగవంతుని నామము మానవులకు దేవతలకును శుభకరము మరీ మంగళకరము. తెలుసుకొంటే ఎదుటనే యున్నది. భగవంతునకు జీవునకు మధ్య ఉన్న వరుసలను మరచిన వానికి మిగిలిన దంతయూ మాయమే. వేదాంత శాస్త్ర సారము విష్ణు భక్తియే. ఇదే ఆది మునుల మతము. ఈ భక్తిని సాధనముగా తీసుకొన్న వారికి ఇదే అన్ని శుభములను సాధించి ఇస్తుంది. ఇది కాదని దీని నుండి తొలగినవారికి అంతయును శూన్యమే. వేంకటేశ్వరుడు అరచేతనున్న ధన నిక్షేపము. ఎటు చూచినా ఎవరి కయినా ఇంతే. ఆ స్వామి భక్తులకు ఇదే నీతి. భక్తి లేని పాపులకు సంసార సముద్రమే గతి. అని అన్న మయ్యగారు చేతనులకు విష్ణు యొక్క మహత్త్వము నుపదేశించినారు.
విశేషములు : ''ఆలోడ్య సర్వ శాస్త్రాణి। వివిచ్యచ పునః పునః। ఇద మేకం నునిష్పన్నం। ధ్యేయోనారాయణ స్సదా॥ = అన్ని శాస్త్రములను మధింపగా తిరిగి తిరిగి ఆలోచింపగా భక్తి కలిగి నారాయణుని ధ్యానింప వలెను అని సర్వశాస్త్ర సారము. మరియు ''పితాచ రక్షక శ్శేషీ। భర్తా జ్ఞేయో రమాపతిః। స్వామ్యా ధారోమమాత్మాచ। భోక్తా చాద్యమనూదితంః॥ = భగవంతునకు చేతనునకు నున్న సంబంధములు తొమ్మిది. 1. పితా పుత్రసంబంధు 2. రక్ష్యరక్షక సంబంధము (రక్షింపబడువాడు - రక్షించువాడు) 3. ఆజ్ఞాపించువాడు ఆజ్ఞను చేయువాడు అను సంబంధము 4. భరించువాడు భరింపబడువాడు అను సంబంధము 5. తెలుసు కొనదగినవాడు తెలుసు కొనువాడు అనుసంబంధము (తెలుసుకొనువాడు జీవుడు తెలియదగినవాడు దేవుడు) 6. సొత్తు అధికారి అను సంబంధము (సొత్తు జీవుడు, అధికారి దేవుడు) 7. ఆధారాధేయ

సంబంధము (ఆధారము దేవుడు ఆధేయము జీవుడు) 8. శరీరాత్మ సంబంధము (శరీరము జీవుడు ఆత్మదేవుడు) 9. భోక్తృ భోగ్యసంబంధము (అనుభవించువాడు దేవుడు అనుభవింపబడు వస్తువు జీవుడు) అని మూల మంత్రమయిన నారాయణాష్టాక్షర మంత్రమందు చెప్పబడినది. ఇవి దేవునకు జీవునకు నున్న వరుసలు.

ఆదిమునులు వసిష్ఠుడు మొదలు ఆవంశమున చివరనున్న శ్రీ శుకుని వరకును ఆదిమునులు. వీరి దంతయు విష్ణుభక్తి మతమే. వసిష్ఠుడు పద్మ పురాణమును రచించి ఆయన పుత్రుడైన శక్తి దానినుసరించి ఆయన పుత్రుడు పరాశరుడు విష్ణు పురాణమును రచించి ఆయన పుత్రుడు వేదవ్యాసుడు భాగవతమును రచించి, ఆయన పుత్రుడు శ్రీ శుకుడు దానిని ప్రవచనము చేసి విష్ణుభక్తి మతమును స్థాపించిరి. ఈ విశేష వివరణము మూలముననున్న వాటిని బట్టి చేయటము జరిగినది. మూల పదములు 1. ''వరుసల మరచిన'' 2. ''వేదాంతసారము'' 3. ''ఆది మునుల మతము'' అనునవి.

## 17. భుజంగిని రాగం = ఆది తాళం

ప॥ ఎదుటనున్నాడు వీడె। ఈ బాలుడు॥
మది దెలియ మమ్మ ఏ। మరులో గాని॥ ॥ఎదుట॥

చ॥ పరమపురుషుడట। పసుల గాచెనట॥
సరవు లెంచిన విన। సంగతా యిది॥
హరియె తానట ముద్దు। లందరికి జేసెనట॥
ఇరవాయెనమ్మ సుద్దు। లేటివో గాని॥ ॥ఎదుట॥

2) వేదాల కొడయడట। వెన్నలు దొంగిలెనట॥
నాదించి విన్నవారికి। నమ్మికాయిది॥
ఆదిమూల మితడట। అడికెల చేతలట॥
కాదమ్మ యీ సుద్దు లెట్టి। కతలో గాని॥ ॥ఎదుట॥

3) అల౹బ్రహ్మ తండ్రియట౹ యశోదకు బిడ్డడట॥
కొలదొకరికి చెప్ప౹ కూడునా ఇది॥
తెలిపి శ్రీవేంకటాద్రి౹ దేవుడై నిలచెనట
కలదమ్మ తన కెంతో౹ కరుణోగాని॥ ॥ఎదుట॥

**తాత్పర్యము :**

అన్నమయ్యగారు వేంకటేశ్వరునిపై బాలకృష్ణుని మహిమలనే ఆరోపించి ఆశ్చర్యము ప్రకటించెదరు. ఒక చెలితో చెప్పుచున్నట్లు. ఈ బాలుడు ఎదుట నున్నాడు. ఎక్కడో వైకుంఠమందున్నవాడు మన ఎదుటకు వచ్చినాడు. మన యందతనికి ఎట్టి వ్యామోహమో తెలియలేము. మనపై వ్యామోహముతో మన ఎదుటకు వచ్చినవాడు పరమపురుషుడు. చేసిన పని పశువులను కాచుట. ఇది ఆశ్చర్యము కాదా! సాక్షాచ్ఛ్రీహరి వ్రేపల్లె వచ్చి అందరికిని ముద్దుల బాలుడైనాడు. ఎట్టి సుద్దులో కదా?? వేదాలకు ప్రభువయినవాడు వెన్నముద్దలు దొంగిలించెనట. (వేదాలలో దొంగతనము చేయరాదని యున్నది. ఆ వేదాలకు ప్రభువయినవాడు దొంగ అంటే నమ్మ శక్యమా?) ఆది మూలపురుషుడట. కాని అపహాస్యపు పనులు చేసెనట. (మన్నుదినుట, గోపికల చీరలపహరించుట అపహాస్యపు పనులు కావా?) అందరికన్న ముందున్న బ్రహ్మకు తండ్రియట. నిన్న మొన్నటి యశోదకు కొడుకట. ఈ శక్తి ఒకరికి వర్ణింపతరమా? అట్టివాడు తన అవతారమును తెలిపి వేంకటాద్రిపై నిలచినాడట. ఈ లోకులపై ఎంత కరుణో?? అని పరమ పురుషుని పరస్పర విరుద్ధములగు ఆశ్చర్యగుణ చేష్టితములను తలచి ఆశ్చర్యపడినా రన్నమాచార్యుల వారు.

**విశేషము :** తెలిపి వేంకటాద్రిపై నిలచినా డంటే? ''ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే'' ధర్మమును స్థాపించుటకు ప్రతి యుగమందును అవతరించెదను అని కృష్ణావతారమున తెలిపినాడు కదా!. వేంకటాద్రిపై నిలచుట దానిలోనిదే.

# 18. పూర్వికల్యాణి = ఆదితాళం

ప॥ ఘుమ్మని యెడి శ్రుతి। గూడగను॥
కమ్మని నేతులు। కాగగ జెలగె॥ ॥ఘుమ్మని॥

చ॥ నీల వర్ణుడని। నీరజాక్షుడని
బాలుని నతివలు। పాడేరో॥
పాలు పిదుకుచును। బానల కాగుల॥
సోలి పెరుగు త్ర। చ్చుచు చెలరేగి॥ ॥ఘుమ్మని॥

2) మందర ధరుడని। మాధవుడని గో
విందుని పాడేరు। వెలదులిదే॥
నంద వ్రజమునను। నలుగడ నావుల॥
మందల పేయల। మంచి రవముల ॥ఘుమ్మని॥

3) వేంకట పతియని। వేదనిలయుడని॥
పంకజ నాభుని। పాడేరో॥
అంకులచేతను। ఆలయరవముల॥
బింకపు మాటల। బృందావనమున॥ ॥ఘుమ్మని॥

## తాత్పర్యము :

ఇందు గోకుల బృందావనమును, తిరుమల దేవస్థానమును ఒకటిగానే భావించి వర్ణింపబడినది. ఘుమ్ ఘుమ్ అనేనాదముతో నేతులు కమ్మగా కాగుచున్నవి. నీలవర్ణా! నీరజాక్షా! అని స్త్రీలు కృష్ణుని పాడుచు బానలతో, కాగులతో పాలు పిదుకుచు పెరుగు తరచుచు అలసిపోవుచున్నారు. మందర ధరా! మాధవా! అని గోపికలు పాడుచు నంజవ్రజంలోని ఆవుల మందలలో నుంచి పెయ్యలను లాగి మంచి పాలు పిదుకుచున్నారు. ఆలయార్చకులు వేంకటపతీ! వేదనిలయా! అని స్తుతిస్తూ తాళం చెవులతో ఆలయ ద్వారాలు తెరచుచున్నారు. ఈ ధ్వనులన్నీ కలిపి ఘుమ్మని వినిపిస్తున్నాయి. ఈ నాదం

భక్తులు పాడే పాటలకు శ్రుతి అగుచున్నది. ఇది ఆండాళ్ తిరుప్పావైలో ''కీచు కీచుమని పక్షులు కూయుచున్నవి. గోపకాంతలు గాజులు, మంగళ సూత్రములు గల గల మనుచుండగా పెరుగు చిలుకుచున్నారు'' అనే పాశురార్థమును తలపించు చున్నది.

**విశేషము :** గోపికలు పాలుపిదుకుచున్నా, పెరుగు చిలుకుచున్నా హరినామ స్మరణమును మానరు అనేది గమనార్హము. లీలా శుకుడు తన కృష్ణ కర్ణామృతములో ''గోవింద దామోదర మాధవేతి'' = ఒక గోపిక పెరుగమ్ముటకు బయలుదేరి పెరుగమ్మోయ్ అనుటకు బదులుగా గోవిందా, దామోదరా, మాధవా'' అని కేకలు వేసినదట. ఇట్టి భావములు ఆచార్యుని మనమున నెలకొని యున్నవి. ఫలితమే ఈ పదము.

## 19. ఆనందభైరవి = ఆదితాళం

ప॥ కంటి శుక్రవారము। గడియ లేడింట
అంటి అలమేల్మంగ। అండనుండే స్వామిని॥ ॥కంటి॥

చ॥ సొమ్ములన్ని కడబెట్టి। సొంపుతో గోణము గట్టి॥
కమ్మని కదంబము। కప్పు పన్నీరు॥
చెమ్మతోన వేష్టువలు। రొమ్ము తల మొల జుట్టి॥
తుమ్మెదమై చాయతోన। నెమ్మదినుండే స్వామిని॥ ॥కంటి॥

2) పచ్చ కప్పురము నూరి। పసిడి గిన్నెల నించి॥
తెచ్చి శిరసాదిగ। దిగనలది॥
అచ్చెర పడిచూడ। నందరి కన్నుల కింపై॥
నిచ్చ మల్లెపూవు వలె। నిటు తానుండే స్వామిని॥ ॥కంటి॥

3) తట్టు పునుగే కూరిచి। చట్టలు చేరిచి నిప్పు॥
పట్టి కరగించి వెండి। పళ్యాల నించి॥
దట్టముగ మేను నిండ। పట్టించి దిద్ది
బిట్టు వేడుకమురియుచుండేబిత్తరి స్వామిని॥ ॥కంటి॥

**తాత్పర్యము :**

శుక్రవారం నాడు వేంకటేశ్వరస్వామికి అభిషేకం చేస్తారు. అన్నమయ్యగారు ఆ దృశ్యాన్ని చూచి వర్ణిస్తున్నారు. ఆహా! శుక్రవారం నాడు ఏడుగడియలు దాటకుండా చేసే అభిషేకోత్సవమును పొందుచున్న స్వామిని చూచాను. అలమేలు మంగాదేవి ప్రక్కన నున్న స్వామిని చూచాను. ఆభరణము లన్నియు ప్రక్కన బెట్టి, సొంపుగా కొన్ని ఆకులను కప్పి, తడి వేష్టువలను (వస్త్రములను) రొమ్ముకు తలకు చుట్టి కదంబమును (సుగంధ ద్రవ్యములు కొన్ని కలిపి చేసిన ముద్ద) పన్నీరుతో కలిపి స్వామి మేనికి పూయగా తుమ్మెద రెక్కల రంగుతో వెలుగు స్వామిని చూచాను. పచ్చకర్పూరము నూరి బంగారు గిన్నెలలో నింపి శిరస్సు మొదలు పాదాలవరకు అర్చకులద్దినారు. అప్పుడు స్వామి విగ్రహమంతా నిత్యమల్లెపూలు నింపి నట్లున్నది. చూచువారి కది కడునింపుగా నున్నది. పునుగు తెచ్చి వెండి పళ్లేలలో పెట్టి నిప్పుపై కరగించి విగ్రహమంతా పట్టించి దిద్దగా వేంకటేశ్వరుడు ఈ సేవలు చాలా వేడుకతో చేయించుకొని మురిసిపోతున్నాడు. ఆ స్వామిని చూచాను. అని అన్నమయ్యగా రీకృతిలో ఆ దర్శనానందమును అనుభవించినారు. ఇది ఇప్పటికిని ఇట్లే జరుగుచున్నది.

విశేషము : వస్త్రములను వైష్ణవ పరిభాషలో ''వేష్టువలు'' అంటారు.

## ౨౦. కమాచిరాగం = జంపె తాళం

ప॥ సింగార మూరితివి। చిత్తజు గురుడవు॥
సంగతి జూచేరు మిము। సాసముఖా॥ ॥సింగార॥

చ॥ పూవుల తెప్పల మీద। పొలతులు నీవు నెక్కి
పూవులు ఆకసము మోవ। పూచి చల్లుచు॥
దేవ దుందుభులు మ్రోయ। దేవతలు కొలువగా॥
సావధానమగు నీకు। సాసముఖా॥ ॥సింగార॥

2) అంగరంగ వైభవాల। అమరకామినులాడ॥
నింగినుండి దేవతలు। నినుజూడగా॥
సంగీత తాళవాద్య। చతురతలు మెరయ॥
సంగడి దేలేటి నీవు। సాసముఖా ॥సింగార॥

3) పరగ కోనేటిలోన। పసిడి మేడనుండి
అరిది ఇందిర నీవు। అందగించి॥
గరిమ (శ్రీ) వేంకటేశ। కనుల పండువుగాగ॥
సరసి నోలాడునీవు। సాసముఖా॥ ॥సింగార॥

## తాత్పర్యము :

ఓ సాసముఖా = సహస్రముఖా! నీవు శృంగార మూర్తివి. మన్మధునకు తండ్రివి. నిన్ను కుతూహలంతో భక్తులు చూచెదరు. నీవు నీ దేవేరులు పువ్వుల తెప్పనెక్కి ఆకసమంతా పూలు చల్లుచు, దేవతల మంగళ వాద్యములు మ్రోగు చుండగా, దేవతలు కొలుచుచుండగా నీకు కొంచెం తీరిక చిక్కుతుంది. అంగరంగ వైభవంతో దేవతా స్త్రీలు నాట్యం చేయుచుండగా ఆకసమున దేవతలు చేరి నిన్ను చూచుచుండగా సంగీత తాళ వాద్యముల నేర్పుజరగుచుండగా ఆనందంలో నీవు తేలియాడుదువు. కోనేటిలో బంగారు మేడలో (తెప్పను బంగారు మేడవలె అలంకరింతురు కదా) నీవు అలమేలు మంగ ఉండి అందాలు చిందిస్తూ సరస్సులో ఓలలాడుదురు కదా! ఓ సహస్ర ముఖా! ఇది భక్తులకు కనుల పండుగ కదా!

**విశేషము :** సింగార మూర్తివి చిత్తజా గురుడవు (మన్మధుని తండ్రివి) ఈ రెండు విశేషణములు ఒకదాని కొకటి సాభిప్రాయ విశేషణము. శృంగార మూర్తివి. ఎందుచేత? శృంగారమూర్తి అయిన మన్మధునకు గురువు కనుక. గురువనగా విద్య నేర్పినవాడు, తండ్రికూడ. రెండు విధములుగానూ నీవు శృంగారమూర్తివి అని. సాసముఖా! సహస్ర ముఖా అను రూపాంతరముగా నేనూహించినాను. ఇది తెప్ప ఉత్సవపు వర్ణనము.

## 21. వకుళాభరణం = జంపె తాళం

ప॥ ఇన్ని చదువనేల। ఇంత వెదక నేల॥
కన్ను తెరచుటొకటి। కనుమూయుటొకటి॥ ॥ఇన్ని॥

చ॥ వలెననే దొకమాట। వలదనే దొకమాట॥
సిలుగు లీరెంటికిని। చిత్తమే గురియౌను॥
వలెనంటె బంధము। వలదంటె మోక్షము॥
తెలిసి విజ్ఞానులకు। తెరు విది యొకటే॥ ॥ఇన్ని॥

2) పుట్టెడి దొకటే। పోయెడి దొకటే॥
దిట్టమైరెంటికిని। దేహమే గురియౌను॥
పుట్టుట సంశయము। పోవుట నిశ్చయము॥
వొట్టి విజ్ఞానులకు। పురమిది ఒకటే॥ ॥ఇన్ని॥

3) పరమనే దొకటే। ప్రపంచ మొకటే॥
సిరుల నీ రెంటికిని। జీవుడే గురియౌను॥
ఇరవు వేంకటేశు। డిహపరముల కర్త॥
శరణాగతుల కెల్ల। సతమీత డొకడే॥ ॥ఇన్ని॥

### తాత్పర్యము :

పలుచదువులు చదువనక్కరలేదు. ఏదో జ్ఞానమునకై అన్వేషణ చేయనక్కర లేదు. పుట్టుట ఒకటి ఉన్నది. చచ్చుట ఒకటి యున్నది. ప్రతి వస్తువు కావలెననే దొకటి. అక్కరలేదనే దొకటి.

కావలెననుకొంటే సంసారబంధము ప్రాప్తిస్తుంది. అక్కర లేదనుకుంటే (ఇదేవైరాగ్యము) మోక్షము సిద్ధిస్తుంది. ఈ రెండిటికిని మనస్సే మూలము. విజ్ఞానుల మార్గమిదే. పుట్టుట అనేది ఒకటే. చచ్చుట అనేదొకటే. ఈ రెండిటికిని దేహమే ఆధారము. కాని పుట్టుట సందేహము. చచ్చుట నిశ్చయము. (ప్రతి జీవియు చచ్చుట మనము చూచుచున్నాము. మరల పుట్టుట మనము చూచుట

లేదుకదా) దేనికయినా పురము ఈ దేహమే. ఇహము అనేది ఒకటే. పరమనేది ఒకటే. ఈ రెండిటికిని జీవుడే గురి. ఇహపరములకు రెండిటికిని వేంకటేశ్వరుడే కర్త. శరణాగతులయిన భక్తులకు వేంకటేశ్వరుడే ఎప్పుడును గతి.

**విశేషము :** ఇందు అన్నమయ్యగారు సకల శాస్త్రాల సారమును మూడు ముక్కలలో చెప్పిరి. చివరి చరణములో శరణాగతులకు గతి వేంకటేశ్వరుడని చెప్పి వేదాంత శాస్త్ర సంపూర్తిని చెప్పిరి.

## ౨౨. నీలాంబరిరాగం = ఆదితాళం

ప॥ దీనుడను నేను దేవుడవు నీవు॥
నీ నిజమహిమే। నెరపుట గాక॥ ॥దీనుడను॥

చ॥ మతి జనన మెరుగ। మరణంబెరుగను॥
ఇతవుగ నిను నింక। నెఱిగేనా?॥
క్షితి బుట్టించిన। శ్రీపతివి నీవు॥
తతి నాపై దయ। దలతువు గాక॥ ॥దీనుడను॥

2) తలచ పాపమని। తలచ పుణ్యమని॥
తలపున ఇక నిన్ను। దలచేనా॥
అలరిన నాలో। అంతర్యామివి॥
కలుష మెడయనను। గాతువు గాక॥ ॥దీనుడను॥

3) తడవ నా హేయము। తడవ నా మలినము॥
తలపున నిక నిన్ను। దలచేనా॥
విడువలేని శ్రీ। వేంకట విభుడవు॥
కడదాక నిక। గాతువు గాక॥ ॥దీనుడను॥

**తాత్పర్యము :**

స్వామీ నేను దీనుడను. నీవు దేవుడవు. చాలా తారతమ్యము కలిగిన మన కిరువురకు పొత్తు కుదిరినది. అది ఏది అనగా? నేను రక్షించ బడువాడను. నీవు రక్షకుడవు. (ఇందులో నా మహిమ ఏదీ లేదు. నీ మహిమ చేత జరుగ

వలసినదే.) నేను పుట్టినది నేనెరుగను. నా మరణమును నేనెరుగను. ఇక నిన్ను తెలుసుకొనగలనా? ఈ భూమిపై నన్ను పుట్టించినది నీవు. కనుక నీకు నన్ను దయ జూచెదవు గాక. చేసే పాపమును తలచపోను. పుణ్యమును తలచబోను. ఇట్టి నేను నిన్ను తలచుదునా? నాలో అంతర్యామి అయి ఉన్నావు కనుక నా పాపము పోగొట్టి నన్ను రక్షింతువు గాక. 3వ చరణము భావము పైదే. పునరుక్తమయినది.

**విశేషము :** భక్తుడు భగవంతుని సన్నిధిలో తనలోపములను అనుసంధించుకొని కాపాడు కొమ్మని వేడుకోవాలి. దీనిని నైచ్యాను సంధానమంటారు. యామునా చార్యుల వారు తమ స్తోత్రరత్నంలో ''న ధర్మనిష్ఠోస్మి నచాత్మవేదీ। న భక్తిమాన్ త్వచ్చరణారవిందే'' = ''ధర్మనిష్ఠుడనుగాను. ఆత్మజ్ఞుడనుగాను. నీ పాదభక్తి గలవాడను కాను.'' ఇత్యాదిగా తన లోపములను చెప్పి ''కృపయా కేవల మాత్మసాత్కురు'' = కేవలము నీ కృపచేతనే నన్ను నీవాడను చేసుకొని రక్షించుము'' అని చెప్పినారు. అన్నమయ్య గారి ఈ పాట దీనిని తలపించుచున్నది''. ''విడువలేని శ్రీ వేంకటవిభుడవు'' అనుదాని వివరము. శ్రీరాముడు విభీషణుని పరిగ్రహించు సమయమున ''మిత్రభావేన సంప్రాప్తం నత్యజేయంకదాచన'' = సుగ్రీవా! మైత్రితో వచ్చిన వానిని ఎపుడును విడువను'' అని శపథము చేసెను కదా! అదియే విడువలేని తనము.

## 23. కల్యాణిరాగం = రూపకతాళం

ప॥ రామ రామ రామ కృష్ణ। రాజీవలోచన నీకు॥
దీమువంటి బంటననే। తేజమేనాది॥ ॥రామ॥

చ॥ వారిధి దాటి మెప్పించ। వాయుజుడనే గాను॥
సారె చవుల మెప్పించ। శబరినే గాను॥
బీరాన సీత నిచ్చిమె। ప్పించ జనకుడగాను॥
ఏరీతి మెప్పింతునో న। న్నెట్లాగాచేవో॥ ॥రామ॥

2) ఘనమై మోచి మెప్పించ। గరుడుడనే గాను॥
కొని కామసుఖమిచ్చు। గోపికనే గాను॥
వినుతించి మెప్పించ। వేయినోళ్ల భోగిగాను॥
నిను నెట్లు మెప్పింతు। ననుగాచే దెట్లా॥ ॥రామ॥

3) నవ్వుచు పాడి మెప్పించ। నారదుడ నేగాను॥
అవ్వల ప్రాణమీయ జ। టాయువు గాను॥
ఇవ్వల శ్రీ వేంకటేశ। ఇటు నీకే శరణంటి
రవ్వల నా తెలివిచే। రక్షించే దెట్లా॥ ॥రామ॥

## తాత్పర్యము :

ఓ రామా! కృష్ణా! పద్మనేత్రా! నేను నీకు చాలా చిన్న ఉపకరణము మాత్రమే అయిన బంటును. దీము = వేటకాడు మృగములను వేటాడుటకు ఎరగా వేసే ఒక పక్షి. స్వామీ! నేను నీకు అంత మాత్రపువాడనే. సముద్రం దాటి మెప్పించగల హనుమంతుడనుగాను. రుచిగల పండ్ల నిచ్చిన శబరిని గాను. గర్వముతో సీత నిచ్చి మెప్పించగల జనక మహారాజాను గాను. నన్నెట్లు రక్షిస్తావు? ఆకాశంలో ఎగిరే ఒక మేఘమై నిన్ను మోసే గరుత్మంతుడను గాను. స్వయం గ్రహాశ్లేషం చేసి రతిసుఖ మిచ్చే గోపికను గాను, స్తుతి చేసి మెప్పించుటకు వేయినోళ్ళ శేషుడను గాను, నన్ను నీవు రక్షించేదెట్లు? సంతోషముతో పాడి మెప్పించుటకు నారదుడను గాను. రావణుడు సీతను కొనిపోవునప్పుడడ్డు పడి నీకొరకు ప్రాణాలర్పించిన జటాయువును గాను. నా రవ్వల తెలివితో (చాలాకొద్ది తెలివి) నన్ను నీవు రక్షించేదెట్లా? కనుక నిన్నే శరణన్నాను. అని అన్నమయ్యగారు భర సమర్పణము చేశారు. అన్ని లోపములను పూరించేది శరణాగతే. యామునా చార్యులవారు ''నధర్మనిష్ఠోస్మి నచాత్మవేదీ న భక్తిమాన్ త్వచ్చరణారవిందే। అకించనో నన్యగతి శ్శరణ్య। త్వత్పాదమూలం శరణం ప్రపద్యే'' = ఓ రక్షకా! నాకు ధర్మనిష్ఠలేదు, ఆత్మజ్ఞానము లేదు, నీ పాదభక్తి లేదు, ఇతరగతి ఏమియు లేదు. ఇంకేమియు లేదు. కాని నన్ను నీవు వర్జించలేనిది ఒకటి ఉన్నది. అది నీ శరణాగతి. అని

నివేదించారు. ఇందున్న భావమిట్టిదే. విభీషణుడు దురాత్ముడయిన రావణుని తమ్ముడు, రాక్షసజాతివాడు, సుగ్రీవాదులు వాడు వధ్యుడు అని చెప్పినారు. కాని ''రాఘవం శరణం గతః'' = రాముని శరణు జొచ్చితిని అన్నాడు విభీషణుడు. అందుచేత రక్షింపబడినాడు. కనుక శరణాగతి ఒక్కటి ఉంటే తక్కిన వాటి పనిలేదు అని పరమార్థసారము. అన్నమయ్యగారీపరమార్థము నిందు ఉపదేశించిరి.

విశేషము : అన్నమయ్య నేను ఒక ఎర పక్షివంటివాడను అన్నారు. సంసారములోని ఇహ విషయవాంఛలు మృగముల వంటివి. భగవానుడు జీవునివాటికి ఎరగా వేస్తాడు. మృగములను చంపేవి బాణాలు వలలు కత్తులు మొదలయినవి పెద్ద సాధనాలు. ఎర పక్షి చాలా చిన్న సాధనము. అన్నమయ్య గారు ఈ చిన్న సాధనమునకు తనను ఉపమానముగా చెప్పుకొన్నారు.

## 24. హిందోళము = ఆదితాళము

ప॥ అదివో అల్లదివో శ్రీ। హరి వాసము॥
పదివేల శేషుల। పడగల మయము॥ ॥అదివో॥

చ॥ అదె వేంకటాచల। మఖిలోన్నతము॥
అదివో బ్రహ్మాదుల। కపురూపము॥
అదివో నిత్యనివాస। మఖిల మునులకు॥
అదె చూడు డదె మ్రొక్కు। డానందమయము॥ ॥అదివో॥

2) చెంగట నల్లదివో। శేషాచలము॥
నింగినున్న దేవతల। నిజవాసము॥
ముంగిట నల్లదివో। మూలనున్న ధనము
బంగారు శిఖరాల। బహుబ్రహ్మమయము॥ ॥అదివో॥

3) కైవల్యపదము వేం। కటనగ మదివో
శ్రీ వేంకటపతికి। సిరులైనది॥
భావింప సకల సం। పదరూప మదివో॥
పావనములకెల్ల। పావన మయము॥ ॥అదివో॥

## తాత్పర్యము :

అన్నమయ్య తాళ్లపాకలో ఉండగా సుమారు 16 సంవత్సరాల వయస్సులో వేంకటేశ్వరుని దర్శించవలెనని ఉత్కంఠ ఎక్కువకాగా ఒకనాడు ఎవరితోనూ చెప్పక తిరుమలకు ప్రయాణమయినాడు. పాదచారియై దారిలో ఒక యాత్రిక భక్త బృందములో చేరినాడు. ప్రయాణం సాగించాడు. వేంకటాచలము అల్లంత దూరంలో కనపడినది. ఆనందం పెల్లుబికి భక్త బృందము ఉద్దేశించి అప్పటి కప్పుడు వెలువడిన పాట ఇది అని చరిత్ర.

అదిగో అదే శ్రీహరియొక్క నివాసము. ఆ పర్వతమంతా ఆదిశేషుని పదివేల పడగలే. సర్వోన్నతమైన వేంకటాచలము. అది బ్రహ్మాదులకు కూడ సేవింప దుర్లభమయినది. అది మహామునులకు ఎప్పుడూ ఆశ్రయమైనది. ఆ ఆనందమయమైన పర్వతమును చూడండి మ్రొక్కండి. అదిగో అదే శేషాచలము. ఆకాశమునందున్న దేవతల కది నిజమయిన నివాసము. అది మన ఇంటి ముంగిటకు చేరుకొన్న మూల ధనము. కొండపైనున్న చాలా బంగారు శిఖరాలున్నవి. అవి శిఖరాలు కావు. బ్రహ్మమూర్తులు. మోక్షస్థానమయిన వేంకటాచల మదిగో. వేంకటేశ్వరునకు సమస్త సంపదలు నదే. ఆలోచింపగా అందరికిని అది మూల ధనమే. కాక పవిత్రముల అన్నిటిలో పవిత్రమయినది. అట్టి వేంకటాచల మదిగో చూడుడు అని అన్నమయ్యగారు భక్తులకు ఒక హెచ్చరిక చేశారు.

**విశేషము :** దేవతలను ''దివిషదః'' అందురు. అనగా ఆకసమందు ఉన్నవారు అని అర్థము. ఇప్పుడీ పర్వతము చాలా ఎత్తుగా నుండుటచేత దేవల కదినిజవాసము అని చెప్పబడినది. ఇంకొకటి. భగవంతుని పాదము భక్తులకు ధనముగా చెప్పబడినది. ఒక భక్తుడిట్లు ప్రార్థించినాడు. ''ధనం మదీయం తవపాద పంకజం।

కదాను సాక్షాత్కరవాణి చక్షుషా''. = ఓ దేవా! నా ధనమయిన నీ పాద పద్మమును ఎప్పుడు కంటితో చూతునోకదా'' అని అన్నమయ్యగారు దేవుని నిలయమగు ఈ పర్వతమును ధనముగా భావించిరి. విష్ణు సహస్రనామములలో ''పవిత్రాణాం పవిత్రంయెూ మంగళానాంచ మంగళం'' = పవిత్రములకు పవిత్రము, శుభప్రదములకు శుభప్రదము'' అని చెప్పబడినది. అయ్యగారిందు ఆ లక్షణమును పర్వతమునకు నిర్దేశించారు. ఇట్లు భక్తి భావ సర్వస్వముగా ప్రతి గేయము కూర్పబడి మనస్సును భక్తి పథములో పయనింపచేస్తుంది.

## ౨౫. సింధుభైరవి రాగం = ఆదితాళం

ప॥ ఆదిదేవ పరమాత్మా వేద। వేదాంత వేద్య నమోనమో॥

చ॥ పరాత్పరా భక్త భవ భంజనచరా। చరలోక జనక నమోనమో॥

2) గదాధరా శ్రీ వేం। కటగిరి నిలయ॥
సదానంద ప్ర। సన్న నమోనమో॥ ॥ఆదిదేవ॥

**తాత్పర్యము :**

ఇది ఒక చిన్న సంస్కృత పదము. చిన్న సంబోధన పదములు, ''నమో నమో'' = నమస్కారము నమస్కారము అనుపదములో సంస్కృత కృతి అయినది.

ఆదిదేవ! అందరికన్న ముందున్న దేవుడా! పరమాత్మా = ఓ పరమాత్మా ! వేద వేదాంత వేద్య = వేద వేదాంతముల ద్వారా తెలియదగినవాడా! నమస్సు, నమస్సు. పరాత్పరా = గొప్పవారికన్న గొప్పవాడా! భవ భంజన = భక్తుల సంసారమును బాపువాడా! చరాచరలోకజనక = కదలెడి, కదలని లోకములను సృష్టించినవాడా! నమస్సు నమస్సు. గదాధరా! గదను ధరించినవాడా! సదానంద ప్రసన్న = ఎప్పుడును ఆనందముతో ప్రసన్నముగా నుండువాడా! నమస్సు నమస్సు.

**విశేషము** : వేదములన్నిటిలో విష్ణువే ఆదిదేవుడుగా చెప్పబడినాడు. గీతలో ''వేదైశ్చ సర్వై రహమేవ వేద్యః'' అన్ని వేదములచేతను నేనే తెలియ దగినవాడను

అని కలదు. ''వేదాంత కృద్వేద విదేవ చాహం'' = నేను వేదాంత కర్తను, వేద వేత్తను అని కూడకలదు'' కనుక వేద వేదాంత వేద్య అను సంబోధనము తగియున్నది. విష్ణుని పంచాయుధములలో ''వైకుంఠవామాగ్ర కరాభిమృష్టాం। గదాం సదాహం శరణం ప్రపద్యే'' = విష్ణువు తన ఎడమముంజేతిలో ధరించిన గద నెప్పుడును నేను శరణు జొచ్చెదను'' అను ప్రమాణముచే ఆయన గదాధరుడు. ఇందు స్వామి యొుక్క మూర్తి, మహిమ, మనస్సును సూచింపబడినవి. ''నమో నమో'' చాలా ముఖ్యము. వైకుంఠమున నిత్యసూరులు 'నమ ఇత్యేవ వాదినః'' నమః పదముతోనే హరిని స్తుతించెదరట. సూక్ష్మంలో మోక్షంగా నున్నది ఈ చిన్నపదము.

## ౨౬. రేవతిరాగం = ఆదితాళం

ప॥ నానాటి బ్రతుకు। నాటకము॥
కానక కన్నది। కైవల్యము॥

చ॥ పుట్టుటయు నిజము। పోవుటయు నిజము॥
నట్టనడిమి పని। నాటకము॥
ఎట్ట నెదుట గల। దీప్రపంచము॥
కట్ట కడపటిది। కైవల్యము॥ ॥నానాటి॥

2) కుడిచే దన్నము। కోక చుట్టెడిది॥
నడు మంత్రపు పని। నాటకము॥
ఒడి గట్టుకొనిన। ఉభయ కర్మములు॥
గడి దాటినపుడె। కైవల్యము ॥ ॥నానాటి॥

3) తెగదు పాపము। తీరదు పుణ్యము॥
నగినగి కాలము। నాటకము॥
ఎగువనె శ్రీ వేంక। టేశ్వరుడేలిక॥
గగనము మీదిది। కైవల్యము॥ ॥నానాటి॥

**తాత్పర్యము :**

జీవుడు పుట్టుచున్నాడు. కొంతకాలము బ్రతుకుచున్నాడు. నానాటికి ఇలాగే నడుస్తున్నాడు. ఇదంతా నాటకమే. మనము చూచినదంతా నాటకము. కంటితో చూడలేక ఏ పుణ్యం చేతనో ప్రాప్తించినది కైవల్యము (మోక్షము) పుట్టుట, చచ్చుట నిజము. ఈ మధ్యలో జరిగే పని అంతా నాటకము. ప్రపంచమంతా మనకు ఎదురుగా కనిపించుచునే ఉన్నది. ఇది దాటిన తరువాత చివరిది కైవల్యము. తినేది అన్నము. కట్టేది కోక. ఇంతవరకు నిజము. (గంజి మెతుకుల వాడిదీ అన్నమే. పంచభక్ష్య పరమాన్నముల వానిదీ అన్నమే. మాసిన చినుగుల వాడు కట్టేది వస్త్రమే. రత్నాంబరముల వాడిదీ వస్త్రమే. రెండిటి కార్యము మానసంరక్షణమే కదా! ఇంతవరకు నిజము) నడుమంత్రపుది నాటకము. ఒడిగట్టుకొన్న పుణ్యపాపములు తీరినప్పుడే కైవల్యము. పాపము తెగదు. పుణ్యము తీరదు. ఇవి తీరని తెగని మధ్యకాలము నాటకమే. పర్వతము ఎగువన నున్న వేంకటేశ్వరుడే రక్షకుడు. ఆపై ఆకాశముపై నున్నది కైవల్యము.

**విశేషము :** ''ముక్తిః కైవల్య నిర్వాణ శ్రేయో నిశ్శ్రేయసా మృతం'' అనే నిఘంటువు ప్రకారము కైవల్యమంటే మోక్షము. ఉభయ కర్మలు = పుణ్య పాపములు రెండును తీరితేనే కాని మోక్షం రాదు. పాపము వలె పుణ్యము కూడ మోక్షమునకు ప్రతిబంధకమే. అందుచేతనే ''పుణ్యపాపే విధూయ నిరంజనః. పరమం సామ్యముపైతి'' పురుషుడు పుణ్యపాపములను విదల్చి ఏ పూతలేని వాడై బ్రహ్మ సారూప్యమును పొందును. అని ఉపనిషత్తు చెప్పినది. కైవల్యమనేది పరమాకాశమున కలదని శాస్త్రము. శంకరుల వారి వాక్యము. ''గతవతి దాయౌ దేహాపాయే। భార్యాబి భ్యతి తస్మిన్ కాయే'' = మరణ సమయాన ప్రాణవాయువు లేచిపోతే అంతవరకు కోరిన భర్త శరీరమును చూచి భార్య భయపడును అని. దీనిని బట్టి ఇంతవరకు చూపిన ప్రేమ నాటకమే కదా! అన్నమయ్యగారు చెప్పినదీ నాటకమే. రంగస్థలముపై నటుడు వేరొకని పాత్ర ధరించి ఏడుచును. నవ్వును. అరచును. తెరలోనికి పోయిన తరువాత అవి ఏవియు నుండవు. తన శరీరములోనికే వచ్చును. ఇదియే నాటకము. జగన్నాటకము నింతే కదా!

## 27. జంఝూటి రాగం = మిశ్రచాపు తాళం

ప॥ శరణు శరణు సు। రేంద్ర సన్నుత
శరణు శ్రీ సతివల్లభా॥
శరణు రాక్షస। గర్వసంహార॥
శరణు వేంకటనాయకా॥ ॥శరణు॥

చ॥ కమల ధరుడును। కమల మిత్రుడు
కమల శత్రుడు। పుత్రుడు ॥
క్రమముతో నీ। కొలువు కిప్పుడు
కాచినా రెచ్చరికయా॥ ॥శరణు॥

2) అనిమిషేంద్రులు। మునులు దిక్పతు
లమర కిన్నర। సిద్ధులు॥
ఘనతతో రం। భాది కాంతలు॥
కాచినా రె। చ్చరికయా॥ ॥శరణు॥

3) ఎన్నగల ప్ర। హ్లాద ముఖ్యులు
నిన్ను గొలువగ। వచ్చిరి॥
విన్నపము విన। వయ్య తిరుపది॥
వేంకటాచల। నాయకా॥ ॥శరణు॥

**తాత్పర్యము :**

శరణు అంటే పర్యవసానార్థము రక్షించుము అని. సురేంద్ర సన్నుత = ఇంద్రునిచే పొగడబడినవాడా! శ్రీ సతివల్లభా = లక్ష్మీనాధుడా! రాక్షస గర్వ సంహర = రాక్షసుల గర్వమును సంహరించువాడా! వేంకటనాయకా = వేంకటేశ్వరా! కమల ధరుడును = గంగను ధరించిన శివుడును, కమల మిత్రుడు = పద్మములకు మిత్రుడైన సూర్యుడు, కమల శత్రుడు = పద్మములకు శత్రువయిన చంద్రుడు, పుత్రుడు = పద్మమందు పుట్టిన బ్రహ్మ, వరుసలో నిన్ను

కొలుచుటకు వచ్చినారు. దేవతలు, మునులు, దిక్పాలకులు, రాక్షస ప్రభువులు, కిన్నరులు, సిద్ధులు, రంభాది అప్సరసలు నీయందు భక్తితో వచ్చి నిలచినారు. ఎన్నికగన్న ప్రహ్లాదుడు మొదలగు వారు వచ్చి నిన్ను కొలువనున్నారు. సావధానముగా రావయ్యా వేంకటేశ్వరా శరణు శరణు'' అని వచ్చినవారందరిని ఏలుటకు రమ్మని ప్రార్థించినారు. పైన చెప్పిన వారందరును దేవజాతిలోని వారే. వచ్చి నీ సేవకై నిలచి ఉన్నారు కనుక ఏమరిక లేక ఎచ్చరికతో రమ్మని ప్రార్థన. దేవసన్నిధిలో ఎచ్చరిక చెప్పుట కూడ ఒక ఉపచారములోనిదే. సాధారణముగా ఈ ఎచ్చరికలు సుప్రభాతాలలో ఉంటాయి విప్రనారాయణులవారి ''తిరుప్పళ్లి యెళుచ్చి'' ద్రావిడంలో సుప్రభాత గ్రంథము. అన్నమయ్య గారి ఈ పదము దాని భావాలను పుణికి పుచ్చుకొన్నది.

## 28. శంకరాభరణం = మిశ్రచాపుతాళం

ప॥ ఎటువంటి మచ్చికలో। ఎట్టి తరితీపులో॥
చిటుకనే వినేను। చెవుల పండుగలు॥

చ॥ చెలరేగియాపె నీకు। చెప్పె నిందాక సుద్దులు
వెలలేని వేడుకతో। వింటివి నీవు॥
తలపున బట్టెనా। తమి నీకు బుట్టెనా?
అలరి యా సంతోషము। లాన తియ్యవయ్య॥ ॥ఎటువంటి॥

2) పలుమారు నీయెదుట। పాడెనాపె పాటలు॥
తలయూచి మెచ్చితివి। దానికి నీవు॥
కలిగెనా నీకు మేలు। కరగెనా నీకు గుండె॥
ఎలుగెత్తి నాకు కొంత। ఎరిగించవయ్య॥ ॥ఎటువంటి॥

3) ఎలమి నీతో నాపె। యేకతము లెల్లనాడె॥
వలపులు చల్లితివి। వద్దనుండి॥
నిలిచి శ్రీ వేంకటేశ। నేనల మేల్మంగను॥
కలసితి నెచ్చరించు। కల నెల్లా నాకును॥ ॥ఎటువంటి॥

**తాత్పర్యము :**

వేంకటేశ్వరునకు అలమేల్మంగ మాట్లాడు మాటలంటే చాలా ఇష్టము. దానిని పురస్కరించుకొని అన్నమయ్యగారు వేంకటేశ్వరునితో అంటున్నారు. స్వామీ! ఎటువంటి మచ్చికో? ఎంత అపేక్షో? అలమేల్మంగ మాట చిటుకు మంటే చెవులు రిక్కించి వింటావు. ఆమె మాటలు నీకు చెవిపండుగ. ఇంతవరకు ఆమె నీకు ఎన్నో మాటలు చెప్పినది. వెలకట్టలేని వేడుకతో విన్నావు. ఇంత తమకము నీకెట్లు కలిగినది. పలుమారులు నీ యెదుట నామె పాట పాడినది. నీవు తల ఊపి మెచ్చినావు. నీకు సంతోషమయినదా? నీ గుండె కరిగినదా? ఆమె నీతో ఏకాంతములో ఏమి మాట్లాడినదో, నీవామెపై ప్రేమను గుప్పించితివి. ఆ సంగతులన్నీ గొంతెత్తినాకు చెప్పవయ్యా! నీవు చెప్పకపోతే ఆమెనే అడుగుతాను. ఆమె చెప్పునులే. అని అన్నమయ్యగా రడిగినారు.

**విశేషము :** స్వామియొక్క రహస్యక్రీడలకు సంబంధించిన వార్తలను చెప్పుమని అడుగుట ఉచితమా? అనిన ఉచితమే. పరమైకాంత భక్తుడు కనుక. ఏకశయ్యాగతులయిన భార్యా భర్తల వద్ద 3 సంవత్సరములలోపు బాలు డరమరిక లేక ఉండవచ్చును. లక్ష్మీనారాయణుల ఏకాంత స్థలమున పరమై కాంత భక్తుడుండవచ్చును. అన్నమయ్యగా రట్టివాడు.

## 29. మలయమారుతం = రూపకతాళం

ప॥ నీ దాసుల భంగములు। నీవు జూతురా॥
ఏదని చూచేవు నీకు। నెచ్చరించ వలెనా॥ ॥నీ॥

చ॥ పాల సముద్రము మీద। పవ్వళించునట్టి నీకు॥
బేలలై సురలు మొర। బెట్టినయట్టు॥
వేళలో మామనవులు। విన్నవించితిమి నీకు॥
ఏల నిద్దురించేవు మ। మ్మిట్టే రక్షించరాద॥ ॥నీ॥

2) ద్వారకానగరములో। తగనెత్త మాడే నీకు॥
బీరాన ద్రౌపది మొర। బెట్టినయట్టు॥
ఘోరపు రాజసభల। కుంది విన్న వించితిమి॥
ఏరీతి పరాకు నీకు నింక రక్షించరాద॥ ॥నీ॥

3) ఎనసి వైకుంఠములో। నిందిర గూడున్న నీకు॥
పెనగి గజము మొర। బెట్టినయట్టు॥
చనవుతో మా కోరిక। సారె విన్నవించితిమి॥
విని శ్రీ వేంకటేశుడా। వేగ రక్షించరాద॥ ॥నీ॥

## తాత్పర్యము :

స్వామీ! నీ దాసులు పొందే పరాభవాలు చూస్తూ ఉందువా? అట్లయితే ఏదని చూస్తావు. మా పరాభవాలు ఒకటా? రెండా? అనంతములు. వీటిలో దేనిని చూస్తావు. పాల సముద్రములో నీవు నిద్రించియుండగా రావణుడు చేసిన పరాభవములతో బేలలై దేవతలు వచ్చి నీ వద్ద మొరబెట్టినట్లు మేము సమయములో వచ్చి మొరబెట్టుకొన్నాము. తత్‌క్షణమే రక్షించరాదా! ద్వారకానగరములో రుక్మిణితో చదరంగమాడే నిన్ను గూర్చి మొరబెట్టినట్లు ఘోరరాజ సభలో పరాభవ మందిన నేను మొరబెట్టుకొన్నాను. నీ కేల ఇంతపరాకు? '' అలవైకుంఠ పురంబులో'' లక్ష్మిని గూడియున్న నీకు మొసలితో పెనగుచు ఏనుగు మొరబెట్టినట్లు మొరబెట్టితిని వేగమే రక్షించరాదా? అని ఆర్తి.

**విశేషము :** భక్త కవులు సాధారణముగా ఇట్టి చోట్ల ద్రౌపదికథను, గజేంద్రుని కథను మాత్రమే ఉదాహరిస్తూ ఉంటారు. అన్నమయ్యగారు విశేషముగా రావణ బాధితులను సురలకథను కూడ ఉదాహరించారు. ద్రౌపది గజేంద్రుల మొరవలన ఆ ఇద్దరికి మాత్రమే రక్షణ జరిగినది. సురల మొర వలన స్వామి రావణ సంహారము, దానివలన త్రిలోక సంరక్షణము చేయుట జరిగినది. ద్రౌపది గజేంద్రుల రక్షణకు స్వామి శ్రమకూడ పడలేదు. చదరంగమాడుతూనే ''అక్షయం'' అన్నాడు. గజేంద్రుని రక్షణకు సర్వవ్యాపి అయిన స్వామి అక్కడి కక్కడే అప్పటి కప్పుడే చక్ర ప్రయోగం చేశాడు. కావలసిన పని జరిగినది. మొదటి దానిలో అట్లుకాదు.

రామావతార వ్యూహం, విశ్వామిత్ర యాగ రక్షణము, పట్టభంగము, వనవాసము, సీతా వియోగము, సేతు బంధనము, రాక్షస సంహారము, మరల సీతా వియోగము. ఇట్టి శ్రమములెన్నో సంవత్సరములు పడినాడు. భక్త రక్షణమునకు స్వామి శ్రమము లెక్కింపక రక్షణము చేయుననే వార్తను అన్నమయ్యగారు మనమున నుంచుకొని తమ పదము నందు ''సురల మొరను'' ప్రస్తావించినారు.

## ౩౦. శుద్ధధన్యాసి రాగం = ఖండచాపు తాళం

ప॥ పరమాత్ముడైన హరి। పట్టపు రాణివి నీవు॥
ధరమము విచారించ। తగునమ్మ నీకు॥ ॥పర॥

చ॥ కమలజుగన్న తల్లి। కాముని గన్నతల్లి॥
అమరుల గన్నతల్లి। ఆదిమలక్ష్మి॥
విమలవు నీపతికి। విన్నపము జేసి మము॥
నెమకి ఏలితి దయ। నీకె తగునమ్మ॥ ॥పర॥

2) కామధేను తోబుట్టుగ। కల్పకము తోబుట్టుగ
దోమటి చల్లని చంద్రు। తోబుట్టుగ
నీ మగని పంపునను। నిజసిరులిచ్చితివి॥
నేమపు వితరణము। నీకేతగునమ్మ॥ ॥పర॥

3) పాలజలధి కన్యవు। పద్మాసనివి నీవు॥
పాలనుండే శ్రీ వేంకట। పతి దేవివి॥
ఏలిన ఇతని బంట్లకు। ఇహ పరాలిచ్చి మా॥
పాల గలిగితివి సం। బంధమ్ము మేలమ్మ॥ ॥పర॥

**తాత్పర్యము :**

ఇది లక్ష్మి ప్రార్థనము. అమ్మా! నీవు పరమాత్ముని పట్టపు రాణివి. కనుక మా యోగ క్షేమములు నీకు విచారింపదగును. బ్రహ్మకు తల్లివి. మన్మధుని తల్లివి. దేవతలకు తల్లివి. ఆదిలక్ష్మివి. నీవు నిష్కల్మషవు. ఇదివరలో నీవు మమ్ము వెదకి

నీ పతికి మమ్ము గూర్చి విన్నవించి ఏలినావు. ఈ దయ నీకే తగును. కామధేనువు నీ తోబుట్టువు. కల్పవృక్షము నీ తోబుట్టువు. దేవతలకు ఆహారమయిన చల్లని చంద్రుడు నీ తోబుట్టువు. నీ నాథుని ఆజ్ఞతో నీ సంపదల నెందరికో యిచ్చినావు. నియమముతో ఇట్లు దానము చేయుట నీకే తగునమ్మా. పాలకడలి కూతురు నీవు. పద్మావతివి నీవు (ఈక్షేత్రమందు) ఇక్కడ నుండే వేంకటేశ్వరికి దేవేరివి. వేంకటేశుని దాసులైన వారికి ఇహపరాల నిచ్చి మాపాల గలిగినావు. నీ సంబంధము మాకు శ్రేయస్కరము. అని అన్నమాచార్యులు లక్ష్మీదేవి సమస్త వైభవములను ఇందు ఉద్ఘాటించిరి.

**విశేషము :** ''లక్ష్మీః పురుషకార త్వే నిర్దిష్టా పరమర్షిభిః'' మహర్షులు లక్ష్మీదేవిని పురుషకారముగా నిర్దేశించిరి. పురుషకారమనగా భగవంతుని ఆశ్రయించిన భక్తుల యొక్క గుణదోషములను ఎన్నకుండా తప్పక రక్షించుమని చెప్పుట. ఈ పని లక్ష్మీదేవిది అని మహర్షుల నిర్దేశము. దీనిని బట్టి అన్నమయ్యగారు ''విచారించ తగునమ్మ నీకు'' అనిరి. కాక ఆమెను సమస్త లోక మాతగా చెప్పినారు. రామానుజుల వారు ''అఖిల జగన్మాతరం అస్మన్మాతరం'' = అఖిల జగన్మాత మాతల్లి అని శరణాగతి గద్యలో చెప్పినారు. కోరిన వారికి కోరినదిచ్చే కామధేనువు, కల్పవృక్షము పాల సముద్రము నుండి లక్ష్మితో తోడ బుట్టినవి అని పురాణ ప్రసిద్ధి. అట్టి లక్ష్మి భక్తులకు కోరిన దీయకుండుట తగదని ధ్వని. పాలసముద్రము విష్ణువుకు స్థానమిచ్చిన గొప్పదాత. అతని కన్యవు నీవు మా ప్రార్థన వినకుండుట తగదని ధ్వని. వేంకటపతి ఏలినవాడు. అతని దాసులకు ఇహపరాలిచ్చే నీ సంబంధము మాకు మేలు అని. కొందరు ఒక్క విష్ణువునే కొలుస్తారు. వైష్ణవ సంప్రదాయమున లక్ష్మీ సహితుడైన హరినే కొలువవలెను. అందుచేతనే ఆ సంప్రదాయములో నిత్య జప్యమయిన ద్వయమంత్రమున ''శ్రీమతే నారాయణాయ నమః'' = లక్ష్మీదేవితో కూడిన నారాయణునకు నమస్సు'' అని చెప్పబడినది. కనుక లక్ష్మీ సంబంధము మేలు అని అన్నమయ్య గారు పర్యవసానముగా చివరి చరణమందు దీనిని సూచించిరి. కామధేనువు అనుటకు బదులు ''కామధేను'' అని విభక్తి ప్రత్యయలోపము చేయబడినది. ఇది అరవ సంప్రదాయము. ''చంద్రు'' అని కూడా దానిని బట్టే అన్నమయ్యగారు స్వతంత్రించినారు.

# రెండవ భాగము

## 31. బైరవి రాగం = ఖండచాపు తాళం

ప॥ అలమేలు మంగ నీ। వభినవ రూపము॥
జలజాక్షు కన్నులకు। చవు లిచ్చేవమ్మ॥

చ॥ గరుడాచలాధీశు। ఘనవక్షమున నుండి॥
పరమానందసం। భరితవై॥
నెరతనమ్ములు జూపి। నిరతము నీ నాథుని॥
హరుషింపగా జేసి। అలరితిగదమ్మ॥ ॥అలమేలు॥

2 శశికిరణమ్ములకు । చలువల చూపులు ॥
విశదముగా మీద। వెదజల్లుచు ॥
రసికత పెంపున క । రగించి ఎపుడు నీ ॥
వశము జేసుకొంటి । వల్లభు నోయమ్మ ॥ ॥అలమేలు ॥

3 రట్టడి శ్రీ వేంకట । రాయనికి నీవు ॥
పట్టపు రాణివై । పరగుచు ॥
వట్టి మాకు లిగిరించు । వలపుమాటలవిభు ॥
జట్టిగొని పురమున । సతమైతి వమ్మ॥ ॥అలమేలు ॥

**తాత్పర్యము :**

అన్నమయ్యగారు అలమేలు మంగతో అంటున్నారు. అమ్మా! నీవు వేంకటేశ్వరుని కన్నులకు కొంగ్రొత్త రుచులిచ్చే కొంగ్రొత్త రూపమవు. వేంకటేశ్వరుని విశాలవక్షస్థల మందు ఎప్పుడును ఉండి అనేకములయిన జాణతనములు చూపుచు, ఆయనను సంతోషపెట్టుచున్నావు. నీ చంద్రకిరణాల కన్నా చల్లని చూపులను నాథుని మీద ప్రసరింపచేయుచు, నీ రసికతలో ఆయనను కరగింపజేయుచు, ఆ వల్లభుని వశపరచుకొనుచున్నావు కదా! నిందా పాత్రమయిన వేంకటేశ్వరునకు

నీవు పట్టపురాణివై ఎండిన చెట్లను చిగురింప జేసేవలపు మాటలతో ఆయనపై సర్వాధికారములను స్వీకరించి ఆయన నివసించే పురమందు నివసించి ఉంటున్నావు కదమ్మా! పూర్వాచార్యుల శ్లోకము. ''ఈశానాం జగతోస్య వేంకట పతేర్విష్ణోః పరాం ప్రేయసీం । తద్వక్షస్థల నిత్యవాస రసికాం తత్‌క్షాంతి సంవర్ధినీం'' ఆమె ఈ జగత్తులకు అధీశ్వరి. వేంటేశ్వరునకు పరాకాష్ఠనందుకొన్న ప్రియురాలు. ఆయన రొమ్మున నిత్యమును వసించుట యందు రుచిగలది. ఆయన యొక్క క్షాంతి గుణమును పెంపొందించునది '' అని ఆమెవైభవము చెప్పబడినది. అన్నమయ్య గారి స్తోత్రములో అవి తొంగి చూచు చున్నది. ''రట్టడి వేంకటేశ్వరుడు'' – నిందాపాత్రమయిన వేంకటేశ్వరుడు. అనగా? అలమేలుమంగా దేవి గుణము ''న కశ్చి న్నాపరాధ్యతి'' = అపరాధము చేయని వాడెవడును ఉండడు కనుక అపరాధిని కరుణింపవలెను'' అనే దయా గుణము. (ఈవాక్యము సీతాదేవిది) ఆయనది ''తానహం ద్విషతః క్రూరాన్। సంసారేషు నరాధమాన్। క్షిపామ్య జస్రమశుభా నాసురీష్వేవ యోనిషు'' = అపరాధులయిన నరాధములను సంసారములయందు విసరివేస్తాను'' అనే స్వాతంత్ర్య గుణము. ఈ వాక్యమును బట్టి కొంతమంది భక్తులు సంసారమును భరింపలేక భగవాన్! నీవు నిర్దయుడవు. ఇత్యాదిగా భగవంతుని నిందిస్తారు. ఇదియే ''రట్టడి శ్రీ వేంకటేశ్వరుడు'' నిందాపాత్రమయిన వేంకటరాయుడు అంటే.

## 32. కల్యాణిరాగం = ఆది తాళం

ప॥ వలదన నోరులకు। వశమటవే॥
తలచినట్లనిది। దైవమె చేసె॥ ॥వలదన॥

చ॥ తరుణి కుచములను। తామర మొగుడలు
విరిసెనోయని। వెరపునను॥
సరగున పతి నఖ। చంద్ర శకలములు
దరులు గలుగనిది। దైవమె చేసె॥ ॥వలదన॥

2) పొలతి వదనమును। పున్నమచంద్రుడు॥
బలిమి నెగయునని। భయమునను॥
మెలత చికుర ధ। మ్మిల్లపురాహువు॥
తల చెదరగనిది। దైవమె చేసె॥ ॥వలదన॥

3) వనితకు వాడునో। వలపు తాపమున
తనులతిక యనుచు। తమకమున॥
ఘన వేంకటపతి। కౌగిట చెమటల॥
తనివి దీర్పనిది। దైవమె చేసె॥ ॥వలదన॥

**తాత్పర్యము :**

తరుణికి వేంకటేశ్వరునకు సంభోగము జరిగినది. దానిలో ఆమె స్తనములపై ఆయన నఖక్షతములు చేసినాడు. తల వెండ్రుకలు చెదరి ముఖమును కప్పివేసినది. ఆమెకు చెమటలు పోసినవి. కవి వీటికి కారణములను ఇట్లు ఉత్ప్రేక్షించుచున్నాడు. అంతకుముందు విరహతాపము శమించుటకు తరుణి స్తనములపై తామర మొగ్గలను ధరించినది. అవి వికసించు నేమోనను భయముతో చంద్రరేఖల వంటి నఖక్షతములను చేసినాడు. చంద్ర దర్శనముతో తామర మొగ్గలు వికసింపవు. (నిజానికి ఆయన నఖక్షతములు చేసెను కనుక విరహ తాపము లేదు, తామర మొగ్గల అవసరమును లేదు). ఇక ఆమె ముఖము పూర్ణిమ చంద్ర బింబము వలెనున్నది. చంద్ర బింబము పాలసంద్రము నుండి పుట్టగనే ఆకసమున కెగసినది. ఈ చంద్ర బింబము కూడ అట్లు ఎగయునేమో అని భయముతో దైవము తనంత తాను ఆమె జుట్టు ముడి అనే రాహువుతో ఆ ముఖచంద్ర బింబమును గ్రహింపజేసినది. ఆమె శరీరలత విరహతాపముతో వాడిపోవునేమో అను భయముతో దైవము తనంత తాను వేంకటేశ్వరుని కౌగిట బిగింపజేసి దానివలన కలిగిన చెమటతో ఆ లతను తడిపినది. తడిసిన లత వాడిపోవదు కదా! ఇదంతయు దైవము చేసిన పని. దీనిని కాదన నెవరి తరము. ఇట్లు నాయకా నాయకుల సంభోగమున జరిగిన దైవికమగు చిహ్నములకు కవి రమ్యోత్ప్రేక్ష చేసినాడు. జయ దేవ మహాకవి రాధా మాధవుల సంయోగమున నిట్టి రమ్యోత్ప్రేక్షలు చేసినాడు.

# ౩౩. రేవగుప్తి రాగం = ఖండచాపు

ప॥ పురుషోత్తముడ వీవు। పురుషాధముడనేను॥
ధరలోన నాయందు। మంచితన మేది॥ ॥పురు॥

చ॥ అనంతాపరాధములు। అటనేముసేసేవి॥
అనంతమైన దయ। అది నీది॥
నిను నెరుగ కుండేటి। నీచ గుణము నాది॥
నను నెడయకుండే గుణము నీది॥ ॥పురు॥

2) సకల యాచకమే। సరగనాకు పని॥
సకల రక్షకత్వము। సరి నీపని॥
ప్రకటించి నిను దూరే। పలుకె నాకెపుడును
వెకలినైనను గాచే। విధము నీది॥ ॥పురు॥

3) నేరమంతయు నాది। నేరు పంతయు నీది॥
సారె కజ్ఞాని నేను। జ్ఞానివీవు॥
ఈ రీతి వేంకటేశ। యిట్లెనను నేలితివి॥
ధారుణిలో నిండెను ప్ర। తాపము నీది॥ ॥పురు॥

**తాత్పర్యము :**

వేంకటేశ్వరా! నీవు పురుషోత్తముడవు। నేను పరుషాధముడను. నాలో లెక్కపెట్టే మంచిగుణము లేదు. అంతులేని అపరాధములు మావి. (జీవులవి). అంతులేని దయాగుణము నీది. నిన్నెరుగకుండే నీచ గుణము నాది. నన్ను ఎడబాయని గుణము నీది. అందరినీ యాచించుటే నా పని. అందరినీ రక్షించుటే నీ పని. భగవద్దూషణము చేయుట నాపని. వెకలినైనా రక్షించే పనినీది. నేరము నాది. నేర్పు నీది. నే నజ్ఞానిని. నీవు జ్ఞానివి. ఈ విధంగానే నన్నేలు చున్నావు. నీ ప్రతాప మంతము భూమి అంతయు నిండి యున్నది. అన్ని అన్నమయ్యగారు తన తక్కువను దేవుని ఎక్కువను తెలుసుకొన్నారు. యామునాదుల దిదే పద్ధతి.

**విశేషము :** వెకలినైనను గాచే విధము నీది ''అనే అన్నమాచార్యుల వాక్యమునకు ప్రమాణము'' వధార్హ మపి కాకుత్థ్సః కృపయా పర్యపాలయత్'' = రాముడు వధింపదగిన వాడయినా కాకాసురుని కృపతో రక్షించెను అనే రామాయణ వాక్యము.

## 34. మలయమారుతం = ఆది (త్రిశ్రగతి)

ప॥ భక్తి కొలది వాడే। పరమాత్ముడు॥
భుక్తి ముక్తి తానె ఇచ్చు। భువి పరమాత్ముడు॥ ॥భక్తి॥

చ॥ పట్టినవారి చే బిడ్డ। పరమాత్ముడు॥
బట్ట బయటి ధనము। పరమాత్ముడు॥
పట్ట పగటి వెలుగు। పరమాత్ముడు॥
ఎట్ట యెదుటనే యున్నా। డిదె పరమాత్ముడు॥ ॥భక్తి॥

2) పచ్చిపాలలోని వెన్న। పరమాత్ముడు॥
బచ్చెన వాసిన రూపు। పరమాత్ముడు॥
బచ్చు చేతి నొరగల్లు। పరమాత్ముడు॥
ఇచ్చకొలది వాడువో ఈ । పరమాత్ముడు॥ ॥భక్తి॥

3) పలుకులలోని తేట। పరమాత్ముడు॥
ఫలియించు నిందరికి। పరమాత్ముడు॥
బలిమి శ్రీ వేంకటాద్రి। పరమాత్ముడు॥
యెలమి జీవుల ప్రాణమీ। పరమాత్ముడు॥ ॥భక్తి॥

**తాత్పర్యము :**

భక్తి ఎంత ఉంటే అంతకు సరిపడ ఫలమిస్తాడు భగవంతుడు. ఇహలోక సంబంధమయిన భుక్తిని, పరలోకసంబంధమయిన ముక్తిని, పరమాత్మడిస్తాడు. తనను భక్తితో పట్టుకొన్న చేతిలో నున్న చంటి బిడ్డ. (అంత స్వాధీనమయిన

వాడని) పరమాత్ముడు బట్ట బయటి ధనము. అనగా (పెట్టెలో ఉన్న ధనము బయటకు తీసినప్పుడే అది సర్వవిధములా ఏ విధంగా కావలిస్తే ఆ విధంగా ఉపయోగించుకొనవచ్చును). పరమాత్ముడట్టివాడు. పరమాత్ముడు పట్టపగటి వెలుగు. అనగా సూర్యకాంతి. ఈ వెలుగుకు ఏ అవరోధముండదు. రాత్రిపూట ఏ కాంతి ప్రసరించినా ఆ మేరకే అది పనికి వస్తుంది. పగటి వెలుగు సర్వ వ్యాప్తము. పరమాత్ముడట్టివాడు. ఇదిగో ఆ పరమాత్ముడు వేంకటశైలముపై ఎట్ట ఎదుటనే ఉన్నాడు. ఇంకా పరమాత్ముడు పచ్చిపాలలోని వెన్న మరియు ఏ రంగు పూతయు లేని పరిశుద్ధ స్వరూపము. బంగారు వర్తకుడు ఒరపిడి పెట్టే గీటురాయి అతడు. స్వేచ్ఛగలవాడు. తేట పలుకు వంటివాడు. అందరికిని ఫలము లిస్తాడు. వేంకటేశ్వరుడు జీవులలోనున్న ప్రాణముతానే'' అని అన్నమయ్యగారు లౌకికములైన ఉపమానములతో భగవన్మహిమను తేట తెల్లముగా చెప్పినారు.

విశేషము : ''యేయథా మాం ప్రపద్యంతే। తాంస్తదైవ భజామ్యహం'' = ఎవరు నన్ను ఏ విధంగా భజిస్తారో వారిని నేను ఆ విధంగా భజించెదను'' అని కృష్ణ వాక్యము ''భక్తి కొలదివాడు'' అనేది దీని అచ్చు''. పచ్చిపాలలోని వెన్న వివరము. పచ్చిపాలలో వెన్న ఉంటుంది. పాలు మనవద్ద ఉన్నాయి. ఆ పాలలో వెన్న ఉన్నది. మనకు కనపడదు. వాటిని కాచి తోడువేసి పెరుగుచేసి తరచినప్పుడు మనచేతికి వెన్న వస్తుంది. అట్లే పరమాత్ముడు సర్వత్ర వ్యాపించి మనకు కనపడడు. యోగసాధన చేసి భక్తి నవలంబించి ఉపాసన చేస్తే కనపడును. ఒక బొమ్మకు బచ్చెన (రంగు) పూస్తే దాని శుద్ధ రూపము కనపడదు. ఆ రంగు తుడిచివేస్తే దాని శుద్ధ రూపము కనపడుతుంది. పరమాత్ముడు ఏ రంగు అంటని శుద్ధ స్వరూపుడు. కనుకనే ఆయనను ''నిరంజనుడు'' అంటారు. బంగారు వ్యాపారి బంగారును ఒరగల్లు మీదరాచి పరీక్షిస్తాడు. అట్లే పరమాత్ముడు జీవులను ఒరపిడి పెట్టి పరీక్షించి నిగ్గు దేల్చి స్వీకరిస్తాడు. అన్నమయ్యగారు పరమాత్మునే ఒరగల్లు రాయి అని లక్షణార్థంగా చెప్పినారు. సర్వజీవులకును ప్రాణమాతడే ప్రాణశబ్దము పరమాత్ముని చెప్పుతుంది. ఇట్టి మహదర్థములనెడి రత్నములకు అన్నమయ్యగారి హృదయము సముద్రము.

# 35. తిలంగ్‌రాగం = రూపక తాళం

ప॥ ఏమొకో చిగురు టధరమున
ఎడనెడ కస్తూరి నిండెను॥
భామిని విభునకు వ్రాసిన
పత్రిక కాదు కదా!! ॥ఏమొకో॥

చ॥ కలికి చకోరాక్షికి కడ
కన్నులు కెంపై తోచెనే॥
చెలువం బిప్పుటిదేమో
చింతింపరే చలులు॥
నలువున ప్రాణేశ్వరుపై
నాటిన ఆ కొనచూపులు॥
నిలువున పెరుకగ నంటిన
నెత్తురు కాదు కదా॥ ॥ఏమొకో॥

2) పడతికి చనుగవ మెరుగులు
పైపై పయ్యెద వెలుపల
కడుమించిన విధమేమో
కనుగొనరే చెలులు॥
ఉడుగని వేడుకతో ప్రియు
డొత్తిన నఖ శశి రేఖలు॥
వెడలగ వేసవి కాలపు
వెన్నెల కాదు కదా॥ ॥ఏమొకో॥

3) ముద్దియ చెక్కుల కెలకుల॥
ముత్యపు జల్లుల చేర్పులు॥
ఒద్దిక బాగు లివేమో॥
ఊహింపరే చెలులు॥

గద్దరి తిరువేంకటపతి॥
కౌగిటి అధరామృతముల
అద్దిన సురతపు చెమటల
అందము కాదుగదా॥ ॥ఏమొకో॥

**తాత్పర్యము :**

నాయికా నాయకుల సంభోగమయినది. కవికి ఆ నాయిక ఏకతమున కనపడినది. ఆమె శరీరమున ఏవో చిహ్నములు కనపడినవి. తన చెలులని పిలిచి ప్రశ్నిస్తున్నాడు. చెలులారా! చూడుడు. ఆమె పెదవిపైన కస్తూరి కనపడుచున్నది. అది ఆమె పతికి వ్రాసిన లేఖ కాదుకదా! ఆమె కంటికొనలు ఎర్రగా కనిపించు చున్నవి. ఆమె తన చూపులు ప్రియునిపై నాటి తిరిగి లాగుకొనినప్పుడుప్రియుని ఒడలి నుంచి అంటిన నెత్తురు కాదు కదా! ఆమె చనుల మెరుగులు పయ్యెదపైన కనిపించుచున్నవి. అవి నఖక్షత రేఖలనెడి చంద్రుడస్తమించిన తరువాత ( రాత్రి దాటిన తరువాత) వచ్చిన ఎండ కాదు కదా! ఆమె చెక్కిళ్లపై కనుపించు ముత్యముల వలెనున్నవి ఆయన బిగికౌగిలి కలిగిన చెమట బిందువులు అధరామృతపు బిందువులు అద్దుకొన్న బిందువులు కావుగదా'' అని ఆ సంభోగ చిహ్నములను అన్యధాగా ఉత్ప్రేక్షించుట జరిగినది. చివరిది మాత్రము ఉపమేయ వస్తువును ఉపమేయ వస్తువుగా చెప్పుట జరిగినది. ఇది ఒక రమ్యోత్ప్రేక్ష.

## 36. శంకరాభరణం = ఆదితాళం

ప॥ తెలిసిన వారికి దేవుడితడే
వలవని దుష్టుల। వాదములేల॥

చ॥ పురుషుల లోపల। పురుషోత్తముడు॥
నరులలోన నర। నారాయణుడు॥
పర దైవములకు। పరమేశ్వరుడు॥
విరుస మూఢుల కె। వ్వరో ఇతడు॥ ॥తెలిసిన॥

2) పలు బ్రహ్మలకును। పరబ్రహ్మము॥
మలయు నీశులకు। మహేశు డితడు॥
ఇల నాత్మలలో। నిటు పరమాత్ముడు॥
ఖలుల కెట్లుండునో। కానము ఇతడు॥ ॥తెలిసిన॥

3) వేదంబులలో। వేదాంత వేద్యుడు
సోదించ కరిగాచుచో। నాది మూలము॥
ఈ దెస శ్రీ వేంక। టేశు డిందరికి
గాదిలి మతులను। గైకొనడితడు॥ ॥తెలిసిన॥

**తాత్పర్యము :**

తెలిసిన వారికి (జ్ఞానులకు) ఈయనయే దేవుడు. యదార్థము రుచించని దుష్టుల వాదములతో మన కేమి పని? పురుషులలో ఇతడే పురుషోత్తముడు. నరులలో ఈయన నరనారాయణుడు. గొప్పదైవములకు పరమేశ్వరుడు. విరసులయిన మూఢులకు ఇతడెవ్వరో? (వారిమాటకు లెక్కలేదని) పెక్కుమంది బ్రహ్మలకు ఈయన పరబ్రహ్మము. సృష్టిచక్రములో తిరిగే ఈశులకు (శివులకు) ఇతడు మహేశ్వరుడు. దుష్టులకేమో? వేదాలలో వేదాంత వేద్యుడు. శోధింపగా గజేంద్ర రక్షణమున ఇతడాదిమూలము. ఈదిక్కులో ఇప్పుడిందరికి శ్రీ వేంకటేశ్వరుడు. అల్పమతులను ఈయన గ్రహించడు.

**విశేషము :** పురుషోత్తముడనగా ఈయనకంటే ఉత్తముడు ఇంకొక పురుషుడు లేడని. బౌద్ధుడయిన అమర సింహుడుకూడ తన అమర నిఘంటువులో ''శ్రీ పతిః పురుషోత్తమః'' = శ్రీపతి పురుషోత్తముడని చెప్పినాడు. చాలా చాలా అనాది కాలంలో గురుశిష్య సంప్రదాయం పుట్టని కాలంలో గురుశిష్య సంప్రదాయం తెలుపుటకు నారాయణుడు రెండు రూపములతో, నరుడు నారాయణుడు అను రెండు పేర్లతో అవతరించి, బదరికాశ్రమం తపస్సు చేసి వేదప్రతిపాదిత మయిన నారాయణాష్టార మంత్రమును నరున కుపదేశించి అనాది ఋషులుగా ప్రసిద్ధి కెక్కినాడు. కనుక ఈయన నరులలో నారాయణ ఋషి. వారి వారి అభిరుచిని

బట్టి జ్ఞానమును బట్టి దేవతలలో ఏదో ఒక దేవతను పరదైవముగా భావింతురు. ఎవరు ఎవరిని భావించినా ఆ పరదైవము లందరికిని నారాయణుడే పరమేశ్వరుడు. మూఢలీ తత్త్వమును గ్రహింపలేక అతనిని ఎవడో అనుకుంటారు. గీతలో ''అవజానంతిమాం మూఢాః మానుషీంతను మాశ్రితం'' = మానవావతారమెత్తిన నన్ను మూఢులు తెలుసుకొనలేరు'' అని గీతాచార్యుడు చెప్పినాడు. దీనిని బట్టి అన్నమయ్య గారు ''విరస మూఢుల కెవ్వరో ఇతడు'' అన్నారు. నవబ్రహ్మలని ఉన్నారు. వారిలో ఇతడు పరబ్రహ్మము. ప్రమాణము. ''నారాయణ పరం బ్రహ్మ'' = నారాయణుడు పరబ్రహ్మము'' అనే వేద వాక్యము. ఏకాదశ రుద్రులు ఉన్నారు. ఆ పదకొండుగురిలో ''రుద్రాణాం శంకర శ్చాస్మి'' = శంకరుడను నేను. అన్నాడు గీతాచార్యుడు. ఆత్మలలో పరమాత్ముడితడు. ''ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మే త్యుదాహృతః'' అనే గీతావాక్యము ప్రమాణము. ఖలుల సంగతి అక్కరలేదు. ఖలులగు హిరణ్యకశిపు, రావణ, శిశుపాలాదులకిత డెవరో? దానితో మనకు పనిలేదు. వేదము లీతని వేదాంత వేద్యుడుగా చెప్పినవి. ''యో వేదాదౌ స్వరః ప్రోక్తః వేదాంతేచ ప్రతిష్ఠితః తస్యప్రకృతి లీనస్య యః పరస్స మహేశ్వరః'' ఈ వేద ప్రమాణమును బట్టి ఈయన వేదాంత ప్రతిపాద్యుడు. ఇంకా విచారించగా గజేంద్రుడు ''మూల మూల'' = అందరికి ఆది మూలమయిన దేవుడు నన్ను రక్షించుముగాక'' అని ప్రార్థించినపుడు తక్కిన దేవతలెవరును మూల దైవము'' కారు కనుక వారందరును ఊరకుండిరి. విష్ణువు వచ్చి రక్షించినాడు. ఈ పురాణ కథను బట్టి ''సోదించకరి గాచుచో నాది మూలము'' అన్నా రన్నమయ్యగారు. ఇన్ని మహిమలుగల ఈ దేవుడు ఈ దిశలో వేంకటేశ్వరుడుగా ఇందరికి కనపడుచున్నాడు. అల్పమతులను ఈయన భక్తులుగా స్వీకరింపడు. ''మూఢా జన్మని జన్మని'' = అనే గీతా వాక్యప్రకారం వదలివేస్తాడు. సకల వేద పురాణ తత్త్వసార మీ గేయము. ఈ తత్త్వమునే ఋషుల సభలో వేదవ్యాస మహర్షి భుజమెత్తి ''న దైవం కేశవాత్పరం'' = విష్ణువు కన్న పరదైవము లేదు'' అని చెప్పినాడు. ఇట్టి ప్రమాణములు కోకొల్లలుగా కలవు. నేనింతవరకే చూసినాను.

# 37. కేదారం = ఆది

ప॥ కొలిచిన వారల। కొంగుపై డితడు॥
బలిమి తారక। బ్రహ్మ మీతడు॥ ॥కొలిచిన॥

చ॥ ఇనవంశాంబుధి। నెగసిన తేజము॥
ఘన యజ్ఞంబుల। ఘన ఫలము॥
మనుజ రూపమున। మనియెడి బ్రహ్మము॥
నినుపుల రఘుకుల। నిధాన మితడు॥ ॥కొలిచిన॥

2) పరమాన్నపులో। పలి సారపుజవి॥
పరగిన దివిజుల। భయహరము॥
మరిగిన సీతా। మంగళ సూత్రము॥
ధరలో రామావ। తారంబితడు॥ ॥కొలిచిన॥

3) చకిత దానవుల। సంహార చక్రము॥
సకలవన చరుల। జయకరము॥
వికసితమగు శ్రీ। వేంకటనిలయము॥
ప్రకటిత దశరధ। భాగ్యంబితడు॥ ॥కొలిచిన॥

**తాత్పర్యము :**

ఇందు రాముని వర్ణనము. ఈ వేంకటేశ్వరుడు భక్తులకు కొంగు బంగారము. ఇతడు తారక బ్రహ్మము. (శ్రీరామ తారకము) సూర్యవంశములో ఉద్భవించిన తేజస్సు. మహాయజ్ఞముల మహాఫల మితడే. మానవ రూపముతో వెలసిన పరబ్రహ్మ మితడు. రఘుకులానికి నిండైన ధననిక్షేపము. (గని) పరమాన్నములోని తియ్యనిరుచి. ఈ తేజస్సు దేవతల భయమును హరించునది. ఇదియే సీత మంగళ సూత్రము. ఇదే రామావతారము. రామావతారము రాక్షసులను సంహరించు చక్రము. ఇదే వానరులకు జయకరము. ప్రస్తుతము వేంకటాచలమున నిలిచియున్నది. ఇదియే ఆనాటి దశరథుని భాగ్యము. రామునకు వేంకటేశ్వరునకు అభేద అధ్యవసాయముతో పాడిన పాట ఇది.

# 38. హుసేని = ఆది (త్రిశ్రగతి)

ప॥ అంతరంగ మెల్ల శ్రీ। హరికి ఒప్పించకుంటె॥
వింత వింత విధముల। వీడునా బంధములు॥

చ॥ మనుజుడై ఫలమేది। మరి జ్ఞానియౌదాక॥
తనువెత్తి ఫలమేది। దయగలుగు దాక॥
ధనికుడై ఫలమేది। ధర్మము సేయుదాక॥
పనిమాలి ముదిసితే। పాసెనా భవము॥ ॥అంతరంగ॥

2) చదివియు ఫలమేది। శాంతము కలుగుదాక॥
పెదవెత్తి ఫలమేది। ప్రియమాడు దాక॥
మది గల్గి ఫలమేది। మాధవు దలచుదాక॥
ఎదుటతాను రాజైతే। ఏలెనా పరము॥ ॥అంతరంగ॥

3) పావనుడై ఫలమేది। భక్తి కలిగిన దాక॥
జీవించి ఫలమేది। చింతదీరు దాక॥
వేవేల ఫలమేది। వేంకటేశు గన్నదాక॥
భావించి తాదేవుడైతే। ప్రత్యక్ష మౌనా॥ ॥అంతరంగ॥

**తాత్పర్యము :**

మనస్సు నంతయు శ్రీహరి కర్పించకపోతే వింత వింతలైన సంసార బంధములు వీడవు. మనుష్యుడుగా పుట్టిన మాత్రాన జ్ఞానికాకపోతే ఫలములేదు. శరీర మెత్తిన మాత్రాన దయలేకపోతే ఫలములేదు. ధనవంతుడైన మాత్రాన దానము చెయ్యకపోతే ఫలములేదు. ఏ కర్మమును చెయ్యక ముసలి అయితే సంసారము వదలదు. శాంతి అనేది అబ్బకపోతే ఎంత చదువు చదివినా ఫలములేదు. పెదవి ఎత్తి మాటాడితే ప్రియమయినది మాట్లాడవలెను. లేకపోతే మాటకు ఫలములేదు. మాధవుని స్మరింపకపోతే మనసుండి ఫలములేదు. అందరి ఎదుటను తాను రాజైతే ఏమిఫలము? మోక్షము చిక్కునా? చిక్కదు. మడిగట్టు కుంటే ఫలమేమి? భక్తిలేకపోతే చిరకాలము జీవించి చింతలు తీరకపోతే ఫలమేమి?

వేల పుణ్యాలు చేసినా వేంకటేశ్వరుని దర్శింపక ఫలమేమి? నేనే దేవుడను అని భావించు కొంటే ఏమి ఫలము? దేవుడు ప్రత్యక్షమౌనా? కాడు.

**విశేషము :** మనస్సును భగవదర్పణం చెయ్యకపోతే దానిని ఐహిక విషయములకు లాగి జీవుని సంసార బంధములో పడవేస్తుంది. మనస్సును భగవదర్పణం చేస్తే బంధవిముక్తి కలుగుతుంది. కనుకనే ''మనఏవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః'' = మనస్సే బంధానికిగాని మోక్షానికి గాని కారణము''. అని శాస్త్రము చెప్పినది. మానవజన్మ ముత్తమమయినదే. కాని జ్ఞాని కాకపోతే ఫలములేదు. శంకరాచార్యులవారు వివేకచూడామణిలో ''జంతూనాం నరజన్మ దుర్లభ మతః పుంస్త్వం తతో విప్రతా'' = జన్మలలో మానవ జన్మ లభించుట దుర్లభము. దానిలో జ్ఞాని అగుట దుర్లభము'' అని చెప్పిరి. మానవ జన్మమునకు ఫలము జ్ఞానము కదా! కనుకనే ''జ్ఞానేన హీనః పశుభిస్సమానః'' = జ్ఞానములేని వాడు పశుసమానుడు'' అని ఇంకొక ఆభాణకము చెప్పినది. శరీరమెత్తి దయాగుణము లేకపోతే నిష్ఫలము. ధనమున్నందుకు ధర్మముండాలి. లేకపోతే నిష్ఫలము. దానమనే ధర్మము లేకపోతే ఏమగునో చూడుడు. ''చత్వారో ధనదాయాదాః ధర్మాగ్నినృప తస్కరాః'' జ్యేష్ఠభ్రాత్ర వమానేన త్రయః కుప్యంతి సోదరాః'' = ప్రతివాడు సంపాదించు ధనమునకు నలుగురు దాయాదు లున్నారట. వారు ధర్మము, అగ్ని, రాజా, దొంగ. పెద్దన్న నవమానించితే (దానము చెయ్యకపోతే) తక్కిన ముగ్గురు కోపించెదరట. (అగ్ని తగులబెట్టును. రాజా పన్నులు వేయును. దొంగ దోచును అని). కనుక ధర్మము ముఖ్యము. కర్మ బంధము అని నిష్కర్మ నవలంబించి ముసలి వాడయితే సంసారము విడువదు. విద్యకు శాంతి ఫలము. మాటకు ప్రియముగా బలుకుట ఫలము. గీతలో ''అనుద్వేగ కరం వాక్యం'' = ఉద్వేగము కలిగించని మాట'' అని వాఙ్మయ తపస్సుగా చెప్పబడినది. మనస్సున్నందుకు మాధవుని స్మరింపవలెను. రాజయి ఫలములేదు. ''రాజా రాష్ట్రకృతం పాపం'' = రాష్ట్రములోని వాడు చేసిన పాపమును రాజనుభవించు'' ననియును ''రాజ్యాంతే నరకం ధ్రువం'' = రాజ్య పరిపాలనాంతరమున నరకము తప్పదు'' అనియును శాస్త్రము. ''సోహం'' = నేనే దేవుడను అని భావిస్తే దైవసాక్షాత్కారము కాదు. ఇందు లౌకిక పారమార్థిక

తత్త్వములు రెండును చెప్పబడినవి. జీవితములో ఎన్నో ఉండి అవన్నియు నిష్ఫలములయినవి. మరి ఇక గతి ఏమి? అంటే ''భక్తివశః పురుషః'' ''భక్తి రేవైనం గమయతి'' ''భక్తికి దేవుడు వశమగును'' భక్తియే భగవంతుని పొందించును'' అనే వేదాంత వాక్యాల ప్రకారం భక్తి ప్రాధాన్యమును అన్నమాచార్యులవారు చెప్పక చెప్పిరి.

## 39. శహన రాగం = ఖండచాపు

ప॥ భక్తి నీపై దొకటె। పరమ సుఖము॥
యుక్తి జూచిన నిజం। బొక్కటీ లేదు॥

చ॥ కులమెంత గలిగెనది। కూడించు గర్వంబు॥
చలమెంత గలిగెనది। జగడమే రేచు॥
తలపెంత పెంచినా। తగిలించు కోరికలు॥
ఎలమి విజ్ఞానంబు। ఏమిటా లేదు॥ ॥భక్తి॥

2) ధనమెంత గలిగెనది। దట్టమౌ లోభంబు॥
మొనయు చక్కదనంబు। మోహములు రేచ
ఘన విద్య గలిగినను। కప్పు పై పై మదము॥
ఎనయగా పరమపద। మించుకయు లేదు॥ ॥భక్తి॥

3) తరుణు లెందరు నయిన। తాపములు సమకూడు॥
సిరు లెన్నిగలిగినను। చింతలే పెరుగు॥
ఇరవయిన శ్రీ వేంక। టేశ నిను గొలువగా॥
పెరిగె నానందంబు। బెళుకు లికలేవు॥ ॥భక్తి॥

**తాత్పర్యము :**

ఓ వేంకటేశా! నీపై కలిగిన భక్తి ఒక్కటే పరమ సుఖము. యుక్తితో ఆలోచిస్తే ఏ ఒక్కటీ నిజము కాదు. గొప్పకులంలో పుట్టితినను కొంటే అది గర్వమును పెంచుతుంది. పౌరుషం ఉంటే అది కలహాన్ని రెచ్చగొడుతుంది. ఊహలు

తగులుకుంటాయి. వాటికి కోరికలు తగులుకుంటాయి. ఎందులోనూ విజ్ఞానము లేదు. ధనం ఎక్కువగా నున్నా దాని ననుసరించి లోభగుణము పెరుగుతుంది. చక్కదనం ఉంటే మోహము పెరుగుతుంది. విద్య ఉంటే పైపై మదము పెరుగుతుంది. ఆలోచింపగా పై వాటిలో ఉత్తమమయిన పద మేదియు లేదు.

**విశేషము :** స్వామీ! నీ భక్తి ఒక్కటే పరమసుఖము. కులశేఖరులు ముకుంద మాలలో నీ భక్తి ఒక్కటే ''వినుతే నిర్వాణ మాత్యంతికం'' = ముకుందా! నీ భక్తి ఒక్కటే అత్యంత నిర్వాణమును (పరమ సుఖమును ఇచ్చును) అని అన్నారు. పెద్ద కులమున పుట్టుట వలన కలిగిన మదము అష్ట మదములలో నొకటి. కాక అరిషడ్వర్గములో నొకటి. ఇది పతన హేతువు. సౌందర్య మదము, విద్యామదము కూడ పై కోవలోనివే. స్త్రీలు పరిజనముగా ఎంతమంది ఉన్నా సంతాపకారణమే. ''దారావర్తే'' ముకుంద మాల. తరుణి సంసార సముద్రములో ముంచే సుడిగుండమట. సిరులెన్ని వుంటే అన్ని చింతలు పెరుగుతాయి. ''చితా దహతి నిర్జీవం। చింతాదహతి జీవితం'' = చిత అని ఒకటి ఉన్నది. (చితి) చింత అని ఒకటి ఉన్నది. చిత చచ్చిన వానిని దహిస్తుంది. చింత బ్రతికి ఉన్నవానిని దహిస్తుంది'' అని చెప్పబడినది. సిరులతో చింతలు పెరుగునని ఇందు చెప్పబడినది. వేంకటాచలమున నెలకొన్న నిన్ను సేవిస్తే ఆనందము పెరుగుతుంది. ఇందు మార్పులేదు. అని అన్నమయ్యగారి స్వానుభవగేయమిది.

## 40. ముఖారిరాగం = రూపకతాళం

ప॥ విశ్వరూప మిదివో। విష్ణు రూపమిదివో॥
శాశ్వతుల మైతిమింక। జయము నా జన్మము॥ ॥విశ్వ॥

చ॥ కొండవంటి హరి రూపు। గురుతైన తిరుమల
పండిన వృక్షములే క। ల్పక తరువులే
నిండిన మృగాదులెల్ల। నిత్యముక్త జనములు
మెండుగ ప్రత్యక్షమాయె। మేలు వో నా జన్మము ॥విశ్వ॥

2) మేడవంటి హరిరూపు। మించైన పైడి గోపురము॥
చూడనే వాలిన ప। క్షుల రవములు॥
వాడల కోనేటి చుట్లు। వైకుంఠనగరము॥
యీడ మాకు పొడ సూపె। ఇహమేపో పరము॥ ॥విశ్వ॥

3) కోటి మదనుల వంటి। గుడిలో చక్కని మూర్తి॥
ఈటులేని శ్రీ వేంక। టేశుడీతడు॥
వాటపు సొమ్ములు ముద్ర। వక్షపుటల మేల్మంగ॥
కూటువై నన్నేలితి వె। క్కువవో నా తపము॥ ॥విశ్వ॥

## తాత్పర్యము :

ఆచార్యుల వారికి స్వామి సందర్శన మయినది. ఆ సమయమున కలిగిన అనుభూతి ఈ పదము. ఆహా! ఇదిగో విశ్వరూపము. విష్ణురూపము. దీని సందర్శనము చేత మేము శాశ్వతుల మైతిమి. విశ్వరూప మంటే ప్రతి పదార్థమును ఆయన రూపమని. కొండవంటి హరిరూపము ఇది. ఇది గుర్తుగా తిరుమల. ఇది సాక్షాత్తు వైకుంఠము. ఇందున్న మృగ పక్ష్యాదులు నిత్యముక్తులు. పండిన వృక్షములన్నీ కల్పవృక్షములే. ఇట్టిది నాకు ప్రత్యక్షమైనది. నా జన్మము ధన్యమైనది. మేడవలె కనిపించే అదియు హరి రూపమే. దానిపైన బంగరు గోపురము. చూడగనే వాలుచున్న పక్షుల కిలకిలా రావములు చెవుల కింపు కలిగిస్తున్నాయి. వాడలలో కోనేళ్లతో చుట్టుబడిన వైకుంఠమిది. ఇహలోకములో మాకు పరమ పదము కనపడినది. గుడిలోనికి వెళ్ళితే కోటి మన్మధుల అందము గల మూర్తి. ఏనాటికిని వ్యర్థము కాని వేంకటేశ్వరుడితడు కదా! వాటమయిన ఆభరణములు, ఆ అభయముద్ర. వక్షస్థల మందు అలమేల్మంగాదేవి, వీటి అన్నిటి కూడికతో దర్శనమిచ్చి నన్నేలినావు స్వామీ! నేను చాలా ఎక్కువ తపము చేసియున్నాను అని అయ్యగారు తమ ఆనందమును దీనియందు ప్రకటించినారు.

**విశేషము :** ''మృగ పక్ష్యాలు నిత్యముక్త జనములు'' = నిత్యులనగా నారాయణుని స్థానమగు వైకుంఠ మందు వైకుంఠమున్నప్పటి నుండి ఉంటూ

నారాయణుని నిత్యమును దర్శించుచు స్తోత్రములు చేయుచు కనుమూతలు లేక నుండువారు నిత్యులు నిత్యసూరులు. ప్రమాణము. ''తద్విష్ణోః పరమం పదగుం సదా పశ్యంతి సూరయః । దివీవచక్షు రాతతం తద్విప్రాసో విపన్యవో జాగు ర్వాంసస్స మింధతే'' అనెడి వేదమంత్రము. ముక్తులమనగా ఇహలోకమున బుట్టి మోక్షదాయకములయిన కర్మానుష్ఠానములు చేసి ముక్తినంది వైకుంఠమున నిత్యసూరులతో కలసి బ్రహ్మానందమును పొందుచున్న వారు. వారు వీరు కలిసి ''నిత్యముక్తజనము''. అన్నమయ్య గారికి తిరుమల యందలి మృగ పక్షిగణములు నిత్య ముక్త జనమువలె సాక్షాత్కరించినవి. ఇదే విశ్వరూప సాక్షాత్కారము. ఇది బ్రహ్మానందమే.

## 41. కమాస్ = ఖండచాపు

ప॥ అవధారు రఘుపతీ। అందరిని చిత్తగించు॥
ఇవల నిండే కొలు। విదెనదె సముఖాన॥ ॥అవ॥

చ॥ రామ రాఘవ రామ। రామచంద్ర ప్రభో॥
శ్రీ మదయోధ్యాపతీ। సీతాపతి।
ప్రేమ నారదుడు పాడి। పెక్కురంభాదులాడేరు॥
మోమెత్తికపులెల్ల। మ్రొక్కేరదివో॥ ॥అవ॥

2) ఇన వంశకుల జాత। ఇక్ష్వాకు కులతిలక॥
ఘన దశరథ సుత। కౌశిక ప్రియా॥
మునులు దీవించేరు। ముందరను భరతుడదె॥
వెనుక లక్ష్మణుడు సే। వించె వింజామర॥ ॥అవ॥

3) కందువ కౌసల్యా। గర్భ రత్నాకరము॥
చెందిన శ్రీ వేంకటాద్రి। శ్రీనివాస॥
సందడి కుశలవులు। చదివేరు ఒక వంక॥
చెంది నీరాజనము। చెప్పరాదు రామ॥ ॥అవ॥

**తాత్పర్యము :**

ప్రభువు సభలో దర్బారు చేసి ఉండగా వందిమాగధులు అవధారు బహుపరాకు వంటి మాటలతో కైవారాలు చేస్తారు. ఇందు అన్నమయ్యగారు అదే చేస్తున్నారు. అయితే అంతా శ్రీరామ పరముగానే చెప్పినారు. ఇది పరంపరగా వస్తున్న సంప్రదాయమే. ఇందున్న సంబోధన విశేషణములన్నియు రామునివే. ఎచ్చరిక వహించు. అందరినీ చిత్తగించు. సభాస్తారు ఇవల నుండువారు నీ సముఖాన నుండువారును కలిసి నిన్ను కొలుచుచున్నారు. నారదుడు పాడు చున్నాడు. రంభాదులాడుచున్నారు. వానరులందరును మోమెత్తి మ్రొక్కుచున్నారు. మునులు దీవిస్తున్నారు. ముందర భరతుడున్నాడు. వెనుక లక్ష్మణుడు వింజామరతో సేవిస్తున్నాడు. కౌసల్యాగర్భ సంభూతుడవైన వేంకటాద్రి శ్రీనివాసా! ఒక ప్రక్క కుశలవులు గానం చేస్తున్నారు. కనుక సభ చాలించ రాదు. అందరినీ అవధారు = చిత్తగించు అని అన్నమయ్యగారు కైవారాలు పలికినారు.

**విశేషము :** వేంకటేశ్వరుని రామ పరముగా చెప్పుట సంప్రదాయము. ఇద్దరును విష్ణుని అవతారములే కనుక ఇది చెల్లును. కాక చాలా ప్రసిద్ధమైన, పూర్వాచార్యులు రచించిన ''వేంకటేశ్వర సుప్రభాతము'' లో ''అభిరామ గుణాకర దాశరథే జగదేక ధనుర్ధర ధీరమతే'' అనునది రామ పరముగా నున్న శ్లోకము. అట్లే ఈ కైవారము రామ పరముగా జరిగినది.

## 42. ద్విజావంతి = ఆదితాళం (త్రిశ్రగతి)

ప॥ రామచంద్రుడితడు। రఘువీరుడు॥
కామిత ఫలము లీయ। గలిగే నిందరికి॥

చ॥ గౌతము భార్యపాలిటి। కామధేను వితడు
ఘాతల కౌశికుపాలి। కల్పవృక్షము॥
సీతాదేవి పాలిటి। చింతామణియితడు॥
ఈతడు దాసుల పాలిటి। యిహపరదైవము॥ ॥రామ॥

2) పరగ సుగ్రీవు పాలి। పరమ బంధు వితడు॥
సరి హనుమంతు పాలి। సామ్రాజ్యము॥
నిరతి విభీషణుని పాలి। నిధాన మీతడు॥
గరిమ జనకు పాలి। ఘన పారిజాతము॥ ॥రామ॥

3) తలప శబరి పాలి। తత్త్వపు రహస్యము॥
అలర గుహుని పాలి। ఆదిమూలము॥
కలడన్న వారి పాలి। కన్ను లెదుట మూరితి॥
వెలయ శ్రీ వేంకటాద్రి। విభుడితడు॥ ॥రామ॥

## తాత్పర్యము :

ఇదియు రామ పరముగానే జరిగినది. ఇతడు రామచంద్రుడు, రఘువీరుడు. ఇందరికిని కోరిన ఫలము లీయ గలవాడు. అహల్య పాలిటి కామధేనువు. కోరికల నిచ్చునది కామధేనువు. అహల్య కోరుకొన్నది శాపనివృత్తి, గౌతమ స్వీకారము. ఇవి జరిపిన కామధేనువు రాముడు. ఘాతల కౌశికు పాలి(విశ్వామిత్రునకు) కల్ప వృక్షము = (కోరిన కోరికల నిచ్చునది) సీతాదేవికి చింతామణి. (కోరికలు తీర్చుమణి) దాసులకు ఇహపరదైవము. సుగ్రీవునకు పరమ బంధువు. హనుమంతునకితడు సామ్రాజ్యము. విభీషణున కితడు ధన నిక్షేపము. జనకుని పాలిటి పెద్ద కల్ప వృక్షము. శబరి పాలిటి తత్త్వ రహస్య జ్ఞానము. గుహుని పాలిటి ఆదిమూలము. (ఆదిదేవుడు) కలడని నమ్మినవారికి కన్నుల ఎదుటిమూర్తి. ఆయనే ఇప్పుడీ వేంకటాద్రి విభుడు.

**విశేషము :** ఘాతల కౌశికుడు దెబ్బలు తినిన విశ్వామిత్రుడు. ఇతడు కృతయుగంలో వసిష్ఠుని మీద పంతం గట్టి త్రిశంకువును సశరీరంగా స్వర్గానికి పంపుతానని తపస్సును ఖర్చుపెట్టెను. కాని ఆ పని కాలేదు. జీవితములో ఇదొక ఘాత. తరువాత తపస్సు సమయంలో మేనక మోహింపజేస్తే ఆమె మోహంలో చిక్కుకొని శకుంతలను కన్నాడు. ఇదొక తపోభంగము ఘాత. తరువాత నందినీ ధేనువుకై వసిష్ఠునితో తలపడి పరాభవం పొందినాడు. ఇట్టి ఘాతల కౌశికుడు

దశరథు నర్థించి రామునికొనిపోయి రాముని ద్వారా యజ్ఞమును నిర్విఘ్నముగా కొనసాగించినాడు. అదియును కాక యోగలభ్యుడైన రాముడు తండ్రి ఆజ్ఞ చేత విశ్వామిత్రుననుసరించినాడు. ఇదెంత భాగ్యము? భోజరాజంటాడు. ''యోగేన లభ్యోయః పుంసాం। సంసారాపేత చేతసాం। సోయం పితృ నిదేశేన। రామః కౌశిక మన్వగాత్॥ అర్థము పైదే. ఈ విధముగా రాముడు। ఘాతల కౌశికు పాలికల్ప వృక్షము. హనుమంతునకు రామనామమే సామ్రాజ్యము. దానివలననే అతనికి సర్వార్థ సిద్ధి. విషయము సర్వవిదితమే.''శబరిపాలి తత్వరహస్యము'' భగవత్సాక్షాత్కారము ''యజ్ఞేన దానేన తపసా అనాశకేన'' = యజ్ఞముచేత, దానముచేత, తపస్సుచేత, ఉపవాసముచేత'' అని వేదవాక్యము. ఈ తత్త్వ రహస్యము శబరి విషయమున ప్రకటితమైనది. మతంగ శుశ్రూషాదులు యజ్ఞము వంటివి. రామునకు మధురఫలము లిచ్చుటదానము. రామదర్శనము కోసము నిరీక్షించుట తపస్సు. ఉపవాసములు చేసినది. రామదర్శన మయినది. ఇది తత్వ రహస్యము. గుహుడు రాముని దేవునివలె పూజించినాడు.

## 43. షణ్ముఖప్రియ = ఖండచాపు

ప॥ పలు విచారము లేల। పరమాత్మ నీవు నాకు
కలవు కలవు ఉన్న। కడమ లేమిటికి॥ ॥పలు॥

చ॥ నీ పాదముల చెంత। నిబిడమైతే చాలు॥
ఏ పాతకములైన। ఏమిసేయును॥
ఏపార నీభక్తి। యింత కలిగిన చాలు॥
పై పై సిరు లచ్చుట। పాదుకొని నిలుచు॥ ॥పలు॥

2) సొరిదినీ శరణము। జొచ్చితి నంటేచాలు॥
కరుణించి యప్పుడట్టే। కాతువు నీవు॥
సరస నీముద్రలు భు। జముల నుంటే చాలు॥
అరుదుగా చేతనుండు। నఖిలలోకములు॥ ॥పలు॥

3) నేరక వేసిన చాలు। నీ మీద నొకపువ్వు॥
కోరిన కోరిక లెల్ల। కొనసాగును॥
నేరకా శ్రీ వేంకటేశ। నిన్ను గొలిచితి నేను॥
ఏ రీతి నుండిన గాని। యిన్నిటా ఘనుడను॥ ॥పలు॥

**తాత్పర్యము :**

స్వామీ! అనేకములయిన ఆలోచన లేల? నీవునాకు పరమాత్ముడవు. నీవు నా పాలిట నున్నావు. ఇక తక్కినవి నాకేల? నీ పాద సన్నిధిలో నుంటే ఏ పాపములును ఏమీ చెయ్యలేవు. నీ భక్తి రవంత ఉన్నా చాలు. అదివుంటే పెద్ద పెద్ద సంపదలు అక్కడ స్థిరంగా నిలుస్తాయి. నేను నిన్ను శరణు జొచ్చాను. అని మాట అంటే చాలు. అప్పటికప్పుడు అక్కడ కక్కడ రక్షిస్తావు. నీ ముద్రలు భుజముల యందుంటేచాలు. సమస్త లోకములును వాని చేతిలో నున్నట్లే. తెలిసి వేసినా తెలియక వేసినా నీ మీద ఒక పువ్వు వేస్తే కోరికలు తీరుతాయి. శ్రీ వేంకటేశా! నేను నిన్ను తెలిసి కొలుచుచున్నాను. నేను నిన్ను తెలిసి కొలుస్తాను, తెలియక కొలుస్తాను. రెండిటా ఘనుడనే. అని అన్నమయ్యగారు తుదకు చమత్కరించారు.

**విశేషము :** శరణు జొచ్చుట శరణాగతి. ''శరణాగతి నిష్ఠస్య। కలాం నార్హంతి షోడశీం'' = యజ్ఞములు తపములు మొదలైన వెన్ని అయినా శరణాగతిలో పదునారవ కళకైనా చాలవు'' అని శాస్త్రము. ''ముద్రలు'' భుజములపై శంఖ చక్రముద్రలు ధరించుట (తప్తముద్రలు) వైష్ణవ సంప్రదాయమున కలదు. ఇది ఆచార్యుడు చేయును. విష్ణు పురాణమందు ''యే బాహుమూల పరిచిహ్నిత శంఖచక్రాః తే వైష్ణవా భువన మాశు పవిత్రయంతి'' = భుజముల యందు శంఖ చక్రముద్రలు ధరించిన వైష్ణవులు లోకమును పవిత్ర మొనరింతురు'' అని వారి మహిమ చెప్పబడినది. పద్మ పురాణము, పాంచరాత్రాగమము ఈ ముద్రాధారణ మహిమను విరివిగా చెప్పినవి. దీనిని బట్టియే అన్నమయ్యగారు 2వ చరణమున దాని ప్రస్తావము చేసిరి. విష్ణు పూజకు సంబంధించినది తెలిసి చేసినా తెలియక చేసినా అది ఫలప్రదమే. తుదకు విరోధముతో చేసినా అది ఫలప్రదమే. ఘంటా కర్ణుడనే రాక్షసుడు హరినామము స్మరింపకూడదని దృఢదీక్షతో, ఆ పేరు చెవిని

కూడ పడకూడదని ఒంటినిండా గంటలు కట్టుకున్నాడు. ఇట్టి శత్రుత్వంలో నిత్యమును హరినే స్మరించుటచేత ''అనిచ్ఛయాపి సంస్పృష్టో। దహత్యేవ హిపావకః'' = ఇచ్ఛలేక ముట్టుకొన్ననూ అగ్ని దహించునుకదా'' అనినట్లు వాడు మోక్షము పొందినాడు.

## 44. కానడరాగం = ఆదితాళం

ప॥ ఇతరములన్నియు। నేమిటికి॥
మతిచంచలమే। మానుట పరము॥ ॥ఇతరము॥

చ॥ ఎక్కడి సురపుర। మెక్కడి వైభవ
మెక్కడ విన్నియు। నేమిటికి॥
ఇక్కడనే పర। హితమును పుణ్యము॥
గ్రక్కున జేయగ। గల దిహపరము॥ ॥ఇతరము॥

2) ఎవ్వరు చుట్టము। లెవ్వరు బంధువు॥
ఎవ్వరిందరును। నేమిటికి॥
రవ్వగు లక్ష్మీ। రమణుని దలచుచు॥
ఇవ్వలదా సుఖి। యించుట పరము॥ ॥ఇతరము॥

3) ఎందరు దైవము లెందరు వేల్పులు॥
ఎందరిందరును। నేమిటికి॥
కందు వెరిగి వేం। కట గిరి రమణుని॥
చిందులేక కొలి। చిన దిహ పరము॥ ॥ఇతరము॥

### తాత్పర్యము :

హరి భక్తి కాక ఇతర విషయము లెన్నో ఉన్నాయి. అవన్నియు దేనికి? అనవసరము? వాటివలన మతి చలిస్తుంది తప్ప ఫలముండదు. కనుక వాటి ఆలోచన మానుట మేలు. స్వర్గమెక్కడ? దానివైభవ మెక్కడ? ఇవన్నియు దేనికి? ఇక్కడనే పరులకు హితమును కలిగించే పుణ్యము చేస్తే ఇక్కడనే ఇహపరము లుండును చుట్టాలెవరు? బంధువులెవరు? వీరందరును దేనికి? కాయ కష్టములేక

లక్ష్మీ రమణుని తలచుచు సుఖించుటచే ఇక్కడ పరము. ఎందరో దైవములున్నారు. ఎందరో దేవత లున్నారు. వీరందరును దేనికి? జాడ తెలిసి వేంకటేశ్వరుని కొలిచితే అది ఇహపరము.

విశేషము : (1) ''చంచలంహిమనః కృష్ణ। ప్రమాధి బలవత్తరం'' = కృష్ణామతి చంచల మయితే అది బలవత్తరమయి మానవుని హతం చేస్తుంది అని గీతా వాక్యము. కనుక మతి చంచల కారణములయిన ఇతరములు వద్దని. (2) స్వర్గము, స్వర్గ భోగములు ''క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి'' = స్వర్గమునకు బోయినవారు పుణ్యక్షీణమై మానవ లోకమును ప్రవేశింతురు'' అనే గీతా వాక్యప్రకారము అవి క్షణభంగురములు కనుక అవి వద్దు. (3) ''శ్లోకార్థేన ప్రవక్ష్యామి। సర్వశాస్త్రార్థ సంగ్రహం। పరోపకారః పుణ్యాయ। పాపాయ పరపీడనం'' = అరశ్లోకములో సర్వశాస్త్రాల సారమును చెప్పుచున్నాను వినుడు. పరోపకారం చేస్తే పుణ్యము. హానిచేస్తే పాపము'' అని చెప్పబడినది. ఇక్కడనే పరులకు హితం చేస్తే ఇదే ఇహపరము. (4) శంకరా చార్యులవారు ''కాతే కాంతా కస్తే పుత్రః'' = ఎవతె నీ భార్య? ఎవడు నీ కొడుకు?'' అన్నారు. అనగా వీరెవరును నీకు పరగతి కారకులు కారని. అట్టి వీరు దేనికి? (5) ఎందరో దేవతలున్నారు. వారందరును ఒక్కొక్క ఫలమును మాత్రమే ఇవ్వగలరు. ''సర్వలాభాయ కేశవః'' = విష్ణువు అన్నిటిని ఇవ్వగలడు'' అని శాస్త్రము. కనుక తక్కినవారు దేనికి? కేశవుడయిన వేంకటేశ్వరుని కొలుచుటయే యిహపరము (ఉభయతారకము) అని బోధనము.

## 45. మాయామాళవ గౌళ = ఖండచాపు

ప॥ నారాయణాచ్యుతా। నంత గోవింద హరి॥
సారముగ నీకునే। శరణంటిని॥

చ॥ చలువయు వేడియును। చటల సంసారంబు
తొలకు సుఖమొకవేళ। దుఃఖమొక వేళ॥
ఫలములివె ఈ రెండు। పాపములు పుణ్యములు॥
పులుసు దీపును కలిపి। భుజియించినట్లు॥ ॥నారాయణా॥

2) పగలు రాత్రుల రీతి। బహుజన్మ మరణాలు॥
తగుమేను పొడచూపు। తను తానె తొలగు॥
నగియించు నొకవేళ। నలగించు నొకవేళ॥
ఒగరు కారపు విడెము। ఉబ్బించినట్లు॥ ॥నారాయణా॥

3) ఇహము పరమును వలెనే। ఎదిటి కల్లయు నిజము॥
విహరించు భ్రాంతియును। విభ్రాంతియును మదిని॥
సహజ శ్రీ వేంకటే। శ్వర నన్ను కరుణింప॥
బహువిధంబుల నన్ను। పాలింపవే॥ ॥నారాయణా॥

## తాత్పర్యము :

నారాయణా --- నేను సారమయిన శరణాగతి చేశాను. ఈ కపట సంసారము ఒకపుడు చలువను ఒకపుడు వేడిని చల్లుతుంది. ఒకవేళ సుఖమును ఒకవేళ దుఃఖమును కలిగిస్తుంది. ఏది చేసినా రెండే ఫలములు. పాపము, పుణ్యము. ఈ రెండిటి కలిపి అనుభవించుట పులుపు తీపి కలిపి భుజించినట్లుండును. పుట్టు చావులు రెండును పగలు రాత్రివలె ఒకటి అయిన తరువాత ఒకటి వచ్చుచుండును. ఈ దేహము తనకు తానే వస్తుంది, తనకు తానే పోతుంది. ఈ సంసారము తమ్మపాకు విడెము వలె వగరు కారము కలిసి ఊరిస్తుంది. ఇహము పరములవలె ఒకటి కల్ల ( కనపడునది) ఒకటి నిజము. ఒకవేళ భ్రాంతి, ఒకవేళ అది తొలగుట. ఈ విధంగా సంసారమంతా ద్వంద్వములతో నిజము అబద్ధముతో కలిసి ఆరోపించుకొన్న సంబంధములతో ఇక సహజ సంబంధము వేంకటేశ్వరునితోనే ఉన్నది. అట్టి సంబంధము గల వేంకటేశ్వరా! నన్ను బహువిధములుగా పాలింపుమని అన్నమయ్యగారి ప్రార్థన.

**విశేషము** : ''సహజ సంబంధము'' = ఇహలోక సంబంధములు ఇహలోక పరంగా తల్లిదండ్రుల సంబంధము, సంతానసంబంధము మాత్రమే సహజములు. అయినను అవి తాత్కాలికములే. పూర్వజన్మలో ఎవరికి ఎవరో? భావి జన్మలో ఎవరికి ఎవరో? భగవత్సంబంధము అట్లుకాదు. ఎవడు ఏ లోకంలో ఉన్నా ఏ

శరీరంలో ఉన్నా భగవత్సంబంధము శాశ్వతము. ఆ సంబంధములు తొమ్మిదట. దేవునకు జీవునకు గల సంబంధము నవవిధము అని శాస్త్రము. ''పితాచ రక్షక శ్శేషీ। భర్తా జ్ఞేయో రమాపతిః। స్వామ్యాధారో మమాత్మాచ। భోక్తా చాద్య మనూదితః॥'' = పితా పుత్ర సంబంధము, రక్ష్యరక్షక సంబంధము, శేష శేషి సంబంధము (ఆజ్ఞ ఇచ్చువాడు చేయువాడు) భార్య భర్తృ సంబంధము, జ్ఞాతృ జ్ఞేయ సంబంధము (తెలుసుకొనువాడు తెలియ దగినది) స్వస్వామి సంబంధము (సొత్తు అధికారి) ఆధారఆధేయ సంబంధము, శరీరాత్మ సంబంధము. జీవునకు దేవునకు ఈ సంబంధములు సహజములు శాశ్వతములు అని నారాయణాష్టాక్షర మంత్రము చెప్పినదట. ఈ విషయములు మనమునందుండి అన్నమయ్యగారు ''సహజ శ్రీ వేంకటేశ్వర'' అనిరి.

## 46. వరాళిరాగము = ఖండచాపు తాళము

ప॥ ఏటి సుఖము మరి। ఏటి సుఖము ఒక
మాట మాత్రము సట। మట మైన సుఖము॥

చ॥ కొనసాగు దురితములె। కూడైన సుఖము॥
తను విచారములలో। దాకొన్న సుఖము॥
పనిలేని యాసలకు। పట్టయిన సుఖము॥
వెనక ముందర జూడ। వెర్రైన సుఖము॥ ॥ఏటి॥

2) నిందలకు లోనైన। నీరసపు సుఖము॥
బొందికి లంచంబు। పుణికేటి సుఖము॥
క్రిందుపడి పరుల ముం। గిలి గాచు సుఖము॥
పందివలె తను దానె। బ్రతికేటి సుఖము॥ ॥ఏటి॥

3) ధృతిమాలి ఇందరికి। దీనుడగు సుఖము॥
మతిమాలి భంగములు। మరపించు సుఖము॥
పతి వేంకటేశు కృప। పడసినది సుఖము॥
ఇతరము లన్నియును। నీపాటి సుఖము॥ ॥ఏటి॥

**తాత్పర్యము :**

ఈ సంసారములోనున్న సుఖమేటి సుఖము? ఒక మాట మాత్రం నిజము. ఇందులోబడి సతమతమగుటయే సుఖము. దారేషణ, పుత్రేషణ, ధనేషణలతో సతమత మగుటయే సుఖమనుకొనుచున్నాము. ఇదేటి సుఖము? తినేది పాపముల కూడు. ఇదేటి సుఖము? అనేక చింతలలో దాగుకొన్న సుఖమిది. ఇదేటి సుఖము? పనిలేని ఆశలకు పట్టయిన సుఖము. ఇదేటి సుఖము? వెనక ముందులు చూస్తే చాలా భయము కలిగించే సుఖము. ఇదేటి సుఖము? (సుఖము కోసం ముందు శ్రమ పడాలి. సుఖము తరువాత మిగిలేది దుఃఖము) నిందలకులోనైన నీరసపు సుఖము. ఈ శరీరానికి లంచము పెడుతూ వుండాలి. అదొక సుఖము. క్రిందికి దిగి జారివచ్చి ఇతరుల ముంగిలి కాచేది ఒక సుఖము. (చాకిరీ) పంది తనకు తాను ఒంటరిగా జీవిస్తుంది. అట్టిది ఏటి సుఖము? ధృతి లేక అందరికి చేయెత్తి మ్రొక్కుచు దీనుడై పొందేది ఏటి సుఖము? ఇక నిజమయిన సుఖమేదంటే వేంకటేశ్వరుని కృపను పొందుటయే నిజమయిన సుఖము. ఇది తప్ప ఇతర సుఖములన్నీ పైన చెప్పిన వంటివే. అని అన్నమయ్యగారు నిజ సుఖబోధ చేశారు.

**విశేషము :** ప్రతివాడును లోకములో సుఖములు కాని వాటిని సుఖములనుకొని అనుభవిస్తూ ఉంటాడు. దీనికి ఒక ఉపనిషద్వాక్యమున్నది. ''ద్వాసుపరౌ సయుజౌ సఖాయౌ। సమానం వృక్షం పరిషస్వజాతే। తయోరన్యః పిప్పలం స్వాద్వత్తి। అనశ్న న్నన్యో అభిచాకశీతి'' = రెండు పక్షులున్నవి. అవి కూడి ఉంటాయి. స్నేహము కలిగి ఉంటాయి. ఆ రెండిటిలో ఒక పక్షి కారమును తీపిగా తింటుంది. రెండవ పక్షి ఏమీ తినకుండా ప్రకాశిస్తుంది. ఇది ఉపనిషద్వాక్యము. వివరణము. ఆ పక్షులు రెండును జీవాత్మ పరమాత్మలు. కూడి ఉంటాయి. ఒకే శరీరముననుంటాయి. జీవాత్మ దుఃఖమునే (కారమును) తీపిగా సుఖమని భ్రమించి అనుభవిస్తుంది. పరమాత్మ సాక్షిమాత్రంగా నుంటాడు. దీని ప్రకారం సుఖమనుకొన్నది సుఖముకాదు. వేంకటేశ్వరుని కృపమాత్రమే సుఖమని అయ్యగారు వేదాంతోపదేశమును చేసినారు.

# 47. జంఝూటి = ఆది.

ప॥ నవనీత చోర। నమో నమో॥
నవ మహిమార్ణవ। నమో నమో॥ ॥నవ॥

చ॥ హరినారాయణ కేశ। వాచ్యుతకృష్ణ॥
నరసింహ వామన। నమోనమో॥
మురహర పద్మనాభ। ముకుంద గోవింద
నరనారాయణ। నమోనమో॥ ॥నవ॥

2) నిగమగోచర విష్ణు। నీరజాక్ష వాసుదేవ॥
నగధర నందగోప। నమోనమో॥
త్రిగుణాతీతదేవ। త్రివిక్రమ ద్వారక
నగరాధినాయక। నమోనమో॥ ॥నవ॥

3) వైకుంఠ రుక్మిణీ। వల్లభ చక్రధర
నాకేశ వందిత। నమో నమో॥
శ్రీకర గుణనిధి। శ్రీ వేంకటేశ్వర॥
నాకజన నుతా। నమో నమో॥ ॥నవ॥

**తాత్పర్యము :**

ఇందు అన్నియు విశేషణములతోడి సంబోధనములే. ''నమో నమో'' = నమస్కారము అని వాక్యపూర్తి. దీనిని సంస్కృతపదముగా భావించవచ్చును. ఇందు ''ద్వాదశ నగరాధి నాయక'' ను తెలుసుకొనవలసి యున్నది.

# 48. కుంతలవరాళి = ఖండచాపు

ప॥ ఆలాగు పొందులును। అటువంటి కూటములు
ఈలాగు లౌటనే। డిదె చూడనైతి॥

చ॥ అడియాస చూపులకు। నాసగించితి గాని॥
వెడ మాయలని లోను। వెదుకలేనైతి॥
కడు వేడుకల దగిలి। గాసి బొందితిగాని॥
ఎడలేని పరితాప। మెరుగలే నైతి॥ ॥ఆలాగు॥

2) చిరునగవు మాటలకు। చిత్తగించితి గాని
తరి తీపులని లోన। తలప లేనయితి॥
వరుస మోహపు పసల । వలల జిక్కితి గాని॥
గరువంపు పొలయలుక। గానలేనయితి॥ ॥అలాగు॥

3) శ్రీ వేంకటేశ్వరుని। చింత జేసితిగాని॥
దేవోత్తముని లాగు। తెలియలేనైతి॥
ఈ వైభవమ్ముపై। నిచ్చగించితి గాని॥
ఈ వైభవానంద। మిది పొందనైతి॥ ॥అలాగు॥

**తాత్పర్యము :**

అన్నమయ్యగారు తానొక శృంగారనాయిక అయి విరహమనుభవిస్తున్నారు. ఆనాటి పొందులు ఆనాటి కూటములు ఈనాడు వేరుగా కనపడుచున్నాయి. నా మీద తమకముతో అడియాస చూపులు చూస్తాడనుకొన్నాను కాని అవి వెడచూపులని నే భావింపలేదు. ఎక్కువ విరహ తాపము వలన బొంకేనుగాని ఇంత తాపమని ఎరుగ లేనయితి. నాయకుడు చిరునవ్వున నవ్వుచు మాటలాడుచుంటే చెవి యొగ్గి విన్నాను. కాని అవి ఉపేక్షాభావములని తెలియనైతిని. ఆయన పై మోహపు వలలో చిక్కేనుగాని ఆయన గర్వమును తెలియలేక పోయితిని. వేంకటేశ్వరుడని మాత్రమే తెలుసుకొన్నాను కాని దేవ దేవుడని తెలుసుకొనలేక పోయాను, దేవానందమను భవించలేకపోయాను. వేంకటేశ్వరుని సేవలో తలమున్కలుగా ఆనంద మనుభవించుట కలుగలేదే అని ఒక విధమయిన పరితాపమిది.

## 49. ముఖారి రాగం = ఆదితాళం

ప॥ రాముడు లోకాభి। రాముడు త్రైలోక్య
రాముడు రణరంగ। భీముడు వాడే॥ ॥రాముడు॥

చ॥ వరుడు సీతకు ఫలా। ధరుడు మహోగ్రవ్రు॥
శరుడు రాక్షస సం। హరుడు వాడే॥
స్థిరుడు సర్వగుణా। కరుడు కోదండ దీక్షా
గురుడు సేవక శుభ। కరుడు వాడే॥ ॥రాముడు

2) ధీరుడు లోకైక। వీరుడు సకలా
ధారుడు భవబంధ। దూరుడు వాడే॥
శూరుడు ధర్మవి। చారుడు రఘువంశ
సారుడు బ్రహ్మసా। కారుడు వాడే॥ ॥రాముడు॥

3) బలుడు యిన్నిటా రవి। కులుడు భావించ ని
ర్మలుడు నిశ్చలుడవి। కలుడు వాడే
నిలచి శ్రీ వేంకటాద్రి। నిజనగరములోన
తలకొనె పుణ్యపాద। తలుడు వాడే॥ ॥రాముడు॥

**తాత్పర్యము :**

ఈ ఎదుట కనిపించువాడు రాముడు, జనులను మోహపరచువాడు, ముల్లోకములను రమింపజేయువాడు, యుద్ధములోకి దిగితే ప్రళయ కాలరుద్రుడు, సీత వరించిన వాడు, దొండపండు వంటి క్రింది పెదవి కలవాడు, మహోగ్రములయిన బాణములు గలవాడు, రాక్షసులను సంహరించినవాడు, స్థిరమయినవాడు, అన్ని సుగుణములు కలవాడు, కోదండ విద్యలో గురువయిన వాడు, సేవించినవారికి శుభకరుడు, ధీరుడు, లోకైక వీరుడు, అందరికి ఆధార మయినవాడు, సంసార బంధమునకు దూరమయినవాడు, శూరుడు, ధర్మము నాలోచించువాడు, రఘువంశములో శ్రేష్ఠుడు, పరబ్రహ్మతో సాకారుడు, అన్ని విషయములలో బలము గలవాడు, సూర్యవంశ సంజాతుడు. అతడు ఈనాడు తన పుణ్యపాదములతో తన నిజనగరమైన వేంకటాద్రి యందు తలకొనియున్నాడు. శ్రీరామునకును, వేంకటేశ్వరునకు అభేదాధ్యవసాయముతో చేసినదిది.

## 50. కమాస్ = ఆది

ప॥ కొలనిలోన ముని। గోపికలు
మొలకనవ్వులతో। మ్రొక్కిరి నీకు॥ ॥కొలని॥

చ॥ పిరుదులు దాటిన। పింఛపు టలకల
తురుములు వీడగ। తొయ్యలులు
అరిది నితంబము। లందునె దాచుక
మురిపెపు కరముల। మ్రొక్కిరి నీకు॥ ॥కొలని॥

2 నిద్దపు మానము । నెలతలులోగుచు
గద్దరి తొడలనె । గట్టుచును ॥
ముద్దుటుంగరం । బుల కరములతో
ముద్దుల గునియుచు । మ్రొక్కిరి నీకు ॥ కొలని॥

3 పాలిండ్ల పెను । భారంబుల
మూలపు మెరుగులు । ముంచగను ॥
వేలపు ప్రియముల। వేంకటేశనిను
మూలకు పిలుచుచు । మ్రొక్కిరి నీకు ॥ కొలని॥

**తాత్పర్యము :**

కృష్ణావతారంలో గోపికా వస్త్రాపహరము చేసినప్పుడు గోపికలు కృష్ణునికి చేతులెత్తి మ్రొక్కిన విధమును అన్నమయ్య గారు వేంకటేశ్వరునకు గుర్తు చేస్తున్నారు. స్వామీ! మునుపు కొలనులో గోపికలు మొలకనవ్వులతో నీకు మ్రొక్కినారు. వారి కేశపాశము నెమిలి పురి వలెనే చాలా పొడవయినది. దట్ట మయినది. అవి వాళ్ల పిరుదులు దాటి క్రిందికి వచ్చినవి. వాటిలో మొల, పిరుదులు దాచుకొనుచు ముద్దు చేతులతో నీకు మ్రొక్కినారు. దట్టమయిన తొడలతో అభిమానమును దాచుకొనుచు ముద్దుటుంగరాల చేతులతో ముద్దుగా గునుస్తూ నీకు మ్రొక్కిరి. స్తనముల భారము మేని కాంతులను కప్పుచుండగా అతిప్రియ మయిన వేంకటేశ్వరా! నిన్ను మూలకు పిలుస్తూ మ్రొక్కిరి కదా!

## 51. రాగమాలిక = ఆదితాళం

ప॥ అమరాంగన లదె । యాడేరు ॥
ప్రమదంబున నదె । పాడేరు ॥ ॥అమరాం॥

చ॥ గరుడవాహనుడు । కనకరథముపై
ఇరవుగ వీధుల । నేగీని ॥
సురలును మునులును । సొంపుగ మోకులు
తెరలిచి తెరలిచి । తీసేరు ॥ ॥అమరాం॥

2 ఇలధరుడదిగో । ఇంద్రరథముపై
కెలయుచు దిక్కులు । గెలిచీని ॥
బలుశేషాదులు । బ్రహ్మశివాదులు ।
చెలగి సేవలటు। చేశేరు॥ ॥అమరాం॥

3 అలమేల్మంగతో । నటు శ్రీవేంకట
నిలయు డరదమున । నెడడీని ॥
నలుగడ ముక్తులు । నారదులును
పొలుపు మీరకడు । పొగడేరు ॥ ॥అమరాం॥

## తాత్పర్యము :

ఇది రథోత్సవపు వర్ణన. జరుగబోవునని. అదిగో దేవతాస్త్రీలు ఆడబోవుచున్నారు, సంతోషముతో పాడబోవుచున్నారు. గరుడవాహనుడు (వేంకటేశ్వరుడు) బంగారు రథమొక్కి బయలుదేరబోవుచున్నాడు. దేవతలు మునులును రథం యొక్క మోకులు (పగ్గాలు) తీయబోవుచున్నారు. ఇలధరుడు ( భూమిని భరించు వేంకటేశ్వరుడు) ఇంద్రరథము పైన ( ఆరథమే ఇంద్రరథము) దిగ్విజయానికి బయలుదేబోవుచున్నాడు. ఆది శేషుడు మొదలగు వారు, బ్రహ్మశివుడు మొదలగు వారు ఉత్సాహముతో సేవలు చేయబోవుచున్నారు. శ్రీ వేంకటేశ్వరుడు అలమేల్మంగతో రథమెక్క బోవుచున్నాడు. ముక్తపురుషులు, నారదాదులును నాలుగు వైపుల చేరి స్తోత్రములు చేయబోవుచున్నారు.

**విశేషము :** విప్రనారాయణుల వారు రచించిన ద్రవిడభాషలోని రంగనాథ సుప్రభాతములో ''ఏదమిత్ తండుమయక్కుంమత్త ళియాళ్ కులల్ ముడవమోది శదిశకెళుమి కీ దంగళ్ పాడినర్ కిన్నరర్ గరుడర్ గళ్ కందరువరు వరుగంగళు లెల్లాం । మాదవర్ । వానవర్ శారణ రియక్కర్'' = రంగనాథా! వీణావేణు మృదంగాది వాద్యములు తీసుకొని కిన్నరులు, గరుడులు, గంధర్వులు, దేవతలు, చారణులు, యక్షులు, మహామునులు నిన్ను పాడుచున్నారు. అని ఉన్నది. ఈ సంప్రదాయాను సారంగా అన్నమయ్యగారు ఈ రథోత్సవంలో దేవతలను, మునులను, బ్రహ్మాదులను పొందుపరచినారు.

# 52. ఆనందభైరవి = ఖండచాపు

ప॥ పసిడి అక్షంతలివె । పట్టరో వేగమెరారో ॥
దెసల పేరంటాండ్రు । దేవుని పెండ్లికిని ॥ ॥పసిడి॥

చ॥ శ్రీ వేంకటేశునకు । శ్రీ మహాలక్ష్మికి
దైవికపు పెండ్లి ముహూ । ర్తమునేడు ॥
కావించి భేరులు మ్రోసె । గరుడధ్వజంబెక్కె
దేవతలు రారో । దేవుని పెండ్లికిని ॥ ॥పసిడి॥

2 కందర్పజనకుని । కమలాదేవికి పెండ్లి ॥
పందిరి లోపల త । లంబ్రాలు నేడు
గందము విడెమిచ్చేరు । కలువడాలు గట్టిరి
అందుకమునులు రారో । హరి పెండ్లికిని ॥ ॥పసిడి॥

3 అదె శ్రీ వేంకటపతికి । అలమేలు మంగకును
మొదలి తిరునాళ్ళకు । మ్రొక్కేము నేడు ॥
ఎదుట నేగేరు వీరె । ఇచ్చేరు వరములివే
కదలి రారో పరుష । ఘనుల పెండ్లికిని ॥ ॥పసిడి॥

## తాత్పర్యము :

బంగారు అక్షతలివిగో అక్కడక్కడనున్న పేరంట్రాండ్రు తీసికొన రండు. వేంకటేశ్వరునకు అలమేలు మంగకు దైవజ్ఞులు పెట్టిన పెండ్లి ముహూర్తము ఈ రోజు. భేరులు మ్రోగుచున్నవి. రథము పై గరుఢధ్వజ మెక్కినది. దేవతల అందరును రండు. మన్మథుని తండ్రి యైన వేంకటేశ్వరునకు లక్ష్మీదేవికి పెండ్లి జరగుచున్నది. ధ్వజమునకు కలువపూదండలు కట్టిరి. చందన తాంబూలము లిచ్చెదరు. మునులారా! అందుకొనరండు. హరికి సిరికి జరిగే ఈ కల్యాణోత్సవము సంవత్సరములో మొదటిది. దీనికి మ్రొక్కుదము రండు. ఈ పెండ్లి కుమారుడు, పెండ్లి కూతురు చాలగట్టివారు. మనకు వరాలిస్తారు. కదలి రండు. అని అన్నమాచార్యులు, త్రిలోకదాసులను వేంకటేశ్వరుని కల్యాణోత్సవమునకు ఆహ్వానిస్తున్నారు. ఇచ్చట పెండ్లి పెద్ద ఆయనే అని భావింపవచ్చును.

# 53. నాదనామక్రియ = ఖండచాపు

ప॥ పాపపుణ్యముల రూ । పము దేహమిది దీని
దీపనం బణగింప । తెరు వెందు లేదు ॥ ॥పాప॥

చ॥ అతిశయంబైన దే । హాభిమానము దీర ॥
గతిగాని పుణ్యసం । గతి బొందరాదు ॥
మతిలోని దేహాభి । మానంబు విడుచుటకు ॥
రతి పరాఙ్మ్ముఖుడుగాక । రవణంబు లేదు ॥ ॥పాప॥

2) సరిలేని మమకార । జలధి దాటిన గాని ॥
అరుదైన నిజసౌఖ్య । మది వొందరాదు ॥
తిరువేంకటాచలా । ధిపుని గొలిచినగాని ॥
పరగు బ్రహ్మానంద । పరుడు తా కాడు । పాప॥

**తాత్పర్యము :**

పూర్వము చేసిన పాపపుణ్యముల రూపమే ఈనాడు ఈ దేహము. దీని విజృంభణమును తగ్గించవలెనంటె మార్గమేదీ లేదు. దీనిని దేహాభిమానమంటారు. దీనిని అణగించుటకు పుణ్యములు చేయుట ఉపాయము కాదు. దీనిని విడువలెనంటే ఐహికములయిన సుఖానుభవములకు పరాఙ్మ్ముఖుడు కావలెను. ఇంతకంటే మార్గములేదు. మమకారము = ప్రతిదానిని నాది యనుకొనుట. మానవుని చెరచుటకు దీనికి సరి అయినది లేదు. ఇట్టి మమకారమును వదలితే కాని దుర్లభమయిన నిజసౌఖ్య మబ్బదు. వేంకటేశ్వరుని కొలిస్తే కాని బ్రహ్మానందము ననుభవించు వాడు కాలేడు. వేంకటేశ్వర భజనమే బ్రహ్మానందమని సారము.

**విశేషము :** ''ఆనందం బ్రహ్మణో విద్వాన్। న బిభేతి కుతశ్చన'' = బ్రహ్మానందము నెరిగిన వాడు ఇక ఏ ఇతరములకు లొంగడు'' అనే ఉపనిషద్వాక్య ప్రకారము భగవద్భజనము అనే బ్రహ్మానందానుభవము వలన అహంకారమమకార రూపమయిన దేహాభిమానము వదలుట, క్రమంగా శాశ్వత బ్రహ్మానంద ప్రాప్తి. ఈ పదము యొక్క తాత్పర్యసార మిది.

# 54. బహుదారి = ఆది

ప॥ సకల శాంతికరము। సర్వేశ నీపై భక్తి
ప్రకటమై మాకు నబ్బె। బ్రతికించు నిదియె సర్వేశ॥ ॥సకల॥

చ॥ మనసులో పాపబుద్ధి। మరి యెంత దలచిన॥
నినుదలచి నంతనే। నీ రౌను॥
కనుగొన్న పాపములు। కడలేని వైనాను॥
ఘనుడ నిన్ను జూచితే। కడకు దొలగును॥ ॥సకల॥

2) చేతనంటి పాతకాలు। సేవగానే చేసినాను॥
ఆతల నీకు మ్రొక్కితే। అన్నియు బాయు॥
ఘాతల చెవుల విని। గా నంటిన పాపము॥
నీతితో నీ కథ వింటే। నిమిషాన బాయును॥ ॥సకల॥

3) కాయమున జేసేటి। కర్మపు పాపము లెల్ల॥
కాయపు నీ ముద్రలచే। గ్రక్కున వీడు॥
యేయెడ వేంకటేశ। యేయేపాతకమైనా॥
ఆయమైన నీ శర। ణాగతిచే నణగు॥ ॥సకల॥

## తాత్పర్యము :

శ్రీ వేంకటేశ్వరా! సర్వేశ్వరా! సమస్త దుర్విషయములను శాంతింపజేసే నీ భక్తి మాకు అబ్బినది. స్వామీ! దీనిని వృద్ధి పొందించుము. మానసికంగా ఎంత పాప చింత చేసినా నిన్ను తలచిన మాత్రమున అంతయు నీరయిపోతుంది. కంటితో చూచిన పాపాలు అంతులేని వయినా నీ మూర్తిని చూచితే కడకు తొలగిపోతాయి. చేతనయిన పాపాలు సేవా బుద్ధితో చేశాను. ఒకసారి నీకు చేయెత్తి మ్రొక్కితే అన్నియు నశించును. ఎన్నో దుర్వార్తలతో దెబ్బదిన్న చెవులకు అంటిన పాపములు నీ కథ వింటే నిమిషములో తొలగిపోతాయి. కాయముతో ( శరీరముతో) చేసిన పాపకర్మములు శరీరమందున్న నీ ముద్రలచే ( శంఖ చక్రధారణముచే) తొందరగా

వదలిపోతాయి. ఓ వేంకటేశ్వరా! ఇంకా ఏయే పాపములయినా నీ శరణాగతి సంపదచే అణగిపోతాయి.

**విశేషము :** ఇందు మానసిక వాచిక కాయిక పాపములు చెప్పబడినవి. వీటినివృత్తి భగవత్ స్మరణ, కీర్తన, వందనములచేత కలుగునని చెప్పబడినది. కాక కాయిక పాపములు కాయిక ముద్రా ధారణముచేత అణగునని ఒక విశేషము చెప్పబడినది. ఇది తప్త చక్రాంకనము. ఇది అన్నమాచార్యులకు ఘనగురువు అనే వైష్ణవాచార్యుని చేత వేంకటేశ్వర నిదేశము చేత లభించినది. ఈ సంస్కారము యొక్క ప్రాశస్త్యమును పాంచరాత్రాగమము ప్రత్యేకముగా చెప్పినది. మరియు పద్మ పురాణము చెప్పినది. జరాసంధుడు ప్రవేశించుటకు శక్యముకాని ద్వారకను శ్రీకృష్ణుడు నిర్మించెను. ఆనాడు దానియందు భుజములయందు తప్త శంఖ చక్రముద్రలు గల వారికి మాత్రమే ప్రవేశముండెడిదని భాగవత గాధ. కాఠకమనే ఒక శ్రుతిలో ''తప్తం చక్రం ద్విభుజే ధార్యం --- తేన పూతస్తరతి దుష్కృతాని'' = అగ్ని తప్తమయిన చక్రమును (ఇది శంఖమునకు ఉప లక్షణము) రెండు భుజముల యందు ధరింపవలెను. దీనిచేత పవిత్రుడై పాపములను దాటును'' అని చెప్పబడినది. అన్నమాచార్యులు పై విషయములను మనస్సున నిడుకొని మూడవ చరణమును రచించిరి. ఇంకొక విశేషము. త్రికరణములతో (మనోవాక్కాయములతో) చేసిన పాపములు వాటి పరిహార క్రియలు చెప్పబడినవి. ఇంకా ఏవయినా ఉంటే వాటికి శరణాగతి పరిహారమని చెప్పినారు. ఏవయినా మానవునకు త్రికరణములతో చేసినవి తెలుస్తాయి. అజ్ఞాత దుష్కృతములు (పాపములు) అని కొన్ని ఉంటాయి. వాటికిని ఫలితము తప్పదు. అవెట్టి వనగా? మనము నడచునప్పుడు కాలిక్రింద పడి కొన్ని సూక్ష్మ జీవులు నశించును. అది అజ్ఞాత పాపము. శరణాగతితో ఇక ఎట్టి పాపమును ఉండదు. కృష్ణ పరమాత్మ గీతలో ''మామేకం శరణం వ్రజ। అహంత్వా సర్వపాపేభ్యో। మోక్షయిష్యామి'' = నీవు నా శరణాగతి చేయుము. నేను నిన్ను సర్వపాపముల నుండి విడిపింప గలను'' అని అభయమిచ్చినాడు. దీనిని అన్నమయ్యగారు 3వ చరణము సగమున సూచించినారు.

# 55. కేదారగౌళ = ఖండచాపు

ప॥ చాలు చాలును భోగ। సమయమున మైమరపు॥
పాలు పడునట యేటి। బ్రతుకురా ఓరీ॥ ॥చాలు॥

చ॥ ఇందుముఖినిను కౌగి। లించి లోపలి జగము॥
కందునని నీ బిగువు। కౌగిలే వదలె॥
పొందైన వారితో। పొసగ కౌగిట జేర్ప
పొందుగాదట యేటి। పొందురా ఓరీ॥ ॥చాలు॥

2) నెలత నీ వాలు క। న్నులు మూసి జగమెల్ల॥
కలచు చీకట్లైన। గ్రక్కునను వదలె॥
వలచిన అంగనలు తమ। వలసిన విలాసముల॥
వలన వెరవనిదేటి। వలపురా ఓరీ॥ ॥చాలు॥

3) కొమ్మ నీయురముపై। గోరు దివియుచు నాత్మ
నిమ్మైననిను తాక। నిద్దరిని తాకె
దిమ్మరివి కోనేటి। తిమ్మ నీపై ప్రియము
కుమ్మరించని దేటి। కోర్కెరా ఓరీ॥ ॥చాలు॥

## తాత్పర్యము :

ఒక శృంగారనాయికతో వేంకటేశ్వరునకు రతి (సంభోగము) జరిగినది. నాయిక ప్రౌఢకాదు ముగ్ధ. అందుచేత రతిలో కొంత బింకము సడలినది. ఇది నచ్చని అన్నమయ్యగారు స్వామితో ఇలా విన్నవించుకొంటున్నారు. స్వామీ! సంభోగసమయములో నాయిక మైమరపునకు పాలుపడినదట. అయ్యో ఆ నాయిక దేమి బ్రతకు? ఆ నాయిక నిన్ను కౌగిలించుకొని నీ కడుపులోనున్న జగములు కందిపోతాయని కౌగిలి వదలినది. పొందైన వారిని కలసి పొందులో కౌగిట చేర్చుట తగదని (బిగిగా) వదలుట ఇదేటి పొందు? నాయిక నీ కన్నులు గట్టిగా మూసి లోకమంతా చీకట్లు క్రమ్ముకుంటాయని వెంటనే వదలి వేసినది. వలచిన నాయికలు తమకు కావలసిన శృంగార విలాసముల పట్ల భయపడితే ఇదేటి వలపురా! ఓరీ! నాయిక నీ రొమ్మున తన గోళ్ళతో నఖక్షతము వేద్దామని

తన మనస్సులో నున్న నిన్ను మాత్రమే తాకక అక్కడ నున్న లక్ష్మీదేవిని కూడ తాకినది. కోనేటి తిమ్మా! నీపై గట్టిగా శృంగార చేష్టలను కుమ్మరింపని ఆ కోర్కె ఏమి కోర్కె? అని అన్నమయ్యగారు తన అసంతృప్తిని స్వామితో విన్నవించినారు.

**విశేషము :** ఇందు ''రా'' ''ఓరీ'' అని స్వామిని నీచ సంబోధనములు చేసినారు. ఇది అన్నమయ్యగారికి స్వామి యందున్న అతి స్వాతంత్ర్యమును సూచిస్తుంది. అదీకాక ''అత్యంత భక్తియుక్తానాం। న శాస్త్రం నైవ చక్రమః'' = మెండైన భక్తిగల వారికి శాస్త్రము, క్రమము, ఉండవట. దీనిని బట్టి కూడ అన్నమయ్యగారి సంబోధనములు తప్పుకావు. ఆయన కుక్షిలో జగము లుండుట సర్వవిదితము. దానిని బట్టి కౌగిలిని సడలించినది ఆమె. సూర్యచంద్రులు ఆయన నేత్రములు. అవి మూస్తే జగము లంధకారమగునని కన్నులమూత సడలించినది. కోనేటి ''తిమ్మ'' అని సంబోధనము. తిమ్మ అనే దానిని నేడు కోతిగా భావిస్తున్నాము. అసలు వేంకటేశ్వరుడు తిరుమలకు ప్రభువు కనుక ''తిరుమలప్ప''. కాలంలో క్రమ క్రమంగా తిరుమలప్ప, తిర్మలప్ప, తిర్మప్ప, తిమ్మప్పగా మారి మారి తిమ్మప్పకు కోతిగా అర్థము రూఢమయినది. దీనికొక కారణము ఆ కొండల మీద కోతులను కూడ వేంకటేశ్వరునిగానే భావించుట. అన్నమయ్యగారు దీనిని వదలక సాభిప్రాయముగా దిమ్మరివి = తిరుగువాడవు కోనేటి తిమ్మప్ప. కోనేటి వద్ద తిరుగు తిమ్మప్పవు అనే అర్థముతో వాడినారు. అయితే అన్నమయ్యగారు దీనిని మూలార్థముతోనే ప్రయోగించిరని భావించుట యుక్తము.

## 56. శంకరాభరణం = ఖండచాపు

ప॥ తరుణి నీ యలుకకెం। తటిది ఇంతి నీ వేళ॥
కరుణించ గదర వేం। కట శైలనాథ॥ ॥తరుణి॥

చ॥ ఒకమారు సంసార। మొల్ల బొమ్మని తలచు
ఒకమారు విధిచేత। లూహించి పొగడు
ఒకమారు తనుజూచి। ఊరకే తలయూచు
నొకమారు హర్షమున। నొంది మేమరచు॥ ॥తరుణి॥

2) నిను జూచి యొకమారు। నిలువెల్ల పులకించు
తనుజూచి యొకమారు। తలపోసి నగును
కనుదెరచి నినుజూచి। కడు సిగ్గువడినిలిచి
యిన్నియును తలపోసి। యింతలో మరచు॥ ॥తరుణి॥

3) వదలయిన మొలనూలు। గదియించు నొకమారు
చెదరినకురులెల్ల। చెరుగు నొకమారు
అదనెరిగి తిరువేంక। టాధీశ పొందితివి
చదురుడవు నిను బాయ। జాలదొకమారు॥ ॥తరుణి॥

## తాత్పర్యము :

ఈ శృంగార నాయిక విరహోత్కంఠిత = నాయకుని విరహము చేత మనసు నిలుకడ లేక పలువిధముల వ్యాకుల పడునది. అన్నమయ్యగారు ఆ నాయిక యొక్క దీన స్థితిని వేంకట నాయకునకు తెలిపి కరుణించ మంటున్నారు. వేంకటేశ్వరా! ఆ తరుణి నీవు కోపగిస్తే ఎంతది? ఆమె నీ వేళ కరుణింపవయ్య. ఒకసారి ఈ సంసారము వద్దు అని తలచుతుంది. ఒకసారి విధి చేతలూహించుకొని పొగడుతుంది. ఒకసారి తననే చూచుకొని ఊరికే తలవూపుతుంది. ఒకసారి నిన్ను చూచి సిగ్గుతో నిలబడి పాతవాటిని గుర్తు తెచ్చుకొని వెంటనే మరచిపోతుంది. వదలయిన వడ్డాణమును బిగించుకొని చెదరిపోయిన కురులను ఒకసారి సవరించుకొంటుంది. ఈ విధముగా అదనెరిగి ఆమెను పొందిన చతురుడవు నీవు. నిన్నామె ఎడబాయజాలదు.

## 57. శుభాళిరాగం = ఆదితాళం

ప॥ ఆకటివేళల। అలపైన వేళలను॥
తేకువ హరినామమే। దిక్కు మరి లేదు॥ ॥ఆకటి॥

చ॥ కొరమాలి యున్నవేళ। కులము చెడిన వేళ॥
చెరవడి యొరులచే। జిక్కిన వేళల॥
ఒరపైన హరినామ। మొక్కటే గతిగాక
మరచి తప్పిననైన। మరిలేదు తెరగు॥ ॥ఆకటి॥

2) ఆపద వచ్చిన వేళ। ఆరడి బడిన వేళ॥
పాపపు వేళల। భయపడిన వేళ
ఓపినంత హరినామ। మొక్కటే గతి గాక
మాపు దాకా బొరలిన। మరిలేదు తెరగు॥ ॥ఆకటి॥

3) సంకెల బెట్టిన వేళ। చంప బిలిచిన వేళ॥
అంకిలిగా నప్పులవా। రాగిన వేళ॥
వేంకటేశునామమే। విడిపింప గతిగాక॥
మంకుబుద్ధి బొరలిన। మరిలేదు తెరగు॥ ॥ఆకటి॥

## తాత్పర్యము :

ఇందు హరినామ మహిమ చెప్పుటయే సారము. ఇందు 12 రకాల ఆపదలు పేర్కొనబడినవి. ఈ ఆపదలు తొలగవలెనంటే హరినామము కన్న వేరు గతి లేదు అని చెప్పబడినది. ఇది అనాది అయిన సిద్ధాంతము. వేద వ్యాస మహర్షి మహాభారతములో ద్రౌపదికి నిండుసభలో కలిగిన ఆపద సమయములో ''మహత్యాపది సంప్రాప్తే। స్మర్తవ్యోభగవాన్ హరిః'' = గొప్ప ఆపద వచ్చినప్పుడు హరిని స్మరింపవలెను'' అని చెప్పినాడు. అన్నమయ్యగారు చెప్పినదిదే అర్థము.

# 58. మోహన = ఆది

ప॥ అదె చూడరే మో। హన రూపం॥
పది కోట్లుగల భా। వజ రూపం॥ ॥అదె॥

చ॥ వెలయగ పదారు। వేల మగువలను
అలమిన ఘన మో। హన రూపం॥
వలచిన నంద। వ్రజము గొల్లెతల॥
కులుకు చూపులకు। గురియగు రూపం॥ ॥అదె॥

2) ఇందిరా వనిత। నెప్పుడు తన ఉర
మందు నిలిపిన మో। హనరూపం॥
కందువ భూసతి। కౌగిటి సొంపుల
విందులు మరగిన। వేడుక రూపం॥ ॥అదె॥

3) త్రిపుర సతుల బో। ధించి రమించిన॥
అపురూపపు మో। హన రూపం॥
కపురుల (శ్రీ) వేం। కట పతియై యిల
ఉపమించగ రాని। యున్నత రూపం॥ ॥అదె॥

**తాత్పర్యము :**

వేంకటేశ్వరుని రూపమును అన్నమయ్యగారు దర్శించి భక్తులని చూడమని ఆహ్వానిస్తున్నారు. అదిగో! ఆ మోహన రూపం చూడండి. రెండవ పంక్తి అర్థము. పదికోట్ల మన్మథల రూపమని. పదారువేల మంది స్త్రీల నాక్రమించుకొన్న మోహన రూపమది. వ్రేపల్లెలోని అందరిగోపికల కులుకు చూపులకు గురిఅయిన మోహనరూపము. లక్ష్మీదేవి నెప్పుడును తన రొమ్మున నిలిపిన మోహన రూపము. అంతేకాక భూదేవి కౌగిటి రుచులు మరగిన వేడుక అయిన రూపము. త్రిపుర సతులకు భోదించి వాళ్లతో రమించిన అపురూపమయిన మోహన రూపము. ఈయిల కర్పూరపు వేంకటేశ్వరుడుగా వెలసి సాటి చెప్పుటకు లేని ఉన్నతమయిన రూపము చూడండి. అని భక్తుల కాహ్వానము.

**విశేషము :** పూర్వము ముగ్గురు రాక్షసులు మూడు పురముల రూపముతో ఇష్టము వచ్చినట్లు ఆకాశమున ఎగిరి విహరించి విహరించి అమాంతముగా భూమికి దిగేవాళ్లు. అప్పుడు ఆ పురముల క్రింద పడిన ఊళ్ళు మనుష్యులు ధ్వంసమై పోయేవారు. అప్పుడు లోకుల ప్రార్థనపై శివుడు త్రిపురాసురులను సంహరించే భారము నెత్తిన వేసుకొన్నాడు. వాళ్లు అజేయులు. శివుడు ప్రత్యేకముగా యుద్ధ సామాగ్రిని కూర్చుకోవలసివచ్చినది. భూమి రథమయినది. మేరు పర్వతము విల్లైనది. విష్ణువు బాణమైనాడు. ఇన్ని కుదిరినా త్రిపురాసురులకు పెద్ద అండ ఒకటి ఉన్నది. త్రిపురాసురుల భార్యల పాతివ్రత్య భంగమైతే కాని వాళ్ళు చావరు. అప్పుడు విష్ణువు బుద్ధుడనే పేరుతో అవతారమెత్తి, త్రిపురాసురుల భార్యలను కలుసుకొని, వాళ్లకు అవైదికములయిన ధర్మముల నుపదేశించి, పాతివ్రత్య ధర్మము మీద వెగటు కలిగించి అతిలోక మోహన రూపముతో వాళ్లతో రమించినాడు. వాళ్ల ప్రాతివ్రత్య భంగమైనది. త్రిపురాసురులు చచ్చారు. అన్నమయ్య గారు మూడవ చరణములో చెప్పినది ఈ మోహన రూపము. విష్ణువు యొక్క దశావతారములలో చెప్పబడిన బుద్ధుడితడు.

# 59. సురటి = ఖండచాపు

ప॥ ప్రతిలేని పూజ దల। పంగ కోటి మణుగులై
అతివ పరవశము బ్ర। హ్మానంద మాయె॥ ॥ప్రతి॥

చ॥ మానినీ మణి మనసు। మంచి ఆసన మాయె॥
ఆనంద బాష్ప జల। మర్ఘ్యాదులాయె॥
మీనాక్షి కనుదోయి। మించు దీపములాయె॥
ఆనన సుధా రసము। లభిషేక మాయె॥

2) మగువ చిరునవ్వులే। మంచి క్రొవ్విరులాయె॥
తగుమేని తావిచం। దనమలదు టాయె॥
నిగనిగని తనుకాంతి। నీరాజనం బాయె॥
జగడంబు టలుకలుప। చారంబు లాయె॥ ॥ప్రతి॥

3) ననుపైన పొందులే। నైవేద్యతతులాయె॥
తనివోని వేడుకలు। తాంబూల మాయె॥
వనిత శ్రీవేంకటే। శ్వరుని కౌగిట జేయ॥
వినయ వివరంబు లర। విరిమ్రొక్కులాయె॥ ॥ప్రతి॥

**తాత్పర్యము :**

నాయిక వేంకటేశ్వరుని కవగూడినది. ఈ కూడుటయే సాటిలేని పూజలు. ఇట్టి పూజ చేస్తే కోటి రెట్లు అగుతుంది. అదెట్లయినదో అన్నమయ్యగారు వివరిస్తున్నారు. ఆమె పొందిన పారవశ్యమే బ్రహ్మానందము. ఆమె మనస్సే స్వామికి పీఠమయినది. ఆ ఆనందములో ఆమెకు ఆనంద భాష్పములు వచ్చినవి. (ఆనందము వలన కలిగిన కన్నీరు) ఆ నీరే అర్ఘ్యము, పాద్యము, ఆచమనీయము అయినది. నాయిక యొక్క రెండు కన్నులు మెరపు దీపములయినవి. ముఖమందలి అధర సుధారసము అభిషేక జలమయినది. నాయిక యొక్క చిరునవ్వులే పువ్వులయినవి. ఆమె శరీర పరిమళమే మంచి గంధ మయినది. నిగనిగలాడే ఆమె శరీరకాంతి కర్పూర నీరాజనమయినది. ప్రణయ కలహములే ఉపచారము లయినవి. వారికి జరిగిన పొందులే నైవేద్యము లయినవి. ఆ రతిలో కలిగిన వేడుకలే

తాంబూల మయినవి. కౌగిలింతలే మ్రొక్కులయినవి. ఈ విధముగా రతిలో నాయిక నాయకునకు సమర్పించు కొనినవన్నియు పూజలోని షోడశోపచారములయినవి. ఈ విధముగా అన్నమయ్యగారు ఒక వస్తువునందు ఇంకొక వస్తుత్వము నారోపించి ఆ పూజను ప్రతిలేని పూజగా చిత్రించారు. ఇది ఆలంకారికముగా పరిణామాలంకారము. ఆరోపింపబడిన ప్రతి వస్తువునూ, ప్రస్తుత మయిన పూజకు పూజాద్రవ్యములుగా ఉపయోగపడినవి కనుక పరిణామాలంకారము.

**విశేషము :** ఆళ్వారులలో మొదటి వారగు పోయ్‌గయాళ్వారు ఎంత చక్కని పరిణామాలంకారమును చూపిరో చూడుడు. ఆయనకు భగవత్సాక్షాత్కార మయినది. భగవంతునకు దీపమును చూపవలెను. అప్పుడిట్లు పాడిరి. ''రయ్యం తగళియాయ్ వార్‌కడల్ నెయ్యాగ। వయ్య కదిరోం విళక్కాగ'' = భూమి ప్రమిద కాగా సముద్రములు నేయికాగా, తమ భక్తి వత్తి కాగా సూర్యుడు దీపము కాగా స్వామికి ఆరతి ఇచ్చెదను'' అని అన్నారు. అన్నమయ్యగారి రచనలో ఇది తొంగి చూచుచున్నది. ఇంకొక చిన్న కిటుకు. అన్నమయ్యగారు చెప్పినది నాయిక పరముగా. ఆ భావములలో ఆత్మానుభావమున్నది.

## ౬౦. మధ్యమావతి = ఆది

ప॥ మరలి మరలి జయ। మంగళం॥
సొరిది నిచ్చలును। శుభమంగళం॥ ॥మరలి॥

చ॥ కమలారమణికి। కమలాక్షునకును॥
మమతల జయజయ। మంగళం॥
అమర జననికిని। అమర వంద్యునకు
సుముహూర్తముతో। శుభమంగళం॥ ॥మరలి॥

2) జలధి కన్యకును। జలధిశాయికిని॥
మలయుచును– శుభ। మంగళం॥
కలిమి కాంత కా। కలికి విభునికిని॥
సులువుల ఆరతి। శుభమంగళం॥ ॥మరలి॥

3) చిత్తజు తల్లికి శ్రీ వేంకట పతికి ।
మత్తిల్లిన జయ మంగళము ॥
యిత్తల నత్తల యిరువురకౌగిటి ।
జొత్తుల రతులకు శుభమంగళము ॥

## తాత్పర్యము :

ఇది మంగళారతి. కమలారమణికి = లక్ష్మీదేవికి, కమలాక్షునకును = పద్మముల వంటి నేత్రములు గల వేంకటేశ్వరునకును మళ్లీ మళ్లీ జయమంగళము, శుభమంగళము. దేవతల తల్లి అయిన లక్ష్మికిని, దేవతలకు వందనీయుడయిన వేంకటేశ్వరునకు జయమంగళము, శుభమంగళము. సముద్రుని కూతురయిన లక్ష్మికి, సముద్రమున పవ్వళించు శ్రీహరికిని, మంగళము. కలిమికాంత = సంపదల కధీశ్వరి అయిన లక్ష్మికిని, ఆమెకు నాధుడయిన వేంకటేశ్వరునకును మళ్లీ మళ్లీ జయమంగళము, శుభమంగళము. అని మంగళగీత మాలపించినారు.

**విశేషము :** ఇందు రెండవ చరణములో ''అమరజనని'' = దేవతలకు తల్లిగా లక్ష్మి చెప్పబడినది. సాధారణము ఎవరు ఏ దేవిని కొలుచుచున్నా, ఆ దేవిని ఆ భక్తులు లోకములకు జననిగా భావించి స్తుతించుట పరిపాటి. ఇక్కడ విశేషమేమి? ఉన్నది. విష్ణువు లోకములను సృష్టించిన బ్రహ్మకు తండ్రి. లక్ష్మి విష్ణువు భార్య. కనుక ఆమె తల్లి. బ్రహ్మ వద్దనుంచి అమరుల వర్గము ప్రారంభం. కనుక ఆమె ''అమరజనని''. బౌద్ధు డయిన అమరసింహుడు తన కోశములో లక్ష్మిని ''ఇందిరా లోకమాతా మా రమా మంగళ దేవతా'' అని లోకమాతగా చెప్పినాడు. ఒక చిన్న కిటుకు. ఎవరు ఎవరినైనా ఏ విధంగా నయినా భావింపవచ్చును. అది ఉపచారమగును కాని తత్త్వముకాదు.

**విశేషము :** ఈ మంగళారతిని శ్రీ నేదునూరి కృష్ణమూర్తిగారు ఇక్కడ చేర్చుట సముచితముగా నున్నది. వారి ప్రణాళిక ప్రకారం దీనితో రెండవ భాగము పూర్తి అయినది. అది ఒకటి. కాక ఈ మంగళారతికి వెనుక నున్నది షోడశోపచారముల గేయము. షోడశోపచారముల తరువాత మంగళ నీరాజనమర్పించుట సంప్రదాయము. ఇది ఇట్లు జరిగినది. అన్నమయ్యగారి క్రమము యిది కాదు. కాని కృష్ణమూర్తి గారు దీనిని ఒక క్రమము చేసిరి. అభినంద్యులు.

# మూడవ భాగము

## 61. సారమతిరాగం = ఆదితాళం

ప॥ ఇతర దేవతల । కిది గలదా
ప్రతి ఏదీ నా । ప్రభావమునకు ॥ ॥ ఇతర ॥

చ॥ రతిరాజ జనక । రవిచంద్రనయన ॥
అతిశయ శ్రీవ । త్సాంకుడవు ॥
పతగేంద్ర గమన । పద్మావతీపతి ॥
మతినిను దలచిన । మనోహరము ॥ ॥ ఇతర ॥

2. ఘన కిరీటధర । కనకాంబర! పా
వనక్షీరాంబుధి । వాసుడవు ॥
వనజ చక్రధర । వసుధా వల్లభ
నిను పేరుకొనిన । నిర్మలము ॥ ॥ ఇతర ॥

3. దేవపితామహా । త్రివిక్రమ హరి ॥
జీవాంతరాత్మక । చిన్మయుడా !
శ్రీ వేంకటేశ్వర । శ్రీకర గుణనిధి !
నీవారమనుటే । నిజసుఖము ॥ ॥ ఇతర ॥

**తాత్పర్యము :**

ఓ వేంకటేశ్వరా! ఇతర దేవతలకు నీకున్న మహిమకలదా? (లేదు) నీ ప్రభావమునకు ఎదురులేదుకదా! అని అన్నమయ్యగారు ''ప్రతి లేని ఆయన ప్రభావములను ఒక్కొక్కటిగా చెప్పుచున్నారు. నీవు మన్మధునకు తండ్రివి. సూర్యచంద్రులు నీనేత్రములు. శ్రీ వత్సమనుపేరుగల మచ్చనీయురమందున్నది. గరుత్మంతుడు నీవాహనము. పద్మావతి నీభార్య. మనస్సులో నిన్ను స్మరిస్తే మనోహరముగానుంటుంది. చక్కని కిరీటమును ధరించినవాడవు. బంగారు

వలువ ధరించినవాడవు. పవిత్రమైన పాల సముద్రములో వసించినవాడవు. శంఖ చక్ర ధారివి. భూదేవికి నాధుడవు. నిన్ను స్మరిస్తే నిర్మలము. దేవతలకు పితామహుడవు. (తాతవు) త్రివిక్రముడవు. (ముల్లోకములను వ్యాపించి కొలిచినవాడవు), పాపములను హరింపవాడవు. జీవులకు అంతరాత్మ అయినవాడవు. జ్ఞానమయుడవు. శ్రీ వేంకటేశ్వరుడవు. మంగళకరగుణములు కలవాడవు. నీ దాసులము మేమనుటే నిజమయిన సుఖము.

**విశేషము :** సౌందర్యము కోరుకొనదగినది. అట్టి సౌందర్యమునకు పరమావధి మన్మధుడు. అట్టి మన్మధునకీయన తండ్రి. సూర్యచంద్రులు నేత్రములు. వేద సూక్తములలో చాల ముఖ్యమయిన పురుష సూక్తములో నారాయణుని ''చక్షోస్సూర్యో అజాయత'' = నేత్రమునకు సూర్యుడేర్పడినాడు'' అని చెప్పబడినది. ఉపలక్షణ మర్యాద చేత చంద్రుని చెప్పినట్లే. గరుత్మంతుడు వేదాత్మా విహగేశ్వరః'' = గరుత్మంతుడు వేదములే తానయినవాడు'' అని చెప్పబడినది. అట్టి నిత్యసూరి వర్గములోని వేదాత్ముడు వాహనమగుట ఇంకెవరికున్నది? (లేదు) దేవతలలో ఎవరికిని కిరీటములేదు. ఇంద్రునకున్నదంటే అది సామాన్య ప్రభుత్వ చిహ్నము. త్రిమూర్తులలో హరికి మాత్రమే ఉన్నది. బ్రహ్మకు కేశపాశము, శివునకు జటాజూటముకదా! ఇంద్రునిది స్వర్గ మాత్ర ప్రభుత్వ కిరీటము. ఈయనది సర్వలోక ప్రభుత్వ కిరీటము. విశ్వరూప ప్రదర్శనములో ఈయనకు కిరీటములున్నవి. కనుకనే అర్జునుడు ''కిరీటినం గదినం చక్రిణంచ''= కిరీటములు గదలు చక్రములు ధరించిన నిన్ను చూచుచున్నాను'' = అంటాడు. కనుక ఈయనది ప్రతిలేని కిరీటము. ఈయనది అందరివంటి వస్త్రముకాదు. కనకాంబరము. బ్రహ్మకు వస్త్ర ప్రసక్తేలేదు. శివునిది చర్మాంబరము. కాకపోతే దిగంబరము. ఈయనది ''పావన క్షీరాంబుధివాసము'' పాలకడలిచాల పవిత్రమయినది. చాలా విశాలమయినది. లక్ష్మీదేవి, సమస్త ఇంద్రసంపదలు సూర్యచంద్రులు నక్షత్రములు దీని నుండి పుట్టినవి. అట్టి పవిత్రమైన పాలకడలి విష్ణువు యొక్క నివాసము.(స్మశానముకాదు.) శంఖచక్రధరుడు. యుద్ధము చేయువారి కందరికిని శంఖచక్రములుండును. కాని, విష్ణుని శంఖచక్రములు ''హరి యందాభరణత్వమున్ కుటిలదైత్య శ్రేణిపట్లన్ భయం। కరమౌనాయుధ

భావమున్ గలిగి భక్తవ్రాతమం దారమా । వరుసాన్నిధ్యము జేర్చుమార్గమును జూపఁదీపమై యొప్పు భాస్వరతేజస్కము శంఖచక్రయుగమున్ సద్భక్తి నర్చించెదన్'' = శంఖచక్రములు హరికి నగలగుచున్నవి. రాక్షసులపట్ల ఆయుధము లగుచున్నవి. భక్తులకు మోక్షమార్గమును చూపే దీపములగుచున్నది. అట్టి శంఖ చక్రములను భక్తితో అర్చించెదను'' అని అభియుక్తోక్తి.

కనుక ఇవి ప్రతిలేని శంఖ చక్రములు కదా! భూమికి నాథుడు. పురుష సూక్తము. ''హ్రీశ్చతే లక్ష్మీశ్చపత్న్యౌ ఉ'' = లక్ష్మియును భూమియును విష్ణువు యొక్క భార్యలు'' అని చెప్పబడినది. ''బ్రహ్మాత్మ భూస్సురజ్యేష్ఠః । పరమేష్ఠీ పితామహః'' చతుర్ముఖ బ్రహ్మపేరులలో ''పితామహ'' అను నామమున్నది. తన నాభిపద్మం నుండి బ్రహ్మను సృష్టించిన విష్ణువుకు పితామహనామము తగుననే భావముతో అన్నమయ్యగారు 3వ చరణములో'' దేవ పితామహ'' అని వాడినారు. నీవారమనునది దాస్యము. దాస్యము నిజసుఖము. ఒక మహాభక్తులంటారు. ''తవదాస్యసుఖైక సంగినాం । భవనే ష్వస్త్వపి కీటజన్మమే'' = ఓ శ్రీహరీ! నీదాస్య సుఖమును మాత్రమే కోరుకొనువారి ఇంటిలో నాకొక పురుగు జన్మనైనా ప్రసాదించుము''. అని దీనిని బట్టి దాస్య సుఖము నిజసుఖము'' అన్నారయ్య గారు.

నోట్ : అన్నమయ్యగారు ప్రతిలేని ప్రభావములుగా హరి విషయములను చెప్పుచు ''ఇతర దేవతలకిది కలదా'' అని చెప్పిన అన్నమయ్యగారి వాక్యమును సోపపత్తికముగా నిర్వహించుట నాపని కనుకను, అందరి దేవతలలో త్రిమూర్తులే గొప్పవారు కనుకను, ప్రస్తుత కథానాయకుడు హరియే కనుకను, అన్నమాచార్యుల వారు ప్రస్తావించిన హరి లక్షణముల వద్ద బ్రహ్మశివుల ప్రస్తావము నేను చేయవలసివచ్చినది. దీనిని అన్యథా భావింపవద్దు. ఎవరి ప్రభావములు వారికి ఉన్నాయి. ఒకవేళ నాపై ఎవరయినా ఆగ్రహించినా అన్నమయ్యగారిపై ఆగ్రహించరుకదా! ఆగ్రహిస్తే అంతటితోపోదు. ప్రహ్లాదుని వరకు వెళ్లాలి. యుక్తిలేనిది ప్రమాణము కానిది నేను వ్రాయను.

# ౬౨. నీలాంబరి = ఆది

ప॥ ఒకటిపై నొకటి నీ । యుపాయాలు ॥
వెకలి నీవిద్యలెల్ల । వెల్లివిరిగావా ॥ ॥ ఒకటిపై ॥

చ॥ సందడి నాచేయి ముట్టి । సరసాలాడే కొరకే
పందెమాడవచ్చేవు । పలుమారును ॥
మందలించి నాచేత । మాటలాడించవలసి
అందపు కతలడిగే । వది నేనెఱుగనా ॥ ఒకటిపై ॥

2) ఏరా నా కుచగిరు । యిటు ముట్టేయందుకుగా
హారములు చిక్కుదీసే । వదిమేలురా ॥
గోరికొన తాకించే । కొరకుగా చెక్కుముట్టి
వీరీతి వేడుకొనే । విన్నియు దెలిసెరా ॥ ॥ ఒకటిపై ॥

3) ఈకడ నన్నుగూడే । ఇందుకుగా నింతసేసి
ఏకత మాడేనంటా । నెనసితివి ॥
పైకొని శ్రీవేంకటేశ । బడివాయకుండా న
న్నాకు ముడి చిమ్మనేవు । అవురా నీవు ॥ ॥ ఒకటిపై ॥

**తాత్పర్యము :**

వేంకటేశ్వరుడు ఒక నాయికను కలుసుకొని కొన్ని పనులు చేయుచున్నాడు. ఆ పనులు చేయుటలో అతని అంతర్యమువేరు. అది తెలిసిన నాయిక అనుచున్నది. ఓ వేంకటేశ్వరా! నీ ఉపాయములు నాకు తెలిసినవిలే. ఒకదానిపైననింకొటి చూపుచున్నావు. నాతో పలుసార్లు పంతమాడుటకు వచ్చుచున్నావు. ఈ రూపములో నా చెయ్యి ముట్టేటందుకే కదా! అందమయిన కథలడుగుచున్నావు. ఈవంకతో నాతో మాటలాడించుటయేకదా నీకు కావలసినది. నేనెఱుగనా? ఓనాయకా! నామెడలోని హారముల చిక్కుతీస్తున్నావు. ఈ రూపముగా నాచనులు ముట్టుటకే కదా! నా బుగ్గమీద చేయివేసి నీవు బ్రతిమిలాడుట నా బుగ్గమీద

నీగోరుగాటు వేయుటకేకదా! ఈ రీతిగా ఏకాంతస్థలంలో ఈ పనులు చేయుట నన్ను కవగూడుటకే కదా! పైకొని నన్నువదలకుండుటకే కదా! నన్ను తమలపాకులు ముడిచి ఇమ్మనుట. అవురా! తెలిసినవి నీ వెకలిచేష్టలు అని నాయిక వేంకటేశ్వరుని వ్యాజముగా మందలించినది.

**విశేషము :** శృంగార చేష్టలలో ఒకటి చేసినచో దాని అంతర్యము వేరొకటిగా నుండును. శకుంతల దుష్యంతుడు ఎదురుగా నున్నప్పుడు చూపును మరల్చుకొన్నది. నవ్వినది. ఆ పరిస్థితిని కాళిదాసు వర్ణించినాడు. దుష్యంతుని భావముగా. ''అభిముఖేమయి సంహృత మీక్షితం । హసిత మన్యనిమిత్త కృతోదయం.... నవివృతో మదనోనచ సంవృతః'' = నేను అభిముఖముగా నున్నప్పుడు చూపును మరల్చుకొన్నది. (ఇది ఒక మన్మథ దశాసూచకము) నన్నుచూచి నవ్వినది. కాని, ఆ నవ్వు వేరే మరెందుకో నవ్వినట్లు నటించినది. ఇంతకు శకుంతలకు నాపై వలపు పుట్టినదో లేదో తెలియలేదు'' అని దుష్యంతుడు తర్కించును. అట్లే ఈగేయమందు నాయకుడు చేసిన చేత ఒకటి. అంతర్యము వేరొకటి.

## 63. వలజిరాగం = ఆదితాళం

ప॥ ఇంతి ఏమీ । యెరుగదు గానీ ॥
చెంతల నీగతి । చెప్పరే చెలులు ॥

చ॥ చిత్తజునమ్ములు । శిరమున ముడువగ
కెత్తు కెట్లు దా। కెనోగానీ ॥
గుత్తపు చెక్కుల । కుంకుమ చెమటల
జొత్తులు గారీ । చూడరె చెలులు ॥ ॥ ఇంతి ॥

2) చలువమేనిపై । సరుల హారములు
చెలగి నాని మొల । చెనోగానీ ॥
పులకల మొలకల । పొదలినపైరులు ॥
వెలసే నిదివో భా।వించరె చెలులు ॥ ॥ ఇంతి ॥

3) ఘనుడగు శ్రీవేంకటపతి గూడగ ॥
చెనకి గురుతుసే । సెనోగానీ ॥
వెనక ముందరల । వింతలు బొడమెను ॥
కనుగొనరేయిది । గ్రక్కున చెలులు ॥ ॥ ఇంతి ॥

**తాత్పర్యము :**

నాయిక యందు మన్మథావస్థ లక్షణములన్నియు కనపడుచున్నవి. అన్నమయ్యగారు తానొక నాయికయై ఆ నాయిక యొక్క మన్మథ తాపలక్షణములను చూపుచు ఇవేమో చెప్పరే చెలులారా! అని అడుగుచున్నారు. చెలులారా! ఆ నాయిక ఏమియు నెరుగదు. మీరు చెప్పండి. చిత్తజానమ్ములు = మన్మథుని భాణములు. అనగా పుష్పములు. వాటిని శిరస్సున ధరించినది. అవి బాణములు కనుక అవి బాగా లోపలికి దిగి నెత్తురు కారుచున్నదా? (నెత్తురు కాదది కుంకుమ చెమటచెక్కిళ్ళ మీదుగా కారుచున్నది) చల్లని మేనిపై అవి ఏమిటి? పుష్పబాణములు (పూలు) నాని ఆరూపములో మొలచినవా? పులకలు అనే మొలకలతో మొలచిన పైరులు (దట్టమైన పులకలు) ఎట్లున్నవో చూడుడు. వెనకముందరల ఈవింతలన్నియు ఎట్ల పొడచూపినవో చూడుడు. ఇది అంతయు నాయకుడైన వేంకటేశ్వరుడు ఈమెను కవకూడుటకు తగిన సమయము అని గుర్తు చేయుచున్నట్లున్నవి. ఈపిచ్చి పిల్ల ఇవేమీ ఎరుగదు.

## 64. ఖరహర్ప్రియ = ఆదితళం (త్రిశ్రగతి)

ప॥ పాలతి జవ్వనమున । పూవకపూచె
ఎలమి నిందుకు మనమేమి సేసేదే ॥ ॥ పాలతి ॥

చ॥ సతిచింతాలతలచే । సంపెంగ పూలుపూచె ॥
మతి విరహపుమేన । మల్లెలు పూచె ॥
అతనుని తలపోతను । అడవి జాజులుపూచె ॥
హితవు తెలియదికను । ఏమి సేసేదే ॥ ॥ పాలతి ॥

2) తొయ్యలి చెమటనీట । దొంతి తామరలు పూచె ॥
కొయ్యచూపు కోపముల । కుంకుమ పూచె ॥
కయ్యపు వలపుల చీకటి మాకులు పూచె ॥
ఇయ్యెడ చెలిభావ । మేమిసేసేదే ॥ ॥ పొలతి ॥

3) మగువ రతులలోన । మంకెన పూలు పూచె ॥
మొగకొనగోళ్ళనే । మొగలిపూచె ॥
పొగరు శ్రీ వేంకటేశు । పొందుల కప్రముపూచె ॥
ఇగురు బోండ్లము ఇంక । నేమిసేసేదే ॥

## తాత్పర్యము :

నాయిక యౌవనముచే పువ్వకపూచినది. ఇక్కడ రెండర్ధములు. పూలు పూచుట అని, పుచ్చుట అని కూడా అర్థము. ఇందు నాయిక యౌవన ప్రారంభము ఆమె మేనిపై మొదట పూచిన పువ్వు. వేంకటేశ్వరునితో కలిగిన రతులలో ఆయన శరీరముపైని కర్పూరమంతా నాయిక శరీరమున పూచినది. ఇది చివరి పూత. (లేపనము, పూయుట) ఈ మధ్య చాలా పూతలు పూచినవి. ఆమెకు యౌవనము ప్రారంభముకాగానే వలపు చింతలు ప్రారంభము. అదే చింతాలత. ఆ లతకు సంపెంగ పూలు పూలుపూచినవి. (నాయకుని తలచుకొనుట, అతనితో జరుగబోవు పొందుల నూహించుకొనుట, ఇవి చాలా మధురముగానుండును. కనుక ఇవి సంపెగపూలు.) ఇప్పటికీ నాయకుడు దరి జేరలేదు. విరహమయినది. ఈ విరహతాపముచే మేనువేడెక్కినది. అందుచే తాపోపశాంతికి మల్లెలు మేనదాల్చినది. అదియే ''మల్లెలు పూచుట''. లేక విరహమందును మన్మధుడు బాణములు విడచుటమానడు. మన్మధుని బాణములలో ''అరవింద మశోకంచ। చూతంచ నవమల్లికా । నీలోత్పలంచ పంచైతే । పంచ బాణస్య సాయకాః'' = పద్మము, అశోక పుష్పము, మామిడి పువ్వు, మల్లెపువ్వు, నల్లకలువ ఈ ఐదును మన్మధుని ఐదు బాణములు'' అని చెప్పిన దాని ప్రకారం మల్లెపూవు మన్మధుని బాణము. నాయికమేన మన్మధుని ఈ బాణములునాటినవి. ఇట్లు కూడా

''మల్లెలు పూచుట'' అని చెప్పవచ్చును. మన్మథునకు సంబంధించిన తలపులు (కామ భావనములు) అడవి జాజాలుపూచుట. మన్మథావస్థలుపది. ''దృఙ్మనస్సంగ సంకల్పజాగరాః కృశతారతిః। హీత్యాగోన్మాద మూర్చాంతాః ఇత్యనంగదశాదశః'' = 1. నాయికా నాయకుల చూపులు కలియుట, 2 మనస్సులు కలియుట, 3 కలయికకు సంకల్పించుట, 4 అది జరుగకపోతే నిదురలేమి 5. కృశించుట, 6 ఇతర విషయములయందు దేని యందును ఇష్టము లేకపోవుట 7. సిగ్గువదలుట, 8 ఉన్మాదము, 9 మూర్ఛ, 10 రతి, అదికాకపోతే మరణము. అని మన్మథావస్థలు పది. ఈ అవస్థనునభవించుటే'' అతనుని తలపోత. ఇదియే అడవి జాజాలు పూచుట. రతి జరుగనిలోపుగా అనుభవించిన తొమ్మిది అవస్థలు ఎక్కువయి రతిజరుగకపోతే అవి అడవిజాజాల వలె వ్యర్థమే. కనుక ''అడవి జాజాలుపూచుట'' గా కవి వర్ణించెను. పైన చెప్పిన వాటి శ్రమ చేత చెమట అధికముగా పట్టును. అది జలము. జలమధికముగా నున్నచోట తామరలు పూచుట సహజము. తామరకు ''జలము'' = నీట బుట్టునది అని పేరు. తామర ఉత్పత్తి కారణమయిన జల మున్నది కనుక తామరలు పూచుటను కవి అనుమానించినాడు. తర్క శాస్త్రమున అనుమాన ప్రమాణమనునొక ప్రమాణమున్నది. ఎట్లనగా పొగమాత్రము కనపడుచున్నది. కనుక దాని ఉత్పత్తికి కారణమయిన నిప్పు ఉన్నదని ఊహించుట. ప్రస్తుతము దీనికి వత్యస్తముగా నాయిక మేనిపై తామరలు పూచుట నూహించుట. నాయకుని విరహమువలన నాయికకు కోపమధికమై కనుకొనలను కుంకుమ పూలుపూచినవి. (ఎర్ర వారినవి) తుదకు నాయకుడు వచ్చినాడు. ఆలస్యమగుటచే ప్రణయకలహమయినది. దానివలన చీకటి చెట్లు పూచినవి. ''తమాలశ్యామలా కృతిః'' కృష్ణోత్తర శతనామములలో కృష్ణుడు చీకటి చెట్టుతో ఉపమింపబడినాడు. అతడున్న చోట చీకటి చెట్లే. అవి పూచినవి.

రతికి తలపడిరి కనుక చీకటి క్రమ్మినదని భావము కూడ. మంకుతనముతో రతులు సాగినవి. అదియే మంకెనపూలు పూచుట. రతులలో నఖక్షతములు (గోరుగాట్లు) నాయకుడు నాయిక చనులపై పెట్టినవి జరిగినవి. ఇదే మొగలిపూత. కర్పూర పూత కలిగిన వేంకటేశ్వరుని పొగరు రతులచే

(దృఢబంధములచే) నాయిక ఒడలంతయు కర్పూరపు పూత అయినది. అని కవి తానొక నాయిక అయి తోడి నాయికలకు చెప్పినాడు. ఇందు నాయికా నాయకుల దృక్సంగము మొదలుకొని దృఢబంధపు రతులవరకు ఒకపూల పూతగా వర్ణింపబడినది. ఈ వర్ణన మిదివరలో నా అనుభవములో లేదు. ఇది ఆచార్యుని స్వోపజ్ఞము.

## 65. నాటకురంజిరాగము = ఆదితాళము

ప॥ మందులు మాకులు । మరియేలా
అందులనే గుణ । మయ్యీని ॥

చ॥ చుంగుల నీ తెలి । చూపులు రమణుని
కంగజబాణము । లై తాకె
రంగగు వీడెపు । రసముల కారము
లెంగి లనక పతి । కియ్యగ రాదా ॥ ॥మందులు॥

2) వెడ నీ నవ్వుల । వెన్నెల విభునికి
వడి గల యెండై । వడదాకె ॥
అడరగ నతిరస । మమృత రసాయన
మొడలికిత వతని । కొసగగ రాదా ॥ ॥మందులు॥

3) చెలి నీ కుచములు । శ్రీవేంకటపతి
కలయిక రుచులై । కళదాకె ॥
కులికేటి గోళ్ల । కొన యెచ్చెరికల
తెలియగ మఱపులు । తెలుపగరాదా ॥ ॥మందులు॥

**తాత్పర్యము :**

శంగారనాయిక వేంకటేశ్వరుని వలచినది. కాని ఆ నాయకుడు వశమగుటలేదు. అప్పుడు నాయిక మందులో మాకులో పెట్టి నాయకుని

వశపరచుకొందామనుకొన్నది. అప్పుడు అన్నమయ్యగారు నాయిక తాను చెలి ''మందులు మాకులు అక్కరలేదు. నీవు ఆయనను అందుకొందువు కదా! ఆ అంతులలోనే (స్వీకరించుటలలో) గుణమవుతుంది. నీ తెల్లని చూపులే రమణునికి మన్మథ బాణములై తాకినవి. ఇక వశమగును. నీవు సేవించిన తాంబుల రసము నిమ్ము. ఎంగిలి అని భావించక ఇమ్ము. నీ నవ్వుల వెన్నెలయే రమణునికి వేగముకల ఎండ అయి అతనికి వడ తగిలినది. (అంటే వలకాక అతనిలో ప్రవేశించినదని) అదీకాక నీ అధరరసము (క్రింది పెదవి రసము) అనే అమృతరసాయన అతని ఒడలికి హితమయినది. దాని నీయరాదా'' అని కవి సూచన. అనగా రమణుని వద్దకు నాయిక తనంత తానేగి ఈ రసాయనములన్ని అందించుమని సూచన.

నోట్ : రెండవ చరణము ''అడర నధరరస । మమృతరసాయన'' మని యుండవలెనెమో? ఇట్లుంటే అర్థము సులభముగా ప్రకృతానుసారముగా నుండును.

## 66. బేగడరాగం = ఆదితాళం

ప॥ మనసిజ సముద్ర । మధనమిదే ॥
కనుగొను మింతట । కాంతుడ నీవు ॥ మనసిజ॥

చ॥ సతి చింతామతి । జలనిధి తరువగ ॥
అతిగరళపు విర । హము వొడమే ॥
తతి నా పిమ్మట । తమకపు కోర్కుల
లతల కల్పకపు । లాకలు వొడమె ॥ మనసిజ॥

2) పొలతి కూటములు । పొంగులు పొంగగ
పులకల తారలు । పొడమె నవి
ఫలమై సాత్త్వక । భావపు చంద్రుడు
నిలువున బొడమగ । నేరుపు లలరె ॥ మనసిజ॥

3) సుదతి తానె నీ । చొక్కపు కౌగిట
నదుమున నిందిర । య్యై పొడమె ॥
కదిసిన శ్రీ వేం । కట పతి నీదెస
అధరామృతమ । య్యతివకు పొడమె ॥ మనసిజ॥

## తాత్పర్యము :

నాయికకు వేంకటేశ్వరునకు రతి ప్రారంభమయినది. క్రాంతదర్శి అయిన కవి దానిని మన్మథ సముద్ర మధనముగా రూపకము చేసి తన వేంకటేశ్వరునకు వినిపించుచున్నాడు. మొట్టమొదట నీ కాంతకు కలిగిన వలపుల తలపుల సముద్రము నామె మధించగా నీతోడి విరహమనెడి విషము పుట్టినది. తరువాత ఆమె తమకముతో కోర్కెలనెడి లతలతో కూడిన కల్పవృక్షము పుట్టినది. ఆపైన ఆ సముద్రమధనమున భాగముగా రతి ప్రారంభమై ఆ ఫలితముగా నాయికా నాయకులకు పులకలు పొడమినవి. అది సముద్రము నుండి నక్షత్రములు పుట్టుట. దానితో మనస్సునందు సాత్విక భావములనే కిరణములతో చంద్రుడు పుట్టినాడు. సముద్రము నుండి లక్ష్మి పుట్టినట్లు నీ కౌగిటిలో నాయిక ఈ విధముగా లక్ష్మీదేవి పుట్టినది. అపుడు నీవు అధరోష్ఠము నామె కందించితివి. అది ఆమెకు అమృతము లభించుట ఈ విధముగా దృష్టాంతాలంకారమును అన్నమయ్యగారు రమ్యముగా సాధించినారు.

**విశేషము :** దృష్టాంతాలంకార మనగా ఒక వస్తువును ఇంకొక దానిలో పోల్చినప్పుడు దానిలో నున్న ప్రతి విషయము దీనిలో కనిపించుట. సాగర మధనము- మన్మధమధనము. విషముపుట్టుట- విరహము పుట్టుట. నక్షత్రములు పుట్టుట- పులకలు పుట్టుట. సాత్వికభావోదయము - చంద్రోదయము. లక్ష్మీదేవి పుట్టుట- నాయిక కౌగిట చిక్కుట. వేంకటేశ్వరుని అధర రసపానము- అమృతరసపానము. ఇట్లు ఈ గేయమందు దృష్టాంతాలంకార మమరినది.

# 67. బేహాగ్ రాగం = ఆదితాళం

ప॥ తెరవకు బతివై తివి గాక
గటిసించిన గడు । ఘనమా నీవు ॥ తెరవకు॥

చ॥ చూచిన వెల్లా । సొంపు ముత్యములు
పూచిన పువ్వులె । పున్నములు
లాచిన వెల్లా । లాగవేగములు
ఈ చెలి సొబగుల । కెదురా నీవు ॥ తెరవకు॥

2) పలికిన వెల్లా । పసని వజ్రములు ॥
నిలువున దురుమే । నీలములు ॥
కలిగిన పులకలె । కనకపు మొలకలు ॥
జలజలోచనకు । సరియా నీవు ॥ తెరవకు॥

3) కౌగిటి వెల్లా । కంతుని రచనలు
మూగిన రతి నిను । ముంచెనిదే ॥
చేగల చిగురుల । శ్రీ వేంకట పతి ॥
వీగే రమణికి । వింతా నీవు ॥ తెరవకు॥

**తాత్పర్యము :**

నాయకుడు నాయికను పెండ్లాడినాడు. (వేంకటేశ్వరుడు) ఆమెను దరిజేరక ఉపేక్షించుచున్నాడు. ఆమె లక్షణము లన్నియు గ్రహింపదగినవి కావు. మంచివి. అందుచేత కవి వేంకటేశ్వరునకు బోధించుచున్నాడు. వేంకటేశ్వరా నాయికకు భర్తవైనావు. ఆమె నుపేక్షంచుట ఘనకార్యము కాదు. ఆమె చూచినవన్నీ సొంపైన ముత్యములు. (చూపులు ముత్యములని) పూచిన వన్నీనవ్వులు (పున్నములు) ప్రతిపనిని లాఘవముగా వేగముగా చెయ్యగలదు. ఆమె పలికిన పలుకులు వజ్రములు. (శ్రేష్ఠమయినవి, వాడి అయినవి) ఆమె కేశపాశములు ఇంద్రనీలమణులు. ఆమెకు కలిగిన పులకలు బంగారు మొలకలు. ఆమెకు నీవు సాటియా? కావు. ఆమె కౌగిలియిస్తే ఆ కౌగిళ్లు మన్మధుడు రచించిన ప్రబంధము.

ఆమె రతులు నిన్ను చుట్టు ముాగి నిన్ను ముంచెత్తగలవు. నీవు చేగల చిగురుల వాడవు. (ప్రౌఢుడవు కావని) నాయిక ప్రౌఢ. ఆమెకు తాను ప్రౌఢ నాయికనని చాల గర్వము. ఆమెకు నీ వంత ఆశ్చర్యకరుడవు కావు. అని అన్నమయ్య గారు స్వీయనాయికను ఉపేక్షింపకుమని దూతీ కృత్యము చేసినారు.

**విశేషము :** ఈ పదములు శృంగార పదములు. ఇవి నాయికా నాయకుల మధ్యనడుస్తాయి. ఇందలి రసము శృంగారము. దీనికి ఆలంబము నాయిక, నాయకుడు. ఈ రసమునకు స్థాయీభావము సంభోగము. సంభోగము స్త్రీ పురుషుల మధ్యనడుస్తుంది. పదకర్త పురుషభక్తుడుగా నుంటున్నాడు. కాని ఇతడు స్త్రీత్వమును తనయం దారోపించుకొని తాను నాయిక అయి పురుషుడగు భగవంతునితో శృంగారరసము ననుభవించుచున్నాడు. ఇది రాధా కృష్ణుల మధ్యలో, గోదారంగనాథుల మధ్యలో సహజముగా నడచినది. కాని పురుషభక్తుల భక్తి శృంగారమై ఆయిద్దరి మధ్య వివిధములయిన సంయోగ వియెగ వార్తలతో కథలు నడుస్తున్నాయి. ఈ భక్తుడు ఒకసారి నాయిక అగుచున్నాడు, ఒకసారి దూతిక అగుచున్నాడు. అన్నమాచార్యులది ఇదే స్థితి. వీరికి మార్గదర్శి నమ్మాళ్వారు. వీరు తమ తిరువాయ్ మొళిలో ఒక సారి నాయిక అయి స్వామికి సందేశము నందిస్తారు. నమ్మాళ్వారును మనస్సునందుంచుకొని వేదాంతదేశికులు తమ ''గోదాస్తుతి'' లో గోదాదేవితో ఇట్లంటారు. ''భోక్తుంతవ ప్రియతమం భవతీవగోదే। భక్తిం నిజాం ప్రణయభావనయా గృణంతః। ఉచ్చావచై ర్విరహసంగమజై రుదంతైః శృంగారయంతి హృదయం గురువ స్త్వదీయాః'' ఓగోదాదేవీ! నీ కన్న పూర్వులై నీకు గురువులయిన ఆళ్వారులు నీ ప్రియుడయిన రంగనాథుని నీవలెనే అనుభవింపగోరి, తమ భక్తిని ప్రణయ భావనతో భావించినవారై, వివిధములయిన విరహములను, సంయోగములకు కల్పించుకొని ఆ వార్తలతో తమ హృదయములను శృంగార రసమయములుగా చేసుకొనుచున్నారు'' అని వేదాంత దేశికు లంటారు. సరిగా అన్నమయ్యగారి స్థితి ఇదే. ఈ శ్లోకమందు వేదాంత దేశికుల చమత్కారమేమంటే గోదాదేవి కంటే పూర్వులయిన ఆళ్వార్లు తమకంటే తరువాత పుట్టిన గోదాదేవి వలెనే భగవంతుని అనుభవింపగోరిరని చెప్పుట.

# 68. జంఝూటి రాగము = ఖండచాపుతాళము

ప॥ వెన్న పట్టుక నేయి । వెదకనేలా మరియు
నెన్ని వలసినను దమ । ఎదుటివే కావా ॥

చ॥ తలపునను విష్ణుచిం । తన నిమిష మాత్రంబు ॥
కలుగుటే కలుగవలె । గాక ॥
వలనైన భోగములు । వైభవంబులు మరియు ॥
కలవెల్ల తమ యెదుట । కలిగినవె కావా ॥ వెన్న॥

2) పదిలముగ హరినామ । పరమమంత్రము నోరు
కదియుచే కలుగవలె । గాక
తుదలేని సంపదలు । తొలగని మదంబులును
కదల కెప్పుడు తమకు । గలిగినవె కావా ॥ వెన్న॥

3) ఇంచుకైనను వేంక । టేశు గిరి శిఖరంబు
కాంచుటే కలుగవలె । గాక ॥
అంచితం బైనని । త్యానంద పదవులును
మించి తమ ఎదుట ప్రభ । వించినవి కావా ॥ వెన్న॥

## తాత్పర్యము :

తమవద్ద నున్న స్వాధీనములో నున్న ఇంద్రియాదులను మంచి దారిలో ఉపయోగించుకొనక ఏవో అడియాసలకు లోనై ఏవేవో కోరుకొనే మందమతులకు అన్నమయ్యగారు పరమార్థోపదేశం చేస్తున్నారు. చేతిలో వెన్న ఉండగా నెయ్యికోసం వెదకెదరేల? కావలసిన దంతయు ఎదుటనే వద్దనే యున్నది. మనస్సులో విష్ణు స్మరణ మొక్క నిమిషము చేసినను చాలు అది సర్వార్థ సిద్ధి కలుగ జేస్తుంది. ఇది ఇట్టుండ దేనికోసమో వెదకెదరే? హరినామస్మరణము అన్నిభోగములను వైభవములను ఎదుట నుంచుతుంది. హరి మంత్రమును నోటి కదలికచే చెయ్యవచ్చును. ఇది చేయక కలిగిఉన్న సంపదను దాని వలన వదలని మదమునే కోరుకొందురేల? వేంకటేశ్వరుని పర్వత శిఖర దర్శనము కోరుకొనక (కావలసినది) పదవులను తమ ఎదుట పుట్టినశించు వాటిని కోరు కొందురేల ? అని ఉపదేశము.

**విశేషము :** వేదవ్యాసమహర్షి వాక్యము ''నారాయణేతి శబ్దోస్తి । వాగస్తి వశవర్తినీ । తథాపి నరకే ఘోరే । పతంతీతి కి మద్భుతం'' = సకలపాపహరము శ్రేయస్కరము అయిన నారాయణ నామమున్నది. మనము చెప్పినట్లు వినెడి నోరున్నది. అయినను నరులు అది వదలి ఘోర నరకమందు బడుట మహాశ్చర్యము''. అని యున్నది కులశేఖరులు ''ప్రోచ్యశ్రీమన్నామనారాయణా ఖ్యం । కేన ప్రాపు ర్వాంఛితం పాపినోపి । హా నః పూర్వం వాక్ప్రవృత్తాన తస్మిన్ । తేన ప్రాప్తం గర్భవాసాది దుఃఖం '' = సంపత్కరముయిన నారాయణనామమును పలికి పాపాత్ములు కూడ వాంఛితమును పొందుదురు. అయ్యోమన నోరు ఇంతకు ముందు దాని యందు ప్రవర్తించలేదు. దాని వలన మనకు గర్భవాసాది దుఃఖములు కలిగినవి'' అని చెప్పిరి అన్నమయ్యగారి ఈ కృతి పై అర్థముల సారమే. కులశేఖరులే ఇంకొకమాట కూడ అనిరి. ''నామాని నారాయణగో చరణాణి । వక్తుం సమర్థోపి నవక్తి కశ్చిత్ । అహో జనానం వ్యసనాభిముఖ్యం'' = నారాయణ నామములను పలుకుటకు సమర్థుడయినను ఒక్కడును పలుకకున్నాడు. ఆహా ఆపదల కే అభిముఖుడగు చున్నాడు. ఇదే ''వెన్న చేతిలో బెట్టుకొని నేతికై వెదకుట''.

## 69. రీతిగౌళరాగం = ఖండచాపుతాళం

ప॥ మనసిజగురుడితడో । మరియు గలడో – వేద
వినుతు డీతడు గాక । వేరొకడు గలడో ॥ ॥మనసిజ॥

చ॥ అందరికి నితడె పో । అంతరాత్ముడనుచు ॥
నందురితడోమరియు । నవల నొకడో ॥
నందకధరుడు జగ । న్నాథు డచ్యుతుడు గో
విందు డీతడు గాక । వేరొకడు గలడో ॥ మనసిజ॥

2) తనర నిందరికి చై । తన్యమొసగిన యాత
డొనర నితడో మరియు । నొకడు గలడో ॥
దినకర శత తేజు । డును దేవ దేవుడు–త
ద్వినుతు డీతడు గాక । వేరొకడు గలడో ॥ మనసిజ॥

3) పంకజ భవాదులకు। పరదైవమీతడని
అంకింతు రితడో। అధికు డొకడో
శాంకరీ స్తోత్రములు। సతతమును గైకొనెడి
వేంకట విభుడొకాక। వేరొకడు గలడో ॥ మనసిజ॥

**తాత్పర్యము :**

నారాయణుని లక్షణములన్నియు పేర్కొనుచు సాక్షాన్నారాయణుడీ వేంకటేశ్వరుడే అను విషయమున అన్నమయ్యగారు భంగ్యంతరముగా చెప్పుచున్నారు. మన్మధుని తండ్రి ఇతడు కాక మరొకడు కలడా? వేదములచే వినుతింపబడిన వాడితడు కాక వేరొక్కడు గలడా? అందరికిని అంతరాత్మ అని పండితులు చెప్పునత డితడా? ఇంకొకడా? నందకమును ఖడ్గమును ధరించినవాడు, జగన్నాధుడు, అచ్యుతుడు, గోవిందుడు, ఇతడు కాక వేరొకడు కలడా? లోకము నందందరికి చైతన్య మొసగు వాడు ఇతడు కాక మరొకడు కలడా? నూరు సూర్యుల తేజస్సు కలిగి, సూర్యునిచే పొగడబడు వాడై, దేవదేవుడయినవాడితడు కాక మరొకడు కలడా? చతుర్ముఖబ్రహ్మకు పరదైవ మీతడని అందురు. అతడితడా? వేరొకడు కలడా? పార్వతీదేవి స్తోత్రమును ఎప్పుడు స్వీకరించు వేంకటేశ్వరుడితడు కాక మరొకడు కలడా? అని అన్నియు ప్రశ్నరూపములో నున్నవి. అన్నిటికిని ''లేడు'' అని ఒకటే ప్రత్యుత్తరము.

**విశేషము** : ''అంతః ప్రవిష్ట శ్శాస్తా జనానాం సర్వాత్మా'' = జనుల లోపల ప్రవేశించి శాసించు సర్వాత్మ అని వేదవాక్యము. అట్లు ప్రవేశించి చైతన్య మొసగు వాడని కూడ. ''దివి సూర్య సహస్రస్య। భవే ద్యుగప దుత్థితా ॥ యదిభా స్సదృశీ సాస్యాత్। భాస స్తస్యమహాత్మనః'' = ఆకాశమందు వేయిమంది సూర్యులొక్కపరి ఉదయిస్తే ఎంతకాంతి ఉండునో అంత కాంతి పరమాత్మది. అని గీతావాక్యము. ''నారాయణా ద్బ్రహ్మ జాయతే, నారాయణా ద్రుద్రో జాయతే'' = నారాయణుని నుండి బ్రహ్మజనించెను, రుద్రుడు జనించెను'' అనే వేదవాక్యము వలన బ్రహ్మాదులకు ఇతడు పరదైవము. శంకరుడు ''శ్రీరామ రామ రామేతి'' అని రామతారకమంత్రమును పార్వతి కుప దేశించెను. కనుక పార్వతి స్తోత్రములు

గొనుట. ఈ మహిమలన్నియు కలిగిన ఆతడే ఇతడని నిర్ణయము. ఇదే పరతత్త్వ నిర్ణయము. సంశయములేని నిర్ణయము.

## 70. కమాస్ రాగం = రూపకతాళం

ప॥ మొక్కేటి గోపాంగనల । మోహనా కారము ॥
చిక్కని నవ్వులు నవ్వీ । శ్రీ వేంకటేశ్వరుడు ॥ ।మొక్కేటి॥

చ॥ సత్యభామ ఉరముపై । చల్లని కస్తూరి పూత ॥
తత్తరించె - రుక్మిణి చే । తామర పూవు ॥
హత్తిన భూకాంతకు । యంగపు పయ్యెద కొంగు ॥
చిత్తగించరమ్మ వీడె । శ్రీ వేంకటేశ్వరుడు ॥ ।మొక్కేటి॥

2 పంతపు పదారువేల । బంగారు ఉంగరము ॥
బంతినే కుట్టబడిన । పసిడి తాళి ॥
వింతగా రాధాదేవి । వేసిన కలువదండ ॥
చెంతలను వీడె అమ్మ । శ్రీ వేంకటేశ్వరుడు॥ ।మొక్కేటి॥

3. ఆసల తులసీదేవి। అరచేతిలో అద్దము
భాసురపు నీళాదేవి । పట్టుగొమ్మ ॥
శ్రీ సతి ఎక్కిన యట్టి । సింహాసనపు గద్దె ॥
సేస పెట్టించుకొన్నాడు । శ్రీ వేంకటేశ్వరుడు ॥ ।మొక్కేటి॥

**తాత్పర్యము :**

ఓ భక్త జనులారా! ఇక్కడ శ్రీ వేంకటేశ్వరుడు ఎవరను కొన్నారు. మ్రొక్కిన గోపికల మోహనాకారము. చిక్కని నవ్వులు నవ్వే గోపాల బాలుడే. సత్యభామ రొమ్మున పూసుకొనిన చల్లని కస్తూరి. రుక్మిణి చేత ధరించిన తామరపూవు.

భూదేవికి ఈయుట పైట కొంగు. పదారువేల గోపికల బంగారపు ఉంగరముల వేళ్లతో పట్టిన బంతితో కుట్టబడిన బంగారు మంగళసూత్రము. వింతగా రాధ చేసిన కలువపూలదండ. ప్రేమ కలిగిన తులసీ దేవి చేతిలోని అద్దము. నీళా దేవికి పట్టుగొమ్మ. (ఆధారము) లక్ష్మీదేవి అధిష్ఠించిన సింహాసనము. అనగా ఇందు చెప్పబడినదేవేరుల కందరికినీ సర్వసులభుడని అర్థము.

**విశేషము :** ఈ కృతి యందు చెప్పబడిన మహిషీ( రాణుల) వర్గములో లక్ష్మీదేవి ప్రధాన పట్టమహిషి. ప్రభువుతో కూడ సింహాసన మెక్కే అధికారము పట్టమహిషికే ఉంటుంది. ఆమె సింహాసనమే వేంకటేశ్వరుడని చెప్పబడినది. ఈమె వైభవము వేద పురాణముల యందు చెప్పబడినది. వేదము. ''అస్యేశానా జగతో విష్ణుపత్నీ'' విష్ణు పత్ని అయిన లక్ష్మి ఈ జగత్తుకు రాణి'' అని చెప్పబడినది. పురాణము ''రాఘవత్వే భవత్సీతా । రుక్మిణీ కృష్ణ జన్మని । అన్యేషు చావతారేషు। విష్ణో రేషానపాయినీ'' = లక్ష్మీదేవి విష్ణువు రాముడయితే సీత అయినది. కృష్ణుడయితే రుక్మిణి అయినది. తక్కిన అవతారములలో కూడ విష్ణువుకు ఆమె ఎడబాయనిది'' అని చెప్పబడినది. ఇట్టి విశేషములచేత ఆమెకు ఆయన సింహాసనమని చెప్పబడినది. అట్టి వేంకటేశ్వరుడు సేస పెట్టించుకున్నాడు. అక్షతలు వేయించుకొన్నాడంటే కల్యాణోత్సవ మన్నమాట.

గమనిక : 3వ చరణమున ''ఇలాదేవి'' అనుదానిని ''నీళాదేవి'' గా మార్చుటయినది. ఇలాదేవి అంటే భూదేవి. ఆమెను మొదటి చరణంలో చెప్పుట జరిగినది. ఇటువంటిచోట ఒకళ్ళు చూచి చెపుతూ ఉంటే ఒకళ్లు ఏదో వినపడినట్లు వ్రాయుట పరిపాటి. దీని నూహించి ''నీళాదేవి'' అని మార్చుట జరిగినది. ఈమె యశోద తమ్ముడయిన కుంభుని కుమార్తె. కృష్ణుని అవతారములో ఈమె తుల్య రూపగుణ వృత్తములలో సరియగు మహిషి అని వైష్ణవ సంప్రదాయము. మూలకందమైన నారాయణుని మహిషీవర్గములో నీళాదేవి ఉన్నది. ఈమెకు వేద మంత్రములున్నవి. అదియే పంచసూక్తములలోని ''నీళాసూక్తము''.

## 71. ఖరహరప్రియ = ఆదితాళం

ప॥ సదానందము। సర్వేశ్వరానీ॥
పదారవిందము। పైభక్తి॥ ॥సదానందము॥

చ॥ నయనానందము। నరులకు సురలకు
జయమగుహరి నీ। సాకారము॥
నయమగు శ్రవణా। నందము వినినను
క్రియగలిగిననీ। కీర్తనము॥ ॥సదానందము॥

2) చెలగియందరికి। జిహ్వానందము॥
పలుమరు గొనునీ। ప్రసాదము॥
నలుగడ దేహా। నందము బుధులకు॥
బలు నీపాద। ప్రణామములు॥ ॥సదానందము॥

3) ధర బరమానం। దము నీ దాస్యము
గరిమల శ్రీ వేం। కట విభుడా॥
నరహరి నిత్యా। నందము నిను దగ
నరవిరి జేయు స। మారాధనము॥ ॥సదానందము॥

**తాత్పర్యము :**

ఓ వేంకటేశ్వరా నీ పాదభక్తి ఎప్పుడును ఆనందకరము. ఆకారముతో కూడిన నీ దర్శనము నరులకు సురలకు నయనానందకరము. కీర్తించుట మరియు నీ ప్రసాదమును భుజించుట జిహ్వా కానందము. నీ పాదప్రణామము చేయుట పండితులకు సర్వవిధములుగను దేహానందము. నీ దాస్యము పరమానందము. నీ సమారాధనము నిత్యానందము.

**విశేషము :** వేంకటేశ్వరుని పాదభక్తి, ఆ భక్తితో చేయు కృత్యములు, భావములు పరమానందకరములని ఈ గేయమున చెప్పబడినది. భక్తియందలి సుఖమెరిగిన వారిట్లే కోరుకొందురు. కులశేఖరులంటారు. ''నాస్థా ధర్మే నవసునిచయే నైవ

కామోపభోగే । యద్య ద్భవ్యం భవతి భగవన్ పూర్వకర్మానురూపం । ఏత త్ర్పార్థ్యం. మమ బహుమతం జన్మజన్మాంతరేపి । త్వత్పా దాంభోరుహయుగగతా నిశ్చలా భక్తి రస్తు'' = స్వామీ! ముకుందా! నాకు ధర్మంపై ఆశలేదు. డబ్బు పై ఆశలేదు. కామోపభోగములయందులేదు. కాని నీపాదములపై నిశ్చల మయిన భక్తి జన్మ జన్మలకు కావలెను'' అని కోరుకొన్నారు. పరమభక్తుల ఆకాంక్ష ఇట్లేయుండును.

## 72. కాపిరాగం = ఆదితాళం (త్రిశ్రగతి)

ప॥ మొక మోటముల కెల్ల । మొదలు నేను ॥
వెకలి నీతమకము । విడిపించగలనా ॥

చ॥ ముద్దులనీ మోముచూచి । మొక్కకుండలేను నీతో ॥
గద్దించి నే నలుగగ । గలనా ॥
పొద్దు పొద్దు నేదలచి । పులకించకుండలేను ॥
వద్దని నీ గుణములు । వారించగలనా ॥ ॥మొకమోట॥

2) చేరి నేను ముచ్చటలు । చెప్పకుండలేను నీతో ॥
ధీరత నే చలము సా । ధించగలనా ॥
పేరుకొని సారె సారె । పిలువకుండగ లేను ॥
దూరి దూరి నేనిన్ను । తుచ్ఛమాడగలనా ॥ ॥ మొకమాట॥

3) సతమైన నిన్ను గూడి । సంతసించకుండలేను ॥
ఇతరుల వలె నేను । ఎగ్గులెంచ గలనా ॥
రతి వేళ నిన్ను గడు । రాయడించకుండలేను ॥
పతిగా శ్రీ వేంకటేశ । పంతమియ్యగలనా ॥ ॥మొకమాట॥

**తాత్పర్యము :**

అన్నమయ్య ముగ్ధ నాయిక తాదాత్మ్యము చెంది స్వామితో పలుకుచున్నారు. నేను మొగమాటస్థులలో మొదటి దానను. నీవంటే నాకు తమక మెక్కువగా

నున్నది. ఈతమకమును నేను విడిపింపగలనా? (లేను) నీ ముద్దు మోము చూచి మ్రొక్క కుండలేను. నాయకుడైన నీతో సరిసమానముగా గద్దించి పలుకలేను. ప్రతిదినమును నీ గుణములను తలచి పులకించకుండ ఉండలేను. నీ గుణములను నాపై చూపవద్దని వారించలేను. నిన్ను కలసిమాట్లాడకుండలేను. ధీరతతో నీపై కోపగించి సాధించలేను. మాటిమాటికి నీ పేరుతో నిన్ను పిలువకుండనుండలేను. ఇట్టినేను నిందించగలనా? (నిందించ లేను). ఎప్పుడు నిన్ను కూడి సంతోషించక ఉండలేను. ఇతరులవలె నీ అపరాధముల నెంచలేను. రతిసమయములో నిన్ను రాపిడి పెట్టక ఉండలేను. నీతో పంతమాడలేను'' అని ముగ్ధనాయిక భావమును తమయందా రోపించుకొని ప్రార్థించినారు.

## 73. హంసనాదరాగం = రూపకతాళం

ప॥ తెలిసితే మోక్షము । తెలియ కున్న బంధము ॥
కలవంటిది బతుకు। ఘనునికిని

చ॥ అనయము సుఖమేడ । దవల దుఃఖమేడది
తనువుపై నాసలేని । తత్త్వ మతికి ॥
పొనిగితే పాపమేది । పుణ్యమేది కర్మమందు ॥
ఒనర ఫలమొల్లని । యోగికిని ॥

2) తగిన అమృతమేది । తలపగ విషమేది
తెగి నిరాహారియైన । ధీరునికిని ॥
పగవారనగ నేరి । బంధులనగ నేరి
వెగటు ప్రపంచ మెల్ల । విడిచేవివేకికి ॥

3) వేవేలు విధులందు । వెరపేది మరపేది ॥
దైవము నమ్మిన యట్టి । ధన్యునికిని
శ్రీవేంకటేశ్వరుడు । చిత్తములో నున్నవాడు
ఈవలేది యావలేది । ఇతని దాసునికి ॥

**తాత్పర్యము :**

తెలిస్తే మోక్షము. తెలియకపోతే సంసారబంధము. బ్రతుకంతా ఒక కలేకాని నిజముకాదు. శరీరము నశించును. ఇట్టి శరీరముపై ఆశ ఎందుకు? అనే తత్త్వము తెలిసినవానికి సుఖములేదు, దుఃఖములేదు. కర్మమాత్రము చేయదగినది. కాని దాని ఫలమక్కర లేదు అని ఫలత్యాగము చేసే యోగికి పాపము లేదు, పుణ్యము లేదు. నిరాహార దీక్ష గలవానికి అమృతము లేదు, విషములేదు. ప్రపంచమంతయు మిథ్య అని తెలిసి దానిపై వెగటు చెంది ప్రపంచమును వదలిన వానికి పగవాడు లేడు, బంధువు లేడు. వేల వేల విధులున్నాయి. ఈ విధులు చేసి ఏవేవో పొందుదామని తలంప సాధారణముగా ఉంటుంది. రానిది రాకమానదు. పోనిది పోక మానదు. అని దైవమునే నమ్మినవానికి వెరపు లేదు, మరపులేదు. శ్రీ వేంకటేశ్వరుని చిత్తమున నిలిపి ఆయన దాసుడయిన వానికి ఈవల లేదు, ఆవలలేదు.

**విశేషము** : మొదటి చరణము రెండవ భాగము ''యోగస్థః కురు కర్మాణి । సంగం త్యక్త్వా ధనంజయ । సిధ్యసిద్ధ్యో సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే ॥'' = యోగమందున్న వాడవై ఫలసంగమును విడచి కర్మలను చేయుము. ఫలసిద్ధికిని అసిద్ధికిని సముడవై కర్మలను చేయుము. ఈ సముడగుటయే యోగము. ఆ యోగము కలవాడే యోగి. యోగికి పాపమేమున్నది? పుణ్యమేమున్నది? ఏదియు అంటదన్నమాట ఇది గీతావాక్యము. అన్నమయ్య ఈతత్వమును చెప్పిరి.

## 74. ధర్మవతి = ఆదితాళం

ప॥ హరి గొలిచియు మరి । అపరములా ॥
తిరముగ నతనినే । తెలియుట గాకా ॥ ॥హరి॥

చ॥ పంకజనాభుని । పాదములు దలచి
ఇంకా మరి యొక । ఇతరములా ॥
అంకెల నతనినే । అతని దాసులనే
కొంకక నిజముగ। కొలుచుట గాకా॥ ॥హరి॥

2) పన్నగశయనుని । బంట్లకు బంటై
కొన్నిటిపై మరి । కోరికెలా?
ఇన్ని కోరికలు । ఇదియే తనకని
కొన్నది కోలై । కోరుట గాకా ॥ ॥ హరి॥

3) వీనుల వేంకట । విభునామామృత ।
మానిన మతి మరి । యును రుచులా ॥
తేనెలు గారెడి । తీపు లతని నుతి
నానారుచులై । నమలుట గాక ॥ ॥ హరి

## తాత్పర్యము :

హరిని గొలిచినవాడితరమును కొలుచునా కోరునా? కోరడు. పద్మనాభుని పదములను కొలిచి వేరే ఇతరములను కోరుకొనునా? హరిని హరి దాసులను కొలుచుట కాక వేరొకటి యుండునా శ్రీ హరి యొక్కదాసులకు దాసుడై ఇతరముల కోరునా? కోరడు. చెవులతో వేంకటేశ్వరుని నామామృతమును రుచి చూచిన వానికి వేరేరుచి రుచించదు. ఒక వేళ ఇంకొక రుచిని కోరినా ఆ నామామృతమే నానారుచులై భాసిస్తుంది.

**విశేషము :** ''పరమాత్మ ని యో రక్తః । విరక్తో పరమాత్మ ని '' విష్ణువుయందు రక్తి గలిగిన వాడు ఆయన కాని ఇతరములయందు విరక్తితో నుండునట. కులశేఖరసూక్తులు గమన్వార్హములు. ''సుఖతర మపరన జాతుజానే । హరిచరణ స్మరణామృతేన తుల్యం'' = విష్ణు పాదస్మరణామృతముతో సరియైనది కాని, ఎక్కువయినది కాని సుఖము నేనెన్నడును ఎరుగను'' అనియును ''మదనుగ్రహ ఏష ఏవ। త్వద్భృత్య భృత్య పరిచారక భృత్యభృత్య। భృత్యస్య భృత్యఇతి మాంస్మర లోకనాథ॥ = ఓ లోకనాథా! నేను నీ దాసుల దాసుల దాసుల దాసులకు దాసుడను. అని స్మరింపుము. ఇదియే నీవు నాపై చూపవలసిన అనుగ్రహము. అని కుల శేఖరుల సూక్తులు. ఈ చరమావధిదాస్య భావమే వైష్ణవ సంప్రదాయమున చాలా ముఖ్యమైనది. అన్నమాచార్యులీ భావములనే ఈ గేయమందు చెప్పిరి. మంత్రాంతర, దేవతాంతర, సాధనాంతరములను ఈ సంప్రదాయస్థులు పరిగ్రహింపరు. ఇదియే ఇందున్న భావము.

# 75. లలిత రాగం = ఖండచాపు

ప॥ చాలదా హరినామ । సౌఖ్యామృతము దమకు॥
చాలదాహితమైన। చవులెల్ల నొసగ॥ ॥చాలదా॥

చ॥ ఇది యొకటి హరినామ। మింతైన జాలదా॥
చెదర కీ జన్మముల। చెరలు విడిపించు
మదినొకటె హరినామ। మంత్రమది చాలదా
పదివేల నరకకూ। పముల వెడలించ॥ ॥చాలదా॥

2) కలదొకటి హరినామ। కనకాద్రి చాలదా
తొలగుమని దారిద్ర్య। దోషమ్ము చెరచ
తెలివొకటి హరినామ। దీపమది చాలదా
కలుషంపు కఠినచీ। కటి పారద్రోల॥ ॥చాలదా॥

3) తగు వేంకటేశు కీ। ర్తన మొకటి చాలదా॥
జగములో కల్ప భూ। జమ్ము వలె నుండ॥
సొగిసి ఈ విభుని దా। సుల కరుణ చాలదా॥
నగవు జూపులను ను। న్నత మెపుడు జూప॥ ॥చాలదా॥

## తాత్పర్యము :

ఓ మానవులారా! హరినామామృత మొక్కటి చాలదా! అది హితమైన అన్ని రుచులను ఇస్తుంది. జన్మ పరంపరలనే చెరలు విడిపించటానికి హరినామము చాలదా! నరకములు ఫదివేలున్నాయి. వాటిని దాటించే హరినామ మొకటి చాలదా? హరినామము బంగారు కొండ. అన్ని రకములయిన దారిద్ర్యములను పోగొట్టుట కదిచాలదా? హరినామ మొక దీపము. అన్ని విధములయిన కటిక చీకట్లను అది పారద్రోలుతుంది. వేంకటేశ్వరుని కీర్తనము కల్పవృక్షమువలె ఏది కోరితే అది ఇస్తుంది.

**విశేషము :** ''సర్వలాభాయ కేశవః'' = హరిసేవ అన్ని ఫలములను ఇస్తుంది. దీనిని వదలి దేనికో దేనికో అఱ్రులుచాచి అడియాస పాలు కాకుడని పరమార్థ బోధ.

## 76. రాగమాలిక = ఖండచాపు

ప॥ తొల్లియును మఱ్ఱాకు। తొట్టెలనె యూగె గద
చెల్లుబడి నూగీని। శ్రీరంగ శిశువు॥

చ॥ కలిగి కావేరి తర। గల బాహులతలనే
తలగ కిటు రంగ మ। ధ్యపు తొట్టెలన్॥
పలుమారు తను నూచి। పాడగా నూగీని
చిలుపాల సెలవితో। శ్రీరంగ శిశువు॥ ॥తొల్లి॥

2) అదివొ కమలజుని తిరు। వారాధనం బనగ॥
అదన కమల భవాండ। మనుతొట్టెలన్॥
ఉదధులు తరంగములు। నూచగా నూగీని
చెదరని సిరులతోడ। శ్రీరంగ శిశువు॥ ॥తొల్లి॥

3) వేదములె చేరులై। వెలయంగ శేషుడే॥
పాదుకొను తొట్టెలై। పరగగాను॥
శ్రీదేవితో గూడి। శ్రీ వేంకటేశుడై
సేద దేరెడివాడె। శ్రీరంగ శిశువు॥ ॥తొల్లి॥

### తాత్పర్యము :

అన్నమయ్యగారు తదేక భక్తితో వేంకటేశ్వరుని సేవిస్తూ ఉంటే అందులో శ్రీరంగనాధుడు గోచరించినాడు. ఆయన త్రేతాయుగంలో వెలసిన మూర్తి. ఈయన కలియుగమూర్తి. ఈ రెండిటిలో భేదములేదు. కాని రంగనాధుడు పవ్వళించి యున్నాడు. శిశువు తొట్టెలో పవ్వళించినట్లు తోచినది. తొట్టెలో ఊగుచున్నట్లు తోచినది. అవును. తొల్లి మఱ్ఱాకు తొట్టెలో ఊగెనుకదా! ఇప్పుడు శ్రీరంగ శిశువై శ్రీరంగ మందిరమనే తొట్టెలో కావేరి తన తరంగములనే బాహువులతో ఊపుతుంటే త్రాగిన పాలు పెదవుల మొదళ్ళలో కనపడుతూ ఉండగా శ్రీరంగ శిశువు ఊగుచున్నాడు. బ్రహ్మ యొక్క తిరువారాధనము అను పేరుతో బ్రహ్మాండమనే తొట్టెలో సముద్రములు తమ తరంగములతో ఊపుతుంటే

శ్రీరంగ శిశువు చెరగని కాంతులతో ఊగుచున్నాడు. ఆదిశేషుడనే తొట్టెలో నాలుగు వేదవములు నాలుగు గొలుసులు కాగా శ్రీదేవితో కూడి సేదదీర్చుకొంటున్న శ్రీ వేంకటేశ్వరుడే ఆ శ్రీరంగ శిశువు.

**విశేషము :** సృష్టికి పూర్వము శ్రీమన్నారాయణుడు వటపత్రశాయిగానే సముద్ర మందున్నాడు. సృష్టి వటపత్ర శాయిలో నుంచే జరిగినది. ఆ అనాది కాలమున బ్రహ్మ నారాయణుని కోరగా తనకు ప్రతిగా శ్రీరంగ మందిరమును బ్రహ్మకిచ్చినాడు. అది బ్రహ్మ అర్చన సంపుటము. వైష్ణవ సంప్రదాయమున దానిని తిరువారాధన మందురు. 2వ చరణములోనిదే చెప్పబడినది. బ్రహ్మ తిరువారాధనముగా సత్యలోకములో చాలా కాలమున్నది. బ్రహ్మనుంచి దానిని ఇక్ష్వాకు మహారాజా తపస్సుజేసి గ్రహించాడు. ఆయన నుంచి శ్రీరాముని వరకు ఆ శ్రీరంగ మందిరము ఆ వంశములో పూజింపబడినది. శ్రీరాముడు విభీషణున కీయగా ఇప్పుడున్న చోట ప్రతిష్ఠింపబడినది. ఇది శ్రీరంగ చరిత్రము. నారాయణుడు నాలుగు యుగములలో ఆయా నామములతో వెలసినాడు. ''కృతే వరద రాజశ్చ। త్రేతాయాం రంగనాయకః। ద్వాపరే శ్రీ జగనాథః । కలౌ వేంకటనాయకః'' = కృతయుగములో వరదరాజాగాను, త్రేతాయుగంలో రంగనాధుడుగాను, ద్వాపరంలో జగన్నాధుడుగాను, కలిలో వేంకటేశ్వరుడు గాను విష్ణుదేవుని అర్చావతారములు వెలసినవి. మొదటి అవతారమయిన శ్రీరంగని పరుండిన శిశువుగా భావించి ఈ గేయమందు అన్నమయ్య గారు చక్కని రూపకాలంకారమును చూపినారు.

## 77. ఆనందభైరవి = ఆది (త్రిశ్రగతి)

ప॥ చూడపిన్నవాడు గాని। జూటు దనాల నెక్కుడు
ఏడ జూచినా తాను। ఈ విఠలుండే ॥చూడ॥

చ॥ గోవులలో విహరించే। గోవిందుడు పెక్కు
వావుల గోపికలకు। వల్లభుండు
చేవ మీరి ముద్దుల। శ్రీకృష్ణుడు
ఏ వల్ల జూచినాను। ఈ విఠలుండే॥ ॥చూడ॥

2) రాసక్రీడలలోని। రాజీవాక్షుండు
ఆసపదారువేల పెం। డ్లా డినవాడు॥
బాసతో రుక్మిణీ సత్య। భామా సమేతుడు॥
ఈ సుద్దుల వెలసీ। నీ విఠలుడు॥ ॥చూడ॥

3) వింత మధురాంగనల। వేడుకకాడు॥
చెంత కొలని సతుల। సిగ్గుల వాడు॥
కాంత లక్ష్మపతి శ్రీ వేం। కటేశ్వరుడు॥
ఇంతటా వినోదించే। నీ విఠలుడు ॥చూడ॥

**తాత్పర్యము :**

అన్నమాచార్యులవారి మనస్సొకసారి ఉత్తరదేశ క్షేత్రమైన పండరీపురము వెళ్ళినది. అక్కడ శ్రీ విఠలదేవుడు. అతడే వేంకటేశ్వరుడు. ఈ ఇద్దరికి మూల మయిన అవతారము కృష్ణుడు. చాలా చిన్నవాడు. కాని మోసములో చాలా పెద్దవాడు. ఎక్కడ చూచినా ఈ విఠలుడే. గోవులలో తిరిగేది ఈతడే. పెక్కు చుట్టరికపు వరుసలతో గోపికలలో తిరిగేది ఈతడే. యశోదకు ముద్దుల కృష్ణుడు. పదారు వేల మంది గోపికలను పెండ్లాడినాడు. రాసక్రీడలలో ఈ విఠలుడే. రుక్మిణి సత్యభామలతో నున్నవాడు. వ్రేపల్లెలోని గోపికలను విడచి మధురాపురం కన్యలకు కొంతకాలము వేడుక కలిగించినాడు. కొలనులో గోపికల చీరలపహరించి సిగ్గు గలిగించినవాడు. ఇప్పుడు లక్ష్మితో గూడి వేంకటేశ్వరుడై వినోదిస్తున్నవాడును విఠలుడే అని వేంకటేశ్వరుని, విఠలుని, బాలకృష్ణుని ఒకటిగా చేసి ఆ లీలలను వర్ణించినారు అన్నమయ్యగారు.

## 78. ఆనందభైరవి = ఆది (త్రిశ్రగతి)

ప॥ రామభద్ర రఘువీర। రవివంశ తిలక నీ
నామమే కామధేనువు। నమో నమో॥ ॥రామ॥

చ॥ కౌసల్య నందవర్దన। ఘన దశరధ సుత॥
భాసుర యజ్ఞరక్షక। భరతాగ్రజ॥
రాసికెక్కు కోదండ। రచన విద్యా గురువ
వాసితో సురలు నిను। వడి మెచ్చేరయ్యా॥ ॥రామ॥

2) మారీచ సుబాహు। మర్దన తాటకాంతక
దారణ వీరశేఖర। ధర్మపాలక॥
కారుణ్యరత్నాకర । కాకాసుర వరద॥
సారెకు వేదవిదులు। జయ వెట్టేరయ్యా॥ ॥రామ॥

3) సీతారమణా రాజ। శేఖరా శిరోమణి॥
భూతలపు టయోధ్యా। పురనిలయా॥
యీతల శ్రీవేంకటాద్రి। నిరవయిన రాఘవా॥
ఘాత నీ ప్రతాప మెల్ల। కడునిండే నయ్యా॥ ॥రామ॥

**తాత్పర్యము :**

అయ్యగారి మనస్సు రాముని వైపు మళ్లినది. ఇందున్న సంబోధనము లన్నీ ఆయనవే. రామభద్రా! రఘువీరా! సూర్యవంశ శ్రేష్ఠా! నీ నామమే సర్వార్థ సాధనము. నీకు నమస్కారము. కౌసల్య కానందమును పెంచువాడా! దశరథ పుత్రా! విశ్వామిత్రుని యజ్ఞ రక్షకుడా! భరతాగ్రజుడవు. కోదండ విద్యలో గురువవు. ఇట్లు దేవతలు నిన్ను బాగుగ మెచ్చిరి. తాటకను మారీచసుబాహులను మర్దించినావు. వీరశేఖరుడవు. ధర్మపాలకుడవు. దయా సముద్రుడవు. కాకాసురునకు వరమిచ్చిన వాడవు. వేదవేత్తలు నీకు జయ జయ ధ్వానములు చేయుదురు. సీతకు నాధుడవు. రాజ శ్రేష్ఠులలో శిరోమణివి. భూలోక వైకుంఠమందు నివసించువాడా! ఇటు వేంకటాద్రి యందు నిలచిన రాఘవుడవు. నీ ప్రతాప మంతయు జగమంతయు నిండి ఉన్నదయ్యా!

**విశేషము :** ''వధార్హ మపికాకుత్థః। కృపయా పర్యపాలయత్॥ = వధింపదగిన వాడైనను కాకాసురుని శ్రీరాముడు కృపతో పరిపాలించెను'' అని వాల్మీకి. చంపక ఒక కంటిని మాత్రము బాణమున కిచ్చి వదలుటయే కాకాసురునకు వరమిచ్చుట. <u>''భూతలపు టయోధ్య''</u> ''దేవానాం పూర యోధ్యా'' అనే వేదవాక్య ప్రకారము నిత్యసూరులనబడే దేవతల పురము అయోధ్య అనగా వైకుంఠము. వైకుంఠము యొక్క ఇంకొక పేరు అయోధ్య. సూర్య వంశ ప్రభువులు ఆ పేరును తమ

పురమునకు పెట్టుకొన్నారు. అందుచేత అది ''భూతలపుటయోధ్య'' అందు నెలకొన్నాడు రాముడు. అట్లే ''ఈతల'' భూలోక వైకుంఠమయిన వేంకటాద్రి యందు నెలకొన్నాడు వేంకటేశ్వరుడు. ఇది రెండు విధములుగాను సరిపోయినది.

## 79. పున్నాగవరాళి = ఖండచాపు తాళం

ప॥ ఏణనయనల చూపు। లెంత సొబగై యుండు
ప్రాణసంకటములగు। పనులు నట్లుండు॥ ॥ఏణ॥

చ॥ ఎడలేని పరితాప। మేరీతి తానుండు
అడియాస కోరికలు। నటువలెనె యుండు॥
కడలేని దుఃఖసం। గతి ఎట్లు తానుండు
అడరు సంసారంబు। నట్లనే యుండు॥ ॥నేణ॥

2) చింతా పరంపరల। చిత్త మది ఎట్లుండు॥
వంత దొలగని మోహ। వశము నట్లుండు॥
మంతనపు పనులపయి। మనము మరి యెట్లుండు
కంతు శరమార్గముల। గతి అట్లనుండు॥ ॥నేణ

3) దేవుడొక్కడె అనెడి। తెలివి తన కెట్లుండు
శ్రీ వేంకటేశుకృప। చేతలట్లుండు॥
భావగోచరమైన। పరిణతది ఎట్లుండు॥
కైవల్య సౌఖ్య సం। గతులు నట్లుండు॥ ॥నేణ॥

**తాత్పర్యము :**

ఏణనయన లనగా లేడివంటి కనులు వారనగా స్త్రీలు. వీరి చూపులెంత అందముగా నుండునో పనులంత ప్రాణ సంకటముగా నుండును. విరామము లేని పరితాప మెట్లుండునో మనస్సులో కలిగే అడియాసలు కోరికలు అట్లే యుండును. దుఃఖ మెట్లుండునో సంసార మట్లుండును. మనస్సునావరించిన చింత లెట్లుండునో మోహము లట్లుండును. రహస్యపు పనుల మీద మనస్సు

ఎట్లుండునో మన్మధ బాణముల మార్గ మట్లుండును. దేవుడొక్కడే అనే జ్ఞానము ఎంత సుఖముగానుండునో వేంకటేశ్వరుడు కృపతో చేసే పనులంత సుఖముగా నుండును. అన్నిటా పరిణతి చెందిన భావమెట్లుండునో కైవల్యమట్లుండును.

**విశేషము :** ఇందు సంసార బంధములగు దుఃఖకరవిషయములకు దుఃఖకరమైన ఒక విషయముతో పోలిక చెప్పుట జరిగినది. అట్లే సుఖకరమగు కొన్నిటితో సుఖకరములకు పోలిక చెప్పుట జరిగినది. దేవుడొకడే అను జ్ఞానము సుఖమని చెప్పబడినది. దీని విషయముగా ఓ చాటువున్నది. ''ఏకో దేవః కేశవోవా శివోవా। ఏకానారీ సుందరీ వాదరీవా'' = కేశవుడుగాని శివుడుకాని ఒక్కడే దేవుడుండవలెను. సుందరి కాని గయ్యాళి కాని ఒక్కతే భార్య ఉండవలెను'' అని చెప్పబడినది. ఒక్కదేవుడు కాకపోతే చిత్తమునకు ఏకాగ్రత లేక కొన్ని అనర్థములు కలుగును. అందుచేత ఇట్లు విధింపబడినది. దీనిని సమర్థించు వేదవాక్యములు కూడ నున్నవి. ''స్వాందేవతా మతియజతే సపాపీయాన్'' ఇత్యాదులు.

## 80. సారంగరాగం = ఆదితాళం

ప॥ ఘను డాతడె మము। గాచుగాక హరి
అనిశము నేమిక। అతనికె శరణు॥ ॥ఘను॥

చ॥ ఎవ్వని నాభిని। ఈ బ్రహ్మాదులు
ఎవ్వడు రక్షకుడు। ఇన్నిటికి
ఎవ్వని మూలము। ఈ చరాచరము
అవ్వల నివ్వల। నతనికె శరణు॥ ॥ఘను॥

2) పురుషోత్తముడని। పొగడి రెవ్వనిని
కరి నెవ్వడు గ। క్కున గాచె॥
ధర నెవ్వడెత్తెను। దనుజుల పొరిగొనె॥
అరుదుగ మేమిక। అతనికె శరణు॥ ॥ఘను॥

3) శ్రీసతి ఎవ్వని। చేరి ఉరమునను
భాసిలె నెవ్వడు। పరమంబై
దాసుల కొరకై। తగు శ్రీ వేంకట
మాస జూపునిత। డతనికె శరణు॥ ॥ఘను॥

## తాత్పర్యము :

''అతనికే శరణు'' = అతనినే శరణు జొచ్చితిమి అని అర్థము. అతడే మమ్ము రక్షించును. అతనికే శరణు. ఎవని నాభి పద్మము నుండి బ్రహ్మాదులు పుట్టిరో, ఎవ్వడు ఇన్నిటిని రక్షించువాడో, ఈ చరాచర జగత్తుకు మూల మెవ్వడో అతనికే శరణు. పురుషోత్తము డెవరు, కరిని రక్షించిన వాడెవరు? వరాహరూపమున భూమి నెత్తిన దెవరు, రాక్షసులను సంహరించిన దెవరు, అతనికే శరణు. లక్ష్మీదేవి ఎవని వక్షస్థలమును చేరి భాసిల్లినది. ఎవడు దాసుల కొరకై వేంకటాద్రియందు పరముడై వెలసియున్నాడో అతనికి శరణు. అని అన్నమయ్య తదేక నిష్ఠను చెప్పినారు.

**విశేషము :** సంప్రదాయములో ''ఆకారత్రయము'' అని ఒకటి ఉన్నది. అనన్యార్హ శేషత్వము, అనన్యార్హ భోగ్యత్వము, అనన్యశరణత్వము. అనే మూడు స్వరూపములు జీవునకుండవలెనట. శ్రీహరి తప్ప ఇంకొకనికి దాసుడు కాకుండుట, శ్రీహరి కొక్కనికే తాను భోగ్యమగుట, శ్రీ హరి నొక్కనినే శరణనుట. శ్రీ వైష్ణవ సంప్రదాయమున ఇవి ప్రధానములు. శ్రీ హరినే శరణనవలెను. కనుక ఆయనకు ఉన్న మహిమలను పేర్కొనుచున్నారు. బ్రహ్మాదులకు ఆయన నాభి జన్మస్థానమని. నమ్మాళ్వారుల తిరువాయ్ మొళి ''తేవు మెప్పొరుళం పడైక్క। పూవిల్ నాన్ముగనై పడైత్త। తేవు మెంబెరు మానుక్కల్లాల్। పూవుం పూశన యుం తగుమే'' = దేవతలను సమస్త భూతములను సృష్టించుటకు తన నాభి పద్మమునుండి చతుర్ముఖుని సృష్టించిన మహోపకారకుడగు దేవుడు'' అని చెప్పబడినాడు. అతడే రక్షకుడు. చరాచర ప్రపంచమున కాతడే మూలము. ఇహపరలోకములలో అతనికే శరణు. వేదము ''యతోవా ఇమాని భూతాని జాయంతే। యేన జాతాని జీవంతి'' విష్ణువు వలననే సమస్తమును పుట్టుచున్నవి. పుట్టినవి జీవించుచున్నవి'' అని. పురుషులు అంటే

భూమియందుండే సామాన్యజీవుడు మొదలుకొని బ్రహ్మరుద్రేంద్రాదులు మధ్యలో ఉండి నారాయణుని వరకును ఉన్న జీవులు. ఇందరిలో పురుషోత్తముడనే ప్రసిద్ధి నారాయణునకే. బౌద్ధుడైన అమరసింహుడు కూడ తన అమరకోశములో ''శ్రీపతిః పురుషోత్తమః'' అని విష్ణు నామములలో చెప్పినాడు. గజేంద్రుడు తనకు ఆపద కలిగినప్పుడు పేరుతో పిలువక ఆయన మహిమలతో ''ఎవ్వనిచే జనించు జగ మెవ్వనిలోపల నుండు లీనమై'' అని పిలిచినాడు. అప్పుడు తక్కిన దేవతలు ''నాహం నాహం నచాహం'' = నేను కాను నేను కాను నేనూ కాను'' అని ఎవరును రాలేదు. అప్పుడు విశ్వమయుడయిన నారాయణుడేవచ్చి గజమును గాచినాడు. శ్రీని అందరును ఆశ్రయించెదరు. అట్టి శ్రీదేవి హరినాశ్రయించి భాసిల్లినది. యామునాచార్యుల సూక్తి. ''కః శ్రీః శ్రియః పరమసత్త్వ గుణాశ్రయః కః। కః పుండరీక నయనః పురుషోత్తమః కః'' = శ్రీకి శ్రీ అయినవాడు, పరమసత్త్వగుణమువాడు, పద్మాక్షుడు, పురుషోత్తముడు'' అని. అట్టి, మరియు దాసుల కొరకై ఇప్పుడు వేంకటాచలమందు వేంచేసి యున్న ''అతనికే శరణు'' అని అన్నమాచార్యులు తన అనన్యార్హశరణత్వము నీ గేయమందు తెలిపినారు.

## 81. వాచస్పతిరాగం = ఆదితాళం (త్రిశ్రనడ)

ప॥ ఏమమ్మమగువా నీ। వింత సేతువా॥
తామసించ నేటికింక। దయజూడవమ్మా॥ ॥ఏమమ్మ॥

చ॥ తగిలి తప్పక చూచు। దలవంచునంతలోనె
నిగిడి చింతారతి। నేల దవ్వును॥
మగువ నిన్నిటు వాసి। మానుపడి ఊరకుండు
ఆగడాయె నీ పతి। నదె చూడవమ్మా॥ ॥ఏమమ్మ॥

2) దీనతతో చిన్నబోవు। తెగువలే తలపోయు॥
తానె ఏకతాననుండి। తమకించును
మోనుగ దెల్లవారు। మోహించిన విరహాన
మానిని నీవే విచ్చేసి। మరి చూడవమ్మా॥ ॥ఏమమ్మ॥

3) కొచ్చిన కాకలచే పై। కొంగు వేయ నెరగడు
మెచ్చుగ మెట్టిన చోటే। మెట్టి బ్రమయును॥
అచ్చుపు శ్రీ వేంకటేశు। నలమేలు మంగ నీవు॥
వచ్చి చేసి కూడితివి। పంతమేటికమ్మా॥ ॥ఏమమ్మ॥

**తాత్పర్యము :**

అలమేలు మంగ నాయిక. ఈమె ఒకసారి నాయకుని కలసి వెళ్లిపోయినది. నాయకుడైన వేంకటేశ్వరుడు విరహ వేదన పడుచున్నాడు. కవి అలమేలుమంగతో ఆయన బాధను వివరించి చెప్పుచున్నాడు. ఏమమ్మా! నీ వింత చేస్తావా? కోపగించక ఇంకనయినా దయ జూడుము. ఆసతో నీ కొరకు చూస్తాడు, అంతలోనే తలవంచుకుంటాడు. నీ కోసం ఆలోచిస్తూ కాలి బొటన వ్రేలుతో నేలను రాస్తూ ఉంటాడు. నీ విరహముతో కొంతసేపు మ్రానుపడి (నిశ్చేష్టుడై) ఉంటాడు. ఆగకుండ చింతపడుచునే యున్నాడు. వచ్చి చూడవమ్మా!! ఎవరితో కలియక ఒంటిగా బాధపడుచున్నాడు. వచ్చి చూడవమ్మా విరహతాపం హెచ్చుతూ ఉన్నా పైన ఒక కొంగు వేసుకొనుటలేదు. తిరిగిన చోటనే తిరుగుచున్నాడు. అలమేలు మంగా! నీకు పంతమేలనమ్మా! నీ పతిని వచ్చి కూడుము అని చెప్పుచున్నారయ్య గారు.

## 82. శంకరాభరణం = ఆది (త్రిశ్రనడ)

ప॥ చేపట్టి మమ్ముగావు। శ్రీ నరసింహా – నీ
శ్రీ పాదములే దిక్కు। శ్రీ నరసింహా॥ ॥చేపట్టి॥

చ॥ చెలగు వేయిచేతుల। శ్రీ నరహింహా॥
చిలికేటి నగవుల। శ్రీ నరసింహా॥
సిలుగులేనిమంచి। శ్రీ నరసింహా నీ॥
చెలి తొడెక్కించుకొన్న। శ్రీ నరసింహా॥ ॥చేపట్టి॥

2) క్షీర సముద్రము వంటి। శ్రీ నరసింహా దైత్యు॥
చీరిన వజ్రపు గోళ్ల। శ్రీ నరసింహా॥
చేరి ప్రహ్లాదుని మెచ్చె। శ్రీ నరసింహానుతిం
చేరు దేవతలు నిన్ను। శ్రీ నరసింహా॥ ॥చేపట్టి॥

3) శ్రీ వనితతో మెలగు। శ్రీ నరసింహా॥
చేవ దేరె నీ మహిమ। శ్రీ నరసింహా॥
శ్రీ వేంకటాద్రిమీది। శ్రీ నరసింహా, సర్వ
జీవదయా పరుడవో। శ్రీ నరసింహా॥ ॥చేపట్టి॥

**తాత్పర్యము :**

ఓ శ్రీ నరసింహా। మమ్ము చేపట్టి రక్షించుము. నీ శ్రీపాదములే మాకు దిక్కు. వేయి చేతులుగల శ్రీ నరసింహా। నవ్వులు చిలుకున్న శ్రీ నరసింహా। లోపములులేని శ్రీ నరసింహా। తొడమీద లక్ష్మీదేవిని ఎక్కించుకొన్న శ్రీ నరసింహా। క్షీర సముద్రము వంటి శ్రీ నరసింహా। హిరణ్యకశిపుని చీల్చిన వజ్రపు గోళ్ల శ్రీ నరసింహా ప్రహ్లాదుని మెచ్చుకొనే శ్రీ నరసింహా। దేవతలు నుతించే శ్రీ నరసింహా। లక్ష్మీదేవితో మెలగుచుండే శ్రీ నరసింహా। నీ మహిమ బాగా బలపడినది. ఆ నరసింహుడవు జీవ దయాపరుడవై నేడు వేంకటాద్రి మీదకు వచ్చి ఉన్నావు. మమ్ము చేపట్టి రక్షించుము.

**విశేషము :** అన్నమాచార్య స్వామి నరసింహుని మహిమలతో వేంకటేశ్వరుని కీర్తిద్దామను కొన్నారు. శ్రీ నరసింహునితో పాటు శంకరాచార్య విరచితమైన ''లక్ష్మీనరసింహకరావలంబ'' స్తోత్రము మనస్సు కెక్కినది. కరావలంబము అంటే చేయి పట్టుట. అదే చేపట్టుట. ఆ స్ఫూర్తితోనే చేపట్టి మమ్ము బ్రోవు'' అని పదము ప్రారంభమైనది. 2వ చరణము : లక్ష్మి తొడపై నున్నది. ఈమె క్షీర సముద్రరాజ తనయ కనుక తండ్రి తొడపై కూరుచున్నట్లు భావములో పొడగట్టినది. దానితో శ్రీ నరసింహుడు క్షీరసముద్రము వలె దోచినాడు. తక్కిన మూడు పాదములలో వరుసగా హిరణ్య కశిపుని చీల్చుట, ప్రహ్లాదుని స్వీకరించుట, దేవతలు స్తుతించుట

అనే కథా క్రమము సూచింపబడినది. మన దేశములోనే అష్టభుజములతో వెలసిన నరసింహుని ఆలయములున్నవి. ఇందు అన్నమయ్యగారు ''వేయి చేతులు'' చెప్పినారు. దీనికి భగవద్గీత – పురుషసూక్తము స్ఫూర్తి నిచ్చినవి. గీతలో విశ్వరూపము చూచినప్పుడు అర్జునుడు ''అనంత బాహుం శశిసూర్య నేత్రం'' = లెక్కలేని భుజములవాడవు'' అని అన్నాడు. పురుష సూక్తము '' వేయి శిరస్సులవాడు, వేయికనులవాడు'' = అని చెప్పినది. ఇక్కడ వేయి అంటే అనంతము అని భావము. వీటి స్ఫూర్తితో అన్నమయ్యగారు ''వేయి చేతులు'' అని చెప్పినారు.

## 83. హంసానంది రాగం = ఖండచాపుతాళం

ప॥ ఘోర దురితములచే। గుణవికారములచే॥
నీ రీతిబడు నాకు। నేది తెరువు॥

చ॥ హరి జగన్నాథు లో। కారాధ్యు నిన్ను
నెరుగ నేరని వాని। కేది తెరువు॥
పరమ పురుషుని జగ। చ్చరితు నంతర్వ్యాప్తి
నిరవు కొలు పనివాని। కేది తెరువు॥ ॥ఘోర॥

2) శ్రీ వేంకటేశు దల। చిన వెనుక సకలంబు
నేవగింపని వాని। కేది తెరువు
దేవోత్తముని మహిమ। దెలిసి తెలియగ లేని
యీ వివేకంబునకు। నేది తెరువు ॥ ॥ఘోర॥

**తాత్పర్యము :**

పెద్ద పాపముల వలన గుణ వికారములచే నేనీ సంసారములో పడ్డాను. ఇట్టి నాకు మార్గమేది? పాపహరుడవు, లోకములచేత ఆరాధింపదగినవాడవు, జగత్తులకన్నిటికిని ప్రభువవు అయిన నిన్ను తెలియని వానికి మార్గమేది? పరమ పురుషుడవు, జగత్తుల సృష్టి, రక్షణము, లయము అనే చరిత్రము కలిగిన నిన్ను తనలో నిలుపుకొనిన వానికి మార్గమేది? శ్రీ వేంకటేశ్వరుని తెలిసిన తరువాత

తక్కిన అన్నిటిమీద ఏవగింపు కలవానికి, తెలిసి తెలియక ఉన్నవానికి మార్గమేది? అని ప్రశ్నము. ఏదియు లేదని అర్థము.

**విశేషము :** పరమాత్మని ఎరుక కావలెను. ఎరుకయే జ్ఞానము. ఇది చాలా జన్మల తరువాత కాని కలుగదు. ''బహూనాం జన్మనామంతే। జ్ఞానవాన్ మాంప్రపద్యతే। వాసుదేవస్సర్వమితి। స మహాత్మా సుదుర్లభః'' = వాసు దేవుడే సర్వమును అనే జ్ఞానమును కలవాడు బహుజన్మముల తరువాత నన్ను భజించును. అట్టి మహాత్ముడు చాలా దుర్లభుడు'' అని గీతా వాక్యము. ''దైవీ హ్యేషా గుణమయీ। మమ మాయా దురత్యయా॥'' గుణవికారముల చేత కలిగిన మాయ దాటరానిది''. ఈ మాయ పరమాత్మను తెలియనీయదు అని గీతావక్యము. ఇక మార్గమేది అని అన్నమయ్యగారి చింత. భగవంతుని మహిమ తెలిసిన తరువాత తక్కిన ప్రపంచ మెట్లుండునో కులశేఖరులు చెప్పిన వాక్యమది ''పృధ్వీరేణు రణుః పయాంసి కణికాః। రంధ్రం సుసూక్ష్మం నభః॥ క్షుద్రా రుద్ర పితామహ ప్రభృతయః। ఫల్గుస్సు లింగో రవిః। జ్ఞాతేయత్ర సతావకో విజయతే। భూమావధూతా వధిః'' = ఓ ముకుందా! నీ మహిమ తెలిస్తే భూమి ధూళిలోని ఒక్క రవ్వగాను, సముద్ర జలములన్నీ చిన్న నీటి బిందువులుగాను, ఆకాశ మంతయు ఒక్క చిన్న చిల్లుగాను, బ్రహ్మరుద్రాదులు చాలా తక్కువ వారుగను, సూర్యుడు చిన్న నిప్పురవ్వగాను, కనపడుదురు. ఆ విధముగా నీ మహిమ సర్వోత్కృత్కష్టముగా ప్రకాశించుచున్నది అని. చివరి చరణములోని భావమిదే.

## 84. కేదారగౌళ = ఆది (త్రిశ్రగతి)

ప॥ చెలులాల చూడరె ఈ। చెలిభాగ్యము॥
అలమేలు మంగయీకె। కబ్బెను ఈ భాగ్యము॥ ॥చెలు॥

చ॥ పతిదయ గలిగిన। పడతిదీ భాగ్యము॥
అతడు మాట మీరనీ। దది భాగ్యము
సతతము బాయక జంటై। యుండేది భాగ్యము॥
అతివలెందరు గల్గా। నది ఏమి చెప్పేరే॥ ॥చెలు॥

2) మగడు మన్నించిన। మగువది భాగ్యము॥
సొగిసి అతడు మోహిం। చుట భాగ్యము॥
వెగటులేని రతుల। వేసర నిది భాగ్యము
మగువల వలపులు। మరి ఏమి చెప్పేరే

3) శ్రీ వేంకటేశు డేలెమ। చ్చిక నీ సతిది భాగ్యము॥
ఆ వేళ నాతడు మెచ్చి। నది భాగ్యము॥
తావుకొని ఎపుడు। తనవాడౌటె భాగ్యము॥
ఏ వనితల నేరుపులు। ఇక నేమి చెప్పేరే॥ ॥చెలులార॥

## తాత్పర్యము :

అలమేలుమంగ, శ్రీ వేంకటేశ్వరుడు కలసినారు. ఇది ఆమెకు కలిగిన పెద్ద భాగ్యము. ఎప్పుడును ఎడబాయక జంటై ఉండుట ఆమె భాగ్యము. వేంకటేశుడామె మాట మీరడు. అది ఆమె భాగ్యము. స్థిరముగా నాధుడు తనవాడైనాడు. అది భాగ్యము.

**విశేషము :** శ్రీ వేంకటేశ్వరుడు నారాయణుడు, అలమేలు మంగ లక్ష్మీదేవి. ఆ యిద్దరిది సరియైన జంట అని శ్రీ రామానుజుల వారు తమ శరణాగతి గద్యలో ''శ్రీ మన్నారాయణ మతానురూప స్వరూప రూప విభవైశ్వర్యాం'' = నారాయణుని మతమునకు అనురూపమయిన రూపము, వైభవము, ఐశ్వర్యము కలిగినది లక్ష్మీదేవి'' అని చెప్పినారు. అట్టి భాగ్యము అలమేలు మంగదే. ఋషులు ఆమెను ''లక్ష్మీః పురుషకారత్వే నిర్దిష్టా పరమర్షిభిః'' = లక్ష్మిని పురుష కారముగా నిర్దేశించిరి. పురుషకారమనగా అపరాధి అయినవాడు భగవంతుని రక్షింపుమని ఆశ్రయించినప్పుడు ఆమె చేయు సిఫారసు. దానిని ఆయన మీరడు. ఇది ఆమె భాగ్యము. ''రాఘవత్వే భవత్సీతా। రుక్మిణీ కృష్ణ జన్మని। అన్యేషు చావతారేషు। విష్ణో రేషా లక్ష్మీదేవి, పతి రాముడైతే సీత అయినది. కృష్ణుడైతే రుక్మిణి అయినది. తక్కిన అవతారములలోను ఆమె విష్ణువునకు నిత్యానపాయిని. అనగా ఎప్పుడును ఎడబాయనిది అని. ఆమె ఈ అవతారములో అలమేలు మంగగా ఎడబాయని జంట అయినది. అన్నమయ్యగారు పై విశేషములతో ఆమె భాగ్యమును వర్ణించి చెలులను చూడమని చెప్పినారు.

## 85. రంజని రాగం - ఖండచాపు

ప॥ ఇతరులకు నినుఎరుగ । తరమా
సతత సత్య వ్రతులు । సంపూర్ణ మోహవిర
హితు లెరుంగుదురునిను । ఇందిరా రమణా ॥ ॥ఇతరులకు॥

చ॥ నారీ కటాక్ష పటు । నారాచభయరహిత
శూర లెరుగుదురు నిను । జూచేటి చూపు ॥
ఘోర సంసారసం । కుల పరిచ్ఛేదులగు
ధీరు లెరుగుదురు నీ । దివ్య విగ్రహము ॥ ॥ఇతరులకు ॥

2) రాగ భోగవిదూర । రంజితాత్ములు మహా
భాగు లెరుగుదురు నిను । ప్రణుతించు విధము ॥
ఆగ మోక్త ప్రకా । రాభిగమ్యులు మహా
యోగు లెరుగుదురు నీ । వుండేటి ఉనికి ॥ ॥ఇతరులకు ॥

3) పరమ భాగవత పద । పద్మ సేవా నిజా
భరణు లెరుగుదురు నీ । పలికేటి పలుకు ॥
పరగ నిత్యా నంద । పరిపూర్ణ మానస
స్థిరులెరుంగుదురు నిను । తిరు వేంకటేశ ॥ ॥ఇతరులకు ॥

**తాత్పర్యము :**

ఓ లక్ష్మీ రమణా! ఎప్పుడు సత్యవాక్యము పలుకువారు, మోహమును సంపూర్ణముగా వదిలినవారు నిన్నెరుగగలరు. ఇతరు లెరుగలేరు. స్త్రీల కడగంటి చూపు లనెడి బాణములకు భయపడక నిలచిన శూరులు, సంసార బాధలను లెక్క చేయక అణచు వారు, రాగభోగాలకు దూరమయినవారు, వేదమందు చెప్పబడిన ధర్మముల నాచరించు మహా యోగులు, భగవద్భక్తులను సేవించు వారు, దుఃఖము మనస్సు కంటనీయక ఆనందముతో నుండు వారు మాత్రమే నీ మూర్తిని చూడగలరు. నిన్ను స్తుతింపగలరు. నీ ఉనికిని తెలుసుకొన గలరు. నీవు పలికిన పలుకును తెలుసుకొనగలరు. ఇట్టి వారు కాక ఇతరు లిదేమియు తెలుసుకొనలేరు.

**విశేషము :** పైన చెప్పిన తాత్పర్య విషయములు భగవద్గీత జ్ఞాన యోగమున సంగృహీతములై యున్నవి.

## 86. శంకరాభరణం - రూపకం

ప॥ చక్కని వాడ వన్నిటా । జాణవు నీవు ॥
ఇక్కడ నా సంతోష । మెంతనంగ వచ్చును ॥

చ॥ కన్నుల నన్ను జూచితే । కౌగిలించి నట్లవును
సన్న సేసితే వలపు । చల్లినట్లౌను ॥
చిన్న నవ్వు నవ్వితేను । సేస పెట్టిన ట్లౌను
విన్న వింప నెట్లు వచ్చు । వేడుక నాలోనిది ॥ ॥ చక్కని॥

2) సారె మాటాడితే మోవి । చవి గొన్నట్లౌను ॥
చేరి తేనె మేలెల్లా వ। చ్చిన యట్లౌను॥
నేరుపుతో చెనకితే। నెమ్మి బెండ్లాడి నట్లౌను
పేరు కొనగ నెట్టు వచ్చు । ప్రియములు నాకు ॥ ॥ చక్కని ॥

3) మతి నీవు దలచితే । మర్మము సోకిన ట్లౌను ॥
రతి గూడితేను క । రగిన యట్లౌను ॥
ఇతవై శ్రీ వేంకటేశ । యే నలమేల్ మంగను ॥
తతి బాయకుండితేను । దక్కిన ట్లౌను ॥ ॥ చక్కని ॥

**తాత్పర్యము :**

అలమేలు మంగ నాయిక. నాయకుడు వేంకటేశ్వరుడు నాయిక వద్దకు వచ్చినాడు. ఆ సంతోషముతో ఆమె అనుచున్నది. నీవు చక్కనివాడవు. అన్నిటిలోను గడుసువాడవు. నాకు చాల సంతోషముగ నున్నది. నీవు నన్ను చూచిన మాత్రమున కౌగిలించినంత ఆనందముగా నున్నది. నీవు కనుసంజ్ఞ చేసితే ప్రేమ నాఒడలునిండా చల్లి నట్లుగా నున్నది. నీవు ఒక చిన్న నవ్వునవ్వితే నా మీద అక్షతలు చల్లినట్లున్నది. నా ఆనందమింత అని చెప్పలేకున్నాను. ఒక

మాట మాట్లాడితే అధరోష్ఠమును పానము చేసి నట్లున్నది. నీవు నా వద్ద చేరితేనే శ్రేయస్సులన్నియు కలిసి వచ్చినట్లున్నది. నీవు నన్ను తాకితే పెండ్లాడినంతగా నున్నది. మనస్సులో నిన్ను తలచితేనే రతి జరిపినంత సుఖముగా నున్నది. అని అలమేలు మంగ వేంకటేశ్వరునితో తన ఆనందోద్రేకమును చెప్పుకొన్నది.

## 87. ముఖారిరాగం - ఆదితాళం

ప॥ అదివోకనుగొను । మదియొకతె ॥
ఎదుటనెనెలకొనె । నిది యొకతె ॥ ॥అదివో ॥

చ॥ తేటల మాటల । తెరలదె కట్టీ ॥
కాటుక కన్నుల । కలి కొకతె ॥
జూటరి చూపుల । జొక్కులు చల్లీ
నీటు గర్వముల । నెలతొకతె ॥ ॥అదివో ॥

2) ముసిముసి నవ్వులు । మోపులు గట్టీ
రసికుడ నీపై । రమణొకతె ॥
కొసరుల కుచముల । గోటలు వెట్టీ
మిసమిస మెరుగుల । మెలతొకతె ॥ ॥అదివో ॥

3) కాయజ కేళికి । కందువ జెప్పీ ॥
చాయల సన్నల । సతియొకతె ॥
యీ యెడ శ్రీ వేంక। టేశు గూడి నిను ॥
నోయని మెచ్చీ । నొక తొకతె ॥ ॥అదివో ॥

### తాత్పర్యము :

వేంకటేశ్వరుడు శృంగారనాయకుడు. నాయికలలో అష్టవిధనాయికలున్నారు. ఆ నాయిక లిప్పుడు నాయకుని వద్దకు వచ్చిరు. కవి ఇప్పుడు ఆనాయికలలోని శృంగారములను నాయకునితో చెప్పుచున్నాడు. వేంకటేశ్వరా! అదిగో అది ఒక నాయిక. ఇదిగో నీ ఎదుటనే నిలచినది ఒక నాయిక, ఆకర్షించే చూపులు చల్లి

సౌందర్య గర్వముతో ఒక నాయిక, ముసిముసి నవ్వుల మోపులు కట్టి, నీపై విసరేది ఒక నాయిక, కుచములను గట్టి కోటలుగా ఏర్పరచిన ఒక నాయిక, యౌవనముతో మిసమిసలాడుచున్నదొకతె, రతికి సంకేతము చెప్పే ఒక నాయిక, కను సంజ్ఞలుచేసే ఒక నాయిక, రతిసుఖమునునుభవించి ఓహో అని మెచ్చుకొనే నాయిక ఒకతె, ఇంతమంది నాయికలు నిన్ను చుట్టుకొని ఉన్నారు చూడవయ్యా! అని అన్నమయ్యగారు వేంకటేశ్వరునకు హెచ్చరిక చెప్పుచున్నారు.

**విశేషము :** ఇందు సంఖ్యకు ఎనమండ్రు నాయికలున్నారు. ఆ లక్షణములు కావు. కాని నాయకుడు వేంకటేశ్వరుడొక్కడే. పెక్కు మంది నాయికలతో సమముగా ప్రవర్తించువాడు దక్షిణనాయకుడు. ''తుల్యోఽనేకత్ర దక్షిణః'' - పెక్కు మంది నాయికలతో సమానముగా ప్రవర్తించువాడు దక్షిణనాయకుడన బడును అని అలంకార శాస్త్రము.

## 88. కమాస్ రాగం - ఆదితాళం

ప॥ కనుగొనరే యిరు । గడ చెలులూ ॥
పనివడి యివియే । ర్పరచగ గలరా ॥ ॥కను ॥

చ॥ ముదిత నవ్వులును । మొగి బతికాంతులు
గుదిగొని ఇరుదెస । గూడగను ॥
ఇది దిన మిదిరే । యిపుడని యెరుగక ॥
ముదముల చెమటల । మునిగిరి దాము ॥ ॥కను ॥

2) కలికి కోరికలు । గాంతుని యాసలు ॥
కలిసెను మనసుల । గా లవిసి ॥
తలపుల నివియే । తడబడ జేయగ
నిలువున నూరకె । నివ్వెరగైరి ॥ ॥కను ॥

3) అతివ నేరుపులు । నటు శ్రీ వేంకట ॥
పతి రతులు నొకట । బలుసుకొని ॥
చతురతనంబుల । సందడి సేయగ ॥
ఇతవగు కౌగిట । నెడ మీరైరి ॥ ॥కను ॥

**తాత్పర్యము :**

వేంకటేశ్వరుడు నాయికయు కలుసుకొన్నారు. వారు శృంగార చేష్టలు జరుపుచున్నారు. అన్నమయ్యగారు చెలులను పిలిచి చెప్పుచున్నారు. చెలులారా! మీరు వీటిని విభజించి చెప్పగలరా? ఆమె నవ్వులు విసరుచున్నది. అవి తెల్లగ నున్నవి. నాయకుని శరీరకాంతులు నల్లగానున్నవి. రెండును కలియుటచేత అది పగలో రాత్రో తెలియుటలేదు. నాయికా నాయకులు సఖములో చెమటలో మునిగి యున్నారు. ఆమె కోరికలు ఆయన ఆశలు కలిసి తడబాటు కలుగ జేస్తున్నాయి. ఆమె విలాసములు ఆయనరతులు ఒక దాని కొకటి బలపరచు చున్నాయి. ఇట్టి చతురత్వముతో కౌగిలిని వదలక ఆనాయకానాయికలు సుఖించు చున్నారు.

**విశేషము :** ఇందున్న నాయిక స్వాధీనపతిక. అనగా అన్నివిధములుగ నాయకుని స్వాధీనపరచుకొనినది.

## 89. కాంభోజి - ఆదితాళం

ప॥ ఎరిగించవలయు । నిప్పుడిపుడేనీ ॥
కరకరి నిన్నియు । గసరకు మీ ॥ ॥ఎరిగించ ॥

చ॥ చెలి నీపతిపై । చిందుల పాటలు ॥
పలుమరు నీతో । బాడగను ॥
అలులివి వినితా । నటు తమ పిల్లల
పిలుపని మూగిన । బెదరకుమీ ॥ ॥ఎరిగించ ।

2) అందపు నడుపుల । నటు నీ పలుకెదు
రిందు వదన నీ । వేగగను ॥
కందువ నంచలు । గతి యిది తమదని ॥
సందడి సేసిన । జడియకుమీ ॥ ॥ఎరిగించ ॥

3) ఓడక శ్రీవేంక ।టోత్తము కౌగిట
మేడెపు గుచములు । మెరయగను ॥
ఈడను జక్కవ । లివి తమజాతని
జోడుగ వాలిన । జోపకుమీ ॥ ॥ఎరిగించ॥

**తాత్పర్యము :**

వేంకటేశ్వరుని నాయిక వేంకటేశ్వరుని కలియుటకు బయలు దేరినది. దీనిలో ఎదురయ్యే ఇబ్బందులు నాయికకు తెలుపుచున్నాడు. ఓ చెలీ! ఇప్పుడిప్పుడే నీ కన్నియు తెలుపుచున్నాను. నన్ను కోపగించకు. నీవు వేంకటేశ్వరునిపై సన్నగా పాట పాడుచు వెళ్ళుదువు. ఆ ధ్వని తమపిల్లల పిలువని నీ చుట్టును మూగుతాయి భయపడకు. నీ అందపు నడకలు హంసలను పోలి ఉంటాయి. ఆ నడకలతో నీవు నడచుచుంటె హంసలు నీవొక హంసవని భావించి సందడి చేస్తే భయపడకు. వేంకటేశ్వరుడు వనములో నిన్ను కౌగిట చేర్చుతాడు. అప్పుడు నీ చనులు బయట పడతాయి. చక్ర వాకపక్షులు ఇవి తమ జాతి పక్షులని భ్రమపడి అక్కడకు వచ్చి వాలుతాయి. భయపడకు. అని కవి ముందు జాగ్రత్తలు చెప్పుచున్నాడు.

**విశేషము :** కవులు చనులను చక్రవాకపక్షులతో పోల్చుట కలదు.

## ౯౦. శివరంజని - ఖండచాపుతాళం

ప॥ ఏది చూచిన తమకు । నిన్నియును నిటు వలెనె ॥
వేదు విడిచిన కూడు । వెదకినను లేదు ॥ ॥ ఏది ॥

చ॥ ఏకాంత సౌఖ్యంబు । లెక్కడివి ప్రాణులకు ॥
పైకొన్న దుఃఖముల । పాలుపడె గాక ॥
ఏకమగు పుణ్యంబు । లేడగల విందరికి
కై కొన్న దురితములు । కలపాటి గాక ॥ ॥ ఏది ॥

2 హితమైన మమకార । మెందు గల దిందరికి
ప్రతిలేని విరహతా । పముకొలది గాక
మతిలోని వేడుకలు । మరి యేవి మనుజులకు
జితమైన దైవమి । చ్చిన పాటి గాక ॥ ॥ ఏది ॥

3 ఇరవైన దైవకృప । ఏల దొరకును దమకు ॥
పరమైన కర్మంబు । పరిపాటి గాక ॥
యెరవైన పెనుబంధ మేల వీడెడు నాత్మ
దిరు వేంకటేశుకృప తిరమైన గాక॥ ॥ ఏది॥

**తాత్పర్యము :**

ఈ ప్రపంచములో ఏదీ సుఖమైనది లేదు. తినే కూడు అంతా అమృతమయినదే లేదు. ప్రక్కనే వెగటును విడువనిది ఉంటుంది. సుఖము ప్రక్కన దుఃఖము కూడ వుంటుంది. సృష్టిలో నున్న ఇందరికిని పుణ్యమే ఉండదు. ప్రక్కనే పాపములు కలసి ఉండును. ఒక వస్తువుపై మమకారము సుఖముగా నున్నట్లే ఉంటుంది. కాని ఆ వస్తువు నశించిపోయినప్పుడు దుఃఖమే మిగులుతుంది. మానవుడు తన మనస్సులో చాలా కోరికలు కోరుకుంటాడు. అవి సిద్ధించినట్లే ఆనందపడతాడు. అవి పగటి కలలే. కాని దైవ మిచ్చిన వరకే అబ్బుతాయి. దైవము అనుగ్రహించి మంచి ఫలితాలను ఇవ్వాలంటే ఉత్తమమైన కర్మలను చేయవలసి ఉంటుంది కదా! ఇక సుఖమెక్కడ? అని తత్త్వబోధ చేసినా రన్నమయ్యగారు.

**విశేషము :** లోకములో ప్రతివాడును సుఖమును కోరు కొనును. దానికొరకు ఏదో చెయ్యవలెను. ఇది కష్టముతో కూడినది. తీరా సుఖమిచ్చి నట్లే అబ్బి చేయి జారిపోవును. అప్పుడు పర్యవసానము దుఃఖమే. ''భోగే రోగభయం కులే చ్యుతిభయం విత్తే నృపాలా ద్భయం । సర్వం చైవ భయాన్వితం మహితలే వైరాగ్య మేవా భయం'' - తింటే రోగభయము, పెద్దకులంలో పుట్టినవాడనని అనుకుంటే అది జారిపోవుననే భయము, ధనము బాగా కూడ బెట్టితే రాజా వలన భయము. ఇట్లే ఈలోకములో ప్రతిదీ భయముతో కూడినదే. వైరాగ్య మొక్కటే భయములేనిది అని శంకరాచార్యుల వారి సూక్తి. దీని సారమే ఈ గేయ మందు చెప్పబడినది.

# 91. సింధుభైరవి - ఆదితాళం

ప॥ నీవు దేవుడవు । నేనొక జీవుడ
ఈ విధి నిద్దరి । కెంత అంతరువు ॥ నీవు ॥

చ॥ పొడమిన జగములు । పుట్టెడి జగములు
గుడిగొనె మీ రోమ । కూపముల
యెడయక నీ రూప । మేమని ధ్యానింతు
అడరి మీ వాడ । ననుటే గాక ॥ నీవు ॥

2) మునుపటి బ్రహ్మలు । ముందరి బ్రహ్మలు
మొనసి మీ నాభిని । మొలచేరు
ఘనుడవు నిన్నే । గతి నే దెలిసెద ॥
అనువుగ మిముశర । ణనుటే గాక ॥ నీవు ॥

3) సహజానందము । సంసారానందము
ఇహము పరముగా । నిచ్చేవు ॥
అహిపతి శ్రీవేంక । టాధిప నీ కృప ॥
మహిలో సేవించి । మనుటే కాక ॥ నీవు ॥

**తాత్పర్యము :**

స్వామీ! వేంకటేశ్వరా! నీవు ఎంతో ఎత్తులో ఉన్న దేవుడవు. నేను ఎంతో క్రింద నున్న జీవుడను. ఈ స్థితిలో నేను నిన్నెట్లు తెలియగలను? పుట్టిన లోకములు పుట్టబోయే లోకములు నీ రోమ కూపములయందున్నవి. ఇట్టి నీ రూపము నేరీతిగా ధ్యానింపగలను? నీ దాసుడను అనుట తప్ప ధ్యానింపగలనా? జరిగిన కల్పములను సృష్టించిన బ్రహ్మలు సృష్టింపబోవు బ్రహ్మలును నీనాభినుంచి పుట్టెడివారే. ఇట్టి ఘనుడవైన నిన్ను నే నెట్లు తెలియగలను? నిన్ను శరణనుట తప్ప. సహజముగా ఆనందమని తోచే సంసారానందమును ఈ జన్మలోను రాబోవు జన్మలోనూ ఇచ్చువాడవునీవు. ఆది శేషునకు ప్రభువయిన వేంకటేశ్వరా! నీ కృపను ఈ లోకములో సేవించి ఉండుట తప్పనేనేమియు చేయలేను అని.

**విశేషము :** భగవన్మహిమ తెలుసుకొనుట కష్టము. కనుక ''ఆత్మదాస్యం హరేస్స్వామ్యం స్మర''– ఓ జీవా! నీ దాస్యమును హరియొక్క ప్రభుత్వమును గుర్తుంచుకొనుము. అనెడి సూక్తి ప్రకారము అన్నమయ్యగారిందు ''మీ వాడనుట'' అనినారు.

## 92. వలజిరాగం -ఖండచాపుతాళం

ప॥ కలిమి గలిగియు నధమ । గతియదేల ॥
బలిమి గలిగియులోగి । బతిమాల నేల? ॥ కలిమి ॥

చ॥ ఇలవేలుపొకడు హరి । ఇంటనే ఉండగా
పలువేలుపుల తోడి । భ్రమత లేల?
మెలగి సూర్యుడొక్కడు । మిక్కిలిని వెలుగగా
వెలలేని దీపములు । వేయి నేమిటికి? ॥ ॥కలిమి ॥

2) హరిభక్తి యొక్కటే । నాత్మలో నుండగా ॥
పరయుక్తు లెంచేటి । పనులేల?
సిరులు చింతామణులు । చేతిలో నుండగా
సరి గాజుబూస మె । చ్చగ నదేమిటికి? ॥ ॥కలిమి ॥

3) నాలుకను మంచి హరి । నామ మొకటుండగా
గాలిబోయెటి వూర । గాథలేల?
ఈలీల శ్రీవేంక । టేశుడెదుటనెయుండ
మూలలకు చే జాచి । మ్రొక్కనిక నేలా ॥ ॥కలిమి ॥

**తాత్పర్యము :**

సంపద కలిగియుండగా దరిద్రునివలె అధమగతితో నేలయుండవలెను? బలముండగా దుర్బలునివలె బరులను బ్రతిమాలు టెందుకు? ఇలువేలుపయి విష్ణువు ఇంటిలోనుండగా ఇతర దేవతల పై భ్రమత లెందుకు? సూర్యుడు చక్కగా

ప్రకాశించుచుండగా వెలలేని దీపములు వేయి ఎందుకు? ఆత్మలో విష్ణుభక్తి యుండగా ఇతరభావములతో పని ఏమి? సంపదలు, అన్నిటిని ఇచ్చే చింతామణియు చేతిలో నుండగా గాజుపూస దేనికి? నాలుకపై విష్ణు నామముండగా గాలికి పోయే ఊరకథ లెందుకు? వేంకటేశ్వరుడు ఎదుటనుండగా మూలలకు ఎవరికోసమో చేయిజాచనేల?

**విశేషము :** ఇందు ప్రధానమైన హరిభక్తి ఉంటే తక్కిన ఏవీ అక్కర లేదని. తక్కిన దేవతలతో పని లేదని ప్రధానప్రతి పాద్యము. కలిమి బలిమి మొదలయిన వాటిని ఉపమానముగా చెప్పివాటితో హరి భక్తికి బింబ ప్రతిబింబ భావమును చెప్పి ఆసాంతమును నిర్వహించుట చేత ఇది దృష్టాంతాలంకారము.

## 93. చారుకేశిరాగం - ఆదితాళం

ప॥ ఇరవగు వారికి । ఇహపరమిదియే ॥
హరిసేవే స । ర్వాత్మలకు ॥ ॥ఇరవగు ॥

చ॥ దురిత మోచనము । దుఃఖపరిహారము
హరి నామమె పో । ఆత్మలకు ॥
పరమ పదంబును । భవ న్నిర్హరణము
పరమాత్ము చింతే ప్ర । పన్నులకు ॥ ॥ఇరవగు ॥

2) సారము ధనములు । సంతోషకరములు
శౌరి కథలు సం । సారులకు ॥
కోరిన కోర్కియు । కొంగు బంగరువు
సారె విష్ణుదా । స్యము లోకులకు ॥ ॥ఇరవగు ॥

3) ఇచ్ఛయగు సుఖము । ఇరవగు పట్టము
అచ్యుతు కృపమో । క్షార్థులకు ॥
అచ్చపు శ్రీవేం । కటాధిపు శరణము
రచ్చల మాపాలి । రాజ్యపు సుగతి ॥ ॥ఇరవగు ॥

**తాత్పర్యము :**

ఈలోకములో అందరికి ఇహపరసాధనము హరిసేవే. అన్ని ఆత్మలకు పాపములను దుఃఖములను పోగొట్టునది హరినామమే. ప్రపన్నులకు (శరణాతులకు) హరిచింతనమే సంసారహరము, పరమపదము, సంసారులకు సారమైన సంతోషమును కలిగించే ధనములు హరియొక్క కథలే. జనులకు హరి దాస్యము కోరిన అన్ని కోరికలను తీర్చే కొంగుబంగారము. మోక్షము కోరినవారికి ఇష్టమయిన సుఖము, యోగ్యతాపత్రమును హరికృపయే. వేంకటేశ్వరుని శరణమనుటయే బజారుపాలయిన జీవులకు సామ్రాజ్యము. అని హరి సంబంధము యొక్క మహిమ ఇందు చెప్పబడినది.

**విశేషము :** బజారుపాలగుట అంటే సంసారమున పడుట. మరియు ఏ దిక్కు లేకపోవుట. అట్టివారికి వేంకటేశ్వర శరణాగతి రాజ్యము చేజిక్కిన వంటిది. ఇది పరమార్థము.

## 94. బారుకేశిరాగం - ఆదితాళం

ప॥ చాల దాహరి । సంకీర్తనము ॥
మేలిది దీనసే । మెరసిరి ఘనులు ॥ ॥చాలదా ॥

చ॥ తలపవేదశా । స్త్రములు గానక
అలరుచు వాల్మీ । క్యాదులు ॥
తలకొని హరిమం । త్రమెతగ బేర్కొని ॥
నలవి మీర గడు । నధికము లైరి ॥ ॥చాలదా ॥

2) ఇతర దైవముల । నెరుగ నేరక
ప్రతి లేని మహిమ । బార్వతి ॥
మతి దలచుచు హరి । మంత్రమె పేర్కొని
సతతము హరులో । సగమైనిలచె ॥ ॥చాలదా ॥

3) చదువులు బలుమరు । చదువ నోపక
అదువో నార । దాదులు ॥
పదిలపు వేంకట । పతి హరినామమే
వదల కిదియ జీ । వనమై మనిరి ॥ ॥చాలదా ॥

**తాత్పర్యము :**

హరినామ మొక్కటే చాలు. దీని వలననే ఎంతో మంది ఘనులైనారు. వేదశాస్త్రము లంటే ఏమిటో తెలియని వాల్మీకి మొదలయినవారు నామముతో ఘనులయిరి. పార్వతి నామస్మరణ మహిమ చేతనే పతి అర్ధ శరీరముగా నిలచినది. చదువులు చదువకయే నారదాదులు హరినామమే జీవనము కాగా ఘనులయినారు. కనుక హరి నామ మొక్కటేచాలునని అన్నమయ్యగారి బోధ.

**విశేషము :** వాల్మీకి బోయవాళ్లతో చేరి దారులు కొట్టుచుండగా ఒకనాటి రాత్రి ముని బృందము దొరికినది. మునులు వాల్మీకి ననుగ్రహింపదలచి వానికి రామ నామమును ఇటునుండి అటు చేసి ''మరామరా'' అని ఉపదేశించిరి. భగవన్నామము అంటే వాడు ఒప్పుకొనడని ఏదో చెప్పి దానిని స్మరింపుమనిరి. వాడు దానిని స్మరింపమొదలిడెను. వాని ఉద్దేశ్యము లేకపోయినను అది రామ నామమయి ఆత్మలో వేదవేత్త అయి రామాయణము రచించి ఆది కవి అయినాడు. నారదుడు ఒకకల్పములో దాసీపుత్రుడు. అది వానిని ఋషి వాటికలో వదలి మరణించినది. నారదుడు ఋషివాటికలలో తిరుగుచు వారు స్మరించు హరినామమును పట్టుకొని ఉద్దేశ్యము లేకయే స్మరించినాడు. ఫలితముగా ఈ కల్పములో దేవముని అయినాడు. నామమును వదలలేదు. ఎన్నో మంచిపనులు చేసినాడు వాల్మీకి రామాయణ రచనమునకు, వేదవ్యాసమహర్షి భాగవత రచనమునకు మార్గ దర్శకుడైనాడు. శివుడు పార్వతికి ''శ్రీ రామరామ రామేతి'' అని రామనామము నుపదేశించినాడు. దాని ప్రభావముతో శివుని అర్ధాంగి అయినది. (ఇది భావన). ఇట్లన్నమయ్యగారు నామ మహిమ నుద్ఘాటించినారు.

# 95. ఆరభిరాగం - ఆదితాళం

ప॥ తలపులోననే । దైవము వీడిగో ॥
సులభము సులభము । సోదించరో ॥ ॥తలపు ॥

చ॥ ఇదే హరి నామము । ఇదే కొసనాలికె
వదలక తలచితే । వైకుంఠము ॥
వెదకగ నేటికి । వెడపుణ్యములిక ॥
సదరము సదరము । సాధించరో ॥ ॥తలపు ॥

2) కలదుదేహమిదె । కలవివె ముద్రలు
వలెనని చేకొన్న । వైకుంఠము ॥
పొలసి కర్మముల । బొరలగ నేటికి
కలిగెను కలిగెను । కైకొనరో ॥ ॥తలపు ॥

3) శ్రీ వేంకట మిదె । శ్రీ పతి వీడిగో
వావిరి గొలిచిన । వైకుంఠము ॥
భావించి చూచిన । బ్రహ్మాదులకును
త్రోవయిదె త్రోవయిదె । తొలగకురో ॥ ॥తలపు ॥

**తాత్పర్యము :**

తలపులోనే ఉన్నాడు దేవుడిడిగో. ఈ దేవుని సేవించుట అతి సులభము. మానవులారా! దీనిని శోధించండి. ఇదిగో హరినామ మున్నది. ఇదిగో నాలుక ఉన్నది. స్మరిస్తే వైకుంఠవే. దీనిని సాధించండి. వేరే పుణ్యం కోసం పాటుపడకండి. ఈ దేహమున్నది. ఈ భుజముల పై ముద్రలున్నవి. ఇది కావలెనని చేకొన్నవైకుంఠము. ఇతర కర్మలలో పొరలుట దేనికి? ఇదిగో తిరుమల క్షేత్రము. ఇడుగో వేంకటేశ్వరుడు. ఈయనను కొలిచితే వైకుంఠము. బ్రహ్మాదులకు కూడ ఇదే మార్గము. దీని నుంచి తొలగకుడు అని బోధనము.

**విశేషము :** వ్యాసమహర్షి ''నారాయణేతి శబ్దోస్తి । వాగస్తి వశవర్తినీ'' – ''నారాయణ'' అనెడి శబ్దమున్నది, వాక్కు మన వశములో నున్నది. ఈ రెండిటిని అనుసంధించి తరించుడు'' అని బోధించెను. కులశేఖరులు ''చేతసాసేవ్యే స్వస్యపదస్యదాతరి'' = మనస్సుతో సేవించిన మాత్రమున తన పదమును హరి ఇచ్చును'' అని చెప్పిరి. ''కలవివె ముద్రలు'' = వైష్ణవ సంప్రదాయమందు తప్తమయిన శంఖచక్రముద్రలను భుజములయందు ధరించెదరు. ఇవి ఆచార్యుడు ధరింపజేయును. బ్రాహ్మణుల కుపనయన మెట్లు విహితమో వైష్ణవుల కిది విహితము. దీని ఆవశ్యకత్వమును మహిమను ''యేన దేవాః పవిత్రేణ'' వంటి, వేదవాక్యములు, పద్మపురాణము, పాంచరాత్రాగమము ప్రతిపాదించినది. ఈ సంస్కారమును అన్నమాచార్యులు ''వలెనని చేకొన్న వైకుంఠము'' అన్నారు. ఇది గమనార్హము. కొంతమంది దీనిని వేరుగా భావిస్తున్నారు.

## 96 ఆభోగిరాగం = ఆదితాళం

ప॥ ఒసగితి వన్నియు । నొకమాటే ॥
వెసనిక చేసే । విన్నపమేదీ ॥ ॥ ఒసగితి ॥

చ॥ నారాయణ నీ । నామము దలచిన
నీరాని వరములు । నిచ్చితివి ॥
చేరి నిన్ను నిటు । సేవించిన నిక
కోరి పడయ నిక । కోరికలేవీ ॥ ॥ ఒసగితి ॥

2. హరి నీ కొక పరి । యటు శరణంటే
గరిమల నన్నిటు । గాచితివి ॥
నిరతముగానిక । నిను నుతియింపుచు ॥
అరగొర నివినిను । నడిగేదేదో ॥ ॥ ఒసగితి ॥

3. శ్రీ వేంకటేశ్వర । చేయెత్తిమ్రొక్కిన
భావమే నీవై । పరగితివి ॥
ఈ వరుసల నీ । వింతటిదాతవు
ఆవల నిను కొని । యాడెడి దేమి? ॥ ఒసగితి ॥

**తాత్పర్యము :**

ఓ వెంకటేశ్వరా! నీవు నా కీయవలసిన వన్నియు నిచ్చినావు. నీ నామము, నీసేవ, భావములో నిలచుట, నీ శరణాగతి ఇవన్నియు నాకిచ్చినావు. ఇక నిన్ను అడగవలసినది, కోరవలసినది ఏమియులేదని అన్నమయ్యగారు కృతజ్ఞత తెలుపుకొన్నారు.

**విశేషము :** ''నాస్థాధర్మే, న వసునిచయే, నైవకామోపభోగే యద్యద్భవ్యం భవతి భగవన్ పూర్వకర్మానురూపం ఏతత్ప్రార్థ్యం మమ బహుమతం జన్మజన్మాంతరేపి త్వత్పాదాంభోరుహయుగగతా నిశ్చలా భక్తిరస్తు = ఓ ముకుందా! నాకు ధర్మార్థ కామముల యందు కోరికలేదు. అవి ఏవిధంగా కావలసి ఉంటే అట్లవుతాయి. కాని, నాకు చాలా ఇష్టమైన కోరిక ఒకటి ఉన్నది. అది జన్మ జన్మలకును నీ పాద పద్మములయందు నిశ్చలమగు భక్తికావలయును. దాని నొసంగుమని కులశేఖరుల ప్రార్థనము. కాని ఇక్కడ అన్నమాచార్యులది, ఆ భక్తి సమగ్రముగా ఇచ్చితివి కనుక నిన్ను నేను కోరవలసినది ఏమియు లేదు అని.

## 97. కాపిరాగము = ఖండచాపు

ప॥ ఇద్దరి గుణంబులివి । ఇంతులాల ॥
చద్దికిని వేడికిని । సంగడించీని ॥

చ॥ వొలసి సూర్యునిలోని । నుండేటి అలవాటు
కలదు గద విరహాగ్ని । గలగడతడు ॥
పొలితి దేహము మొదల । పూదీగె గనక ఇది
వలరాచ కాకచే । వాడ బారీని ॥ ॥ ఇద్దరి ॥

2) సరిలేని పంచశర । గురుడు గవపైకొన్న
విరిబాణములకెల్ల । వెరవడతడు ॥
గరిమనీ చెలిమనసు । గంటి లేనిది గనక
వరుసలోలోమెఱుగు । వలెనె దాగీని ॥ ॥ ఇద్దరి ॥

3) శ్రీ వేంకటాద్రిపై । జెలగు దేవుడు గనక
ఈ వనితకుచగిరుల । నిటు మరగెను ॥
ఏవంక నీచెలియ । ఇందుకే కోరెగన
భావమున సంతసము । పచ్చిదేరీని ॥ ॥ ఇద్దరి ॥

**తాత్పర్యము :**

ఇచ్చట శృంగారనాయిక శృంగారనాయకుడగు వేంకటేశ్వరుని గుణములను కవి మనకు చెప్పుచున్నాడు. ఓ స్త్రీలారా! ఇద్దరి గుణములు చలువకు వేడికి రెండికిని సంబంధించిన గుణములు. వేంకటేశ్వరుడు సూర్యుని లోపల నుండే అలవాటు కలవాడు కనక విరహతాపము ఆయన నేమియు చెయ్యలేదు. (ఇది ఈయన వేడి) నాయిక దేహము పూవుతీగవంటిది కనుక మన్మధతాపమునకు వాడిపోతుంది. (ఇది రమచలువ). సాధారణముగా మన్మధుని బాణములు అందరిని కలతపెడతాయి. కాని వెంకటేశ్వరుడు మన్మధుని తండ్రి కనుక మన్మధబాణములు వేంకటేశ్వరుని ఏమియు చేయలేవు. నాయిక యొక్క మనస్సుకు గాయములేదు కనుక లోపలి కాంతి వలెనే లోపల దాగి యుండును. వేంకటేశ్వరుడు తిరుమల కొండమీద నుండుట కిష్టపడు స్వభావము కలవాడు కనుక నాయిక యొక్క చనుకొండల కిష్టపడినాడు. నాయిక కూడా నాయకుని ఇందుకే కోరినది. భావము పచ్చిబారినది. అనగా కోరికలు చిగిర్చినది అని.

**విశేషము :** ఆయన వేడికి అలవాటు పడినవాడు. ఆమె చలువకలవాటు పడినది. ఈ విరహములో కలిగిన వేడిచలువలు ఆనాయికానాయకులకు బాధాకరములు కాలేదు. ''ధ్యేయస్సదా సవితృమండల మధ్యవర్తీ! నారాయణః'' = సూర్యమండల మధ్యమందున్న నారాయణుడు ఎప్పుడూ ధ్యానింపదగినవాడు'' అని పురాణసూక్తి.

''య ఏషోంతరాదిత్యే'' = పరమాత్ముడు సూర్యమండలములోపల నున్నాడు'' అని వేదము. చనులను కొండలతో పోల్చుట కవి సమయసిద్ధము.

# 98. హరికాంభోజి = ఆదితాళం

ప॥ ఇంతి చెలువమే । ఈతనికి
కంతుని చేతల । కలసిన వేళ ॥ ॥ ఇంతి ॥

చ॥ చిత్తజకేళి నీ । చెలి కుచగిరులివి
హత్తిన రమణున । కాదరువు ॥
నెత్తమ్మి తావుల । నిట్టూర్పుల గములు
కొత్తగుబడలిక । కును పరిహారము ॥ ॥ ఇంతి ॥

2) వలపులాకటికి । వనిత అధరమిది
చెలువునకిపుడమ । సిన విందు ॥
చెలప చెలపమై । చెమట పన్నీరు ॥
తెలియగ చలిపం । దిరివో పతికి ॥ ॥ ఇంతి ॥

3) పట్టుగొమ్మ యీ । పడతి దేహలత ।
గట్టిగ (శ్రీ) వేం । కటపతికి ॥
ఇట్టె ఇన్నియు । నీ కెకు నితనికి
పట్టిన వెల్లా । బంగారములు ॥ ॥ ఇంతి ॥

## తాత్పర్యము :

వేంకటేశ్వరునకు నాయికకు రతి జరిగినది. ఆరతిలో కలిగిన బడలికను ఆమెలో ఉన్న సౌందర్యము మొదలయినవే తీర్చేవయినవి. రతి క్రీడలో ఆమె చనుగొండలే ఆయన కాధారమైనవి. ఆమె నిట్టూర్పులు పద్మపరిమళముతో ఇవతలకు వచ్చుచున్నవి. అవియే ఆయన బడలికను తీర్చే పిల్లగాలులయినవి. ఆయన కాకలివేసినది. ఆమె క్రింది పెదవియే ఆయన కిపుడువిందు. ఆమె పన్నీటి చెమటయే ఆయునకు చలువ పందిరి. కలిగిన రతిశ్రమవలన పట్టుదప్పి పడబోవుచున్న వేంకటేశ్వరునకు ఆమె దేహలతయే పట్టుకొమ్మ. ఈ విధముగా తన సౌందర్య వస్తువులన్నీ తన నాయకునకు అవసరమునందు ఆదుకొనువస్తువులై పట్టినదెల్లా ఇరువురికిని బంగారమయినది అని. ఇది అపూర్వమయిన వర్ణనము.

# 99. జంఝూటి = ఆదితాళం (త్రిశ్రగతి)

ప॥ అంతసిగ్గుపడకనీ। వాన తీయవయ్యానీ
అంతరంగ మేల దాచ। నానతీయవయ్యా॥ ॥ అంత ॥

చ॥ కడు సరసుడవట। ఘనుడ నీ మోమందు
నడరిన కళలెల్ల। నాన తీయవయ్యా॥
ఒడికమ్మై నీమోవి। నున్న కెంపులవి యెన్ని
అడియాలముగనాకు। నానతీయవయ్యా॥ ॥ అంత ॥

2) మిక్కిలి జాణవట। మేనిమీద చెమటలు
అక్కట యెందుండి వచ్చె। నానతీయవయ్యా॥
గుక్క కిట్టెయే యింతి। గుబ్బలపై కుంకుమోనీ
అక్కుమీద నంటినది। ఆనతీయవయ్యా॥ ॥ అంత ॥

3) ఎసగి శ్రీ వేంకటేశ। ఇట్టే కౌగిటిలోన
అసురుసురులేలవచ్చె। నానతీయవయ్యా॥
ముసిముసి నగవుతో। మునిగి నా కొనగోరి
కొసమిచ్చి ఏలలోగే। వాన తీయవయ్యా॥ ॥ అంత ॥

**తాత్పర్యము :**

శ్రీ వేంకటేశ్వరుడు ఒక నాయిక వద్దకు వచ్చినాడు. ఆయన వద్ద ఇంకొకనాయికతో రమించివచ్చిన గురుతులు కనిపించుచున్నవి. అప్పుడు ఆనాయిక నాయకుని నిలువదీసి అడుగుచున్నది. ఇట్లు అంతసిగ్గువడక చెప్పుము. మనస్సును దాచక చెప్పుము. నీవు గొప్ప సరసుడవు, ఘనుడవు, నాకు తెలుసునులే. నీ ముఖములో కళలు మారి కనపడుచున్నవి. కారణము చెప్పుము. నీ పెదవిమీద ఆ ఎర్రని గుర్తులు కనపడుచున్నవి. అవి ఏమిటి చెప్పుము. నీవు చాలా జాణవట. నీ శరీరమున చెమట లెక్కడ నుండి వచ్చినవి? చెప్పవయ్యా! నీ రొమ్మున అంటిన కుంకుమ ఎవతెది? కౌగిలించుకుంటే ఉస్సురమంటున్నావు. ఇది ఏలవచ్చినది. నేను కొనగోరితో గుచ్చితే ముసిముసి నవ్వులు నవ్వుచుకుంచించుకుపోవుచున్నా వెందుకు? అని వెంకటేశ్వరుని నిలువదీసి అడుగుచున్నది ఈ నాయిక.

**విశేషము :** శ్లో॥ జ్ఞాతేఽన్యాసంగ వికృతే । ఖండితేర్ష్యాకషాయితా'' = తన నాయకుడు ఇంకొక స్త్రీతో రమించివచ్చినట్లు కనబడిన నాయకుని చూచి ఈర్ష్యతో మగ్గిననాయిక ఖండితనాయిక అనబడును. అని అలంకారశాస్త్రము. ఇందు ఈ నాయిక ''ఖండిత''

## 100. దుర్గరాగం = ఆదితాళం

ప॥ ఆణికాడవట । అంతటికీ ॥
జాణవు తెలియము । సరిగొనవయ్యా ॥

చ॥ ముంగల చెమటల । ముత్యపు బూసలు
అంగన లోలో । నమ్మేనదే ॥
ఇంగితంబు వెల । లెరుగుదు వటవో ॥
యంగడి బేహారి । యని గొనవయ్యా ॥ ॥ ఆణి ॥

2) మొల్లమి మాచెలి । మోవి మాణికము
అల్ల వెలకు నీ । కమ్మేనదే ॥
తొల్లి నీవు సూ । దుల వాట్లచే
కొల్ల లడిగితట । కొనవయ్యా ॥ ॥ ఆణి ॥

3) నిడుదల చూపుల । నీలంబులు నీ
వడిగినంతకే । అమ్మేనదే ॥
పడతిదె శ్రీ వేంకటపతి నీవిదె
యెడయని కౌగిట । ఇటు గొనవయ్యా ॥ ॥ ఆణి ॥

**తాత్పర్యము :**

ఇందు నాయిక యొక్క లక్షణములను అంగడిలోని వస్తువులవలె పోల్చి వేంకటేశ్వరునితో అవి కొనుమని చెప్పుచున్నారు. వేంకటేశ్వరా! నీవు మర్మజ్ఞుడవు. ముఖము పై నున్న చెమట బిందువులు అవి ముత్యములు. నాయిక వాటిని నీ

కమ్మదలచినది. ఆమె భావముల వెల నీవెరుగుదువు. బేరగాడిని అని సరిగా కొనుము. మా చెలియొక్క పెదవి దట్టమయిన మాణిక్యము. దానిని కూడ నీకు వెల కమ్ముతుంది. దాని నింతకుముందు నీ పలుగాట్ల కడిగి నావట. అట్లే కొనుము. పొడవైన ఆమె చూపులు ఇంద్రనీల మణులు. నీవడిగిన వెలకే ఇస్తుంది. ఆమె ఇదిగో, నీవిదిగో. మధ్యవర్తిని నేనెందుకు? నీ కౌగిలితో ఈమెను కొనవయ్యా! అని అన్నమయ్య గారు తనస్వామితో చెప్పుచున్నారు.

**విశేషము :** నాయిక ఒక రత్నముల అంగడి. చెమట బిందువులు ముత్యములు. పెదవి ఒకగట్టిమణి. చూపు లింద్రనీలములు. వీటి అన్నిటి వెల వేంకటేశ్వరుని కౌగిలియే. కవి ఇట్లు తన మేధాశక్తితో చక్కని రూపకాలంకారమును చేసెను.

## 101. ఖరహరప్రియ రాగం = ఆదితాళం

ప॥ ఇందిరానామ । మిందరికి
కుందనపు ముద్దవో । గోవిందా ॥ ఇందిరా ॥

చ॥ అచ్చుతనామము । అనంతనామము
ఇచ్చిన సంపద । లిందరికి ॥
నచ్చిన సిరులు । నాలుకతుదలు
కొచ్చి కొచ్చీ వో । గోవిందా ॥ ఇందిరా॥

2) వైకుంఠ నామము । వరదనామము
ఈకడ నాకడ । నిందరికి ॥
వాకు దెరపులు । వన్నెలు లోకాల
గూకులు పత్తులు వో । గోవిందా ॥ ఇందిరా॥

3) పండరి నామము । పరమనామము
ఎండల నాపెడి । దిందరికి ॥
నిండు నిధానమై । నిలిచిన వేళ
కొండల కోనేటి వో । గోవిందా ॥ ఇందిరా॥

**తాత్పర్యము :**

ఓ గోవిందా! లక్ష్మీ దేవి యొక్క నామము అందరికిని బంగారపు ముద్ద. అచ్యుతనామము, అనంత అనే నామమును అందరికిని నీ విచ్చిన సంపదలు. నామములు నాలుక తుద నుండే నచ్చిన సంపదలు. హరినామము వరాలిచ్చేనామము. ఈ లోకములో పరలోకములో కూడ వాక్కుకు వికాసము వన్నె కలిగించు నామములు. ఇవే ఆహారములు, ఈలోకములను నడిపించే సేనలు. పండరినామము ఉత్తమమయిన నామము. సంసార తాపమును బాపే నామము. ఓ వేంకటేశ్వరా! నీ నామమే అందరికిని నిధి నిక్షేపము. అని నామమహిమ చెప్పబడినది.

**విశేషము :** ఒక్కొక్క నామములో ఒక్కొక్క విశేషమున్నది. నామము లన్నిటిలో అచ్యుత, అనంత, గోవిందనామములు చాల గొప్పవి. శివుడు హాలా హలమును పైనామము లుచ్చరించి పానము చేసి రక్షితుడైనట్లు వరాహపురాణగాథ. ద్రౌపదికి వస్త్రము లిచ్చినది గోవిందనామము. ద్రౌపది ''శంఖ చక్రగదా పాణే, ద్వారకానిలయాచ్యుత। గోవింద పుండరీకాక్ష'' అనే నామములతో పిలిచినది. కృష్ణుడు కాలాంతరమున ''గోవిందేతి యదాక్రందత్ కృష్ణామాందూర వాసినం।ఋణం ప్రవృద్ధ మివమే। హృదయాన్నాప సర్పతి'' = ద్రౌపది దూరమందున్న నన్ను ''గోవిందా'' అని పిలచిన పిలుపు నా హృదయమునుండి తొలగిపోవుట లేదు'' అంటాడు. ఈ వాక్యము భారతములోనిది. ఈ గోవిందనామమే వేంకటేశ్వరుని నామములలో ప్రధానమైనది. ఇట్టినామము లొక్కచో చేర్చి అన్నమయ్యగారు నామమహిమను పేర్కొన్నారు. ''లక్ష్మీతో కూడిన విష్ణువునే సేవింపవలెను'' అనే వైష్ణవ సంప్రదాయమును బట్టి ఇందిర నామముతో ఈ గేయము ప్రారంభమయినది. గమనార్హము. రామానుజార్యుల వారు కూడ శ్రీరంగ గద్యమునకు వైకుంఠగద్యమునకు ముందుగా లక్ష్మీ దేవి పరముగా ''శరణాగతి గద్య'' మును అనుసంధించిరి. ముఖ్యభాగమయిన పల్లవి యందు ఇందిరానామముండుటచే ప్రధాన వివక్ష జరిగినది.

## 102. రాగమాలిక = ఆదితాళం

ప॥ వెరవకు మనసా। విష్ణుని అభయము
నెరవుగ నెదుటను । నిలచినది ॥ ॥వెరవకు॥

చ॥ శ్రీపతి కరుణే । జీవరాసులకు
దాపున దండై । తగిలినది ॥
పైపై దేవుని । బలు సంకల్పమే
చేపట్టి రక్షింప । జెలగేది ॥ ॥వెరువకు॥

2) నలినోదరు నిజ । నామాంకితమే
ఇలపై దాసుల । నేలేది ॥
కలిభంజను శంఖ చక్ర లాంఛన
మలవడి శుభముల । నందించేది ॥ ॥వెరవకు॥

3) శ్రీ వేంకట పతి । సేసిన చేతలే
వేవేలు విధుల । వెలసేది
భూవిభుడీతడు । పూచిన మహిమలె
కై వశమై మము । గా చేసి ॥ ॥వెరువకు॥

### తాత్పర్యము :

అన్నమయ్య తనమనస్సుకు అభయము తెలుపుతున్నారు. ఓ మనసా! వెరవకుము. స్వామి యొక్క అభయము విశాలముగ ఎదుటనే నిలచి ఉన్నది. వేంకటేశ్వరుని కరుణయే సమస్త జీవులకు సమీపమున బలమై వచ్చి యున్నది. ఆ స్వామి యొక్క నామమే దాసులను రక్షించేది. స్వామియొక్క శంఖచక్ర ముద్రలే మన భుజములయందుండి శుభముల నిచ్చును. ఆయన చేతలే వేయి విధములుగా మనను రక్షించునది. భూనాధుడైన ఆయన మహిమలే మనకు చెయిజిక్కి రక్షించునవి.

**విశేషము :** వేంకటేశ్వరుని అభయముద్ర ఉన్నది. నీవు భయపడవలదు. అది నిన్ను రక్షిస్తుంది. అని అభయ బోధ. కులశేఖరులు ''మాభీ ర్మంద మనో విచింత్య బహుధా యామీ శ్చిరం యాతనాః । నామీ నప్రభవంతి పాప రిపవః స్వామీ నను శ్రీ ధరః''= ఓ మందమనమా! యమబాధలను తలచుకొని భయపడకుము.

బహుసమర్థుడైన మన స్వామిముందు అవినిలువలేవు'' అని బోధ చేసినారు. అట్లే ఇదియును. అన్నమయ్యగారు శంఖ చక్ర ముద్రల ప్రస్తావము తరచు తెస్తున్నారు. దీని విశేషము. యమధర్మరాజు ''యేబాహుమూల పరిచిహ్నిత శంఖచక్రాః'' బాహువులయందు శంఖ చక్రముద్రలు కలవారు అని ప్రపన్నులగుర్తు చెప్పుచు ''పరిహర మధుసూదన ప్రపన్నాన్'' = ఓరీ భటుడా! అట్టి భగవద్భక్తుల జోలికి వెళ్ల వద్దు అని చెప్పును. (ఇదిముద్రల మహిమ).

## 103. రాగమాలిక = ఆదితాళం

ప॥ నారాయణాయ నమోనమో । నానాత్మనే నమోనమో ॥
ఈరచనలనే ఎవ్వరు దలచిన । ఇహపరమంత్రము లిందరికి ॥ ॥నారా॥

చ॥ గోవిందాయ నమోనమో । గోపాలాయ నమోనమో ॥
భావజగురవే నమో నమో । ప్రణవాత్మనే నమోనమో ॥
దేవేశాయ నమోనమో । దివ్య గుణాయ నమోనమో ॥
ఈ వరుసలనే ఎవ్వరు దలచిన । ఇహపరమంత్రము లిందరికి ॥ ॥నారా॥

2) దామోదరాయ నమోనమో । ధరణీశాయ నమోనమో ॥
శ్రీ మహిళా పతయేనమోనమో । శిష్ట రక్షిణే నమోనమో ॥
వామనాయతే నమోనమో । వనజాక్షాయ నమోనమో ॥
ఈమేరలనే ఎవ్వరు దలచిన । ఇహపరమంత్రము లిందరికి ॥ ॥నారా॥

3) పరిపూర్ణాయ నమోనమో । ప్రణవాగ్రాయ నమోనమో ॥
చిరంతన శ్రీ వేంకటనాయక । శేషశాయినే నమోనమో ॥
నరకధ్వంసీ నమోనమో । నరసింహాయ నమోనమో ॥
ఇరవుగ నీగతి నెవ్వరు దలచిన । ఇహపరమంత్రము లిందరికి ॥ ॥నారా॥

**తాత్పర్యము :**

ఈపదములో పల్లవిలో రెండవ పంక్తి చరణాలలో 4వ పంక్తులు మాత్రము తెలుగు. తక్కిన దంతయు సంస్కృత రచనము. వాటి అర్థము మాత్రము

పొందుపరచుచున్నాను. నారాయణునకు, మన్మథుని తండ్రికి, ఓంకార స్వరూపునకు, దేవతల ప్రభువునకు దివ్యగుణములు గలవానికి, దామోదరునకు, భూమి పతికి, లక్ష్మీ పతికి, శిష్టులను రక్షించువానికి, వామనునకు, పద్మనేత్రునకు, పరిపూర్ణునకు, ప్రణవాగ్రునకు ( ఓంకారమునందు మొదట నున్నవానికి), శాశ్వతునకు, శ్రీ వేంకటేశ్వరునకు, శేషశాయికి, నరకుని సంహరించినవానికి, నరసింహునకు నమస్కారము నమస్కారము. ఈ విధముగా ఎందరు స్మరించినా ఇహపరసాధనమయిన పరమ మంత్రము అని తాత్పర్యము.

**విశేషము :** ప్రణవాగ్రునకు = ఓంకారమందు మొదటనున్నవారికి అనగా ఓం అనుదానియందు అ-ఉ-మ్ అని మూడక్షరములున్నవి. వాటిని సంధిస్తే ఓం అయినది. ఆమొత్తములో మొదటిది ''అ'' కదా! దీనిని అకార మందురు. కృష్ణపరమాత్మ గీతలో ''అక్షరాణామకారోస్మి'' = అక్షరములలో నేను అకారమును అని చెప్పినాడు. మరియును ''యోవేదా దౌ స్వరః ప్రోక్తః। వేదాంతే చప్రతిష్ఠితః। తస్య ప్రకృతి లీనస్య। యఃపరస్స మహేశ్వరః'' = వేదాది అయిన ఓంకారమందు ప్రకృతి అక్షరమయిన అకారమునకు మహేశ్వరు డనగా నారాయణు డర్థము'' అని. విశేషములో విశేషము ఇందు పల్లవి నారాయణాష్టాక్షరి మంత్రములో మొదటి అక్షరమైన ఓంకారమును వదలిపెట్టి తక్కిన రెండు పదములతో ప్రారంభించినది. మొదటి చరణములో ''ప్రణవాత్మనే'' అని చెప్పుటచేత ఆలోపము తీరినది. అందుచేత మంత్రరాజమైన అష్టాక్షరమంత్ర మిందు ప్రతిపాదింపబడినది. అష్టాక్షరమంత్రమునందు ఫలశ్రుతిగా ''విందతే ప్రాజా పత్యం రాజస్పోషం గౌపత్యం తతోమృతత్వముశ్నుతే'' = నారాయణాష్టాక్షరమంత్ర జపముచేసినవాడు ప్రజాపతి అగును, రాజపూజనందును, భూపతి అగును, పిదప ముక్తినందును'' అని చెప్పబడినది. 3 చరణముల యందును చివరి తెలుగుపంక్తులు పైఫలశ్రుతినే చెప్పినవి. అన్నమయ్య గారి ఈ గేయము నారాయణాష్టారమంత్ర తుల్యము అని చెప్పవచ్చును.

# 104. సింధు భైరవి = ఆదితాళం (త్రిశ్రనడ)

ప॥ ఏటిజోలి చేకొంటివి । ఎంత విరాళి ॥
నీటున నింతి కడకు । నేడే రారాదా ॥ ఏటి॥

చ॥ కలికి కన్నుల చూపు । కడలేని తరితీపు
మొలక చన్నులు నీవు । మోచేటి మోపు ॥
తెలిసి చూడవలపు । తెగరాని రారాపు
కలిగి నింతి కడకు । గక్కన రారాదా ॥ ఏటి॥

2 వనిత చిగురు మోవి । వన్నెలైన చెంగావి
దినదినమును నీకు । తియ్యని తావి ॥
చెనకి మీ యిద్దరికి । జెప్పితినే నిండు వావి
యెనసి ఇంతికడకు । నిప్పుడె రారాదా ॥ ఏటి॥

3 అలమేలు మంగమాట । అమరు కోవిల పాట
కలయికలకు నిదే । కాగిటి పూట
ఎలమి శ్రీ వేంకటేశ । యీకె గూడితి విచ్చోట ॥
తలచి యింతి కడకు । తప్పక రారాదా ॥ ఏటి॥

**తాత్పర్యము :**

ఇందు శృంగారనాయిక అలమేలుమంగ. కాని వేంకటేశ్వరుడు వచ్చుట లేదు. కవి నాయకుని నాయికను చేరరమ్మనుచున్నాడు. ఏమి పద్ధతిని అవలంబించినావు? శృంగారించుకొని నాయిక వద్ద కిప్పుడే రారాదా? నాయిక తన చూపులు ప్రసరింపజేయుచు నీకొరకు చూచుచున్నది. ఇప్పుడు నీ ఉపేక్ష తగదు. ఆమె మొలక చన్నులు నీవు మోసే బరువుగానున్నవి. ఆమె వలపుతో రారాపు పడుచున్నది. ఆమె పెదవి నీ విరహముతో ఎర్రవారినది. నీవు ఆస్వాదించుటకు దానియందు తియ్యదనమున్నది. మీ యిద్దరికి వావి వరుస సరిపోయినది. అలమేలు మంగ మాట కోకిలపాట. ఇవన్నీ ఆమె నీకై సిద్ధము చేసుకొని ఉన్నది. కనుక నీవు ఆమెను కలయుటకు రారాదా? అని ప్రార్థన.

# 105. కాంభోజిరాగం = ఆదితాళం

ప॥ ఏమి సేసితివో । యింతిని నీ
మోము చూచి చూచి । మొక్కీనదె ॥ ॥ఏమి॥

చ॥ చెక్కుల కాంతులు । చెదరగా
నక్కు పడగ చెలి । నవ్వీనదే ॥
ముక్కున నూర్పులు । మెరయుగా ॥
సొక్కుచు సోలుచు । జూచీనదె ॥ ॥ఏమి॥

2) చెమట నీపై । చిప్పిలగా
కొమరె సిగ్గున । గొంకీనదె ॥
ఉమురు గుచాల । ఒత్తులు
గములు పయ్యద । గప్పీనదె ॥ ॥ఏమి॥

3 ఒగల దమకము । లొలుకగా
చిరుగు దేనెలు । చిందీనదే ॥
నగు శ్రీవేంకట । నాయకుడా నీవు
తగ గూడినవి । తలచీనదే ॥ ॥ఏమి॥

**తాత్పర్యము :**

వేంకటేశ్వరా! నాయికను నీవు ఏమి చేశావోకాని నీ ముఖమును చూచి చూచి మ్రొక్కుచున్నది. అనగా నీముఖమును తలచి మ్రొక్కుచున్నదని. చెక్కిళ్లపై నవ్వులకాంతులు చెదరిపడగా నవ్వుచున్నది. నిట్టూరుపులు బాగా విడుచుచు సొక్కుచు సోలుచు చూచుచున్నది. పడునేమో? శరీరమంతా చెమట నిండి సిగ్గుతో భయపడుచున్నది. చనులు బాగా బలిసినవి. ఆ బలుపు కనపడనీయక పయ్యెద కప్పుచున్నది. తమకము బాగా ఎక్కువయినది. నీకు ఆమె బాధ ఏమీ పట్టలేదు. నేను చెప్పుచుంటే నవ్వుచున్నావు. ఇంతకు ముందు నీతో కూడినవి తలచుకొంటున్నది. అని అన్నమయ్యగారి రాయబారము.

**విశేషము :** ఈనాయిక విరహోత్కంఠిత. నాయకుని ఎడబాటుచే బాధపడుచు ఏమేమో చేయుచున్నది. ఇది మన్మథా వస్థలలో దాదాపు 8వది అగు ఉన్మాదావస్థ.

## 106. కేదారగౌళ = ఖండచాపుతాళం

ప॥ లాలనుచు నూచేరు । లలన లిరుగడల
బాల గండర గో । పాల నిను చాల ॥ ॥లాలనుచు॥

చ॥ ఉదుట గుబ్బల సరము । లుయ్యాల లూగ
పదరి కంకణ రవము । బహుగతుల మొగ్ర
ఒదిగి చెంపల కొప్పు । లొక్కింత వీగ
ముదురు చెమటల నళిక । ములు తొప్పదోగ ॥ ॥లాలానుచు॥

2) సొలపు తెలి కన్ను గవ । చూపు లిరువంక
పలయు రవళులకు బలు । మారును బెళంక ॥
కొలది కోవిగములు । క్రోలు మదనాంక
ముల గ్రేణిసేయు రవ । ములు వడిదలంక ॥ ॥లాలనుచు॥

3) సరస పదములు జంగ । చాపు చేబాయ
గురులీల మీగళ్ల । గుచ్చెళ్లు రాయ
కర మూలముల కాంతి । కడు జాయఁజేయు
సరస మరువకసువా । సన లెదురు డాయ ॥ ॥లాలనుచు॥

4) కొలది నును మేను లత । కూనలసియాడ
మెలకువతో నొకరొకరి । మెచ్చి సరిగూడ ॥
తలలూచి చొక్కిచి । త్తరు బొమ్మలాడ
అలరి ఎల్లరు మోహ । నాకృతులు చూడ ॥ ॥లాలనుచు॥

5) లలిత తాంబూల రస । కలితంబులైన
తళుకు దంతముల కెంపుల గుంపు లీన ॥
మొలక వెన్నెల డాలు । ముసురు కొని లోన
చెలగి సెలవుల ముద్దు । చిరునవ్వులాన ॥ ॥లాలనుచు॥

6) మలయమారుత గతులు । మాటికి జెలంగ ॥
పలుకు గపురపు తావి । పైపై మెలంగ ॥
బలుగాన లహరి ఇం । పుల రాల్గరంగ ॥
బలసి వినువారి చెవి । బడలిక తొలంగ ॥ ॥లాలనుచు॥

7) లలనాజనాపాంగ । లలిత సుమచాప
జలజలోచన దేవ । సద్గుణ కలాప ॥
తలపు లోపల మెలగు । తత్త్వప్రదీప
బళిర గండపరేశ । పరమాత్మ రూప ॥ ॥లాలనుచు॥

## తాత్పర్యము :

ఓ బాలవరగండ గోపాలా! స్త్రీలు రెండు వైపుల నుండి లాలి లాలి యనుచు నిన్ను ఊచుచున్నారు. అప్పుడు వారు ధరించిన హారములు చనులపై అసియాడుచున్నవి. చేతులకు ధరించిన కంకణములు వివిధ గతులతో మ్రోగుచున్నవి. కొప్పులు వదులయి చెంపలపై జారి పడుచున్నవి. నుదుట చెమటగారుచున్నది. చుట్టుప్రక్కల మ్రోగే ధ్వనుల చేత బెదురు చూపులగుచున్నవి. అంగలు వేయుచు పాటపాడుటలో చీర కుచ్చెళ్ళు రాచుకొంటున్నాయి. ఊచుటలో వారి చేతికాంతులు ప్రసరిస్తున్నాయి. కొప్పులలో దాల్చిన మరువపు వాసనలు దిక్కులలో వ్యాపిస్తున్నాయి. మెత్తని వారి దేహలతలు అసియాడుచున్నవి. ఒకరినొకరు మెచ్చుకొనుచు సరిగా కలసి ఊపుచున్నారు. ఊపే ఊయెలకు కట్టిన బొమ్మలు తలలూచి ఎగురుచున్నవి. అందరు నీ మోహనాకృతిని చూచుచు ఊపుచున్నారు. వారు వేసికొనిన తాంబూలము చేత దంతములు ఎర్ర బారి ఉన్నవి. లోపలి ఆనందముతో పైకి వచ్చే వారి వారి చిరునవ్వులు చిరు వెన్నెలలను చిమ్ముచున్నవి. మలయమారుతము వీచుచున్నది. కర్పూరపు పరిమళము చిమ్ముచున్నది. వారు పాడే పాటకు రాలు కరగుచున్నవి. వినే వారి చెవిబాధలు పోవుచున్నవి. చివరి చరణమంతయు కృష్ణుని పిలచుటయే.

నోట్ : రెండవ చరణమందు 3,4, పంక్తులు అన్వయించలేదు.

# 107. మంగళారతి = కేదారగౌళ = ఆదితాళం

ప॥ మాధవునకు । మంగళం
సాధు ప్రియునకు । జయమంగళం ॥ ॥మాధవునకు॥

చ॥ మదన గురునకును । మంగళం, మా
మదిలో హరికిని । మంగళం ॥
మదరిపు హరునకు । మంగళం
చదువుల మూర్తికి । జయమంగళం ॥ ॥మాధవునకు॥

2) మహిమాధికునకు । మంగళం
మహామహునకు । మంగళం
మహీధవునకు । మంగళం
సహజ తేజునకు । జయమంగళం ॥ ॥మాధవునకు॥

3) మాయా రహితునకు । జయమంగళం
మాయింటి పతికిని । మంగళం
ఈ యెడ శ్రీవేంక । టేశ్వరుండితని
ఛాయ శ్రీ సతికి । జయమంగళం ॥ ॥మాధవునకు॥

**తాత్పర్యము :**

మధురస్వభావునకు మంగళము. సాధువులపై ప్రేమగలవానికి, మన్మధుని తండ్రికి, మనస్సులో నున్న హరికి, మదించిన శత్రువులను హరించువానికి, విద్యాస్వరూపునకు, గొప్ప మహిమ గలవానికి, మహామహునకు, భూమి ప్రభువునకు, సహజమైన తేజస్సుగలవానికి, మాయారహితునకు, మాయింటి దేవునకు, శ్రీ వేంకటేశ్వరునకు, ఆయన నీడ అయిన లక్ష్మీదేవికిని మంగళము, జయమంగళము. అని మంగళము పాడిరి.

**విశేషము :** గీతలో ''పవిత్రాణాయ సాధూనాం'' సాధువులను రక్షించుట కవతరించెదను'' అని భగవానుడు చెప్పెను. కనుక ''సాధుప్రియునకు'' అని ఒకటి. ''హృదయస్థోజనార్దనః'' అనుదానిని బట్టి ''మదిలోహరికిని''. అన్నమాచార్యుల వారి ఇలవేల్పు కనుక ''మాయింటిపతి'' అని. ''శరణాగతి

గద్య'' నిత్యానపాయినీం దేవదేవ దివ్య మహిషీం'' - ఎప్పుడును ఎడబాయని దివ్య మహిషి లక్ష్మీదేవి '' అని చెప్పినది. కనుక ''ఇతని ఛాయ శ్రీసతికి'' అని గేయమున చెప్పబడినది.

## 108. సురటి రాగం = మిశ్రచాపుతాళం

ప॥ మంగళముగో ।విందునకు జయ
మంగళము గరుడ । ధ్వజునకును ॥
మంగళము 1 సర్వా । త్మునకు 2 ధ
ర్మ స్వరూపునకు జయ । మంగళం ॥ మంగళము॥

చ॥ 3 ఆదికిని ఆ । దైన దేవునకు
అచ్యుతున కంభోజ । నాభునకు
4 ఆది కూర్మమౌ జగ । దాధారమూర్తికిని
వేద రక్షకునకును సంతత । వేదమార్గవిహారునకు - బలి
భేదికిని 5సామాదిగాన । ప్రియవిహారునకు-జయ ॥ మంగళము॥

2) హరికి బరమే । శ్వరునకును శ్రీ
ధరునకును 6కా । లాంతకునకును
పరమపురుషో । త్తమునకును బహు
బంధ దూరునకు ॥
సురముని స్తోత్రునకు 7దేవా
సుర గణ శ్రేష్ఠునకు - కరుణా
కరునకును 8కాత్యాయనీ సుతా
కలిత నామునకు ॥ మంగళము॥

3) పంకజాసన వరదునకు భవ
పంక విచ్ఛేదునకు 9 భవునకు
శంకరున కవ్యక్తున కా ।
శ్చర్య రూపునకు ॥

వేంకటాచల వల్లభునకును
విశ్వమూర్తికి నీశ్వరునకును
పంకజాకుచకుంభ కుంకుమ
పంకలోలునకు.........॥ మంగళము॥

**తాత్పర్యము :**

గోవిందునకు మంగళము. గరుడవాహనునకు, (1) అందరికి ఆత్మ అయినవానికి, (2) ధర్మ స్వరూపునకు, (3) ఆదికి ఆది అయిన దేవునకు, అచ్యుతునకు, పద్మనాభునకు, (4) ఆదికూర్మరూపముతో జగదాధారమైన వానికి, వేదములను రక్షించువానికి, ఎప్పుడును వేదమార్గమున విహరించువానికి, బలిచక్రవర్తి నణచిన వానికి, (5) సామవేదమునందు విహరించు వానికి, హరికి, పరమేశ్వరునకు, శ్రీధరునకు, (6) కాలాంతకునకు, పరమపురుషోత్తమునకు, ఎట్టి బంధము లేని వానికి, సురలు మునులు స్తోత్రము చేయువానికి (7) దేవతల గణములకు, రాక్షసగణములకును శ్రేష్ఠుడైన వానికి, కరుణగల వానికి, పార్వతీ దేవి నుతించు పేరుగలవానికి (8) బ్రహ్మకు వరములిచ్చు వానికి, సంసార పంకమును పోగొట్టువానికి, (9) ఉండుట మాత్రము కలవానికి, సుఖము కలుగజేయువానికి, అవ్యక్తునకు, ఆశ్చర్యరూపునకు, వేంకటాచల నాథునకు, ప్రపంచమంతయు తనరూపమయిన వానికి, సర్వసమర్థునకు, లక్ష్మీదేవి యొక్క చనుల యందలి కుంకుమమందు ఇష్టము గలవానికి. మంగళము.

**విశేషము :** (1) జీవాత్మలు, స్థావరపదార్థములు హరిదేహములని, హరి సమస్తములకు ఆత్మ అని విశిష్టా ద్వైతమతము, (2) రాముడు ''విగ్రహవాన్ ధర్మః'' – మూర్తీ భవించిన ధర్మమని, కృష్ణుడు ''కృష్ణం ధర్మం సనాతనం'' – శాశ్వతమైన ధర్మమని ఆర్షప్రోక్తము. (3) తక్కిన దేవతలు ఆదిదేవతలు కారు. ''నారాయణా ద్బ్రహ్మ జాయతే, నారాయణాద్రుద్రో జాయతే, నారాయణా

దింద్రో జాయతే'' – నారాయణునుండి బ్రహ్మపుట్టుచున్నాడు. నారాయణు నుండి రుద్రుడు పుట్టుచున్నాడు. నారాయణు నుండి ఇంద్రుడు పుట్టుచున్నాడు ''ఇత్యాది వేద వాక్యముల చేత ''ఆదికి ఆద్యైనదేవుడు''. (4) కూర్మాదీన్ దివ్యలోకాన్ తదనుమణిమయం మంటపం తత్ర శేషః। తస్మి౯ ధర్మాధి పీఠం తదుపరి కమలం'' – ముందు కూర్మాదిలోకములు, వాటిపై మణిమంటపము, దానిపై శేషుడు, వానిపై ధర్మపీఠము'' అనే పురాణ సూక్తి వలన కూర్మరూపముతో హరి జగత్తులను మోయుచున్నాడని. (5) గీతలో ''వేదానాం సామవేదోస్మి'' – వేదములలో నేను సామవేదమును ''అని భగవానుడు చెప్పుటచేత'' సామాది గానప్రియవిహారుడు, (6) ''కాలోస్మి లోకక్షయకృత్'' – నేను లోకక్షయమును జేయు కాలమును''అని భగవద్వాక్యము. కనుక కాలాంతకుడు. (7) ''రాక్షసానాం దేవతానాం సామాన్య మధిదైవతం'' – రాక్షసులకును దేవతలకును విష్ణువు సమానమగు దేవుడు'' అనిన పురాణసూక్తి వలన ఈయన ''దేవాసుర గణ శ్రేష్ఠుడు''. దంభుడు, నముచి, ప్రహ్లాదుడు, బలి, విభీషణుడు మొదలగు రాక్షసులు భక్తులే కదా! హిరణ్యకశిపు ప్రముఖులు మార్గమును తప్పివ్యతిరేకించి పోయిన వాళ్ళు. (8) బ్రహ్మకాయా సమయములయందు మత్స్యావతారుడై, హయగ్రీవుడై రాక్షసులను వధించి వేదముల నిచ్చుటయే వరప్రదానము. (9) ''భూ'' ధాతువునకు ఉండుట అని అర్థము. దాని మీద వచ్చినది ''భవుడు'' అనునది. తక్కిన అందరి దేవతలకు పుట్టుట గిట్టుట ఉన్నవి. ''ఆ బ్రహ్మభువనాలోకాః పునరావృతినోర్జున'' అనే గీతా వాక్యము వలన బ్రహ్మలోకము వరకు అన్ని లోకములకు లోకేశులకును పుట్టుట గిట్టుట వున్నది. ఒక్క విష్ణువునకే ఏ శాస్త్రమును వీటిని చెప్పలేదు. అందుచేత ఆయన ''భవుడు'' ఉండుటమాత్రము కలవాడు అని చెప్పబడినది. ఒకవేళ ఈ శబ్దము ఇంకొక దేవునకున్నను అది ఉపచారవాక్యము మాత్రమే అగును. తత్త్వముకాదు.

దింద్రో జాయతే'' – నారాయణునుండి బ్రహ్మపుట్టుచున్నాడు. నారాయణు నుండి రుద్రుడు పుట్టుచున్నాడు. నారాయణు నుండి ఇంద్రుడు పుట్టుచున్నాడు ''ఇత్యాది వేద వాక్యముల చేత ''ఆదికి ఆదైనదేవుడు''. (4) కూర్మాదీన్ దివ్యలోకాన్ తదనుమణిమయం మంటపం తత్ర శేషః । తస్మిన్ ధర్మాధి పీఠం తదుపరి కమలం'' – ముందు కూర్మాదిలోకములు, వాటిపై మణిమంటపము, దానిపై శేషుడు, వానిపై ధర్మపీఠము'' అనే పురాణ సూక్తి వలన కూర్మరూపముతో హరి జగత్తులను మోయుచున్నాడని. (5) గీతలో ''వేదానాం సామవేదోస్మి'' – వేదములలో నేను సామవేదమును ''అని భగవానుడు చెప్పుటచేత'' సామాది గానప్రియవిహారుడు, (6) ''కాలోస్మి లోకక్షయకృత్'' – నేను లోకక్షయమును జేయు కాలమును''అని భగవద్వాక్యము. కనుక కాలాంతకుడు. (7) ''రాక్షసానాం దేవతానాం సామాన్య మధిదైవతం'' – రాక్షసులకును దేవతలకును విష్ణువు సమానమగు దేవుడు'' అనిన పురాణసూక్తి వలన ఈయన ''దేవాసుర గణ శ్రేష్ఠుడు''. దంభుడు, నముచి, ప్రహ్లాదుడు, బలి, విభీషణుడు మొదలగు రాక్షసులు భక్తులే కదా! హిరణ్యకశిపు ప్రముఖులు మార్గమును తప్పివ్యతిరేకించి పోయిన వాళ్ళు. (8) బ్రహ్మకాయా సమయములయందు మత్స్యావతారుడై, హయగ్రీవుడై రాక్షసులను వధించి వేదముల నిచ్చుటయే వరప్రదానము. (9) ''భూ'' ధాతువునకు ఉండుట అని అర్థము. దాని మీద వచ్చినది ''భవుడు'' అనునది. తక్కిన అందరి దేవతలకు పుట్టుట గిట్టుట ఉన్నవి. ''ఆ బ్రహ్మభువనాలోకాః పునరావృతినోర్జున'' అనే గీతా వాక్యము వలన బ్రహ్మలోకము వరకు అన్ని లోకములకు లోకేశులకును పుట్టుట గిట్టుట వున్నది. ఒక్క విష్ణువునకే ఏ శాస్త్రమును వీటిని చెప్పలేదు. అందుచేత ఆయన ''భవుడు'' ఉండుటమాత్రము కలవాడు అని చెప్పబడినది. ఒకవేళ ఈ శబ్దము ఇంకొక దేవునకున్నను అది ఉపచారవాక్యము మాత్రమే అగును. తత్త్వముకాదు.



## గ్రంథకర్త గురించి

| | |
|---|---|
| పూర్తి పేరు | **నల్లాన్‌చక్రవర్తుల కృష్ణమాచార్యులు** |
| తల్లిదండ్రులు | వేంకటరమణమ్మ<br>జగన్నాథ తిరువేంకటాచార్యులు |
| జననం | 1924, కృష్ణాజిల్లా, జగ్గయ్యపేట |
| విద్యాభ్యాసం | తండ్రిగారివద్ద తర్క వ్యాకరణ మీమాంసాది శాస్త్రాలు, చిలకమర్తికేశవాచార్యులు, పారుపల్లి రామకృష్ణయ్యపంతులుగారి వద్ద సంగీతశిక్షణ |
| ఉద్యోగం | 1948 నుండి 1983 వరకు విజయవాడ ఆకాశవాణిలో నిలయ విద్వాంసులుగ. |
| బిరుదులు | గానకళాప్రపూర్ణ (ఆంధ్రప్రదేశ్ సంగీత అకాడమీ) సంగీత సాహిత్య కళానిధి, హరికథా చూడామణి సంగీత కళాసాగర. |
| పురస్కారాలు | తెలుగు విశ్వ విద్యాలయం వారిచే విశిష్ట వ్యక్తి పురస్కారం,<br>ఆకాశవాణి స్వర్ణోత్సవాల సందర్భంగా విశిష్ట వ్యక్తి పురస్కారం -నవంబర్ 1998 |

రచనలు ముద్రితములు తెలుగులో

1. గోదాస్తుతి 2. బిడాల మోక్షం 3. పరకాల విలాసం
4. త్యాగరాజ చరితం 5. నారాయణ శతకం
6. నృసింహతాండవం (హరికథ) 7. త్యాగరాజ అష్టోత్తరం
8. ఆలయములు ఆళ్వారులు 9. దుర్మోహ నిర్మూలనము
10. ప్రాచీన భగవద్గీత పరామర్శము
11. ఆరావముదు ఖండనము 12. కృష్ణమాచార్య సంగీత కృతులు
13. స్వరరాగ సుధ (వ్యాస సంకలనం)
14. సంప్రదాయ వాఙ్మయ సౌరభం (రచనా సంకలనం)
15. త్యాగరాజ గేయార్థకుంచిక

| | |
|---|---|
| సంస్కృతములో | 1. రామాయణ కథాయాం వ్యపదేశాః 2. మృత సంజీవనమ్ (నాటకమ్) 3. శఠగోపచరితమ్ 4. నౌకా చరితమ్ |
| అముద్రతములు | రామాయణ, భక్త జయదేవాది సంస్కృత హరికథలు 10 యామునాచార్య చరితము, వరదాభ్యుదయము, భక్త రామదాసాది తెలుగు హరికథలు.<br>విప్రనారాయణ (వేదాంతం వారిచే ప్రదర్శితమయ్యేది) యక్షగానం. |